వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 13 సంచిక : 11 హైదరాబాద్ 172 నవంబర్ 2015 పేజీలు : 68 రు. 20

- ‘చలో అసెంబ్లీ’ పై ఉక్కుపాదం
- వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారం
- ప్రజా సమస్యలు పట్టని అమరావతి ఆర్భాటం
- ప్రశ్నలపై మతోన్మాద అసహనపు కత్తి
- మరణశిక్షను ఎందుకు వ్యతిరేకించాలి?
- బీహార్ ఎన్నికల రాజకీయాలు
- రాజ్యాంగబద్ధ లౌకిక రాజ్యంగా నేపాల్



ఆర్ఎస్ రావు స్మారక సదస్సు

నవంబర్ 8, 2015, ఆదివారం

సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) సెమినార్ హాల్, బేగంపేట, హైదరాబాద్

వలసలు – ఆర్థిక వ్యవస్థలు

ఆర్ఎస్ రావు మిత్రులు, బి1 కలెక్టివ్, తెలుగు రాజకీయార్థిక సామాజిక మాసపత్రిక వీక్షణం సంయుక్త నిర్వహణలో నాలుగేళ్లుగా ప్రతి సంవత్సరం ఆర్ఎస్ రావు స్మారక ఉపన్యాసం, స్మారక సదస్సు కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఈ సంవత్సరం ఆర్ఎస్ రావు స్మారక సదస్సు హైదరాబాద్ బేగంపేటలో సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) సెమినార్ హాలులో నవంబర్ 8 ఆదివారం ఉ. 10 నుంచి సా. 6 వరకు జరుగుతుంది. ఈ సంవత్సరం సదస్సు చర్చాంశం 'వలసలు – ఆర్థిక వ్యవస్థలు'. (ఈ సంవత్సరం ప్రొ. డి నరసింహారెడ్డి చేయవలసిన స్మారకోపన్యాసం అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది).

ఇటీవలి కాలంలో భారత ఆర్థిక వ్యవస్థలో అనివార్య స్థితిలో వలస వెళ్తున్న శ్రామికుల సమస్య మళ్లీ ప్రధాన చర్చనీయాంశంగా మారింది. విద్యావేత్తలు, పరిశోధకులు, విధాన నిర్మాతలు, సామాజిక కార్యకర్తలు, వ్యాఖ్యాతలు ఈ అంశం గురించి విభిన్న ఆలోచనలు చేస్తున్నారు. వలసలకు దారి తీస్తున్న స్థితి గురించి రెండు స్థాయిలలో ఆలోచనలున్నాయి. వ్యవసాయం గిట్టుబాటు కాక శ్రామికులను బైటికి తోస్తున్నదని అందువల్ల శ్రామికులకు వలస వెళ్లడం కన్న గత్యంతరం లేదని, వలసల మూలాల గురించి ఆలోచించడం ఒక అభిప్రాయం. కాగా, వలసల గమ్యంగా ఉన్న స్థలాలలో వలసల వల్ల సామాజిక ఉత్పత్తి, ప్రత్యుత్పత్తిలలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని గమ్యం గురించి ఆలోచించడం మరొక అభిప్రాయం. భారత ఆర్థిక వ్యవస్థలో శ్రామిక వలసలు మాత్రమే కాక ఇతర రకాల వలసలు కూడ ఉన్నాయి. ఉత్తరాంధ్ర, తెలంగాణ, కర్ణాటక వంటి వెనుకబడిన ప్రాంతాలకు కోస్తాంధ్ర ప్రాంతం నుంచి రైతుల వలస, దేశంలో ఇతర ప్రాంతాలకూ, విదేశాలకూ కూడ సాగుతున్న నైపుణ్యం ఉన్న శ్రామికుల వలస, గ్రామీణ ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు నైపుణ్యం లేని శ్రామికులు, ప్రత్యేకంగా స్త్రీలు, వలస వెళ్లి నర్సులుగానో, పనిమనుషులుగానో, నిర్మాణ కార్మికులుగానో చేరడం వంటి అనేక వలసలున్నాయి. ప్రస్తుత సందర్భంలో భారత ఆర్థికవ్యవస్థలో పెట్టుబడి వలస కూడ పెద్దఎత్తున సాగుతూ సమస్యలకు కారణమవుతున్నది. చాల సందర్భాలలో ఈ వలసలు వాటి గమ్యాలలో ఘర్షణలకు దారి తీస్తున్నాయి. సింగూర్, నందిగ్రాంలకు పెట్టుబడి వలస, తెలంగాణకు రైతాంగ వలస వంటి సమస్యలు అందరికీ తెలిసినవే. చరిత్రలో సానుకూల పాత్ర నిర్వహించిన వలసలు ఇవాళ భారత ఆర్థిక వ్యవస్థలో ఘర్షణలకు కారణమవుతున్న సందర్భాన్ని విశ్లేషించవలసి ఉంది.

ఈ నేపథ్యంలో

1. ఎవరైనా ఉన్న ప్రాంతం వదిలి కొత్త ప్రాంతాలకు వలస వెళ్లడానికి పురికొల్పే పరిస్థితులు ఏమిటి?
2. వలసలను వర్గ దృక్పథంతో అర్థం చేసుకోవలసి ఉందా, విభిన్న వలసలను వర్గాలుగా విభజించి చూడవచ్చునా?
3. వలసల వల్ల వ్యక్తిగత స్థాయిలోనూ, సామాజిక స్థాయిలోనూ తలెత్తే సమస్యలేమిటి?
4. వలస వచ్చిన వారు తాము కొత్తగా చేరిన ప్రాంతాలలో ఏ మార్పులు ప్రవేశపెడతారు?
5. గమ్య స్థలంలోని ఆర్థిక వ్యవస్థ స్వభావం వలస వచ్చినవారు ప్రవేశపెట్టే మార్పులకు ఆటంకం అవుతుందా? లేక ఆ ఆర్థిక వ్యవస్థే వలస వచ్చిన వారి స్వభావాన్ని మారుస్తుందా?

వంటి సమస్యలకు ఈ సదస్సు సమాధానాలు అన్వేషిస్తుంది.

అందరూ ఆహ్వానితులే

వివరాలకు, సమాచారానికి 040 66843495 (వీక్షణం), 9949391028 (వై. రామచంద్రం), 9440893596 (ఆర్. విజయ్)

172

ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

నవంబర్ 2015

సంపుటి : 13

సంచిక : 11

- పాఠకుల వీక్షణం ... 4
- కొత్త పుస్తకాలు / సి.డి.లు ... 4
- సంపాదకీయం ◆ సంఘ్ పరివార్ అసహనాన్ని అడ్డుకోక తప్పదు ... 5
- సంపాదకీయ వ్యాఖ్యలు ◆ ప్రజల ఆకాంక్షకు చోటులేని 'ప్రజా ప్రతినిధుల' సభ ◆ అమరావతి ఆర్భాటం అసలు సమస్యల్ని మాయం చేస్తుందా? ... 6
  - ◆ బాలరిష్టాలలో నేపాల్ నూతన రాజ్యాంగం ... 7
- ఈనేల – వై. రామచంద్రం ... 8
- వర్తమాన చరిత్ర – రాజకీయార్థిక దృష్టి – ఫ్రెంచ్ విప్లవం నాటి స్థితికి భారతదేశం ... 9
- ప్రాంతీయం – 'చలో అసెంబ్లీ' పై ఉక్కుపాదం – బి. రామకృష్ణ ... 11
- 〃 – వ్యవసాయ విప్లవమే పరిష్కార మార్గం – వరవరరావు ... 14
- 〃 – తెలంగాణ సమాజం మేల్కొనాలి – గోడితాల వెంకటేశ్వర్లు ... 17
- 〃 – గద్వాలలో ఘరానా దోపిడీ – సాయన్న ... 21
- 〃 – వ్యక్తిని చూసి రాజ్యం స్వరూపాన్ని మర్చిపోదామా? – సిఎచ్. మధు ... 22
- 〃 – ఆర్టికల్ 371డి ఉల్లంఘనే జి.ఒ. 120 – మల్లెల భాస్కర్ ... 24
- 〃 – ప్రజా సమస్యలు పట్టని అమరావతి ఆర్భాటం – చిమ్మె జాన్ బర్నబాస్ ... 26
- 〃 – రిషితేశ్వరి ఆత్మహత్య – మూలాలు – షేక్ కరిముల్లా ... 28
- 〃 – విద్యను దూరం చేసే డిటెన్షన్ విధానం – రుద్రవేణి ... 30
- 〃 – అర్హతలు లేని వైద్యుల శిక్షణ – డా. రాపోలు సత్యనారాయణ ... 32
- 〃 – ఆదివాసి ప్రాంతాలకు ప్రత్యేక జిల్లాలు – మైపతి అరుణ్‌కుమార్ ... 33
- 〃 – రాయలసీమపై శీతకన్ను – ఎం. కె. కుమార్ ... 36
- దేశీయం – ఆలస్యంగానైనా అర్థవంతమైన అడుగు – ఆర్. లక్ష్మి ... 37
- 〃 – అభివద్ధి పేరుతో విధ్వంసం – మర్రి కామయ్య ... 38
- 〃 – 'ద్వేష'భక్తి ! – గుండెబోయిన శ్రీనివాస్ ... 41
- 〃 – బ్రిటిష్ – మోడీ పాలనలకు మధ్య తేడా ఉందా? – వి. హనుమంతరావు ... 42
- 〃 – వ్యవసాయ సంక్షోభం – పరిష్కారాలు – కె. సురేష్ ... 43
- 〃 – వేగుచుక్కల ఉసురు తీస్తున్న మతోన్మాదం – వై.ఎచ్.కె. మోహన్‌రావు ... 46
- 〃 – ఆధార్ – అంతా అయోమయం – ఎస్. కిశోర్‌కుమార్ ... 49
- 〃 – మరణశిక్షను ఎందుకు వ్యతిరేకించాలి? – మాదిరాజు రాంబాబు ... 51
- 〃 – బీహార్ ఎన్నికల రాజకీయాలు – వై. భాస్కర్ ... 55
- అంతర్జాతీయం – కొండను తవ్వి ఎలుకను పట్టని నివేదిక – బైరెడ్డి సతీష్ ... 56
- 〃 – రాజ్యాంగబద్ధ లౌకిక రాజ్యంగా నేపాల్ – ఎ. నరసింహారెడ్డి ... 58
- పుస్తక సమీక్ష – చిన్న పుస్తకం–పెద్ద సందేశం – జి. కోటయ్య ... 61
- ఇరుగు–పొరుగు – వై. రామచంద్రం ... 64
- భూగోళం – సి. రాజశేఖర్ ... 65
- అసహజ మరణాలు – ఎస్. వెంకటేష్ ... 66

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎం. రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని వరంగల్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్న వారు ఎస్. వెంకటేష్)

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓ.లు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : డక్కన్ ప్రెస్ / చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 20	రు. 20
సంవత్సరం	రు. 240	రు. 200
మూడు సంవత్సరాలు	రు. 600	రు. 540
ఐదు సంవత్సరాలు	రు. 1000	రు. 900
పది సంవత్సరాలు	రు. 2000	రు. 1700

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపేవారు మాత్రమే బ్యాంక్ స్లిప్‌లపై 'veekshanam' అని రాసి వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి.
ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

పాఠకుల వీక్షణం

వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో మూలనిధికి 2015 అక్టోబర్ నెలలో వచ్చిన విరాళాలు - శ్రేయోభిలాషి, హైదరాబాద్ - రు. 20,000; కట్టా కీర్తి, ఖమ్మం - రు. 5,000. (తన మొదటి జీతం నుంచి) మిత్రులిరువురికీ కృతజ్ఞతలు- సం.

అక్టోబర్ 2015 సంచికలో వివరించినటువంటి 'తెలంగాణ అధ్యయనం ఎందుకు, ఎలా?' అనే వ్యాసంతో మాకు కొద్ది స్పష్టత వచ్చినది. కానీ ఇంకా ఏదో అసంతృప్తి. ఎందుకంటే మీరు వివరించిన ఈ సుదీర్ఘమైన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమచరిత్రలో మొదటిదశ తెలంగాణ భావన దశ, రెండవ దశ అయిన సమీకరణదశలో జరిగినటువంటి సాయుధ రైతాంగ పోరాటాలు, నక్సల్బరీ, పీపుల్స్ వార్‌లు చేసిన ఉద్యమాల ప్రస్తావన పరీక్షల్లో వచ్చే అవకాశముందా? నేను న్యాయ శాస్త్ర విద్యని అభ్యసిస్తున్న విద్యార్థిని. నేను పుట్టి పెరిగినప్పటినుండి మా ఊర్లో జరిగిన నిర్బంధ, హత్యా కాల్చివేతల ఉదంతాలు వినివిని అడుగుతున్న ప్రశ్న ఇది., మీరు చివర్లో హెచ్చరించిన రెండిట్లో మొదటి దాంట్లో సామాజిక హితం కోసం ఉండాలి అనడం నచ్చింది.

– ఎస్. ప్రదీప్
ఆన్‌లైన్


అక్టోబర్ వీక్షణంలో 'రాజధానికి చేరిన రైతు ఆత్మహత్యలు' అనే వ్యాసంలో రచయితలు మల్లేశ్, రామచంద్రంలు లోతైన పరిశీలనే చేశారు. వ్యవసాయరంగ దుస్థితి, రైతుల దుర్భరావస్థకు దార్శనికతలేని పాలకుల విధానాలని స్పష్టం చేశారు. వర్తమాన రాజకీయ పాలక వ్యవస్థలో ప్రస్తుతమున్న ప్రముఖులంతా ఒకప్పటి పాలకవర్గ ప్రముఖులే గదా! నూతనంగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి మొదలుకొని వ్యవసాయ మంత్రి దాక గత ప్రభుత్వాల పాలనా విధానాల భాగస్వాములే. రైతుల ఆత్మహత్యలు తీవ్రరూపం దాల్చి పిట్టలు రాలినట్లు రోజుకు పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతుంటే సమస్య మూలకారణాలు, పరిష్కారం కొరకు శాస్త్రీయ పరిశోధన జరపకుండా ఆత్మహత్యలు ఆపాల్సిన ప్రభుత్వాలు రైతు మరణానికి అనారోగ్యం, కుటుంబ సమస్యలే కారణమని నిస్సిగ్గుగా మీడియా ముందు చాటింపు వేయడం విచాకరం. కాగా ఈ వ్యాసంలో రచయితలు రైతుల ఆత్మహత్యల పరిష్కార మార్గంగా ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాగా జనతన సర్కార్ విధానాలను ఆచరణాత్మక విధానంగా పరిచయం చేయడం వ్యవసాయ రంగానికి అదొక విలువైన ఆవిష్కరణే. ఇది సమగ్రంగా చర్చించి ఉంటే అటు పాలకులకు ఇటు పాఠకులకు, ప్రజలకు అర్థమయ్యేలా చేస్తే బాగుండేది. ఆ విధానంలో విత్తన పంపిణీ నుండి పంటల తీరు, ఋణాలు, మార్కెటింగ్, నిల్వలు పంపిణీ మొదలైనవన్నీ చర్చిస్తే, ఆ నమూనా ప్రత్యామ్నాయంగా ప్రజోపయోగమైతే ప్రభుత్వ వర్గాలకు విధిగా అనుసరణీయమైతే తద్వారా ఆత్మహత్యలకు పరిష్కారం లభిస్తే అన్నదాతకు అంతకంటే మేలు మరొకటి ఉండదు. కావున కొనసాగింపుగా రచయితలు మరోమారు సమగ్రంగా చర్చించాలని విజ్ఞప్తి.

– డా. అక్కెనపల్లి పున్నయ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం

అక్టోబర్ 2015 సంచికలో 'వ్యక్తుల హత్యలతో సత్యశోధన ఆగదు' వ్యాసం బాగుంది. కాని ఆ హత్యలను ఖండించిన మేధావి వర్గం చాలా తక్కువ మంది. ప్రధాని స్పందనలేదు. దోషుల అరెస్ట్ జరగలేదు. హత్యలకు నిరసనగా రచయిత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మేనకోడలు సెహగల్‌తో పాటు కొందరు సాహిత్య అకాడమీ అవార్డులను వాపస్ చేయాలని నిర్ణయించారు. ఈ బాటలో కొందరు సాహితీవేత్తలు నిర్ణయాలు తీసుకోవడం హర్షించదగినది. మనది ఆచరణలో సెమీ హిందూ రాజ్యం. ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రులు తిరుపతి, సింహాచలం, భద్రాచలంలోని దేవుళ్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్నారు. పునాది రాళ్లు ఆవిష్కరణలు పురోహితుల మంత్రాలతోనే జరుగుతున్నాయి. ఇవి అన్ని అధికారిక కార్యక్రమాలే. ఇందులో న్యాయమూర్తులు భాగస్వాములే. రాజ్యాంగం 20వ భాగంలోని 368వ నిబంధన రాజ్యాంగాన్ని సవరించే విధానాన్ని వివరిస్తుంది. అందులో భాగంగా 1976లో 42వ సవరణ జరిగింది. దీని వలన 59 ప్రకరణాలు మార్పులకు గురయ్యాయి. ఒక విధంగా రాజ్యాంగానికి ఇది 'రివిజన్' లాంటిది. సవరణలో 10 అంశాలు ముఖ్యమైనవి. అందులో మొదటిది రాజ్యాంగ ప్రవేశికలో కొత్తగా లౌకిక, సామ్యవాద, సమగ్రత అనే మూడు పదాలు చేర్చబడినవి. కాని లౌకిక (సెక్యులర్) అన్నదానికి సమగ్ర నిర్వచనం లేదు. ప్రభుత్వ ఆచరణ ఎలా ఉండాలో పేర్కొనలేదు. మతానికి ప్రాథమిక హక్కులు చట్ట బద్ధత, రక్షణ కల్పించబడింది. వీటి కొరకు ఐపిసి 153ఎ, 295ఎ సెక్షన్లు ఉన్నాయి. ఇవి రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) ఎలో పేర్కొన్న భావ ప్రకటన స్వేచ్ఛను ఉల్లంఘిస్తున్నాయి. రాజ్యాంగంలోను, ఇండియన్ పీనల్ కోడ్‌లోను చాలా మార్పులు రావలసి ఉంది. ఆదేశిక సూత్రాలు ఆర్టికల్ 51 ఎ (ఎచ్) లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడం, మానవవాదం శోధన ప్రతిపౌరుని విధి. అని పేర్కొంది. ప్రభుత్వ బాధ్యతగా పేర్కొనలేదు. అసలు ఆదేశిక సూత్రాలకు చట్టబద్ధత లేదు.

– తుంపాల శ్రీరామమూర్తి
గాజువాక, విశాఖపట్నం


కొత్తపుస్తకాలు / సిడిలు




❖ **పోడు భూముల రక్షణకై ఆదివాసీల పోరాటం – ప్రతిఘటన** – కెచ్చెల రంగయ్య – సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ, తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రచురణ – 48 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు: సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ, మార్క్స్ భవన్, 658, విద్యానగర్ 7వ లైన్, హైదరాబాద్ – 500004; ప్రజాశక్తి; నవోదయ; విశాలాంధ్ర



❖ **మనుషులపై మిర్చీలు** – బత్తుల వీవీ అప్పారావు – సంపాదకులు: పెద్దూరి వెంకటదాస్ – 90 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: బత్తుల వీవీ అప్పారావు, జి2, మణిమాల ఎస్టేట్, 151 మోతీనగర్, లీలా ఆసుపత్రి ఎదురుగా, ఎర్రగడ్డ–బోరబండ రోడ్, హైదరాబాద్ – 500 018; సెల్: 9885008937, 040 40209378; mircheelu@gmail.com ; అన్ని ప్రముఖ పుస్తక షాపుల్లో



❖ **మాటల మడుగు** – మెర్సీ మార్గరెట్ కవిత్వం – మెర్సీ పబ్లికేషన్స్ – 140 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: మెర్సీ మార్గరెట్, 1-4-61/12, రంగానగర్, ముషీరాబాద్, హైదరాబాద్ – 500 080; ఫోన్: 040 64643525; అన్ని ప్రముఖ పుస్తక షాపుల్లో



❖ **1984 ఢిల్లీ – గుజరాత్ 2002** – వ్యవస్థల వైఫల్యంపై పంచనామా – మనోజ్ మిట్ట, ఎచ్.ఎస్. ఫుల్కా తెలుగు: ప్రభాకర్ మందార, రివేరా – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ – 440 పేజీలు, 1/8 డెమీ, రు. 250, ప్రతులకు: హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, ఫ్లాట్ నం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 006. ఫోన్: 040 23521849; www.hyderabadbooktrust.blogspot.com

'పల్లెను మింగిన పెట్టుబడి' పుస్తక సమీక్షపై ఎస్. ఎ. విద్యాసాగర్ చర్చా వ్యాసం మొదటి భాగం సెప్టెంబర్ సంచికలో వచ్చింది. అక్టోబర్ సంచికలో వచ్చిన రెండో భాగం కొనసాగింపు అని అచ్చు కాలేదు. అలాగే అర్విణి రాజేంద్రబాబు వ్యాసం 'ప్రజల ఒత్తిడితో వెనక్కి తగ్గుతున్న ప్రభుత్వాలు' అని ఉండే బదులు 'పాలకుల ద్వంద్వ ప్రమాణాలు' అని వచ్చింది. పొరపాట్లకు చింతిస్తున్నాం. – సం.

సంఘ్ పరివార్ అసహనాన్ని అడ్డుకోక తప్పదు

సంఘ్ పరివార్ అధికారానికి వచ్చినప్పటి నుంచీ మామూలు పాలనా పద్ధతులనూ మర్యాదలనూ కూడ పక్కనపెట్టి ఇష్టారాజ్యపు అరాచకత్వాన్ని కొనసాగిస్తున్నది. తన మతోన్మాద, మతవిద్వేష భావజాలాన్ని ప్రచారం చేసుకోవడానికీ, ప్రభుత్వ సంస్థలలో స్థిరీకరించుకోవడానికీ, ఇతర భావజాలాలను అణచివేయడానికీ తీవ్రంగా, దూకుడుగా ప్రయత్నిస్తున్నది. నిజానికి సంఘ్ పరివార్ అధికారంలోకి రావడమూ, ఇలా ప్రవర్తించడమూ కొత్త కాదు. జనతా పార్టీలో భాగంగా 1977లో తొలిసారి కేంద్ర ప్రభుత్వ అధికారం, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వాల అధికారం చేపట్టిననాటినుంచీ ఈ ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి. అప్పటివరకూ సంఘ పరివారపు గోముఖాలను, రాజకీయ ముఖాలను మాత్రమే ప్రదర్శిస్తూ ఉండగా, 2014 ఎన్నికల్లో నరేంద్ర మోడీ గెలుపుతో నరహంతక వ్యాఘ్రం ఇంక గోముఖం వెనుక తల దాచుకోవలసిన అవసరం పోయింది. గుజరాత్ రక్తనదిలో తడిసిన త్రిశూలం ఢిల్లీ సింహాసనాన్ని అధిష్టించింది. సంఘ్ పరివారానికి బారా ఖూన్ మాఫ్ వాతావరణం సిద్ధమయింది. ఈ పదహారు నెలల్లో వ్యవస్థాగతంగా జరిగిన మార్పులు, ప్రభుత్వపరంగా జరిగిన మార్పులు, సంఘ్ పరివార్ శక్తుల సమీకరణ, దేశవ్యాప్తంగా 'ఏకీభవించనోని పీకనొక్కు' సిద్ధాంతాన్ని అమలు చేసే ప్రయత్నాలు పెద్ద ఎత్తున ప్రారంభమయ్యాయి. సంఘ్ పరివార్ విచ్చలవిడి కార్యక్రమానికి అనుకూలమైన వాతావరణం తయారయింది. అంటే సాధారణ ప్రజానీకానికి, భిన్నాభిప్రాయాలున్న వారికి, ప్రత్యేకించి బుద్ధిజీవులకు, సాహిత్య, సాంస్కృతిక కార్యకర్తలకు భయభీతావహ వాతావరణం తయారయింది. భారత సమాజంలో ఎన్నో లోపాలతోనైనా కొనసాగుతుండిన బహుళత్వ, విశాల దృక్పథాల మనుగడకే ప్రమాదం వచ్చింది.

భగవద్గీతను నిర్బంధ పఠనీయ గ్రంథంగా మార్చే ప్రతిపాదనలు, భారత చరిత్ర గురించి భిన్న దృక్పథాల, భిన్న కథనాలను నిషేధించాలని, తగులబెట్టాలని వాదనలు, సాహిత్యకారుల మీద, సంస్కృతీపరుల మీద దాడులు, జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి విద్యా, పరిశోధనా, సాహిత్య, సాంస్కృతిక సంస్థల బహుళత్వాన్ని రద్దు చేస్తూ సంఘ పరివార్ శక్తులతో నింపి వేయడం, స్వతంత్ర ప్రతిపత్తితో సృజనాత్మక నైపుణ్యాలను తీర్చిదిద్దుతున్న సంస్థలను నియంత్రించడానికి, వాటిలో సంఘ పరివార్ వ్యక్తులను, భావజాలాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నించడం వంటి అనేక కార్యక్రమాలు ఈ పదహారు నెలల్లో విపరీతంగా జరిగిపోయాయి.

అటువంటి కార్యక్రమాల కొనసాగింపుగానూ, వాటి ప్రభావం పెంచేవి గానూ ఇటీవల ఉధృతంగా జరుగుతున్న పరిణామాలు చూస్తే ఈ పాలన ఐదు సంవత్సరాలు నిండా కొనసాగితే ఈ సమాజ భవిష్యత్తు ఏమవుతుందనే భయం వేస్తున్నది. రేపటికి తమ పాలన ఉండదేమో నన్నంత ఆబగా, హడావుడిగా, అమర్యాదకరంగా ప్రవర్తిస్తున్న పాలకుల పద్ధతి చూస్తుంటే అధికారం ఎక్కువకాలం నిలవదేమో, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుందాం అనే వైఖరి కనబడుతున్నది. అలాగే గత ఒకటి రెండు నెలల్లో ఈ పరిణామాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బుద్ధిజీవులలో, ఆలోచనాపరులలో, సమాజంలో ఎగసిపడుతున్న నిరసన చూస్తుంటే సంఘ్ పరివార్ అక్రమాలను అడ్డుకునే ప్రగతిశీల శక్తులు ఈ దేశంలో ఇంకా బలంగానే ఉన్నాయనే భరోసా కలుగుతున్నది.

తాజా పరిణామాల వంటివి చాలరోజుల కిందనే ప్రారంభమయ్యాయి గాని ప్రతి విషయానికీ ఒక అవధి ఉంటుందన్నట్టు, ఆ అవధి దాటితే కట్టలు తెగిపోతాయన్నట్టు కన్నడ రచయిత, పరిశోధకుడు ఎంఎం కల్బుర్గి హత్యతో, దాద్రీలో ఆవు మాంసం ఉందనే తప్పుడు ఆరోపణతో అఖ్లాక్‌ను చంపిన ఘటనతో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. కల్బుర్గి హత్య కన్న చాల ముందే చరిత్రకారులు రొమిలా థాపర్ రచనలు తగులబెట్టాలన్న విపరీతమైన కోర్కె బైటికి వచ్చింది. తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్‌ను హత్య చేస్తామని బెదిరింపులతో, ఆయన తనలోని రచయిత చచ్చిపోయాడని ప్రకటించే దుస్థితి వచ్చింది. హేతువాద ప్రచారకుడు నరేంద్ర ధబోల్కర్ హత్య జరిగింది. కమ్యూనిస్టు, ప్రగతిశీల భావాల ప్రచారకుడు గోవింద పన్సారే హత్య జరిగింది. కల్బుర్గి హత్యను ఖండించినందుకు కన్నడ రచయిత కెఎస్ భగవాన్‌కు, ఇతర రచయితలకు హత్య చేస్తామని బెదిరింపులు వచ్చాయి. ప్రపంచ ప్రఖ్యాత పాకిస్తాన్ గాయకుడు బడే గులాం అలీఖాన్ పాకిస్తానీ అయిన పాపానికి ముంబాయిలో పాడడానికి వీల్లేదని నిషేధించి, ఏర్పాటయిన కార్యక్రమాన్ని రద్దు చేయించారు. పాకిస్తాన్ క్రికెట్ బృందం భారతదేశంలో ఆడడానికి వీల్లేదని బెదిరింపులు మొదలయ్యాయి. పాకిస్తానీ దౌత్యవేత్త రాసిన పుస్తకావిష్కరణ ముంబాయిలో జరుగుతుంటే ఆ సభలో మాట్లాడు తున్నందుకు ఎల్‌కె అద్వానీ సహచరుడిగా పనిచేసిన సుధీంద్ర కులకర్ణి ముఖానికి నల్లరంగు పూసి అవమానించారు. కశ్మీర్‌లో తాను ఏర్పాటు చేసిన విందులో ఎద్దు మాంసం వడ్డించాడనే ఆరోపణతో కశ్మీర్ స్వతంత్ర శాసనసభ్యుడు ఇంజనీర్ రషీద్ ముఖానికి ఢిల్లీ పత్రికా సమావేశంలో నల్లరంగు పూశారు. ముజఫర్‌నగర్‌లో మత కల్లోలాలు సృష్టించి ఎన్నికల రాజకీయాలలో బలం సమకూర్చుకున్నట్టుగానే బీహార్ ఎన్నికల సందర్భంలో మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి గోవధ నిషేధం గురించీ, ఎద్దుమాంసం తినడం గురించీ వివాదాలు రేకెత్తిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే బహుళత్వానికి నిలయమైన ఈ సమాజంలో ప్రతి ఒక్కరూ ఏ తిండి తినాలో, ఏ బట్టలు కట్టుకోవాలో, ఏ మాటలు మాట్లాడాలో తామే శాసిస్తామని, తాము చెప్పినట్టు ఉండకపోతే చంపేస్తామని సంఘ్ పరివార్ శక్తులు చెప్పదలచుకున్నాయి. తాము ఎంత హింసా దౌర్జన్యాలకు పాల్పడినా చట్టమూ ప్రభుత్వాలూ అడ్డుకోబోవని కూడ వాళ్లు చెప్పదలిచారు.

హిట్లర్ పాలనలో నాజీలు సాగించిన దురంతాలను మించిపోతున్న ఈ అక్రమాలను ప్రతి ఒక్కరూ ఎవరికి తోచిన పద్ధతిలో వారు ఖండించడం, ప్రతిఘటించడం తప్ప వీటిని ఆపడానికి మరొక మార్గం లేదు. సాహిత్య అకాడమీ అవార్డులను తిరస్కరించిన సాహిత్యకారులు తమకు సాధ్యమైన ఒక నిరసన మార్గాన్ని చూపారు. మతవిద్వేష మహమ్మారిని అడ్డుకోవడానికి ఏ ఒక్క మార్గమూ సరిపోదు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ రంగాలన్నిటిలోనూ ప్రతిఘటన వ్యక్తీకరణలన్నీ అవసరమే. భౌతిక ప్రతిఘటన కూడ అవసరమే. సంఘ్ పరివార్ శక్తుల దూకుడే అటువంటి ప్రతిఘటనలకు వేదిక కల్పించి, మార్గం సుగమం చేస్తున్నది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

ప్రజల ఆకాంక్షలకు చోటులేని 'ప్రజా ప్రతినిధుల' సభ

పదహారు నెలల పాలనలో తెలంగాణ రాష్ట్ర సమితి పాలన తెలంగాణ ఉద్యమ ఆదర్శాలన్నిటినీ తుంగలో తొక్కుతున్నది. తెలంగాణ ప్రజలు ఏ స్వావలంబన, స్వాభిమాన, స్వయంనిర్ణయాధికార ఆకాంక్షలతో వీరోచిత పోరాటం జరిపి విజయం సాధించి, అధికారం తెరాస చేతుల్లో పెట్టారో, ఆ ఆకాంక్షలన్నిటికీ తూట్లు పొడవడమే తన లక్ష్యంగా తెరాస పనిచేస్తున్నది. స్వావలంబన బదులు తెలంగాణను మళ్లీ బహుళ జాతి సంస్థల, కార్పొరేట్ సంస్థల, చివరికి ఆరు దశాబ్దాలుగా తెలంగాణను దోచుకున్న కోస్తాంధ్ర సంపన్నుల చేతిలో పెట్టే కార్యక్రమం సాగుతున్నది. తెలంగాణ కావాలని కోరిన ప్రజాసమూహాల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా, ఆమాటకు వస్తే తెలంగాణను ఇంతకాలమూ వ్యతిరేకించిన ఆధిపత్య వర్గాల ప్రాబల్యం ఇంకా పెరిగేలా పాలన సాగుతున్నది. తాము కోరుకున్న రాష్ట్రం ఏర్పడి, నిన్నటిదాకా ఉద్యమంలో తమతో కలిసినడిచిన ఉద్యమకారులు ఇవాళ 'ప్రజా ప్రతినిధులు'గా, శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు గనుక, కోరుకున్న స్వయంనిర్ణయాధికారం వచ్చిందేమోనని ఎవరికైనా భ్రమలు ఉంటే వాటిని పటాపంచలు చేసేలా తెలంగాణ ప్రజలకు తెలంగాణ శాసనసభకు వెళ్లే హక్కు లేని స్థితి దాపురించింది. రోజుకు ఇద్దరూ ముగ్గురూ రైతులు ఆత్మహత్య చేసుకుని పిట్టల్లా రాలిపోతుంటే, ఆ పాపంలో పాత ప్రభుత్వాలకు కూడ భాగస్వామ్యం ఉన్నప్పటికీ, కనీస ఉపశమనం కలిగించి ఆత్మహత్యలను అరికట్టాలని కోరడానికి ప్రజలు 'చలో అసెంబ్లీ' అంటే రాష్ట్ర వ్యాప్తంగా పదివేల మంది అరెస్టు. ఉద్యమ క్రమంలో ఎన్ కౌంటర్లు లేని తెలంగాణ అని మీరు చేసిన వాగ్దానమే ఎందుకు విఫలమయిందని అడగడానికి 'చలో అసెంబ్లీ' అంటే అడుగు ముందుకు కదలడానికి వీలులేని ముళ్లకంచెలు. ఇంతకూ 'చలో అసెంబ్లీ' పిలుపు ఇచ్చినది తెలంగాణలో ప్రతిష్ఠ కోల్పోయిన ప్రధాన ప్రతిపక్షాలు కాదు. ప్రజల మధ్య ఉన్న, తమ తమ స్థాయిల్లో ప్రజాబలం ఉన్న పది వామపక్ష పార్టీలు, నాలుగు వందల ప్రజాసంఘాలు. రాష్ట్రంలో ఇంత గొప్ప రాజకీయ ఐక్యత తెలంగాణ ఉద్యమ సందర్భంలో మాత్రమే సాధ్యమయింది. ఇవాళ ఆ ఉద్యమ ఫలితమైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పడవలసి వచ్చింది. ఆ ఐక్యసంఘటన ప్రతినిధులను శాసనసభకు ఆహ్వానించి, వారి ఆకాంక్షలు తెలుసుకుని, పరిష్కరించడానికి ప్రయత్నించడం, ఒక ప్రజా ఉద్యమ ఫలితంగా అధికారానికి వచ్చిన పార్టీకి కనీస బాధ్యత. పైగా ఆ శాసనసభ సమావేశాలు రైతుల ఆత్మహత్యల మీద చర్చించడానికే ఏర్పాటయినవి. అయినా 'చలో అసెంబ్లీ' ప్రతినిధులను ఆహ్వానించకపోవడం, అరెస్టులతో సన్మానించడం క్రూరమైన పరిహాసం. ఆశా కార్యకర్తలు, కాంట్రాక్టు ఉద్యోగులు, మునిసిపల్ ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు, రైతుకూలీలు...ఏ ఒక్క సమూహమైనా తెలంగాణ ప్రభుత్వం తమదేనని, పరిష్కరించకపోయినా కనీసం తమ సమస్యలు చెప్పుకునే అవకాశం ఉందని భావించే అవకాశం లేదు. ప్రగల్భాలూ గంభీర వాగ్దానాలూ మాయమాటలూ అబద్ధాలూ అతిశయోక్తులూ, కరివేపాకులాగ తెలంగాణ సంస్కృతీ చిహ్నాలూ తప్ప వాస్తవంగా ఇది తెలంగాణ ప్రజలు కోరుకున్న ప్రభుత్వం కాదని ఇంత తొందరగా తెలియజెప్పాలని తెరాస నిశ్చయించుకోవడం అందరికీ మంచిదే. వీ


సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

అమరావతి ఆర్భాటం అసలు సమస్యల్ని మాయం చేస్తుందా?

హిందూ వివాహ వేడుకలలో మాంగళ్యధారణ సమయంలో వాద్యాలను పైస్థాయిలో మోగించమని ఆదేశిస్తారు. సరిగ్గా ఆ సమయానికి ఎవరైనా తుమ్మినా, ఆ అపశకునం వినిపించకుండా ఉండడానికే ఈ హెచ్చుస్థాయి శబ్దాల సృష్టి జరుగుతుందని అంటారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఈ సంగతి బాగా అర్థమైనట్టుంది. పని చిన్నదైనా, పెద్దదైనా ఆర్భాటంగా చేయడం, భారీ మాటలు మాట్లాడడం, విపరీతమైన అతిశయోక్తులతో రణగొణధ్వని సృష్టించడం, ఆ రణగొణధ్వనిలో అసలు విషయాలు వినబడకుండా, కనబడకుండా చేయడం ఒక కళగా అభివృద్ధి చేసి గతంలో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పాటించారు. అదే అనుభవాన్ని ప్రస్తుతం కూడ కొనసాగిస్తున్నారు. ఒక కొత్త రాష్ట్రానికి కొత్త రాజధాని తప్పనిసరిగా అవసరమే. దేశంలో కొత్తగా ఏర్పడిన చాల రాష్ట్రాలు పాత నగరాల పక్కన కొత్త రాజధాని నగరాలు నిర్మించుకున్నాయి. అదేమీ కొత్త విషయం కాదు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అంతవరకూ ఉన్న నగరాలకన్న మెరుగైన రాజధాని నిర్మించాలని అనుకోవడమూ తప్పు కాదు. కాని ఆంధ్రప్రదేశ్ రాజధాని సమస్య అంత సులభమైనది కాదు. ఆ రాష్ట్రంలోని మూడు ప్రధాన ప్రాంతాలలో ఇప్పటికే రెండు ప్రాంతాల ప్రజలలో వివక్షకు గురవుతున్నామన్న భావన ఉంది. రాయలసీమ ప్రజలలో గతంలో ఆంధ్ర రాష్ట్ర రాజధాని తమకు ఇచ్చినట్టే ఇచ్చి తప్పించారనే మనస్తాపం ఉంది. ఆ మనస్తాపాన్ని బలోపేతం చేసే శ్రీబాగ్ ఒడంబడిక ఉల్లంఘన ఉంది. రాష్ట్రంలో అన్నిరకాలుగానూ మొదటి స్థానంలో ఉన్న విశాఖపట్నం రాజధాని అయితే బాగుండునని ఉత్తరాంధ్ర ప్రజల్లో కోరిక ఉంది. అన్ని ప్రాంతాల ప్రజల మనోభావాల్ని గౌరవించి ఉన్నా, హైదరాబాదు కేంద్రీకరణ వల్ల వచ్చిన సమస్యలనుంచి గుణపాఠం తీసుకున్నా అమరావతి ఇంత ఆర్భాట రాజధాని అయి ఉండేది కాదు. వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాలకూ సమప్రాతినిధ్యం దక్కి ఉండేది. ఇక అమరావతికి ఎంచుకున్న భూమి సారవంతమైన పంటపొలాల భూమి. రైతులను బెదిరించి, బలవంతపెట్టి, బూటకపు ఆకర్షణలు చూపి ఆక్రమించిన భూమి. అయినా భూమి ఇవ్వబోమని భీష్మించిన రైతులూ ఉన్నారు. వాళ్ల మీద ప్రభుత్వం, పాలక పక్షం సాగిస్తున్న దాడులు, పంటలు తగులబెట్టడాలు, పంట భూముల మీద రోడ్లు వేయడాలు వార్తలు వస్తూనే ఉన్నాయి. రాజధాని నిర్మాణం అనే అవసరమైన కార్యక్రమం ఇటువంటి సమస్యలను ఎదుర్కొంటున్నప్పుడు, ఎవరైనా ఆ సమస్యలను పరిష్కరించడంపై శ్రద్ధ పెడతారు. కాని ఆంధ్రప్రదేశ్ పాలకులు ఆ సమస్యలను మూసిపెట్టడానికి జపాన్ మంత్రినీ, సింగపూర్ మంత్రినీ, ప్రధాన మంత్రినీ, నిత్యం నిందారోపణలతో, కలహాలతో మాత్రమే సంబంధం ఉన్నట్టు పైకి కనిపించే పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రినీ, అనేక చోట్ల నుంచి మట్టినీ తెచ్చి, అత్యంత అసహ్యకరంగా, రాజ్యాంగ వ్యతిరేకంగా హైందవ, బ్రాహ్మణ మంత్ర తంత్రాల ఆచారాల రణగొణధ్వనితో రాజధాని నిర్మాణాన్ని ప్రారంభించారు. సర్కస్ లూ నుమాయిష్ లూ పిల్లి మొగ్గలూ ఐంద్రజాలిక ప్రదర్శనలూ తాత్కాలికంగా బాగానే ఉంటాయి, కళ్లకూ చెవులకూ మనసుకూ ఇంపుగానే ఉంటాయి. కాని అవి గడిచిపోగానే పాత ఆకలి మళ్లీ గుర్తుకొస్తుంది. పాత సమస్యలు మళ్లీ తిరగబెడతాయి. ఆర్భాటాలతో వాటిని మూసేయడం కుదరదు. వీ

బాలరిష్టాలలో నేపాల్ నూతన రాజ్యాంగం

నేపాల్‌లో ఎట్టకేలకు కొత్తరాజ్యాంగం పురుడు పోసుకుంది. 600 మంది సభ్యులున్న నేపాల్ రాజ్యాంగ సభలో 507 మంది సమర్థించగా కొత్త రాజ్యాంగం ఉనికిలోకి వచ్చింది. భయంకర భూకంపం బారినపడ్డ ప్రజల ఒత్తిడిని తట్టుకోలేక ప్రధాన రాజకీయ పార్టీలు నేపాలీ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ (యునైటెడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్), ప్రచండ నాయకత్వంలోని మావోయిస్టు పార్టీ, మధేశీ పార్టీలోని గచ్ఛదార్ వర్గం తమ విభేదాలకు తాత్కాలికంగా స్వస్తిచెప్పి కొత్త రాజ్యాంగానికి అంగీకరించారు. ఏ రాజ్యాంగంలేని పరిస్థితిలోంచి బయటపడి, ఎన్ని లోపాలున్నా, ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రజాస్వామ్య స్ఫూర్తితో తయారయి, ప్రజాస్వామ్య రీతులలో ఆమోదించబడిన నూతన రాజ్యాంగాన్ని అందరు ఆహ్వానించాలి. పెద్దన్న భారతదేశం మాత్రం నేపాల్ పరిణామాన్ని ఆహ్వానించలేదు. కేవలం గమనంలోకి తీసుకున్నట్టు మాత్రమే ప్రకటించింది. నేపాల్ కొత్త రాజ్యాంగాన్ని చైనా ఆహ్వానించింది. అమెరికా తన రాయబారిని నేపాల్ ప్రత్యేకంగా పంపించి ప్రధాన మంత్రిని అభినందించింది. యురోపియన్ రాజ్యాలు నేపాల్‌లోని దేశం కొత్త రాజ్యాంగం పరిధిలోకి రావడాన్ని హర్షించాయి. భారతదేశం ఒకడుగు ముందుకు వేసి నేపాల్‌ని ఆర్థిక దిగ్బంధంలో ఉంచే ప్రయత్నం చేసింది. భారతదేశంలోని సంస్థలు నేపాల్‌కు ఇంధన సరఫరాను నిలిపివేశాయి. ఈ పనికి నేపాల్ దేశ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఆ దేశ ప్రజలు భారత ప్రభుత్వాన్ని శత్రువులాగా చూసే పరిస్థితి ఉత్పన్నమైంది. నేపాల్ ఆంతరంగిక విషయాలలో భారత్ తలదూర్చడం అనైతికం. ఆ దేశ ప్రజలకే నూతన రాజ్యాంగం పట్ల అసంతృప్తి ఉంటే, దాన్ని వ్యక్తపరచడం పూర్తిగా నైతికమే! నూతన రాజ్యాంగం పట్ల నిరసన జ్వాలలు తీవ్రస్థాయిలోనే ఎగిసిపడ్డాయి. దేశం మొత్తాన్ని ఏడు ప్రాదేశిక ప్రాంతాలుగా విభజించడం జనజాతీలలో, మదేశీలలో కోపావేశాలకు కారణమైంది. ఈ ఏర్పాటును నిరసిస్తూ జరిగిన ఘర్షణలలో 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. థారు, మదేశీ, జనజాతీలాంటి తెగలు ఇంకా వెనుకబాటు తనానికీ, రాజకీయ వివక్షకు, సాంఘిక దోపిడీకి గురవుతాయని వారు అభిప్రాయపడుతున్నారు. నిజానికి, ఈనాడు నేపాల్‌లో బహూన్, చెత్రి అనే రెండు అగ్రవర్ణాల చేతుల్లోనే సాంఘిక, రాజకీయ అధికారం కేంద్రీకృతం అయి ఉంది. ఆ రెండు అగ్రకుల ఆధిపత్యంలోనే నేపాల్ దేశంలో రాజకీయ వ్యవస్థ కొనసాగడానికే ఈ ప్రాదేశిక ప్రాంతాల విభజన తోడ్పడుతుంది. నేపాలీ మహిళల అస్తిత్వాన్ని ప్రశ్నించే అధికరణం ఒకటి నేపాలీ స్త్రీలను తీవ్రంగా కలిచివేసింది. ఆ అధికరణం కారణంగా విదేశీయులకు, నేపాలీ మహిళలకు పుట్టిన సంతానానికి నేపాల్ పౌరసత్వం ప్రశ్నార్థకంగా మారింది. భారతీయులకు, నేపాలీలకు మధ్య వివాహ సంబంధాలు సర్వసాధారణం. నేపాల్ కొత్త రాజ్యాంగంలో చేర్చిన ఈ నిబంధనవల్ల ఇబ్బందులకు గురవుతున్న వారి సంఖ్య పదిలక్షల నుండి నలభై లక్షల దాకా ఉంటుందని ఆందోళనకారులు చెపుతున్నారు. కొత్త రాజ్యాంగంలో మరొక ప్రధానమైన ప్రతికూలాంశం నేపాల్ సమాజంలోని వివిధ వర్గాల అస్తిత్వాన్ని గుర్తించి, గౌరవించే సమాఖ్య స్ఫూర్తిలోపించడం. ఈ ప్రతికూలాంశాలు ఉన్నప్పటికీ, గణతంత్ర ప్రేరణ, సమాఖ్య స్ఫూర్తి, మతరహిత స్థితి, బడుగు వర్గాలను, సామాజికంగా అట్టడుగున ఉన్న సమూహాలను అభివృద్ధిలో భాగాస్వాము లను చేయడం లాంటి సూత్రాలను రాజ్యాంగంలో పొందు పరిచారు. దేశంలో అంతర్గతంగా ఉన్న సమస్యలను అధిగమించి, సామరస్యపూరితం గా అన్నివర్గాల ప్రజల ప్రాతినిధ్యాన్ని పొందుపరుచుకుంటేనే నేపాల్ సమాజం ప్రజాస్వామ్య సమాజంగా మార్పు చెందే ఆవకాశం ఉంది. వీ



(మూలం - జి.వి. రామాంజనేయులు, సెంటర్ ఫర్ సస్టేనబుల్ అగ్రికల్చర్)

కనకయ్య మృతి

పౌరహక్కుల సంఘం నాయకులు, విరసం సభ్యులు కె. కనకయ్య సెప్టెంబర్ 9న ప్రకాశం జిల్లా పర్చూరులో మృతి చెందారు. ఆయన 1937 అక్టోబర్ 15న పర్చూరులో జన్మించారు. ఆయన 1971 నుండి గ్రేడ్1 పండిట్‌గా వై.ఆర్ హైస్కూల్‌లో పనిచేసి 1995లో ఉద్యోగ విరమణ చేశారు. ఎపిటిఎఫ్‌లో చేరి ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల కోసం పనిచేశారు. ప్రాంతీయ విద్యాభివృద్ధి కోసం ప్రాంతీయ సంఘాన్ని, జూనియర్ కళాశాలను, బాలికోన్నత పాఠశాలను నెలకొల్పడంలో ఎంతో కృషి చేశారు. వివిధ ప్రజా సంఘాలను ఏర్పాటు చేయడంలో, వాటిని నిలబెట్టడంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. 1975లో దేశంలో ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినపుడు కనకయ్యను అరెస్ట్ చేసి ఒక సంవత్సరం జైలులో నిర్బంధించారు.

ఎన్‌కౌంటర్లకు నిరసనగా చలో అసెంబ్లీ

వరంగల్ జిల్లాలో జరిగిన శృతి, సాగర్‌ల ఎన్‌కౌంటర్‌కు నిరసనగా తెలంగాణ ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని 371 ప్రజా సంఘాలు, వ్యక్తులు, పార్టీలు కలిసి నిర్వహించాయి. చలో అసెంబ్లీ కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి వస్తున్న వేలాది మందిపై పోలీసులు తీవ్ర నిర్బంధాన్ని అమలు చేశారు. అసెంబ్లీ వైపు వెళ్లడానికి ప్రయత్నించిన వివిధ ప్రజా సంఘాల కార్యకర్తలను దాదాపు ఐదు వేలమందిని అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని వివిధ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు.

తెలంగాణలో రైతు రక్షణ యాత్ర

తెలంగాణలో రైతులకు భరోసా కల్పించేందుకోసం తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో 'రైతు రక్షణ యాత్ర'ను అక్టోబర్ 2న నిర్వహించింది. ఈ యాత్ర హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపమైన గన్ ఫార్క్ నుంచి వరంగల్ జిల్లాలోని చేర్యాల వరకు సాగింది. ముగింపు సభలో అన్నం పెట్టే రైతును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, ప్రభుత్వం మెడలు వంచైనా రైతు ఆత్మహత్యలు లేని తెలంగాణ కోసం పోరాడుదామని వక్తలు అన్నారు. రైతు ఆత్మహత్యల నివారణకు అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. పాత రుణాలను మాఫీచేసి జాతీయ బ్యాంకు ద్వారానే రైతులకు కొత్త రుణాలను అందించాలని అన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో 24 మంది మృతి

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి డిపో బస్ 32 మంది ప్రయాణికులతో అక్టోబర్ 7న నల్లగొండకు బయలుదేరింది. బస్సు తుమ్మలగూడెం శివారులో మలుపు తిరుగుతుండగా నల్లగొండ నుండి భువనగిరి వైపు వెళ్తున్న లారీ బస్సును కుడి వైపు ఢీకొట్టింది. దీంతో బస్ డ్రైవర్‌తో సహా 9 మంది అక్కడికక్కడే మరణించారు. 16 మంది గాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కందుకూరు సమీపంలోని చెర్లపాలెం వద్ద అక్టోబర్ 17న ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 15 మంది మరణించగా 38 మంది తీవ్రంగా గాయపడ్డారు. మాలకొండలో వివాహానికి 55 మందితో వెళుతున్న డిసిఎంను ఎదురుగా వస్తున్న శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు వేగంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.

ఆర్‌టిసి కార్మికుల ధర్నా

ఆర్‌టిసిలో టిమ్స్ అమలు, అద్దె బస్సుల పెంపుపై ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నం. 41ని వెంటనే రద్దు చేయాలని, ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 7న రాష్ట్రంలోని అన్ని డిపోల నుంచి వచ్చిన ఆర్‌టిసి కార్మికులతో ఇందిరా ఫార్క్ వద్ద మహాదీక్ష చేపట్టారు. సిఐటియు జాతీయ నాయకులు ఆర్. సుధాభాస్కర్ టిమ్స్ వినియోగం పెంచి, కండక్టర్లను తొలగించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని అన్నారు. ఆర్‌టిసిని బలోపేతం చేస్తాం అంటూనే బస్సులు కొనకుండా అద్దె బస్సులు తీసుకోవాలని నిర్ణయించడంలో ప్రభుత్వ వైఖరి ఎంటో తెలుస్తుందన్నారు.

తెలంగాణ రాష్ట్ర బంద్

తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా, రైతులకు ఒకే దఫాలో రుణ మాఫీ చేయాలని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు ఉమ్మడిగా అక్టోబర్ 10న రాష్ట్ర వ్యాప్త బంద్ నిర్వహించాయి. బంద్‌లో పాల్గొన్న కాంగ్రెస్, టిడిపి, బిజెపి, వామపక్ష నేతలను, వేలాదిమందిని ఎక్కడికక్కడే అరెస్ట్ చేశారు.

ఎపికి ప్రత్యేక హోదాకోసం ప్రతిపక్ష నేత దీక్ష

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వైసిపి నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్టోబర్ 7న గుంటూరులో నిరవధిక నిరాహార దీక్ష చేశారు. ఆరు రోజుల పాటు సాగిన ఈ దీక్షను అక్టోబర్ 13 తెల్లవారు జామున పోలీసులు భగ్నం చేశారు. పోలీసులు బలవంతంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఆస్పత్రికి తరలించారు.

మద్దిలేటి మృతి

తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్షుడు పులిమామిడి మద్దిలేటి (49) గుండెపోటుతో అక్టోబర్ 14న మృతిచెందారు. ఆయన మహబూబ్‌నగర్‌లోని అలంపూర్ మండలం లింగన్వాయి గ్రామంలో జన్మించారు. అలంపూర్‌లో దళిత వసతి గృహంలో ఉంటూ విద్యను అభ్యసించారు. విద్యార్థిగా ఉన్నప్పుడే రాడికల్ విద్యార్థి సంఘంలో చేరి విద్యార్థుల సమస్యలపై పోరాడారు. డిగ్రీ పూర్తయ్యాక ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. ప్రజాస్వామ్య తెలంగాణ లక్ష్యంగా 1998లో ఏర్పడిన తెలంగాణ జనసభలో చేరి అనంతరం ఏర్పడిన తెలంగాణ ప్రజా ఫ్రంట్‌లో తొలి నుంచి చురుకైన పాత్ర నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘంలో ఉంటూ మహబూబ్‌నగర్ కరువుపై వివిధ సంస్థలతో కలిసి పనిచేశారు. ఆకుల భూమయ్య మరణం తరువాత మద్దిలేటి రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించాడు.

ఆంధ్రప్రదేశ్ రాజధానికి శంకుస్థాపన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి అక్టోబర్ 22న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గుంటూరులో భారీ భహిరంగ సభ ఏర్పాటు చేశారు. దీనికి తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావుతో పాటు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి వెంకయ్యానాయుడు హాజరయ్యారు. వేల ఎకరాల రైతుల భూములు తీసుకొని రాజధానిని నిర్మిస్తున్నారని నిరసిస్తూ ప్రతిపక్ష పార్టీ వైఎస్ఆర్‌సిపితో పాటు కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలు శంకుస్థాపనలో పాల్గొనలేదు.

ఆంధ్రప్రదేశ్‌లో పెరిగిన బస్ చార్జీలు

ఆంధ్రప్రదేశ్‌లో బస్సు చార్జీలు పెరిగాయి. అక్టోబర్ 23 నుంచి ఈ చార్జీల పెంపు అమలులోకి వచ్చింది. సిటీ ఆర్డినరీ చార్జీలపై 5 శాతం పెంపు. ఎక్స్‌ప్రెస్ నుంచి గరుడ ప్లస్ వరకు అన్ని రకాల బస్సులపై 10 శాతం పెంచారు. దీని ప్రకారం తెలుగు, వెలుగు, సిటీ ఆర్డినరీ సర్వీసులపై కిలోమీటర్‌కు మూడు పైసలు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, గరుడ, గరుడ ప్లస్ సర్వీసులపై కిలోమీటరుకు 8 నుంచి 9 పైసల వరకు చార్జీ పెరిగింది.

హిందూ ఫాసిస్టు విధానాలకు రచయితల నిరసన

కవులు, రచయితలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 21న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చర్చాగోష్టి నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు చర్యలకు వ్యతిరేకంగా తెలుగు రాష్ట్రాల కవులు, రచయితలు, కళాకారులు సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో రచయితలపై దాడులు జరగడం అప్రజాస్వామికమన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన నుండి కవులు, రచయితలపై దాడులు పెరిగిపోయాయని ఇది భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమే అవుతుందన్నారు. రచయితలపై జరుగుతున్న మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వేదిక సభ్యులు వెల్లడించారు. వీ

ఫ్రెంచ్ విప్లవం నాటి స్థితికి భారతదేశం

భారత సమాజంలో అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. తమ చుట్టూ ఉన్న దారిద్ర్య సముద్రం మధ్య ఒంటరి ద్వీపాల్లా వెలుగుతున్న సంపన్న వర్గాల నిర్లక్ష్య, అమానుష వైఖరి నానాటికీ పెరుగుతున్నది. కర్మ సిద్ధాంతంతో, కుల మత బంధనాలతో, పార్లమెంటరీ భ్రమలతో, వ్యసనాలతో ఎంతగా మైమరిపించినా నిరుపేద వర్గాల దుస్థితి రోజురోజుకూ దుర్భరంగా మారుతున్నది. ఇది ప్రతి ఒక్కరికీ కనబడు తున్నప్పటికీ చాలమంది ఆలోచనాపరులు ఈ విస్ఫోటక స్థితి లేదన్నట్టు నటిస్తున్నారు, ప్రవర్తిస్తున్నారు. ఈ నెలలో వెలువడిన కొన్ని వార్తలైనా ఈ నిద్రానటన నుంచి ఆలోచనాపరులను మేల్కొల్పగలిగితే బాగుండును.

స్విట్జర్లాండ్‌లోని జూరిచ్ కేంద్రంగా నడిచే క్రెడిట్ స్వీస్ అనే ద్రవ్యవ్యాపార, సలహా వ్యాపార బహుళజాతి సంస్థ ఈ నెలలో గ్లోబల్ వెల్త్ రిపోర్ట్ 2015, దానికి అనుబంధంగా గ్లోబల్ వెల్త్ డాటాబుక్ వెలువరించింది. క్రెడిట్ స్వీస్ ప్రతి సంవత్సరమూ ప్రపంచ దేశాలలో ఏయే దేశంలో ఎంత సంపద పోగుపడిందో ఒక నివేదిక ప్రకటిస్తుంది. ఆరు సంవత్సరాలుగా వెలువడుతున్న ఈ నివేదికల ప్రధాన లక్ష్యం హై నెట్ వర్త్ ఇండివిజువల్స్ (ఎచ్ఎన్ఐ – అత్యంత ఎక్కువ విలువైన, సంపన్నులైన వ్యక్తులు) ఏ దేశంలో ఎలా పెరుగుతున్నారో చెప్పి వారినుంచి మదుపు సేకరించడానికి, వారిచేత విలువైన స్థిర చరాస్తులు, సరుకులు కొనిపించడానికి ఏ అవకాశాలు ఉన్నాయో బహుళజాతి సంస్థలకు సలహాలు ఇవ్వడం. తాజా నివేదిక ప్రకారం భారత జనాభాలో కేవలం ఒక్క శాతంగా ఉన్న ధనికుల దగ్గర దేశపు మొత్తం సంపదలో 53 శాతం ఉంది. జనాభాలో 5 శాతం ధనికులను లెక్కవేస్తే వారి దగ్గర 68.6 శాతం సంపద ఉంది. జనాభాలో 10 శాతం ధనికులను లెక్కిస్తే వారి దగ్గర 76.3 శాతం సంపద ఉంది. దీన్ని మరొక మాటల్లో చెప్పాలంటే దేశ జనాభాలో మిగిలిన 90 శాతం దగ్గర కేవలం 23.7 శాతం సంపద మాత్రమే ఉందన్నమాట. అందులో మళ్లీ సగం జనాభా కేవలం 4.3 శాతం సంపదతో బతుకులీడుస్తున్నారు.

ఈ సంపన్నులకు గత రెండు దశాబ్దాలలో తమ సంపద మరింతగా పెంచుకోవడానికి ఎన్ని అవకాశాలు వచ్చాయంటే దేశంలో అత్యంత సంపన్నులైన ఒక్క శాతం మంది దగ్గర 2000లో 36.8 శాతం సంపద మాత్రమే ఉండేది. పదిహేను సంవత్సరాలు గడిచే సరికల్లా అది 53 శాతానికి పెరిగింది. అలాగే అత్యంత ధనికులైన 10 శాతం దగ్గర 2000లో 65.9 శాతం సంపద ఉండేది. అది ప్రస్తుతం 76.3 శాతం అయింది. ఇదే నిష్పత్తిలో పేదల వాటా తగ్గిపోతున్నదని అర్థం. ఈ పదిహేను సంవత్సరాలలో దేశంలో 2.284 ట్రిలియన్ డాలర్ల (148636895800000 రూపాయలు – 1,48,63,689 కోట్ల రూపాయల) సంపద పెరిగిందనీ, అందులో 61 శాతం అత్యంత ధనికులైన 1 శాతం చేతికి చిక్కిందనీ, అందులో 81 శాతం సంపద అత్యంత ధనికులైన 10 శాతం చేతికి చిక్కిందనీ ఈ నివేదిక చెపుతున్నది. అంటే ఈ పదిహేను సంవత్సరాల్లో పెరిగిన సంపదలో దేశ జనాభాలోని 90 శాతం మందికి దక్కినది 19 శాతమేనన్నమాట. సంపద పెరగాలనీ, జాతీయాదాయం పెరగాలనీ, అది కిందికి బొట్లుబొట్లుగా జారి అందరికీ మేలు జరుగుతుందనీ పాలకుల బూకరింపుల అసలు అర్థం ఇది!

ఈ నివేదిక ఇటువంటి అంకెలు చాల ప్రకటించింది గాని మరొక పట్టిక ఆసక్తికరమైనది. పది లక్షల డాలర్ల నుంచి యాభై లక్షల డాలర్ల సంపన్నులు భారత దేశంలో 1,56,005 మంది, యాభై లక్షల డాలర్ల నుంచి కోటి డాలర్ల సంపన్నులు 16,000 మంది, కోటి డాలర్ల నుంచి ఐదు కోట్ల డాలర్ల సంపన్నులు 11,118 మంది, ఐదు కోట్ల డాలర్ల నుంచి పది కోట్ల డాలర్ల సంపన్నులు 1,142 మంది, పదికోట్ల డాలర్ల నుంచి యాభై కోట్ల డాలర్ల సంపన్నులు 792 మంది, యాభైకోట్ల డాలర్ల నుంచి వందకోట్ల డాలర్ల సంపన్నులు 81 మంది, వంద కోట్ల డాలర్ల కన్న ఎక్కువ సంపన్నులు 67 మంది ఉన్నారని ఈ పట్టిక చెపుతుంది. అంటే మొత్తం మీద ఈ 128 కోట్ల ప్రజల దేశంలో పది లక్షల డాలర్లు (ప్రస్తుత ద్రవ్యమారకం ప్రకారం ఆరు కోట్ల యాభై లక్షల రూపాయలు) కన్న ఎక్కువ సంపద ఉన్నవారు 1,85,205 మంది మాత్రమే.

'ఒకవైపు భారతదేశంలో సంపద పెరుగుదల పెద్దఎత్తున సాగుతుండగా, మధ్యతరగతిలోకి, సంపన్న వర్గంలోకి చేరుతున్నవారి సంఖ్య పెరుగుతుండగా, ఈ వృద్ధి ప్రతి ఒక్కరికీ అందడం లేదు. పేదరికం కూడ పెద్దఎత్తునే కొనసాగుతోంది. దేశంలోని వయోజన జనాభాలో 95 శాతం మంది సంపద పదివేల డాలర్ల (ఆరున్నర లక్షల రూపాయల) కన్న తక్కువే ఉండడం దీనికి సూచన. మరొకవైపు లక్ష డాలర్ల కన్న ఎక్కువ సంపన్నులు దేశ వయోజన జనాభాలో 0.3 శాతం మాత్రమే' అని ఈ నివేదిక రాయక తప్పలేదు.

ఇది కేవలం భారతదేశపు దృశ్యం మాత్రమే కాదు. ఈ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగానే సంపద యజమానుల పిరమిడ్ ఎంత దారుణంగా ఉన్నదంటే, ప్రపంచ వయోజన జనాభాలో 0.7 శాతం మంది చేతుల్లో 45.2 శాతం సంపద ఉంది. ఆ తర్వాత వరుసలో 7.4 శాతం మంది చేతుల్లో 39.4 శాతం సంపద, 21 శాతం మంది చేతుల్లో 12.5 శాతం సంపద ఉంది. ఇక మిగిలిన 71 శాతం ప్రజలకు మిగిలింది 3 శాతం సంపద మాత్రమే.

క్రెడిట్ స్వీస్ లాగనే కాప్ జెమిని అనే మరొక ద్రవ్యవ్యాపార, యాజమాన్య సలహా వ్యాపార బహుళ జాతి సంస్థ ఉంది. ఫ్రాన్స్‌లోని పారిస్ కేంద్రంగా నడిచే ఈ సంస్థ రాయల్ బ్యాంక్ ఆఫ్ కెనడా వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగంతో కలిసి కాప్ జెమిని – ఆర్ బిసి వెల్త్ మేనేజ్‌మెంట్ వరల్డ్ వెల్త్ రిపోర్ట్ అని ప్రతి సంవత్సరం ప్రకటిస్తుంది. ఈ నెలలోనే విడుదలైన దాని తాజా, 2015 సంవత్సరపు నివేదిక కూడ ఇదే చిత్రాన్ని నిర్ధారిస్తున్నది. భారత దేశంలో హై నెట్‌వర్త్ ఇండివిజువల్స్ సంఖ్య ఏడాదికేడాదికీ పెరుగుతున్నదని, 2013లో ఆ సంఖ్య 1,56,000

ఉండగా, 2014లో అది 1,98,000 అయిందని ఈ నివేదిక ప్రకటించింది. సంపన్నుల పెరుగుదలలో భారత ఆర్థిక వ్యవస్థ ఏడాదిలో 26 శాతం పెరుగుదల సాధించి, ప్రపంచంలో ఎక్కువమంది సంపన్నులున్న దేశాల జాబితాలో అంతకు ముందు సంవత్సరం కన్న ఐదుస్థానాలు పైకి ఎగబాకి, పదకొండో స్థానానికి చేరిందని ఈ నివేదిక రాసింది. ఈ బ్రహ్మాండమైన పెరుగుదలకు కారణం 2014 మధ్యలో జరిగిన ఎన్నికలలో వ్యాపార అనుకూల ప్రభుత్వం ఎన్నిక కావడమేనని కూడ రాసింది.

ఒకవైపు భారత ఆర్థిక వ్యవస్థలో సంపన్నుల పెరుగుదల గురించి ఇటువంటి నివేదికలు, బహుళ జాతి సరుకుల, సేవల అమ్మకాల మార్కెట్ అంచనాలు వెల్లువెత్తుండగానే అమెరికాలో స్థిరపడిన బ్రిటిష్ అర్థశాస్త్రవేత్త ఆంగస్ డీటన్‌కు 2015 నోబెల్ ఆర్థిక బహుమతి వచ్చింది. ఆంగస్ డీటన్‌కు భారతదేశంతో కూడ సంబంధం ఉంది. ఆయన 1990ల్లో భారతదేశంలో పోషకాహార స్థితి గురించి పరిశోధనలు చేశారు. పోషకాహార లేమికీ దారిద్ర్యానికీ మధ్య సంబంధం గురించీ, పేదలు పోషక విలువల ఆహారం తీసుకోలేకపోవడం గురించీ ఆయన చేసిన సూత్రీకరణలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. నోబెల్ బహుమతి అందుకున్న సందర్భంగా ఆయనతో పత్రికలు జరిపిన సంభాషణల్లో మళ్లీ ఒకసారి పేదరికం, పోషకాహార లోపం, భారత సమాజంలో అసమానతల గురించి చర్చ జరిగింది. 'భారతదేశంలో ఆర్థిక వృద్ధి గురించి కనబడుతున్న శ్రద్ధ మంచిదే గాని, అది ఒక్కటే సరిపోదు. అర్థవంతమైన సామాజికసేవలు, సౌకర్యాలు వెనుకబడిన ప్రజలకు చేరినప్పుడు మాత్రమే, పెరుగుతున్న సంపదను పంచుకున్నప్పుడు మాత్రమే వృద్ధికి అర్థం ఉంటుంది. ఆర్థిక వృద్ధి సాధారణంగా అసమానతలను సృష్టిస్తుంది. దానితో లాభం పొందేవారు, ఇతరులకు ఆ లాభం అందకుండా అడ్డు పడగూడదు' అని ఆయన హిందుస్తాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు.

పేదల కోసం అనే పేరుతో అమలవుతున్న ప్రజా పంపిణీ పథకం గురించి మాట్లాడుతూ, 'అది పేదలకు అతి ముఖ్యమైన వనరే. కాని సౌభాగ్యాన్ని కేవలం కాలరీలతో కొలిస్తే సరిపోదు. ఆహారం కాలరీల కొలత మాత్రమే కాదు. దాంట్లో వైవిధ్యం ఉండాలి. పళ్లు, కూరగాయలు, గుడ్లు, మాంసాహారం వంటివన్నీ ఉండాలి. అసలు ఆహారం మాత్రమే కూడ కాదు, ఇతర విషయాలు కూడ సక్రమంగా ఉండాలి. పిల్లలు కష్టతరమైన పనులు చేయకుండా ఉండాలి. పిల్లలకు ఆరోగ్యసేవలు అందాలి. మంచి పారిశుధ్య సౌకర్యాలుండాలి. బహిరంగ మల విసర్జన ఉండగూడదు' అన్నారు. 'భారతదేశంలో జాతీయాదాయ లెక్కలు సరైనవి కావని అందరికీ తెలుసు. అందువల్ల అసలు చెపుతున్న వృద్ధి లెక్కలన్నీ సరైనవని నేననుకోను. వృద్ధి రేటును సవరించేటప్పుడు అది పెరిగితే ఆమోదిస్తారు గాని తగ్గిందంటే ఆమోదించరు. పేదరికాన్ని తక్కువ చేసి చూపడం కన్న వృద్ధిని ఎక్కువ చేసి చూపడం విచారకరం' అనీ అన్నారు.

భారతదేశంలో పెరుగుతున్న తీవ్రమైన అసమానతల దుష్ఫలితాల గురించి మాట్లాడుతూ, 'ఆ దుష్ఫలితాలు అమెరికాలో ఉన్నట్టే ఉండబోతాయి. ధనికులు తమకు రావలసిన దానికన్న ఎక్కువ రాజకీయాధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటారు. దానితో రాజ్యం అత్యధిక ప్రజానీకానికి సేవలు అందించడం మానేస్తుంది' అన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే సంపన్నులు పెరగడంతో, అసమానతలు పెరగడంతో రాజ్యం అత్యధిక ప్రజానీకం నుంచి దూరమైపోతుంది అని అర్థం.

రాజ్యానికీ ప్రజలకూ దూరం పెరగడం, ప్రజల సమస్యలనూ ఆకాంక్షలనూ రాజ్యం పట్టించుకోకపోవడం ప్రజల ఆగ్రహం పెరగడానికీ, అంతిమంగా అది విస్ఫోటనం చెందడానికీ ఎలా దారి తీస్తుందో రెండున్నర శతాబ్దాల కింద ఫ్రెంచి విప్లవం చూపింది. చక్రవర్తి పదహారో లూయీ తో సహా దాదాపు అరవై వేల మందిని తలలు నరికి చంపారని, భయానకమైన హింస అమలయిందని యూరపియన్ రాచరిక ప్రభుత్వాలన్నీ గగ్గోలు పెట్టాయి. బ్రిటిష్ తత్వవేత్త, ఉదారవాది ఎడ్మండ్ బర్క్ బ్రిటిష్ పార్లమెంటులో ఈ హింసాకాండను విమర్శిస్తూ మాట్లాడడమే కాక ఒక పుస్తకమే రాశాడు. బర్క్‌ను విమర్శిస్తూ ఆ హింసాకాండకు కారణమైన రాచరికపు హింసాకాండ, సామాజిక అంతరాలు ఎంత దుర్మార్గమైనవో అమెరికన్ తత్వవేత్త థామస్ పెయిన్ రైట్స్ ఆఫ్ మాన్ అని పుస్తకం రాశాడు.

విప్లవ పూర్వ ఫ్రాన్స్‌లో రాజకుటుంబం ప్రజల జీవితాలతో, సమస్యలతో, ఆకాంక్షలతో సంబంధం లేకుండా, సంపదలో, విలాసాలలో మునిగిపోయింది. అప్పటి ఆదాయాల గురించీ, సంపద గురించీ విశ్వసనీయమైన గణాంకాలు లేవు గాని, ఎన్నో సమకాలీన ఆధారాలను, పన్నుల చెల్లింపులను పరిగణనలోకి తీసుకుని క్రిస్టియన్ మారిసన్, వేన్ స్నైడర్ అనే ఇద్దరు ఫ్రెంచి అర్థశాస్త్రవేత్తలు 'ఫ్రాన్స్‌లో ఆర్థిక అసమానతలు – చారిత్రక దృక్పథం' అని ఒక ఆసక్తికరమైన పరిశోధనాపత్రాన్ని 2000లో ప్రచురించారు. ఫ్రెంచి విప్లవం బద్దలు కావడానికి ముందు జనాభాలో సంపన్నులైన పది శాతం చేతుల్లో మొత్తం దేశ సంపదలో 45 నుంచి 53 శాతం కేంద్రీకృతమైందని ఆ పత్రం నిర్ధారించింది. తమ గణాంకాలకు పరిమితులున్నాయని ఆ పరిశోధకులు చెప్పుకున్నప్పటికీ, చాల ఆశ్చర్యకరంగా భారత సమాజంలో సంపద అసమనత గురించి క్రెడిట్ స్వీస్ ప్రకటించిన అంకె, ఫ్రెంచి విప్లవానికి ముందు ఉండిందని ఈ పరిశోధకులు చెప్పిన అంకె ఒకే లాగున్నాయి. విప్లవ పూర్వ ఫ్రెంచి సమాజానికీ ప్రస్తుత భారత సమాజానికీ స్పష్టమైన పోలికలున్నాయి. ఆ మాటకొస్తే భారత సమాజంలోనే ఫ్రెంచి సమాజంలో కన్న ఎక్కువ అసమానతలు ఉన్నట్టున్నాయి.

సరిగ్గా ఇదే మాట మాజీ న్యాయమూర్తి మార్కండేయ కట్జూ కూడ ఇటీవల అన్నారు. జూన్‌లో డెయిలీ ఓ అనే వెబ్‌సైట్ మీద ఆయన 'భారతదేశం ఫ్రెంచి విప్లవం వైపు ఎందుకు పయనిస్తోంది?' అని వ్యాసం రాశారు. సమాజంలో పెరుగుతున్న అసమానతలు, అధికారంలో ఉన్నవారి అక్రమాలు, మాట్లాడవలసినవారి మౌనం, ప్రజల దుస్థితి వంటి విషయాలెన్నో ప్రస్తావించారు. భారతదేశం అనివార్యంగా ఫ్రెంచి విప్లవం వంటి విస్ఫోటనం వైపు ప్రయాణిస్తున్నదని అన్నారు. ఈ వ్యాసాన్ని ఎన్నో పత్రికలకు పంపించాననీ, ఆ పత్రికలన్నీ దాని ప్రచురణకు తిరస్కరించాయనీ, అందువల్ల ఈ వెబ్‌సైట్ మీద ప్రచురించవలసి వచ్చిందనీ ఆయన ఒక వ్యాఖ్య చేశారు. ఆ వ్యాఖ్యలో ఆయన 'ప్రేమ్‌చంద్ కథ షత్రంజ్ కె ఖిలాడీ లో బ్రిటిష్ సైన్యం లక్నోలో ప్రవేశించేవరకూ ఉద్దేశపూర్వకంగా మౌనం నటించిన మీర్ సాహెబ్, మీర్జా సాహెబ్‌ల లాగనే ప్రవర్తిద్దామా' అని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ తమకు తాము వేసుకోవలసిన రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రశ్న అది. వీ

'చలో అసెంబ్లీ' పై ఉక్కుపాదం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే ప్రజాస్వామిక హక్కులు అమలుచేస్తామని చెప్పిన వారు అధికారంలోకి రాగానే కనీసం సభలు, సమావేశాలకు కూడా అనుమతించకుండా ఏకంగా ఎన్‌కౌంటర్‌ల పేరుతో పట్టుకొని చంపి పాలక వర్గ స్వభావాన్ని చాటుకున్నారని అంటున్నారు **బి. రామకృష్ణ**

ప్రజల ఆకాంక్షలను, అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి వీలుండడం అనేది ప్రజాస్వామిక వ్యవస్థ మౌలిక లక్షణం. అందుకొరకు సభలు, సమావేశాలు వేదికలుగా ఉంటాయి. వాక్ సభా, స్వాతంత్ర్యాలను భారత రాజ్యాంగంలోని 19వ ఆర్టికల్ ప్రాథమిక హక్కుగా గుర్తించింది. భావ ప్రకటనా స్వేచ్ఛను ప్రజాస్వామిక విలువగా గుర్తించి వాటికి భంగం కలిగినప్పుడు న్యాయవ్యవస్థ ద్వారా రక్షణ పొందే వీలును రాజ్యాంగంలో కల్పించారు.

తెలంగాణ ఉద్యమ సందర్భంలో చంద్రశేఖరరావు గానీ, తెలంగాణ రాష్ట్ర సమితిలోని (టిఆర్ఎస్) భిన్నస్థాయిల్లో ఉన్న నాయకత్వాలు గానీ తెలంగాణ వస్తే ప్రజాస్వామిక హక్కులకు, విలువలకు గౌరవం ఉంటుందని, అవి అమలు చేయబడతాయని చెప్పారు. ఆంధ్ర పాలకుల వల్లనే అవి ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయని చెప్పుకొచ్చారు. స్వయంగా నేటి తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ 2007లో హైదరాబాద్‌లోని గన్‌ఫౌండ్రీ వద్ద పర్వానాహాల్‌లో జరిగిన పౌరహక్కుల సంఘం సభలో దాదాపు గంటసేపు మాట్లాడాడు. ఆ సమయంలో ప్రొ.జయశంకర్, ప్రొ.హరగోపాల్, ప్రొ.కోదండరాం, ప్రొ.శేషయ్య, నేటి ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణలు వేదికపై ఉన్నారు. రేపటి తెలంగాణలో ఎన్‌కౌంటర్లు ఉండవని, ప్రజాస్వామిక హక్కులు పరిరక్షించబడతాయని, రేపటి తెలంగాణలో మీవంటి మేధావుల సలహా, సంప్రదింపులతో పాలన ఉంటుందని కెసిఆర్ ఉపన్యసించారు. దేశానికి రాష్ట్రపతి కావడంకన్నా పౌరహక్కుల సంఘానికి అధ్యక్షుడుగా ఉండడం ఎక్కువ గౌరవం అన్నారు. అవసరమైతే పౌరహక్కుల సంఘానికి న్యాయకత్వం వహిస్తానని కూడా అన్నాడు. 2014 ఎన్నికల సందర్భంలో గజ్వేల్‌లో జరిగిన సభలో మీ కాలికి ముల్లు గుచ్చుకుంటే నా పంటితో తీస్తానని ఎంతో వినయంగా చెప్పాడు. ఈ మాటలు వింటుంటే ఎంతో గొప్పగా అనిపించకమానదు.

ఎన్నో ఆశలతో ప్రజలు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. చివరకు కెసిఆర్‌కు అధికారం కట్టబెట్టారు. ఆ విధంగా అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అయ్యిందో లేదో భావప్రకటనా స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపారు. 2014 సెప్టెంబర్ 21న ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుప తలపెట్టిన సభను విచ్ఛిన్నం చేశారు. ప్రత్యామ్నాయ రాజకీయాలపై? చర్చించేందుకు పలువురు మేధావులు పాల్గొనే సభ అది. అందులో పార్లమెంటరీ రాజకీయాలకు భిన్నంగా ఉండే అభిప్రాయాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నది. అలా చర్చించడం నేరమేమికాదు.

చరిత్ర పొడుగునా భిన్న ఆలోచనల మధ్య, ఆచరణల మధ్య ఘర్షణ జరుగుతూనే ఉన్నది. వాటిల్లోంచి వచ్చిందే ప్రజాస్వామ్య భావన. ప్రజల అభిప్రాయాలకు సమున్నత స్థానం ఉండడమే ప్రజాస్వామ్య గొప్పతనం. దశాబ్దానికి పైగా ఉద్యమాల్లో ఉండి రాజ్య నిర్బంధాలను, అణచివేతలను అనుభవించి ఉన్న టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిరాగానే అవే పద్ధతులను అనుసరించింది. ఇంత త్వరితంగా అణచివేతల పాలనా చట్రంలో టిఆర్ఎస్ ఇమిడిపోవడం ప్రజాస్వామిక వాదులను నిరాశకు గురిచేసింది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చంద్రశేఖర్‌రావు చంచల్‌గూడ జైలులో నిర్బంధించబడి ఉన్న వరవరరావును కలిశారు. ఆయనకు నైతిక మద్దతును ప్రకటించారు. అలాంటి వరవరరావు రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక సభ ఏర్పాటులో ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. రేపటి తెలంగాణలో పాలన మేధావుల సలహాలు, సంభాషణలు, సంప్రదింపులతో జరుగుతుందని కెసిఆర్ చెప్పి ఉన్నాడు. కెసిఆర్ చెప్పిన అలాంటి మేధావుల్లో ఒకరైన ప్రొ.హరగోపాల్, మరెందరో ఆ సభలో ప్రసంగించనున్నారు. ఈ మేధావుల్లో కొందరిని సభాప్రాంగణంకు వస్తున్న దారుల్లోనే నిర్బంధించారు. కొంతమందిని గృహ నిర్బంధం చేశారు. మరెంతోమందిని ముందస్తుగానే అరెస్ట్ చేశారు. సభ జరిగే సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 400లకు మించి పట్టరు. కానీ అంతకుమించి వందలాదిగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అలాగే హైదరాబాద్‌లో అరెస్టులు జరిగాయి. సభనైతే భగ్నం చేయగలిగారు గానీ ప్రజల ఆకాంక్షలు సజీవంగానే ఉన్నాయనే విషయాన్ని ప్రభుత్వాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో వేలాది ప్రజల్ని అరెస్ట్ చేసి నిర్బంధించడంలో వెల్లడయింది. సభ జరిగే సుందరయ్య విజ్ఞాన కేంద్రం చుట్టూ ముళ్లకంచెలు వేశారు. ఒక యుద్ధ వాతావరణ సృష్టించారు. తద్వారా టిఆర్ఎస్ ప్రభుత్వం తానేమిటో, తానెవరికోసం పనిచేయదలుచుకున్నదో స్పష్టం చేసినట్లైంది. ఉద్యమ స్వభానికి, ప్రజాస్వామిక పద్ధతులకు దూరంగా ఉండే ప్రయత్నం క్రమేణా స్పష్టమవుతూ వస్తున్నది.

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఆందోళనలు చేపట్టినప్పుడు హేళనగా చూశారు. నేటికీ సరైన పరిష్కారం చూపలేదు. అలాగే ఆశావర్కర్లు చేసిన ఆందోళనలపై ప్రభుత్వం సరిగా స్పందించలేదు. ఆశావర్కర్లైనా, మున్సిపల్ వర్కర్లైనా కనీస వేతనాలను అమలు చేయమని, ఉద్యోగ భద్రత కల్పించమని, కాంట్రాక్టు పద్ధతులను రద్దు చేయమని డిమాండ్ చేశారు. ఇవి న్యాయమైనవే కదా. వారు చేసిన ఆందోళనలు అన్నీ కూడా ప్రజాస్వామిక పద్దతులోనే జరిగాయి. వారితో చర్చించి అవసరమైతే మిగతా రాజకీయ పక్షాలతో మాట్లాడి అంగీకారానికి రావచ్చు. కానీ ఏకపక్షంగా ఆ ఉద్యమాలనే తప్పుపడుతూ అణచివేసే ప్రయత్నం చేయడం సరైందికాదు.

పోలీస్ వ్యాన్‌లో కుర్చీలకు సంకెళ్లతో పాటు కట్టివేయబడిన వికారుద్దీన్ తదితరులను కూర్చున్నవారిని కూర్చున్నట్లుగానే కాల్చివేశారు. ఎన్‌కౌంటర్ అని ప్రకటించారు. 2015 ఏప్రిల్ 7న జరిగిన ఆ సంఘటన ఫోటోలు చూసిన ఎవరికైనా ఎదురుకాల్పులు జరిగే అవకాశమే లేదని ఏకపక్షంగా దగ్గరనుండి కాల్చినట్లు తెలుస్తుంది. పోలీసులు అనుకుంటే నిజమైన ఎన్‌కౌంటర్‌లా చిత్రీకరించే ప్రయత్నం చేసేవారే కానీ ఇలా కూడా చంపేస్తారు అనే సంకేతం పంపదలుచుకున్నారని స్పష్టమవుతున్నది. దీనిద్వారా భవిష్యత్‌లో హెచ్చరిక కూడా చేయదలుచుకున్నారని తెలుస్తున్నది.

2015 సెప్టెంబర్ 15న వరంగల్ జిల్లాలోని మేడారం(తాడ్వాయి, రంగాపురం)వద్ద 23ఏళ్ల శృతి, మూడు పదుల వయసున్న విద్యాసాగర్‌లు ఎన్‌కౌంటర్ పేరిట హతమార్చబడ్డారు. పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణలో అవి నిజమైన ఎన్‌కౌంటర్లు కావని, వారిని ముందే పట్టుకున్నారని తేలింది. పోలీసులు తమ అధీనంలో ఉన్న వీరిని తీవ్రంగా గాయపరిచి చిత్రహింసల పాలుచేశారని తేలింది. మృతుల శరీర భాగాలు, లైంగిక అవయాలపై ఉన్న గాయాలు ఫోటోల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ఫోటోల ద్వారా మృతుల శరీరాలపై అయిన గాయాలు ఎదురుకాల్పుల వల్ల జరిగినవి కావని సులభంగా ఎవరైనా తెలుసుకోవచ్చు. ఈ సంఘటనలో ఏ ఒక్క పోలీసుకు చిన్న గాయం గానీ, చీరికగానీ కానేలేదు. నిజమైన ఎన్‌కౌంటరే అయితే ఏ ఒక్క పోలీసుకు ఏ చిన్న గాయం కాకుండా ఉంటుందా? ఎన్‌కౌంటర్ అంటేనే పోలీసులు పట్టుకుని తమ అధీనంలో ఉన్న వారిని చంపడం అనేది తెలుగు సమాజం ఎప్పుడో తెలుసుకున్నది. ఎప్పుడుగానీ నిజమైన ఎదురుకాల్పులు జరగవని కూడా తెలుసుకున్నది. ఒక మహిళ శరీరంపై పైశాచికంగా వ్యవహరించిన అమానవీయ చర్యలను ఈ ఫోటోలు బయటపెడుతున్నాయి. రాజ్యం ఎంత దారుణంగా హత్యలు చేసి, ఎన్‌కౌంటర్ కథలు అల్లడానికి సిద్ధపడుతున్నదో ఈ సంఘటన చెబుతున్నది. అప్పుడప్పుడు ఎన్‌కౌంటర్ అని నమ్మించే ప్రయత్నం అయినా జరిగేది కానీ వీరిద్దరి మృతి విషయంలో అలా నమ్మించాలని కూడా అనుకోలేదని స్పష్టమవుతున్నది. తద్వారా మౌలిక మార్పు కోసం భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థలను ప్రశ్నస్తే, ఎదురొడ్డి పోరాటం చేస్తే, సాయుధమైతే రాజ్యం ఎంత బీభత్సంగా విరుచుకుపడుతుందో హెచ్చరించదలుచుకున్నారని తెలుస్తున్నది. టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇక ఉద్యమాలను సహించదని చెప్పదలుచుకున్నది. ఉద్యమాల నుండి అధికారంలోకి వచ్చిన పార్టీ గనుక ప్రజల సమస్యలను అర్థం చేసుకుని చట్ట పరిధిలో స్పందిస్తున్నదని, సరైన రీతిలో పరిష్కరిస్తుందని, హక్కులకు గౌరవం ఉంటుందని అలా కానప్పుడు ప్రశ్నించే అవకాశం ఉంటుందని నిరసన తెలిపే స్వేచ్ఛ ఉంటుందనుకుని ఎవరైనా నమ్మి ముందుకు వస్తే అలాంటిదేమీ కుదరదని కుండబద్దలు కొట్టదలుచుకున్నట్లుగా అర్థమవుతున్నది.

శృతి, సాగర్‌లను చంపినవారు అంత కిరాతకంగా ప్రవర్తించే అవసరం ఏమిటి? మానవత్వం మరిచి అంత కరంగా ఎలా తయారవుతారు. ఆ పైశాచికత్వం వారిలో ఎందుకు పెరిగినట్లు, వారిని అలా తయారుచేసిన పోలీసు వ్యవస్థను ఏమనుకోవాలి. అది వారి ఉద్యోగ ధర్మమైతే కాదు. అంతహీనమైన వారిగా తీర్చిదిద్దిన, దిద్దుతున్న పోలీసు వ్యవస్థపై ప్రజలకు ఎందుకు సదభిప్రాయం ఉంటుంది. ఈ అవ్యవస్థను మానవీయం చేయకుండా తమ రాజకీయ, వర్గ ప్రయోజనాలకోసం, పోలీసు వ్యవస్థకు విచ్చలవిడి అధికారులు ఇస్తున్నారు. దానిని తమ జేబు సంస్థగా మార్చుకుంటున్న లేదా దాని చేతిలో కీలుబొమ్మగా మారిన ప్రభుత్వాలపై ప్రజలకు ఎందుకు నమ్మకముండాలి. ఈ సందర్భంలో ప్రభుత్వం, పోలీసు వ్యవస్థపై అసహ్యం పెరగకుండా ఎలా ఉంటుంది. ఆ క్రమంలో సున్నిత మనస్కులు రాజ్య వ్యతిరేక ఉద్యమాల్లోకి వెల్లకుండా ఉండగలుగుతారా? ప్రజలు చట్టఛట్రంలో లేదా చట్టాలను ధిక్కరిస్తూ తమకు తోచిన రీతుల్లో ప్రభుత్వ చర్యలను నిరసించవచ్చు. వ్యతిరేకించవచ్చు. చట్టవ్యతిరేక పద్ధతుల్లో కూడా ఎదిరించవచ్చు. ఒక ఉద్యమం చట్టబద్ధమా, చట్టవ్యతిరేకమా? అనేది ఆయా కాలాలను బట్టే ఉంటుంది. బ్రిటిష్ వలస పాలనలో భగత్‌సింగ్, ఆజాద్ చంద్రశేఖర్ వారి అనుచరులు చేసిన పోరాటం చట్ట వ్యతిరేకమని బ్రిటిష్ ప్రభుత్వం భావించింది. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరి తీసింది. అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం తప్పుదని, అతని పట్టుకుని కాల్చి చంపారు. బహుశా ఇది తెలుగు సమాజంలో మొదటి బూటకపు ఎన్‌కౌంటర్. గోండువీరుడు కొమురం భీం పోరాటం చట్టవ్యతిరేకమని నిజాం ప్రభుత్వం భావించింది. నిజాం పోలీసులు కొమురం భీం, అతని అనుచర ప్రజలను దారుణంగా చంపేశారు. వారందరూ నేటి తరానికి ఆరాధ్యనీయులు, వారి చర్యలు సాహసమైనవి, వీరోచితమైనవి, అభినందించదగ్గవిగా గుర్తించబడ్డాయి. ఈ విషయం పాఠ్య పుస్తకాల్లో కూడా వచ్చాయి. చంద్రశేఖర్‌రావు ముఖ్యమంత్రి హోదాలో కొమురం భీం వారసులను కలిశారు. ట్యాంక్‌బండ్‌పై భీం విగ్రహం ప్రతిష్టించబడింది. ఈ నేపథ్యంలో ప్రజలు స్పందించేటప్పుడు అది చట్టవ్యతిరేకమా? కాదా? అనడం కంటే ప్రజాసమస్యలను మానవీయ కోణంలో అర్థం చేసుకోవడం, వాటిని పరిష్కరించడం అనేది ముఖ్యమైనదిగా తోస్తుంది. అయితే ప్రభుత్వాలుగానీ, పోలీసు వ్యవస్థగానీ చట్టానుసారం ప్రవర్తించవలసి ఉంటుంది. అవార్డులు, రివార్డులకోసం లేదా పెట్టుబడిదారి భూస్వామ్య వర్గాల ప్రయోజనాల కోసం ఏకంగా హత్యలు చేయడాన్ని ప్రజాస్వామిక వ్యవస్థలో ఊహించగలమా?

సవతితల్లి పోరుతో చిత్రహింసలు పడిన ఒక అమ్మాయినికెసిఆర్, అతని కుటుంబం పరామార్శించింది. అంతేకాకుండా ఆమెను తమ ఇంటికి తీసుకెళ్లి, ఆమెతో కలిసి భోజనం చేసన వార్తలు, పోటోలు పత్రికల్లో వచ్చాయి. అలా చూసినప్పుడుకెసిఆర్ ఎంత దయామయుడో, ఆయన కుటుంబం ఎంతో సున్నితమైనదని అనిపించకమానదు. ఆ సున్నితత్వం శృతి విషయంలో ఏమైంది. శృతి తల్లిదండ్రుల కడుపుకోత ఎందుకు పట్టింపుకావడం లేదు. శృతి శరీరంపై నానా భీబత్సం చేసిన మానవ మృగాలపై పెదవి ఎందుకు విప్పడం లేదు. ఒక మహిళపై అంత కిరాతక దారుణానికి ఒడిగట్టిన వారిని ఎందుకు కాపాడుకుంటున్నారు. వారిపై హత్యానేరం కేసు నమోదు చేసి కోర్టులో విచారించడానికి ఎందుకు సిద్ధపడడం లేదు. ఇలా చేసిన వారిని కోర్టుల్లోవిచారించమని భారత శిక్షాస్మృతి చెప్పే ఉన్నదికదా. వీటిపై న్యాయస్థానాలు కూడా 'సుమోటో'గా స్పందించవచ్చు. ఇదంతా చట్టపరమైన ప్రక్రియే కదా! ఎందుకు శృతి లేదా మరెందరో ఉద్యమకారుల హత్యలపై చట్టపరంగా ఈ వ్యవస్థలు పనిచేయవు. ఇలా చట్టపరమైన వ్యవస్థలే చట్టాలను ఉల్లంఘించడం ద్వారా ప్రజలకు ఏం

చెప్పదలుచుకున్నారు. ఏ సంకేతాలు పంపదలుచుకున్నారు. చట్టాలను అతిక్రమించి ప్రవర్తించే వారికి ఇతరులను చట్టాలను గౌరవించమని చెప్పే అర్హత ఎక్కడిది. నిజానికి ఈ వ్యవస్థలు ఆదర్శవంతంగా ఉంటూ ప్రజల నమ్మకాన్ని చూరగొనడం ద్వారా ప్రజాస్వామ్యానికి వన్నె తేవచ్చు, తేవాలి కూడా అయితే అది అత్యాశగా మిగిలిపోకుంటే బాగుండేది.

శృతి, విద్యాసాగర్‌లను చంపడాన్ని నిరసిస్తూ పెద్దఎత్తున ప్రజా స్పందన వచ్చింది. మావోయిస్టు రాజకీయాలపై ఏకీభావం లేనివారు సైతం ఈ దారుణాన్ని వ్యతిరేకించారు. చలించిపోయారు. తద్వారా తెలంగాణ సమాజం గొప్ప మానవతను చాటుకున్నది. ఈ సంఘటనపై ముఖ్యమంత్రి నోరు మెదపలేదు. ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి, టిఆర్ఎస్ ఎంపి కవిత మాత్రం పైపై మాటగా ఈ ఘటన దురదృష్టకరం అన్నారు. అధికారంలో ఉన్నవారు స్పందించాల్సిన తీరు ఇదికాదు. చట్టబద్ధపాలన చేయాలనుకున్నప్పుడు నేరవిచారణా స్మృతి, గతంలో న్యాయస్థానాల తీర్పులు, రాజ్యాంగ నియమాలను అనుసరించి శృతి, విద్యాసాగర్‌ల విషయంలో సంబంధిత పోలీసులపై హత్యానేరం కేసు నమోదు చేసి నిజానిజాలు నిగ్గు తేల్చాల్సి ఉంటుంది. అటువైపుగా మంత్రుల కదలికలు లేవు. మొత్తంగా టిఆర్ఎస్ ప్రభుత్వం ఆ పని చేయడానికి సిద్ధంగా లేదు. ఈ క్రమంలో కొంచెం లోతుల్లోకి వెళ్లి పరిశీలిస్తే ప్రభుత్వ కనుసన్నల్లోనే, అంగీకారంతోనే ఈ బూటకపు ఎన్‌కౌంటర్, పైశాచిక హత్యలు జరగాయని అనుకోవడంలో తప్పేమి ఉంటుంది.

ఎన్నడూ లేని విధంగా 10కి పైగా రాజకీయపార్టీలు, 400 ల వరకు ప్రజాసంఘాలు కలిసి తెలంగాణ ప్రజాస్వామిక వేదికగా ఏర్పడి శృతి, విద్యాసాగర్‌ల బూటకపు ఎన్‌కౌంటర్‌పై నిరసన తెలపడానికి సెప్టెంటర్ 30న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని తలపెట్టారు. ఇది తెలంగాణలో ప్రశ్నించే ఉద్యమతత్వం, ప్రజాస్వామిక చైతన్యాలకు సూచికగా నిలుస్తున్నది. చలో అసెంబ్లీ కార్యక్రమానికి అనుమతి నిరాకరించారు. ప్రభుత్వాలు, పోలీసులు గతంలో ఎప్పుడూ పాడే పాట, అల్లర్లకు అవకాశమున్నదని, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్నది మళ్లీ ముందుకు రావడం జరిగింది. ఒక ఉద్యమపార్టీగా చెప్పుకుంటున్న వారు అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే ఇలాంటి నిర్ణయాలకు రావడం, ప్రజలను అవమానించడమే. చలో అసెంబ్లీ కార్యక్రమానికి తరలివస్తున్న విస్తృత ప్రజాశ్రేణులను నిర్బంధించి ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ జరిగింది. ముందస్తు అరెస్టులు సైతం చేశారు. ఎనభైఏళ్లకు పైబడిన పెద్దమనిషి చుక్కారామయ్యను ఇంటినుండి బయటకు రానీయకుండా గృహనిర్బంధం చేశారు. సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద హైదరాబాద్‌లో, తదితర చోట్ల వేలాదిమందిని నిర్బంధంగా పోలీసు వ్యాన్లలో కుక్కి వారిని పోలీస్ స్టేషన్లలో బంధించారు. ఇది తెలంగాణ ఉద్యమ సందర్భంలో విద్యార్థుల చలో అసెంబ్లీని అడ్డుకున్న తీరును ప్రతిబింబిస్తుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం, నిజాం కాలేజీ హాస్టళ్లలో అంతకుముందు రాత్రి సోదాలు చేసి ఎంతోమంది విద్యార్థులను నిర్బంధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులను క్యాంపస్ దాటి బయటకు రాకుండా అడ్డుకున్నారు. చలో అసెంబ్లీ సందర్భంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎక్కడికక్కడ నిర్బంధాలు, అణచివేతలు, అరెస్టులు 10వేలకు పైగా జరిగాయి. ప్రజాస్వామిక పద్ధతుల్లో ఉద్యమించడానికి, కనీస నిరసనలు తెలపడానికి చోటివ్వకుండా పోలీసు మార్కు పాలనను సాగిస్తామనుకుంటే ప్రజలకు వేరే దారేమి ఉంటుందో టిఆర్ఎస్ ప్రభుత్వం చెప్పాలి. సభలు సమావేశాలు ఊరేగింపులకు అవకాశం ఇవ్వకుండా ప్రజాస్వామిక, చట్టబద్ధ, రాజ్యాంగబద్ధమైన హక్కులను ఉల్లంఘించడం ద్వారా ఇది చట్టవ్యతిరేక ప్రభుత్వమని నిరూపించుకుంటున్నది.

ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణ అనేది ఒక ప్రజాస్వామిక, మానవీయమైన ఆశ, ఆకాంక్ష దానిపై గతంలో కెసిఆర్ మాట్లాడి ఉన్నారు. అలాంటి తెలంగాణ సాధిస్తామని ప్రకటించి ఉన్నారు. ఇదే రోజు (30.09.2015) సరిగ్గా మూడేళ్ల క్రితం తెలంగాణ కోసం హైదరాబాద్‌లో సాగరహారం నిర్వహించారు. దీనికి అప్పటి ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. కానీ అనేక ఒత్తిళ్ల మధ్య మేధావుల హామీలతో అనుమతిచ్చారు. అప్పటి ప్రభుత్వం చెప్పినట్లుగా శాంతిభద్రతల సమస్య ఎక్కడా తలెత్తలేదు. సాగరహార కార్యక్రమం శాంతియుతంగా జరిగింది. అలాంటి ఉద్యమాల నుంచి వచ్చిన టిఆర్ఎస్ మాత్రం శృతి, సాగర్‌ల ఎన్‌కౌంటర్లకు నిరసనగా జరిగే చలో అసెంబ్లీకి అనుమతి ఇవ్వక పోవడంతో పాటు తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించింది. యావత్తు తెలంగాణ సమాజం ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌ను నిరసించింది. ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ చేయించమనే డిమాండ్ ముందుకు వచ్చింది. ఇలా విచారణ జరపడం ప్రజాస్వామ్యంలో భాగమే కదా. కనీసం దాన్నైనా ఎందుకు అంగీకరించరు. ఇది ప్రజలు అనుమానిస్తున్నారని తెలిసినవెంటనే చేయవలసినట్టిది. ప్రజలు, ప్రజా సంఘాలు అడిగేంతవరకు ఆగాల్సిన పనేలేదు. అది ఒక ప్రజాస్వామిక సంప్రదాయ అలవాటుగా ఎంతో సహజంగా జరగవలసిన ప్రక్రియ. కనీసం ప్రజాడిమాండ్‌గా ముందుకు వచ్చినప్పుడైన స్పందించవలసి ఉంటుంది. అలాకాకుండా డిమాండ్ చేయడమే నేరంగా చూడడం ప్రజాస్వామ్యంలో జరగకూడనిది. ప్రజల అభిప్రాయాలను గౌరవించడం, వారి సమ్మతిని పొందడం కోసం సంప్రదింపులు, సంభాషణలు జరపడం ప్రజాస్వామిక వ్యవస్థల్లో ముఖ్యమైన విషయం. ప్రజా ఉద్యమం, ప్రజా చైతన్యం ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే ప్రయత్నం చేస్తాయి. పాలకులకు ఎప్పటికప్పుడు చెక్ పెడుతుంటాయి. తమ విధానాలను మార్చుకోమనే సూచనలను, హెచ్చరికలను చేస్తుంటాయి. వాటిని గమనంలో ఉంచుకుంటూ పాలన జరిగినప్పుడు ప్రజాస్వామ్యానికి అర్థం చేకూరుతుంది. నేటి టిఆర్ఎస్ ప్రభుత్వం ఇవన్నీ పక్కనపెట్టి ప్రజాస్వామిక వ్యక్తీకరణలే తప్పనే స్థాయికి వచ్చేసింది. చలో అసెంబ్లీ కార్యక్రమానికి అనుమతి నిరాకరించినప్పటికి కూడా ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఈ విషయమై ప్రకటించాల్సి ఉండింది. కనీసం తెలంగాణ ప్రజాస్వామిక వేదిక నాయకత్వాన్ని పిలిచి మాట్లాడవలసింది. తెలంగాణ ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలోని చలో అసెంబ్లీ కార్యక్రమం రోజున కనీసం ముఖ్యమంత్రి అసెంబ్లీ బయటకు వచ్చి కార్యక్రమ నిర్వాహక నాయకత్వంతో మాట్లాడి ఉండవచ్చు. వారి విజ్ఞాపనను హుందాగా స్వీకరించవచ్చు. ఈ విషయంలో చట్టబద్ధంగా వ్యవహరిస్తామని ప్రకటించి ఉండవచ్చు. కానీ అలా చేయలేదు. అలా స్పందించకపోవడం ద్వారా టిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజాస్వామ్యం పట్ల చిత్తశుద్ధి లేదని తెలుస్తున్నది వీ

(రచయిత ఉపాధ్యాయులు)

వ్యవసాయ విప్లవమే పరిష్కార మార్గం

రైతుల ఆత్మహత్యల గురించి, వ్యవసాయ సంక్షోభం గురించి ఆందోళన పడుతున్నవారు మౌలిక పరిష్కారం గురించి ఆలోచించాలని అంటున్నారు **వరవరరావు**

వ్యవసాయ దేశాల్లో మనుషుల పేర్లు, ఊర్ల పేర్లకు కూడా వ్యవసాయ సంస్కృతితో సంబంధం ఉంటుందేమో. బుద్ధుని కాలానికి ధాన్య కటకంగా ఉన్న నగరం చాళుక్య భీముల కాలానికి అమరారామమై, ఈస్టిండియా కంపెనీ కాలానికి 19వ శతాబ్దానికి అమరావతి అయింది. అంటే కంపెనీ రాకతో వ్యవసాయ జీవితంలో సంక్షోభం మొదలైంది. ఆ సంక్షోభ పరిష్కారానికి ఈ దేశ ప్రజలు ఎంచుకున్న ప్రజాస్వామిక పోరాటమే 1857 భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం. అందులో రైతాంగం బిడ్డలు సిపాయీలుగా పాల్గొని ఓడిపోయారు. మళ్లీ చాలా ప్రజాస్వామిక ప్రయోగాలు జరిగాయి. పంజాబ్‌లో గదర్ పార్టీ అయినా, అకాలీదళ్ అయినా ప్రధానంగా ఆరోజుల్లో కిసాన్ పార్టీలే. బెంగాల్‌లో తెభాగా పోరాటం – కౌలుదార్ల, వ్యవసాయ కూలీల, ముఖ్యంగా మహిళల పోరాటం. అప్పటి తిరువాన్కూర్ కొచ్చిన్‌లో పునప్రావాయిలార్ పోరాటమైనా, మలప్పా తిరుగుబాటైనా రైతాంగ పోరాటాలే. అందులో మలప్పా ప్రధానంగా బ్రాహ్మణీయ భూస్వామ్యాన్ని ప్రతిఘటించిన వీరోచిత ముస్లిం రైతుల పోరాటం. ఇట్లా దేశంలో వేరువేరు ప్రాంతాల్లో విముక్తి మార్గాలు వెతుక్కుంటున్న రైతాంగం జీవితాల్లోకి వేగుచుక్కవలె తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వచ్చింది. అది వ్యవసాయ విప్లవంగా నూతన ప్రజాస్వామికంలోకి గుణాత్మకమవుతున్న దశలోనే అటు ఢిల్లీ సైనిక దాడి–మూడేళ్లకు ఇటు నాయకత్వ విద్రోహంతో వైఫల్యానికి గురయి సాధించుకున్న ఫలితాలూ వెనక్కి పోయాయి.

పొరుగున చైనాలో వ్యవసాయ విప్లవం దేశంలో యుద్ధ ప్రభువులను, వాళ్లు సహకరించిన జపాన్ సామ్రాజ్యవాదాన్ని ఓడించి 1949 అక్టోబర్ 1న విజయవంతమై 1956లో నూతన ప్రజాస్వామిక విప్లవ దశ నుంచి సామ్యవాదదశలో ప్రవేశించే నాటికి దేశంలో నెహ్రూ నాయకత్వం నాగ్‌పూర్ కాంగ్రెస్‌లో సహకార వ్యవసాయ ప్రయోగాన్ని ప్రతిపాదించింది. అప్పటికింకా హైదరాబాద్ రాష్ట్రంలో ఉన్న తెలంగాణ జమీందారీ జాగీర్దారీ వ్యవస్థను రద్దుచేస్తూ రక్షిత కౌల్దారీ చట్టాన్ని, భూ సంస్కరణలను ప్రతిపాదించింది.

ఈ చరిత్ర అనుభవం నుంచే కేంద్రంలోని సి. సుబ్రహ్మణ్యం ఆర్థిక మంత్రిగా ఉన్న కాలంలో 1964లో వ్యవసాయార్థిక వేత్త ఎం.ఎస్. స్వామినాథన్ 'హరిత విప్లవాన్ని' ప్రతిపాదించాడు. అప్పుడే ఆయన చెప్పాడు కూడా – ఎర్ర విప్లవాన్ని నిరోధించాలంటే దేశంలో హరిత విప్లవాన్ని విజయవంతం చేయాలి అని. వ్యవసాయ సంబంధమైన జీవితంతో మనం గుజరాత్‌లోని ఆనంద్ నుంచి కురియన్ తెచ్చిన శ్వేతవిప్లవాన్ని కూడా చూశాం. ఇటువంటి ప్రయోగాల గురించిన సినిమాలు, సాహిత్యం కూడా చాలా వచ్చింది. ఇజం నుంచి స్వేచ్ఛ కోరేవాడు భయపడుతున్నది మార్క్సిజానికే అని కుటుంబరావుగారు అన్నట్లు, ఇక ఎర్రవిప్లవం రాకుండా చూడడానికి దేశంలో జరిగిన విప్లవ ప్రయోగాల ఫలితమే ఇవ్వాల్టి వ్యవసాయ సంక్షోభం–రైతుల ఆత్మహత్యలు. అయితే ఒక పంచవర్ష ప్రణాళిక ముగియకముందే 1967లో నక్సల్బరీలో సంతాల్ ఆదివాసి రైతాంగం ఎర్రవిప్లవాన్ని ప్రారంభించారు. ఎన్ని సెట్‌బ్యాక్‌లకు గురైనా ఇవ్వాల్టి వ్యవస్థకు అదే ప్రత్యామ్నాయ ప్రజా ప్రయోగంగా చర్చలోనే కాదు. దండకారణ్యంలో ఆచరణలో కూడా ఉన్నది.

హరిత విప్లవం విఫలమైందని స్వీయ విమర్శ చేసుకున్న స్వామినాథన్ మళ్లీ రైతులు తమ ప్రాణాలు తామే తీసుకోగలుగుతున్నారంటే వారు ఇతరులను కూడా చంపగలుగుతారు. 'విప్లవం' అనే ఆలోచన గట్టిగా పట్టిందంటే రైతులు నక్సలైట్లుగా మారుతారు' అని అర్ధ శతాబ్దం తర్వాత అదే ఆందోళన ప్రకటిస్తున్నాడు. స్వామినాథన్‌కు ఇవ్వాళ ఇది భవిష్యత్‌కు సంబంధించిన భయం కావచ్చు. కానీ నానా పటేకర్‌కు ఇది తన రాష్ట్రంలో, ముఖ్యంగా విదర్భలో రెండు దృశ్యాలుగా కనిపిస్తున్న కఠోర వాస్తవం. ఒకవైపు దేశంలో అత్యధికంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న రాష్ట్రం మహారాష్ట్ర అందులోని విదర్భ. మరొకవైపు ఈ విదర్భలోని గడ్చిరోలీ జిల్లాలోని ఆదివాసి రైతాంగమే జనతన సర్కారులో భాగంగా ఎర్ర విప్లవం నిర్మాణంలో ప్రాణాలర్పిస్తున్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా చూడడానికే కాదు, నక్సలైట్లుగా మారకుండా చూడడానికి కూడా నానా పటేకర్ పెద్ద ఎత్తున ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకునే పనికి పూనుకున్నాడు. వ్యవసాయ దేశమైన భారతదేశంలో దేశానికి వెన్నెముక అయిన రైతును ఆత్మహత్య చేసుకోకుండా పోషించే కర్తవ్యం ఇవ్వాళ సినిమా తారలో, క్రికెటర్లో, విదేశీ నిధులు పొందే ఎన్.జి.ఒ.లో చేపట్టే స్థితి వచ్చిందంటేనే వ్యవసాయ రంగంలో మన దళారీ ప్రభుత్వాలు చేసిన ప్రయోగాలన్నీ ఎంత విధ్వంస కరమయినవో, ఎంత ఆత్మహత్యా సదృశమైనవో ఊహించుకోవచ్చు.

ఒకవైపు వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లుగానే కనిపించి, మిశ్రమ ఆర్థిక విధానం, పబ్లిక్ రంగంలో భారీ ప్రాజెక్టులు, పరిశ్రమలతో 1952 నాటికి రైతు జీవితంతో చెలగాటాలు మొదలైనవి. ఒకవైపు చైనాలో వ్యవసాయ రంగాన్ని దృష్టిలో పెట్టుకుని 'రెండు కాళ్లతో నడక. ఒక కాలు వ్యవసాయం, మరోకాలు ఆ కాలుకు ఆలంబనగా ఉండే పరిశ్రమ' అనే ప్రాతిపదిక మీద అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుండగా – సింద్రీలో భారీ రసాయన ఎరువుల పరిశ్రమ, కలకత్తాలో హైబ్రిడ్ విత్తనాల కంపెనీలు, భాక్రానంగల్, నాగార్జున సాగర్, హీరాకుడ్ వంటి భారీ జలాశయాల నిర్మాణాలు – రైతుకు వ్యవసాయ జీవితాన్ని సుదూరపు మిరుమిట్లు గొలిపే మాయాజాలంగా మార్చడం ప్రారంభమైంది. జపాన్ వరిసాగు వంటి ప్రయోగాలతో దిగుబడి మీద శ్రద్ధ ప్రజా సాంకేతిక విజ్ఞానం మీద కొరవడింది.

భారీ ఉక్కు పరిశ్రమలు రావడంతో చేతి వృత్తులు మూలకు పడినవి. భారీ జలాశయాలు రావడంతో చెరువులు, వాగులు, కుంటలు వంటి చిన్న నీటి వనరుల పట్ల నిర్లక్ష్యం పెరిగింది. నిన్నటి పంట నుంచి

తీసిన విత్తనాల స్థానంలో హైబ్రిడ్ విత్తనాలు వచ్చినవి. ఇంటి ముందు, ఇంటి వెనుక, పశువుల పాకలోని పెంట స్థానంలో రసాయనిక ఎరువులు వచ్చినవి. నిస్సంశయంగా ఇవన్నీ దిగుబడిని పెంచినవి కానీ ఇవన్నీ రైతుల అనుభవంలో, జ్ఞానంలో భాగం కాలేక పోయినవి. మోట, ఏతం వంటి నీటి పారుదల సౌకర్యం స్థానంలో మొదలు అయిల్ ఇంజన్లు తర్వాత కరెంటు మోటర్లు వచ్చినా రైతుకు, పశువుకు ఎంతో తీరిక చిక్కినప్పటికీ రైతు ఆధారపడే స్థితి పెరిగింది. మొదలు ప్రభుత్వం మీద తర్వాత ప్రైవేట్ కంపెనీల మీద ముఖ్యంగా ఎరువుల కంపెనీలు, పురుగు మందుల కంపెనీలు, విత్తనాల కంపెనీలు – వేల సంవత్సరాల సంచిత అనుభవానికి రైతును దూరం చేసి తన వ్యవసాయానికి తననే పరాయివాణ్ని చేశాయి. ఒక్క నేల తప్ప నేల మీద వేసే విత్తనాలు, నాటే మొక్కలు, వాడే ఎరువులు, పురుగు మందులు ఎక్కడి నుంచి వస్తాయో రైతుకు తెలియదు. అవి కల్తీనో, కాదో తెలియదు. మూడు లక్షల మందికి పైగా ఆత్మహత్యలు చేసుకున్న రైతుల అనుభవాల నుంచి ఇవ్వాళ తెగులు వినాశకారి మందులంటే ఆత్మహత్య సాధనాలనే భావం ప్రబలిపోయింది.

1984–85లో దేశంలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రైవేటీకరణ విధానం ఒక ప్రభుత్వ విధానంగా ముందుకు వచ్చింది. చేనేత రంగంలో సంక్షోభం ఏర్పడి చేనేత కార్మికుల ఆత్మహత్యలు మొదలైనవి. ఆ తర్వాత కంసాలి మొదలైన కులాల్లో ఆత్మహత్యలు మొదలైనవి. ఇంకా 1991 వచ్చే వరకు ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ–సామ్రాజ్యవాద నూతన ఆర్థిక విధానంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వాల అభివృద్ధి నమూనా అయిపోయింది. అది వేగవంతం చేసిన ఘనత మాత్రం 1995 ఆగస్టు నాటికే చంద్రబాబు నాయుడుకే దక్కుతుంది. పైగా సారా నిషేధం చేసి, సబ్సిడీలు ఇస్తానన్న ఎన్‌టిఆర్‌ను దించి వైస్రాయి హోటల్ కుట్ర ద్వారా చంద్రబాబును అధికారానికి ప్రపంచ బ్యాంకు తెచ్చింది. దాని సిఇఒగా ఆ విధ్వంసక అభివృద్ధి నమూనాను అమలు చేయడానికి ఆయన చరిత్ర అంతం గురించి, వ్యవసాయం దండుగ అని కూడా మాట్లాడాడు. రైతు అంటే వెనుకబాటు ఆలోచన కలవాడనే భావన ఆయనలో బలంగా ఉన్నది. అందుకే ఇవ్వాళ ముప్పై వేల ఎకరాల భూమిని రైతుల నుంచి స్వచ్ఛందంగానూ, నిర్బంధం గానూ సేకరించి సింగపూర్ తరహా రాజధాని నిర్మించడానికి శంకుస్థాపన చేశాడు. ఇప్పుడది రైతుల పాలిట అమరావతి – అమరనగరమే కానున్నది. పదహారు వందల రూపాయల బట్టలు, ఒక పాటతో వాళ్లకు హంసగీతం పాడాడు.

ఈ ప్రమాదాన్ని 1995లోనే పసిగట్టిన సిపిఐ ఎంఎల్ పీపుల్స్‌వార్ సరిగ్గా అదే సంవత్సరం ప్రత్యామ్నాయ ప్రజాభివృద్ధి నమూనాను వ్యవసాయ రంగంలో ప్రతిపాదించి తనకు బలమున్న ప్రాంతంలో తెలంగాణలోనూ, బస్తర్‌లోను గ్రామరాజ్య కమిటీల నాయకత్వంలో గ్రామీణాభివృద్ధి పథకాలను ప్రజల సహకారం–శ్రమ ప్రాతిపదిక మీద అమలు చేయడం ప్రారంభించింది. వ్యవసాయ రంగాన్ని పరిరక్షించు కోవడానికి ప్రాతిపదిక భూ సంస్కరణలు. దున్నేవారికే భూమి నినాదం గానీ, బూర్జువా రాజ్యాంగ చట్రంలోనే మొదట చర్చల సమయంలో 2004లో రెండు విప్లవ పార్టీలు ప్రతిపాదించి ఇవ్వాళ తెలంగాణ ప్రభుత్వం కూడా ప్రకటించక తప్పని ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల భూమి అనే ఎజెండా గానీ ఆ అవగాహన నుంచి వచ్చినవే. అదే ఇవ్వాళ ఏడు సంవత్సరాలుగా బస్తర్ అంతటా జనతన సర్కార్ అమలు చేయగలుగుతున్న విధానం కావచ్చు. తెలంగాణలో ప్రజల్ని మభ్యపుచ్చడానికి ప్రభుత్వం వల్లిస్తున్న మావోయిస్టు ఎజెండా కావచ్చు. కాని గుర్తించక తప్పని సంక్షోభ పరిష్కార మార్గమది. ఆ తర్వాత ప్రాధాన్యం సాగునీరు, తాగునీరు. గ్రామంలో ప్రజలందరినీ సమీకరించి వాళ్ల సహకారంతో కాలువలు, చెరువులు, కుంటలు తవ్వుకోవడం, పూడికలు తీసి, గండ్లు పూడ్చుకోవడం, ఇసుక మాఫియా నుంచి కాపాడు కోవడం. ఈ పనులన్నీ వందలాది తెలంగాణ గ్రామాల్లో చేసి తీవ్రనిర్బంధా నికి గురయ్యారు. ప్రాణాలు కోల్పోయారు, కరెంటు మోటర్లు కాలిపోయి, పంటలు ఎండిపోతే వేలసంఖ్యలో కదిలి ప్రభుత్వాన్ని నిలదీశారు.

విద్యుత్ చార్జీల వ్యతిరేక ప్రదర్శన ఒక చారిత్రక సందర్భంగా మారి ఆ తర్వాత తెలంగాణ ఉద్యమ కాలానికి నీళ్లు, విద్యుత్తు భూమికన్న ప్రధానమైన పోరాట ఎజెండాగా మారిన వైనమదే. అంతమాత్రమే కాదు 1996–97లో తిరిగి ప్రారంభమైన ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ప్రాతిపదిక ప్రపంచ బ్యాంకు అభివృద్ధి నమూనా అయింది. ప్రధానంగా వ్యవసాయ రంగమైంది తెలంగాణ. అప్పటికే తెలంగాణలో వాణిజ్య పంటల వైపు రైతులు ఎక్కువగా ఆకర్షితులు కావడం ప్రారంభమైంది. పత్తి, పొగాకు వంటి వాణిజ్య పంటలు పండించగల, మిర్చి, పసుపు, ఉల్లిగడ్డలు వంటి నిత్యావసరాలైనా వాటి మార్కెట్ విలువవల్ల వాటిని కూడా వాణిజ్య సరుకులుగా మార్కెట్ కోసం పండించడం, గిట్టుబాటు ధరలేక, కొనేవాళ్లు లేక అప్పులు పెరగడం – ప్రైవేట్ అప్పులు – అవి కూడా విత్తనాల కంపెనీలు, ఎరువుల కంపెనీలు, పురుగు మందుల కంపెనీలే రైతులకు అప్పులు పెట్టే ప్రధాన వనర్లు కావడం ఒక విషవలయంగా మారింది.

జాతీయ బ్యాంకులంటే అర్థం ప్రభుత్వ బ్యాంకులని. అంటే ప్రజల పొదుపు దాచుకునే బ్యాంకులని అర్థం. కాని అవి ఇందిరాగాంధీ జాతీయం చేసే నాటికే పారిశ్రామికవేత్తలకు, సంపన్నులకు రుణాలు ఉదారంగా ఇచ్చి అంతకన్న ఉదారంగా మాఫీ చేసే అఖిల భారత ద్రవ్యనిధి సంస్థలుగా మారినవి. అఖిల భారత ద్రవ్యనిధి ఎందుకంటే ఈ బ్యాంకులన్నీ అంతర్జాతీయ ద్రవ్యనిధి, ఆసియా బ్యాంకు, ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో నడిచేవే. ఈ బ్యాంకుల రుణాల కోసం పేద రైతులు హామీలు తేలేరు. తేగలిగిన పంట నష్టపోతే బ్యాంకులు వీళ్ల రుణాలు మాఫీ చేయవు. ఇవ్వాళ తెలంగాణలోనే కాక దేశమంతటా రైతుల ఆత్మహత్యలకు ఈ రుణమాఫీ విధానంలో ప్రభుత్వాలు చూపుతున్న వివక్షతే ప్రధాన కారణమని అధికారంలో ఉన్నవాళ్లు తప్ప అందరూ అంటున్న వాస్తవమే.

1997 డిసెంబర్‌లో వరంగల్‌లో ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ సదస్సు జరిగే సమయానికి వరంగల్ జిల్లా పరకాల, చిట్యాల మండలాల్లో తొంభై శాతం రైతులు పత్తి పంటకు ఎగబడినారు. పంట నష్టపోయి, పండిన పత్తికి గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యల పరంపర మొదలైంది. రైతు అంటే మధ్యతరగతి రైతు కూడా కాదు. తనకు భూమిలేక కౌలుకు భూమిని తీసుకుని పత్తి వేసిన రైతు కూడా ఉన్నాడు. 2015లో కూడా రేగొండ మండలంలో ఇందిరమ్మ ఇల్లు తప్ప – తనకంటూ ఆస్తిలేని ఒక దళితుడు భూమి కౌలుకు తీసుకుని పత్తివేసి, తొమ్మిది వేల రూపాయల అప్పుపడి – తనకు చెల్లించే తాహతు లేదని ఆత్మహత్య చేసుకున్న ఉదంతం చూశాం. కనీసం అప్పుడు ఆశ్వాసం ఇచ్చి, వాళ్ల మధ్య నిలిచి సహాయం చేసి పత్తి పండించడం నుంచి నిరుత్సాహపరిచే విప్లవ పార్టీ ఉన్నది. ఆత్మహత్యలను నివారించగలిగింది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయినాక పత్తి రైతుల ఆత్మహత్యలు మూడు రెట్లు పెరిగినవి. ఈ రైతులందరూ బడుగు వర్గాల నుంచి వచ్చినవాళ్లే. ఈ పదహారు నెలల్లో కూడా ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి, కొత్తగా ప్రతి ఆదివాసి కుటుంబానికి మూడెకరాల భూమి, కాకతీయ మిషన్ ద్వారా గ్రామాల్లో పూడిక తీయించడం వంటి నినాదాలు, ఆర్భాటాలతో కూడిన వాగ్దానాలు, కార్యక్రమాలు తప్ప గ్రామీణ స్థాయిలో

ఏ మార్పు జరగలేదు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధుల నుంచి, అనుపస్థితి భూస్వాముల నుంచి నూట నలభై కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి 2014 ఆగస్టు 15న పంచిన ఏడు వందల నలభై ఎకరాల భూమి తప్ప ఆ తర్వాత ఊసులేదు.

అట్లాగే ఆదివాసుల విషయంలోనైతే హరితవనం పేరుతో వాళ్ల పోడు చేసుకున్న భూములను ప్రభుత్వం ఆక్రమించుకునే ప్రయత్నం తప్ప, తీవ్ర నిర్బంధ విధానం, రాజ్యహింసయే అమలవుతున్నాయనేది గోదావరి తీరమంతటా గాలింపు చర్యలు, పోలీసు కాల్పులు మొదలు ఎన్‌కౌంటర్ హత్యల సందర్భాలన్నీ ఆదివాసుల భూమి, భుక్తి, విముక్తి పోరాటాన్ని అణచడానికే కొనసాగిన విధానాలు. జల్ జంగల్ జమీన్‌లనే కాదు ఇజ్జత్‌ను కూడా హరించే విధానమే తెరాస ప్రభుత్వం కూడా కొనసాగిస్తున్నదనడానికి తాజా ఉదాహరణ శ్రుతి, సాగర్‌ల ఎన్‌కౌంటర్. తాడ్వాయి, అడవి మల్లంపల్లి, బక్కన్నపేట, మేడారం ప్రాంతంలో ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల కోసం, మైనింగ్ కోసం కార్పొరేట్ భూములను కట్టబెట్టే క్రమంలోను, పోడు భూముల నుంచి ఆదివాసులను విస్థాపితం చేస్తున్న క్రమంలోను ప్రతిఘటిస్తున్న ఆదివాసుల మధ్యన పనిచేయడానికే అక్కడికి తెలంగాణ మావోయిస్టు పార్టీ కెకెడబ్ల్యు దళం వచ్చింది. ఎన్‌టిఆర్ చింతపల్లి అడవులలో నక్సలైట్లకు ఆశ్రయమిస్తున్నారని గుత్తి కోయల గుడిసెలు తగులబెట్టినట్లుగానే మేడారం ప్రాంతంలో చత్తీస్‌గఢ్ నుంచి సల్వాజుడుం దాడుల కాలంలో వచ్చిన గుత్తి కోయల ఆవాసాలను కెసిఆర్ తగులబెట్టించాడు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకించక పోవడమే కాకుండా ఆ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్‌కు ఏడు మండలాలు వదులుకోవడం, ప్రాణహిత – చేవెళ్ల మొదలు, కాళేశ్వరం, కంతనపల్లి దాకా గోదావరి నదిపై వివిధ జలాశయాల భారీ ప్రాజెక్టుల ఆలోచనలే తెలంగాణ ప్రభుత్వం ఆదివాసుల విషయంలో అనుసరిస్తున్న భూ విధానానికి దాఖలాలు.

ఇంక నీటి వసతుల గురించి కాకతీయ మిషన్ ప్రచారార్భాటంలో పొక్లెయిన్లు కనిపిస్తున్నంతగా, తెరాస కార్యకర్తలు కనిపిస్తున్నంతగా ప్రజలు కనిపించడంలేదు. ప్రజల సహకారానికి, శ్రమకు అందులో తావేలేదు. బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మలు వేయడానికి కూడా చెరువుల్లో నీళ్లు లేవని స్వయంగా హరీష్‌రావే ఆవేదన వెలిబుచ్చక తప్పని సందర్భం ఈ సంవత్సరం కరువు స్థితినే కాదు ప్రభుత్వ వైఫల్యాన్ని కూడ కళ్లకు కడుతున్నది. కరువు నివారణకు గ్రామాల్లో ప్రజలందరిని భాగస్వాములను చేసే పనులు గానీ, ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులకు కనీసం పరామర్శలు గానీ లేకపోవడమే రైతుల ఆత్మహత్యలు ఇంతగా పెరిగిపోవడానికి ప్రధాన కారణాలు. ప్రకటించిన రుణ మాఫీ, పరిహారం ఒకేసారి చెల్లించే విషయంలో నిరాకరించిన మూర్ఖ పద్ధతి ఈ శాసనసభ సందర్భంగా విపక్షాలన్నింటినీ ఒక పక్షం చేసింది. కాకపోతే మహాభారతం లో ధర్మరాజు చెప్పినట్లు మొన్నటి, నిన్నటి, ఇవ్వాల్టి పాలకులందరూ నెత్తుటి కూడే తింటున్నారు గనుక–ప్రతి ఒక్కరి చూపుడు వేలు తమవైపే తిరిగి చూపుతున్నది. రైతులు బాధితులు పాలకులు పీడకులుగా, హంతకులుగా పరస్పర ఆరోపణలు, దూషణలు తప్ప– అసలు ఈ అభివృద్ధి నమూనాలోనే వ్యవసాయ సంక్షోభం ఇమిడి ఉన్నది.

యుద్ధ ప్రాతిపదిక మీద భూసంస్కరణలు అమలు చేయడం, చిన్న, మధ్య నీటి వసతులపై కేంద్రీకరించడం, దేశీయ, సంప్రదాయ వ్యవసాయ విధానాలను ప్రోత్సహించి, వాణిజ్య పంటల మోజు నుంచి రైతుల మనసును మళ్లించడం, బ్యాంకుల రుణాలు మొత్తం మాఫీ చేయడం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతుల స్థితిగతులు మెరుగుపడే వరకు ప్రభుత్వమే ఉచితంగా సరఫరాచేయడం, ఎస్‌సి, ఎస్‌టిలకున్నట్లే, బిసిలకు కూడ సబ్ ప్లాన్ నిధులను జనాభా ప్రాతిపదికపై కేటాయించి, ఆ నిధుల నుంచి వ్యవసాయ అవసరాల కోసం ఉచితంగా సహాయం చేయడం, మార్కెట్లో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఉండేట్లు చేయడం, ఆమేరకు సబ్సిడీలు ఇవ్వడం వంటి తక్షణ చర్యలు ప్రభుత్వం చేపట్టాలి. కాని ఈ పదహారు నెలల ఆచరణ చూస్తే ఈ ప్రభుత్వానికి కార్పొరేట్ కంపెనీల యావ తప్ప మరొకటి లేదని అర్థమవుతూనే ఉన్నది. కంపెనీలకోసం భూమి బ్యాంకులు ఏర్పాటు చేయడం, వాళ్ల స్వార్థ ప్రయోజనాలు తీర్చడం కోసం ఏకగవాక్ష సేవలను సమకూర్చడం మొదలు రైతుల ఆత్మహత్యల నివారణ సందర్భంలో కూడ ప్రైవేటు విత్తనాల కంపెనీలను ప్రోత్సహించే ఆలోచనలు చేస్తున్నది ఈ ప్రభుత్వం. తాను రైతునే అని తన ఫామ్ హౌస్ వ్యవసాయంలో ఆర్జిస్తున్న లాభాల గురించి మాట్లాడుతున్న కెసిఆర్ దృష్టి అంతా స్మార్ట్ సిటీల మీద, పట్టణీకరణ మీద ఉంది. రైతుల ఆత్మహత్యల మీద ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని స్వీకరిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తక్షణ పరిష్కారాలే కాకుండా శాశ్వత పరిష్కారం కోసం సూచనలు చేయండి అని ప్రస్తావన తెచ్చింది. అట్లని హైకోర్టు దగ్గర అటువంటి ఒక ప్రతిపాదన ఉందని కాదు.

ఇరవై ఏళ్ల క్రితం హైదరాబాద్ చంచల్‌గూడ జైలు నుంచి పీపుల్స్‌వార్ రాజకీయ ఖైదీ ఒక పిటిషన్ వేసినపుడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎన్. రావు దానిని విచారించే క్రమంలో ఒక పరిశీలనా వ్యాఖ్య చేశారు. 'మనం ముప్పై ఏళ్లుగా నక్సలిజాన్ని ఒక సమస్యగా చూపి దానికి పరిష్కారం వెతుకుతున్నాం. కాని చూడబోతే ప్రజలు దానినొక పరిష్కార మార్గంగా చూస్తున్నట్లున్నారు. మనం కూడ – గాంధీజం వలెనే మావోయిజం కూడ ఒక పరిష్కార మార్గం కావచ్చునేమో–అనే పద్ధతిలో ఆలోచిస్తే పరిష్కార మార్గాలు కనిపిస్తాయేమో' అని అన్నారు. అట్లాగే డాక్టర్ స్వామినాథన్ ఎర్ర విప్లవం రాకుండా ఏభై ఏళ్ల క్రితం హరిత విప్లవాన్ని ప్రతిపాదించారు. అది అటు ఎర్రవిప్లవాన్ని ఆపలేక పోయింది. ఇటు వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించలేక పోయింది. కొందరు పైకి చెప్పి, కొందరు చెప్పకుండా ఇంక వ్యవసాయం కాలం చెల్లిన జీవన విధానమనే దగ్గరి నుంచి పెట్టుబడిదారీ విధానం వచ్చింది గనుక – ఇంక పాత పద్ధతుల్లో వ్యవసాయం గురించి ఆలోచించడం సరికాదనే దాకా వాదనలు ముందుకు తెస్తున్నారు. వ్యవసాయానికి ప్రత్యామ్నాయాలు ఆలోచించాలంటున్నారు. పాలకులకు సంబంధించి నంత వరకు వాళ్లు సామ్రాజ్యవాద, భూస్వామ్య దళారులుగా వ్యవసాయానికి ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనానే అమలుచేస్తున్నారు. కాని అది ప్రజల కోసం కాదనేది అందరూ అంగీకరించే వాస్తవం. రైతుల ఆత్మహత్యలు పెరగడం, వ్యవసాయ సంక్షోభమే దానికి నిదర్శనం. అర్ధ భూస్వామ్య, అర్ధ వలస దళారీ వ్యవస్థలో ఇంగ్లాండ్‌లోనూ, ఫ్రాన్స్‌లోను వచ్చినటువంటి పారిశ్రామిక విప్లవాన్నిగానీ, బూర్జువా విప్లవాన్ని గానీ మనం ఆశించలేం. అది సాధ్యం కాదు.

కనుక నానా పటేకర్‌కు, స్వామినాథన్‌కు – అటువంటి వాళ్లకు ఇష్టమున్నా లేకున్నా వ్యవసాయ విప్లవాన్ని విజయవంతం చేయగల ఎర్ర విప్లవం గురించే రైతాంగం ఆలోచించాలి. ఆత్మహత్యలు చేసుకోవడం కన్నా నక్సలైట్లుగా మారి పోరాడి సాధించుకోవాలని ఎంచుకోవాలి. ఈ సందర్భంలోనే పొరుగున దండకారణ్యంలో ఆత్మహత్యలు లేని వ్యవసాయ ప్రయోగాల గురించి, సత్ఫలితాల గురించి ఆలోచించవలసిందిగా కూడా విజ్ఞప్తి. అక్కడ లక్షలాది ఎకరాల భూమి చదునుచేసి, తమ విత్తనాలు, ఎరువులు తామే సమకూర్చుకొని, కాలువలు, చెరువులు తవ్వుకొని, ప్రతి ఒక్కరూ భూమి కలిగి ఉండి స్వావలంబనతో కూడిన స్థిర వ్యవసాయం చేస్తున్నారు. అందులో శ్రమ ఉంది, సహకారం ఉంది.

ఇది ఒక్కరోజులో సాధ్యమైన పనేమీ కాదు. మొదటే చెప్పినట్లు

తెలంగాణ సమాజం మేల్కొనాలి

ప్రజలు పోరాడి సాధించుకున్న తెలంగాణలో కూడా పాలనా విధానాల్లో మౌలికమైన తేడా ఏమీ లేదనే విషయం తేలిపోయిందనీ, ప్రజలే తమ సమస్యలకు పరిష్కారాలు వెతుక్కోవాలనీ అంటున్నారు **గొడిశాల వెంకటేశ్వర్లు**

తరాల తరబడి సుదీర్ఘ పోరాటం తర్వాత అనేక మంది విద్యార్థుల త్యాగాల ఫలితంగా సకల జన సమరం తర్వాత ఎట్టకేలకు తెలంగాణ రాష్ట్రం అవతరించిన సంగతి తెలిసిందే. ఏ ఆశల, ఆశయాల సాధన కోసం స్వేచ్ఛ స్వయం పాలన తెలంగాణ సమాజం కోరుకుందో, ఆ స్వేచ్ఛ, ఆశలు, ఆశయాల దిశగా పాలక వర్గాలు పయనిస్తున్నాయా? ఉద్యమ కాలం నాటి నాయకత్వానికి పాలక వర్గంగా పరిణామం చెందిన నాయకత్వ వైఖరికి మార్పులేమైనా ఉన్నాయా? అది పరిణత వైఖరా? అపరిణత వైఖరా? గతానుగతిక వైఖరా? పరిశీలించే ప్రయత్నమే ఇది.

పల్లెబాటలో నడిచి ప్రజల నడుమ పల్లె నిద్రచేసిన ఉద్యమ బుద్ధిజీవులు తెలంగాణ స్వేచ్ఛా పిపాసతో, ప్రజా సంఘాలతో, పలు ఉద్యమ సంఘాలతో కలిసి పోరాడి తెలంగాణ స్వాతంత్ర కాంక్ష నెరవేర్చుకున్న తర్వాత రాచరికపు ఎత్తుగడలకు పెద్దపీట వేసుకోవడం ఆధునిక రాచరిక దర్పణానికి ప్రతీకగా నిలబడుతున్న తీరు విషాదకరం. రాష్ట్రావతరణ ప్రకటనరోజే గుర్రాలపై ఊరేగి, ఆకాశంలో హెలికాప్టరు చేత పూలవాన కురిపించుకోవడం ఏ వైఖరికి తార్కాణం. అదీకాక యావత్ తెలంగాణ ప్రజానీకాన్ని, వాళ్ల బతుకుల్ని ఛిద్రం చేసి రక్తపుటేరులు పారించిన నిజాం నిరంకుశ రాక్షస పాలనకు నిదర్శనంగా నిలిచిన చీకటి కోట గోల్కొండ కోటలో స్వతంత్ర తెలంగాణ తొలి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరపడం కాలం చెల్లిన రాచరిక, భూస్వామ్య ఫ్యూడల్ విధానానికి నిదర్శనం కాక మరేమవుతుంది? నిజానికి ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, పలు సంస్థలు సబ్బండ తెలంగాణ జాతి అంతా తెలంగాణ అమర వీరుల స్తూపం దగ్గరే తొలి స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోవాలని, జరుగుతాయని వేల కళ్లతో ఎదురు చూశారు. కాని ఆ దిశలోనే అత్యంత సామాన్యమైన ప్రజల ఆశలపట్ల ప్రభుత్వ వైఖరికి విస్తుపోవడం అప్పుడే ప్రజలవంతైంది.

ఉద్యమం ఉగ్రరూతలూగించడానికి గత పాలక వర్గాల తప్పిదాలను తెలంగాణ పట్ల అనుసరిస్తున్న విధానాల పట్ల ప్రజలకు చెవినిల్లుగట్టుకొని చెప్పి ఏ పని చేయడం, ఏ కార్యక్రమాలు చేయడం తెలంగాణ ప్రజలకు సమ్మతమో ఏకరువు పెట్టి అవి చేయకపోతే అధికారంలో ఉన్నవాళ్లు సన్నాసులు, చేతగాని దద్దమ్మలు అంటూ అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చండి అంటూ పిలుపునిచ్చిన నాలుకలు ఇప్పుడెందుకు రెండుగా చీల్చినట్లు? ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే అయితే గత ప్రభుత్వాల వైఖరికి ఈ నాయకుల వైఖరికి తేడా ఏముంది? ప్రజల ప్రగాఢమైన కోరికపట్ల తూష్ణీ భావాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. అధికారంలోకి రాగానే మారిన వైఖరికిది ప్రబల నిదర్శనం. ప్రజల్లో ఉన్నప్పుడు నిజాం దానవుడు, పీటమెక్కితే నిజాం దేవుడు. బల్దియా బరిలో నిలవాలంటే

1995లో గ్రామ రాజ్య కమిటీల నేతృత్వంలో ప్రారంభించిన ప్రత్యామ్నాయ ప్రజా అభివృద్ధి నమూనా ఇవ్వాళ జనతన సర్కార్‌గా విస్తరించి వికసిస్తున్నది వాళ్లు వెనుకబడిన వ్యవసాయ జీవితం మాని ఇవ్వాళ కూరగాయలు, పండ్లతోటలు పెంచుతున్నారు. సహకార వ్యవసాయం గనుక ముఖ్యంగా ఫిబ్రవరి భూంకాల్ దివస్ తర్వాత అవసరమైతే భూమి చదను చేయడానికి ట్రాక్టర్లు కూడ అరువుకు తెచ్చుకుంటున్నారు. లక్షలాది ఎకరాల భూమిని చదనుచేసి వ్యవసాయం చేస్తున్నారు. ఈ క్రమమంతా వాళ్లు పాటిస్తున్నది మాత్రం స్వావలంబన సూత్రం. శ్రమ, సహకారం పై ఆధారపడిన అభివృద్ధి. ఈ అభివృద్ధి మార్గాన్ని నడిపించేది వర్గ పోరాట సిద్ధాంతం. ఇందులో కార్మికవర్గ పార్టీ నాయకత్వం, ప్రజా మిలీషియా సహకారం వాళ్లు సాధించిన ఫలితాలను కాపాడుతున్నాయి. ఆ విధంగా వాళ్లు ఇవ్వాళ ఒక యుద్ధంలో ఉన్నమాట నిజమే. గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2009 నుంచే వాళ్లమీద ఒక యుద్ధాన్ని ప్రకటించి ఉన్నాయి. ఆ యుద్ధం మధ్యలోనే వాళ్లు ఉత్పత్తిలో పాల్గొంటున్నారు. వాళ్లు ప్రాణ త్యాగాలు చేస్తున్నారు. మహిళలు సామూహిక అత్యాచారాలకు గురవుతున్నారు. గ్రామాలకు గ్రామాలే తగులబడుతున్నాయి. ఎన్‌కౌంటర్ పేరిట హత్యలు జరుగుతున్నాయి.

మంద్రస్థాయి యుద్ధం మూడవ దశకు చేరి సాల్వాజుడుం మరో రూపంలో ప్రవేశిస్తున్న తీవ్ర రాజ్యహింస దశగుండా వాళ్లు పోరాడుతున్నారు. ఇంతటి తీవ్ర నిర్బంధ రాజ్యహింస వాతావరణంలో కూడా వాళ్లు కోల్పోనిది స్వీయ విశ్వాసం. స్వావలంబన. కనుక ఆత్మహత్యలా పోరాటమా అన్నదే హరిత విప్లవం కూడా విఫలమైన ఈ సందర్భంలో రైతాంగం ఎంచుకోవాల్సి ఉన్న మార్గం. వ్యవసాయం గురించి, రైతుల ఆత్మహత్యల గురించి, చిత్తశుద్ధితో ఆలోచించి ఆవేదన చెందే బుద్ధిజీవులు, ప్రజాస్వామ్యవాదులు కూడా ఆలోచించవలసిన ప్రత్యామ్నాయమదే. మొదట మన పార్లమెంటరీ పార్టీలన్నీ ఎంచుకొని అమలు చేస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణను, అందులో భాగంగా నూతన ఆర్థిక విధానం, నూతన వ్యవసాయ విధానం పేరుతో చేసుకున్న ఒప్పందాలను – సామ్రాజ్యవాదులతో పీటముడి వేసుకున్న రాజకీయార్థిక విధానాలను నిరాకరించడానికి సిద్ధపడితే తప్ప రైతాంగాన్ని ఈ సంక్షోభం నుంచి బయటపడవేయలేం.

రైతు–వ్యవసాయం గురించి ఆలోచించి కాపాడుకోవాలని తపనపడే ప్రతి ఒక్కరూ విమర్శనాత్మకంగానైనా సరే ఆలోచించవలసింది, పరిశీలించవలసింది, రైతుల ఆత్మహత్యలకు పరిష్కారంతో సహా – వ్యవసాయ విప్లవం గురించి, ఎర్ర విప్లవం గురించి, భూమి ఇరుసుగా సాగే వ్యవసాయ విప్లవం గురించే. అది మాత్రమే 1857లో భారత రైతాంగం ప్రారంభించిన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేసి మనదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేస్తుంది.

(రచయిత విప్లవ కవి, విప్లవ రచయితల సంఘం సభ్యులు) వీ

ప్రజల ఆకాంక్షను బలి ఇవ్వాల్సిందేనా? ప్రభుత్వాలు స్వయం పాలనలోనైనా, పరాయి పాలనలోనైనా స్వరూపంలో తేడాయే గాని స్వభావంలో కాదని నిరూపించారు.

ఆంధ్రప్రదేశ్ అవతరణ కంటె ముందు నుండీ తెలంగాణ విద్యలో వెనుకబడిందని, వాళ్లకు ఇంగ్లిష్ చదువులు రావని, ఉర్దూ రాజ భాషగా నైజాం ప్రాంతమంతా తెలుగు భాష నిరాదరణకు గురైందని, వాళ్లు మాట్లాడే తెలుగు తెలుగే కాదని అవమానించబడిన చరిత్ర పుటల సాక్షిగా స్వాతంత్ర్య తెలంగాణ విద్యా విధానం ప్రజానురంజకంగా, ప్రభుత్వాధీన విద్యగా రూపొందుతున్న భ్రమలోంచి బయటపడడానికి ఎంతో కాలం పట్టలేదు. స్వీయ పాలనలో నూతనంగా స్థాపించిన కళాశాలలెన్ని, యూనివర్సిటీలెన్ని? బోధనా, పాలనా సిబ్బంది ఎంత? ఒకవైపు ప్రపంచం గర్వించదగిన కెజి టు పిజి విద్యా విధానం తీసుకొస్తామని (కామన్ స్కూల్) చెప్పుకుంటూ, మరోవైపు పాఠశాల నుండి కళాశాల స్థాయి వరకు ప్రైవేట్ విద్యా విధానానికి వెన్నుదన్నుగా నిలుస్తూ ఉపాధ్యాయ సిబ్బందిని కుదిస్తూ, పాఠశాల నుండి యూనివర్సిటీల వరకు పర్యవేక్షణ లేని ఇంచార్జీల పాలన కొనసాగించడం పటిష్టమైన విద్యా విధానానికి నిదర్శనమా? కోర్టులకు హామీ పత్రాలిస్తూ, కోర్టులు అక్షింతలు వేస్తే గాని కనీసం వలంటీర్లనైనా నియమించే దూర దృష్టిలోపం కలిగిన నాయకత్వాన్ని కలిగి ఉండడం మన దురదృష్టం. ఇంగ్లిష్ రాదన్న భ్రమో లేదా ఇంగ్లిష్‌పై మోజో ఏదేమైనా కెజి టు పిజిలో కూడా ఎక్కడి నుండి ప్రారంభించాలన్న ఒక లోలకపు ప్రశ్న ఇంకా కొనసాగుతూనే ఉంది. పైగా విద్యా రంగంలో మరొకసారి గతానుగతికమైన రాజకీయ పెత్తనానికి తెరలేపే ఆలోచన అత్యంత దురదృష్టకరం. గత ప్రభుత్వాలు పాఠశాలల్లో యాజమాన్య కమిటీల పేరుతో రాజకీయాలు ప్రవేశపెడితే, ఒకవైపు కోర్టుకు హామీలిస్తూ ఏకంగా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ల నియామకాల్లో రాజకీయాధికారానికి పునాదులు వేసుకోవడం మరీ దారుణం.

మార్పు అంటె మార్కు రాజకీయమా? అదీ విలువైన మానవ వనరులిచ్చే విశ్వ విద్యాలయంలో. ఇప్పటికే అంతర్జాతీయంగా గుర్తించిన 200 యూనివర్సిటీల్లో ఒక్క యూనివర్సిటీ కూడా చోటు దక్కించుకోని పరిస్థితుల్లో ఇలా ఆలోచించడం యూనివర్సిటీల స్థాయిని దిగజార్చి చూడడం గ్రూపు రాజకీయాలకు మరింతగా చేరువ చేయడం ఎంతవరకు సమంజసం. నాణ్యత లేని వృత్తి విద్యా కళాశాలల పట్ల తీసుకోవాల్సిన చర్యలపట్ల ఆటంకాలు ఏవైనా ప్రభుత్వ నిస్సహాయత బట్టబయలవుతుంది. ఇది ఉదాసీన వైఖరా? ఉద్దేశపూర్వక వైఖరా? అర్థం కాని పరిస్థితి.

ఎట్టకేలకు కొనసాగుతున్న అనేక ప్రమాణ రహిత వృత్తి విద్యా కళాశాలల్లో ఫీజు రీయంబర్స్‌మెంట్ విషయంలో ప్రభుత్వం తర్జన భర్జన పడుతోంది. తెలంగాణలోని విద్యార్థులకు ఉచిత, నాణ్యతతో కూడిన విద్యనందించి, విద్యార్థులు కలలు గన్న పెద్దపెద్ద చదువులు, కొలువులు సమకూర్చే దిశలో ఆలోచించాల్సిన ప్రభుత్వం రీయంబర్స్‌మెంట్ విషయంలో జవాబుదారీ తనం నుండి తప్పుకోవడానికి తెగ తంటాలు పడుతోంది. విధానాల్లో స్పష్టత లేదు. ఎంసెట్‌లో ఫలానా ర్యాంకు వరకు మాత్రమే అంటూ స్వీయ నియంత్రణ విధించుకుని విద్యా సామాజిక సంక్షోభాన్ని ప్రజల నెత్తిన రుద్ద జూస్తోంది.

విద్యా రంగంలో సింహభాగం ఉపాధ్యాయ నియామకాలే కీలకం వీటి పట్ల స్పష్టత లేదు. ఉపాధ్యాయ సంఘాలను కుదించాలనే ఆలోచన చేసే ప్రభుత్వం ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనల రూపకల్పనకు చేస్తున్న కృషి శూన్యం. అధికారంలోకి రాగానే అడగని ఇంక్రిమెంటు ఇచ్చారు గాని, ఎప్పటి నుండో అడుగుతున్న సర్వీసు రూల్స్ విషయంలో ‘అదో సమస్యా? ఒక్క పేజీలో సర్వీసు రూల్స్ రూపొందిస్తే చాలు. అదెంతపాటి?’ అంటూ మాట్లాడిన మాటలు ఎక్కడ పోయాయి? కోర్టులో ఉన్న వ్యవహారాన్ని వేగవంతం చేసే ప్రక్రియలేవి? ఇప్పటికే పలు యాజమన్యాల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులు, విద్యా సంస్థలకు తోడు నియోజకవర్గానికో పది రెసిడెన్షియల్ పాఠశాలలంటారు. ఏమిటీ ప్రకటనలు? అసంకల్పిత, అస్పష్ట విధానాల నడుమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తుందన్న కెజి టు పిజి విద్య విద్యా రంగంలోని మేధావులకే ఓ చిక్కుముడి. విద్యారంగం పట్ల దార్శనికతలేని వైఖరి సమాజానికి ప్రమాదకరం.

ప్రజలకు అత్యంతావశ్యకమైన విద్యా, వైద్యం ప్రభుత్వం చేతుల్లో ఉండాలనేది ప్రజల డిమాండ్. కాగా స్వయం పాలిత తెలంగాణలోనైనా ఈ విధానం అమలవుతుందనుకుంటే ఇది ఎండమావిగానే కనబడుతోంది. గత ప్రభుత్వాలు చేపట్టిన విధానాల కొనసాగింపుగా నడుస్తున్న ప్రభుత్వ వైఖరిలో ఎటువంటి మార్పూ లేదు. ఆరోగ్య శ్రీ పథకంతో కార్పొరేట్ ఆస్పత్రులకు దోచిపెడుతున్నారని, ప్రభుత్వ వైద్యశాలలు కునారిల్లిపోతున్నాయని ఆరోపించిన పాలక వర్గాలు తిరిగి అదే కార్పొరేట్ యాజమాన్యాలకు తలొగ్గి 25 శాతం మేర నిధులు పెంచడానికి అంగీకరించాయి. ఆ శక్తుల ఆశ మరింత పెరిగి 50 శాతం పెంచాలంటూ భీష్మించుకు కూర్చుంటే ప్రభుత్వ వర్గాలు మీనమేషం లెక్కిస్తూ ఎంతో కొంత పెంచి ఆరోగ్య ‘శ్రీ’ కట్టబెడదామని చూస్తుందే గాని అంతే దీటుగా ప్రజా వైద్యశాలల స్థాయిని, ప్రభుత్వ డాక్టర్ల నియామకాన్ని పెంచుతామని చెప్పలేకపోయింది. పైగా ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ పేరును ఉచ్చరించకుండా హెల్త్ కార్డుల పేరుతో అందరికి ఇస్తున్నట్లు ప్రకటించినా అమలుకు నోచుకోకపోవడం దురదృష్టకరం. పాలక వర్గానికి ప్రజా వైద్యం పట్ల నిర్దిష్ట వైఖరి లేకపోవడం విచారకరం.

తరతరాల తాకట్టు బతుకులకు విముక్తి కలుగుతుందని భావించిన తెలంగాణ సమాజానికి స్వయం పాలనలో కూడా ప్రపంచీకరణ, ప్రపంచ బ్యాంకుకు సరికొత్త కట్టు బానిసగా నిలబడడం తప్పడం లేదు. మన పాలన మనకొస్తే, ఆంధ్ర వలసవాద పాలన నుండి బయటపడితే మనమెవరికీ బానిసలుగా బతకాల్సిన అవసరం ఉండదని ఊదరగొట్టిన నాయకత్వాలే ఇప్పుడు సరికొత్త పారిశ్రామిక విధానం అంటూ పారిశ్రామికవేత్తలకు రెడ్ కార్పెట్ పరుస్తూ కేంద్రీకృత పారిశ్రామికాభివృద్ధికి ఊతమిస్తున్నాయి. అభివృద్ధి అంటే కేవలం నగరీకరణ కాదు. కేవలం ఒక ప్రాంత పారిశ్రామికాభివృద్ధే సమగ్రాభివృద్ధి కాదు. తెలంగాణలోని నలుమూలల ఉన్న నగరాల్లో పారిశ్రామిక కారిడార్ నిర్మాణానికి కృషి చేయాలి. ప్రపంచ దేశాల్లోని పారిశ్రామికవేత్తలకు, దేశీయంగా ఉన్న పారిశ్రామిక దిగ్గజాలకు హైదరాబాద్ ఒక్కటే పరిశ్రమల స్థాపనకు అనువైన ప్రదేశమని చెప్పడం సరైంది కాదు. ఇప్పటికే నగరం కాలుష్య కాసారంలా మారింది. తెలంగాణలోని ప్రతి పట్టణాన్ని సంతులిత అభివృద్ధి చేసుకోవచ్చున్న నాయకాగ్రేసరుల మాటలు ఎటుపోయినవి? అలా జరగకపోతే గత పాలకుల మాదిరే విలువైన నగరం చుట్టూ ఉన్న భూముల్ని బడా పారిశ్రామిక వేత్తలకు ధారాదత్తం చేసినట్లవుతుంది. ఉద్యమకాలంలో నగరంలో ఫార్మాస్యూటికల్ కంపెనీలచేత నగరాన్ని కాలుష్య కూడలిగా ఆంధ్ర పెట్టుబడిదారులు మార్చారని గగ్గోలు పెట్టి, నేడు ఫార్మాసిటీ, ఫిల్మ్‌సిటీల పేరుతో చేస్తున్నదేమిటి? అభివృద్ధి వికేంద్రీకరిస్తామన్న నాయకులు మళ్లీ నగరం చుట్టూ తిరగడం ఏ వైఖరికి నిదర్శనం? నగరం చుట్టూ చేసిన ఆక్రమణలు ఎటుపోయినవి. అక్రమంగా కేటాయించిన భూములను, ఆక్రమించి సెంటు భూమిని

కూడా పోనివ్వమని ప్రగల్భాలు పలికినవారు ఇవ్వాళ చేస్తున్నదేమిటి? లక్ష నాగళ్లతో రామోజీ ఫిల్మ్‌సిటీని దున్నుతామన్న నాయకులు ఎక్కడా ఆక్రమణ దారులకు కనీసం కర్రు కాల్చి వాతపెట్టిన దాఖలాలైనా లేవు. సరికదా వలసవాద పాలనలో మూతపడిన పరిశ్రమలను తెరిపించే ప్రయత్నం చేయకపోవడం మరింత విషాదకరం.

ప్రాజెక్టులు తెలంగాణలో, పారే నీళ్లు ఆంధ్రకా? అని ప్రశ్నించి సమాధానంగా రాష్ట్రాన్ని సాధించుకున్న ప్రజలు తమ కలల పంటల పంటలు పండించుకోవచ్చనుకున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాజెక్టులు అర్ధాంతరంగా ఆగిపోయి, నిధులు లేక నిలువుగుడ్లేసుకుని చూస్తున్నవి. వాటిని చిత్తశుద్ధితో పూర్తి చేసుకుని అనంతరం కొత్త వాటికి పునాదులు వేసుకోవాల్సింది పోయి డిజైన్ల మార్పుని, నూతన ప్రాజెక్టులని మళ్లీ ధనయజ్ఞానికి సమాయత్తం కావడం పూర్వ నాయకుల వైఖరికి, ప్రస్తుత నాయకత్వ వైఖరికి తేడా లేదనిపిస్తుంది. నీటి వాటా సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలకు పూనుకోవాల్సింది పోయి, ఎదుటివాడు అడ్డుపుల్ల వేస్తున్నాడని ఆరోపిస్తూ రాజకీయంగా వాడుకునే వైఖరి అభిలషణీయమా? వ్యవసాయం, నీటి పారుదల పట్ల గత ప్రభుత్వాల నిర్వాకాన్ని విమర్శించిన నాయకత్వం ఇప్పుడు అనుసరిస్తున్న వైఖరి ఏమిటి? గతంలో చంద్రబాబు నాయుడు విజన్ 2020లో భాగంగా చెప్పిన పొగాకు, పత్తి, పసుపు, మిర్చి వంటి వాణిజ్య పంటలు పండించండి, తిండిగింజలు దిగుమతి చేసుకుందామని చెప్పినట్లుగానే ప్రపంచ బ్యాంకు అప్పుకై మోకరిల్లే ప్రభుత్వం చెపుతున్నదేమిటి? 'అధికారులు భూసార పరీక్షలు నిర్వహించి ఏ పంటలు వేయాలో చెప్తారు. అవే పండించాలి. తుంపర సేద్యంతో సిరులు పండించుకోవచ్చని' అంటుంది. మరి గతంలో తుంపర సేద్యం మెట్ట ప్రాంతాల్లో అనువుగా ఉంటుందంటే మీకు కాలువలు, మాకు తుంపర సేద్యమా? అంటూ అరచి గోల ఎందుకు పెట్టినట్లు? స్వతంత్ర తెలంగాణలో ఈ పాలక వర్గాల వ్యవసాయ విధానం ప్రపంచ బ్యాంకు అనుసరణీయ వైఖరే కదా? క్రమంగా సన్న-చిన్నకారు రైతులను మింగే కార్పొరేట్ వ్యవసాయ అనుకూల వైఖరే కదా?

రైతు సానుకూల ప్రభుత్వంలో ఇప్పుడు మరణాలు రాజధానికి చేరుకున్నాయి. బహుశా క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలనెదుర్కొంటున్న రైతులు పాలక వర్గాల కళ్లు తెరిపించడానికి ఊపిరితో శరీరాన్ని నగరం నడిబొడ్డుదాకా మోసుకువచ్చి ఉరివేసుకుంటున్నారు. రైతు సానుకూల ప్రభుత్వమంటూనే లక్ష రూపాయల రుణ మాఫీకి ఎంత తైతక్కలాడిందో చూశాం. ఇప్పటికీ అప్పుతీరక, అప్పుదొరికే అవకాశం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతుల పట్ల ప్రభుత్వ వైఖరేంటి? చనిపోయిన వారికి ఆరు లక్షలు ఎక్స్‌గ్రేషియా చిల్లిస్తామంటారే గాని మూలకారణాలు వెతికి రైతుకు అండగా ఉంటామన్న హామీ కరువైంది. పైగా అప్పులు తీసుకుని వడ్డీ వ్యాపారంతో నష్టాలపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని రైతుల ఆత్మహత్యలను అవహేళన చేస్తూ, అమరవీరుల ఆత్మత్యాగాలను కుదించినట్లే రైతు బలవన్మరణాలను కుదింపజూసే ప్రభుత్వ దుర్నీతిని ఏమనాలి? నగరం కూడలిలో శవమై నిలిచిన అన్నదాత ఆక్రందనలపై ఆలోచించాలి. పండించేవాడే ప్రాణాలు తీసుకుంటున్నాడు. కొన్నవాడు గాని, కొని అమ్మినవాడు గాని నష్టపోయి ప్రాణాలు కోల్పోయిన దాఖలాలు లేవు. మూలాలు వెతకాలి. స్వతంత్ర తెలంగాణలోనైనా ఆకలికి పిడికెడు మెతుకులు పెట్టే అన్నదాతకు పిడికెడంత ధైర్యాన్ని నూరిపోయాలి. లేకుంటే అన్నమో రామచంద్రా! అనక తప్పదు.

గతకొన్ని దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు కల్లుకు, సారాయికి కట్టు బానిసలన్నట్లు ఆంధ్రవాళ్లకు కల్లుతాగే అలవాటు లేనట్లు సోయగాలు పోయిన సోకాల్డ్ ఆంధ్రా వాదుల చేతుల్లో అవమానాల పాలై ఇటీవల కాలంలో మేల్కొంచిన తెలంగాణ ప్రజలు ఆంధ్రా కుసంస్కారాలపై యుద్ధం ప్రకటించి, విజయం సాధించి తమకంటూ ఓ గౌరవ మర్యాదలు ఉన్నాయని భావించారు. ఐతే తెలంగాణ అవతరణ తర్వాత మన అసెంబ్లీలో ఉన్న మన ప్రజా ప్రతినిధులను కల్లుతాగి నిద్రపోతున్న శాసన సభ్యులని నీచంగా వర్ణించిన ఆంధ్రా మీడియాను చూశాం. ఈ దశలో మన మద్యం పాలసి ఎలా ఉండాలి? మద్యం పట్ల మన విధానం హుందాగా ఉండల్సింది పోయి, మద్యం ఒక ఆదాయ వనరుగా చూడడం సిగ్గుచేటు. ప్రజల ఆదాయ వనరులను, సాంస్కృతిక విలువలను పెంచాల్సిన ప్రభుత్వం విలువల పతనం దిశగా ప్రజలను నిజంగానే మద్యపాన ప్రియులుగా మార్చే దిశగా తక్కువ వెలకే మద్యం అంటూ సరికొత్త పల్లవినెత్తుకోవడం తెలంగాణ సమాజాన్ని ఎటువైపు నడిపే వైఖరి? ఇప్పటికే రాష్ట్రంలో కల్తీకల్లు తాగి వందల సంఖ్యలో మనుషులు ఎంత దుర్భర స్థితికి వచ్చారో కళ్లారా చూస్తున్నాం. దానికి బానిసలై ప్రాణాలు కోల్పోయారు. తొలినాళ్లలో తెలంగాణలో తాగుడును మాన్పించడానికి హైదరాబాద్ మేయర్‌గా పనిచేసిన కృష్ణస్వామి ముదిరాజ్, భాగ్యరెడ్డివర్మ లాంటి మహానుభావుల వారసత్వముండగానే నేటి తెలంగాణ ప్రభుత్వం ప్రజలను తాగుబోతులుగా తీర్చిదిద్దే ప్రయత్నం ఏ సంస్కరణకు నాంది పలుకుతోంది? ప్రాణాప్రాయమైన కల్తీకల్లు విధానాన్ని అరికట్టలేని ప్రభుత్వం నాణ్యమైన మద్యం అందించగలదా?

విద్యార్థుల బలిదానాలు, ఆత్మత్యాగాలపైన అవతరించిన తెలంగాణ విద్యార్థుల, ఉద్యోగుల ఆశల ప్రతిబింబంగా నిలుస్తుందనుకున్నారు. విద్యార్థుల ఆందోళనలే ఊపిరిగా ఎగిసిపడిన ఉద్యమ ఫలితమే ఇవాల్టి అధికార పీఠమన్నది మరచిపోయి, 'ప్రతిభను మరచి పలుకుబడికి పట్టం కడదామంటూ ప్రశ్నించినందుకు విద్యార్థులు పనిపాటలేని పోరగాళ్లు'గా చిత్రీకరించడం ఏ నైజానికి గుర్తు. ఫక్తు రాజకీయ బుద్ధికాదూ! ఇప్పటికీ విద్యుత్ ఉద్యోగుల విభజన వివాదం కొలిక్కి రాలేదు. కమలనాథన్ కమిటీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుంది. దీన్ని వేగవంతం చేసేదిపోయి, ఆలస్యమైతే ఆరోపణల అదునుకోసం చూడడం ఫక్తు రాజకీయ వైఖరి గాక మరేమవుతుంది. నిత్యం విద్యార్థులు తమ స్కాలర్‌షిప్‌ల కోసం, మౌలిక వసతుల కోసం, పుస్తకాల కోసం ఆందోళనలు, ఆశా వర్కర్ల లాంటి ఉద్యోగుల జీత భత్యాల పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. కేవలం హాస్టళ్లలో సన్నబియ్యం ఇవ్వగానే సంక్షేమమవుతుందా? వాళ్ల సంక్షోభం తీరినట్లేనా?

గత కాలపు ప్రభుత్వాల విష సంస్కృతిని అక్షరాల పునికి పుచ్చుకున్నట్లు తోస్తుంది ఈ ప్రభుత్వ వైఖరి కూడా. గతంలో తమ పార్టీ ఎంఎల్ఎలను కొంటున్నారని, బెదిరిస్తున్నారని చెప్పి రాజకీయ అనైతికత గురించి పెదబొబ్బలు పెట్టిన నాయకులు ఇవాళ చేస్తున్నదేమిటి? ఇతర పార్టీల్లో ఉన్నవాళ్లను తమ పార్టీలోకి, ప్రభుత్వంలోనికి ఎలా గుంజుకోగలిగారు. ఇది ఏ వైఖరి? అంతేగాక అసలు ఉద్యమంలో తమ వాక్పటిమతో పార్టీని తెలంగాణ అస్తిత్వాన్ని భుజాన వేసుకుని పోరాడిన అనేక మంది తెలంగాణ వాదులను, ఆఖరుకు తెలంగాణ కోసం ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడి పిడి యాక్టు వంటి రాక్షస చట్టాలకు గురై జైలు పాలైన స్వచ్ఛ తెలంగాణ వాదులను విడనాడి, స్వార్థ ప్రయోజనాలతో అప్పటికప్పుడు చంకన చేరిన వారికి పెద్దపీట వేయడంలో, ఉద్యమ స్ఫూర్తి గల నాయకత్వం అసలు సిసలు వైఖరేంటో అర్థమవుతుంది. ప్రతిపక్షాలను కలుపుకుని పోతామన్న

నాయకత్వం తమ పార్టీలో కలుపుకో చూడడం ఏ నీతి? ప్రతిపక్షమే లేకుండా చేయాలనుకున్న 'పెద్దాయన'కు ఈ పెద్ద మనిషికి తేడా ఏమిటి? ప్రతిపక్షాలపై విరగపడడానికి ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక తరగతులా?

తెలంగాణలో సబ్బండజాతీ అభివృద్ధికి అర్హులే. కాదనలేం. కాని వివిధ సామాజిక వర్ణ బేధాలున్న నిచ్చెన మెట్ల సమాజంలో అంతరాలను, కుల మతాల విబేధాలను కూకటి వేళ్లతో కూలదోసి సమసమాజ నిర్మాణానికి ప్రాతిపదికను ఏర్పరచుకోవాల్సిన పాలక వర్గాలు కులాల ప్రాతిపదికన భవనాలు నిర్మించి ఇస్తామని పలుకుబడిగల అధిక జనాభాగల సామాజిక వర్గ ప్రతినిధులకు హామీలివ్వడం, కోట్లు ఖర్చు చేస్తామనడం ఎలా సమర్థనీయం? ఇది రాజకీయంగా పదిల పరుచుకునే వైఖరి కాదా? ప్రభుత్వానికొస్తే నీకో ముక్కెర, పీఠమెక్కితే నీకో పసిడి కిరీటం అని దేవుళ్లకు ఆశపెట్టి అధికారంలోనికి వచ్చిన తర్వాత ప్రజా ధనంతో ఒక వర్గ ప్రతినిధులుగా చలామణి అయ్యే దేవుళ్లకు ధార పోస్తాననడం ఏ విధి కర్తవ్యం? శాస్త్రీయ విధానాలను అవలంబిస్తూ, ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దేది పోయి, పుష్కరాల పేరుతో ప్రజలను మూఢత్వంలో ముంచెత్తారు. ప్రభుత్వానికి ఓ వాస్తు సలహాదారుని ప్రత్యేకంగా నియమించుకోవడం, యజ్ఞ యాగాదుల చేత ప్రజలను ఏ శాస్త్రీయ ఆలోచనలవైపు పయనింపజేస్తున్నారో ఆలోచించుకోవాల్సి ఉంది. ఈ విధానాలు ఏ లౌకికవాద ప్రజాస్వామ్య ప్రయోజనమో చెప్పాల్సి ఉంది.

బంగారు తల్లి నా తెలంగాణ తల్లి అని అడుగు ముందుకేసి పోరాడిన ఆడపడచులకు సంక్షేమ సంక్షుభితాలే కనపడుతున్నాయి. స్త్రీ శిశు సంక్షేమానికి తెలంగాణ రాష్ట్రంలో ఒక్క మహిళా మంత్రీ లేదన్న అప్రతిష్ట ప్రభుత్వం ఎలాగూ మూట గట్టుకుంది. కాని కనీసం అంతకుముందన్న 'బంగారు తల్లి' పథకం ఎటుపోయినట్టో? ఉందో లేదో తెలియక ఆడబిడ్డలు ఆందోళన పడుతున్నారు. దాని స్థానంలోనే అనుకున్నా కళ్యాణ లక్ష్మీ పథకం స్పష్టత లేదు. వారికి వర్తిస్తుందో లేదో చెప్పలేని పరిస్థితి ఉంది. రెండు గదుల ఇళ్లు ఇంకా రూపుదాల్చ లేదు. కొత్తగా పేదలకు గ్రామాల్లో ఇళ్ల స్థలాల పంపిణీ లేదు. పట్టణాల్లో ఆక్రమిత పేదలకు పట్టాలు లేవు. నగరం చుట్టూ వేలాది ఎకరాల భూములు పారిశ్రామిక వాడల పేరుతో కట్టబెడుతూ, నగరం నడిబొడ్డులో ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ భూముల్లో పేదలకు ఇళ్లు కట్టిస్తామని చెప్పి ఆక్రమణ దారుల చేతిలో ఉన్న భూమిని విడిపించి ఇళ్ల స్థలాలు పేదలకిచ్చేది పోయి, యూనివర్సిటీ భూమిని ఆక్రమించే అవకాశం కోసం ఎదురుచూస్తున్న వారికి ఊతమిచ్చేలా ప్రకటనలు చేసి, సరికాదన్న విద్యార్థులను, మేధావులను ప్రజల ముందు దోషులుగా నిలిపే ప్రయత్నం ఏ సంక్షేమ వైఖరో? ఏడాదిన్నర కాలంలో ఎక్కడా నూతన ఇళ్ల పట్టాలు లేవుగాని హైదరాబాద్‌లో ఎన్నికలు అనగానే ఇళ్ల పట్టాల పంపిణీ గుర్తుకు వచ్చిన ప్రభుత్వానికి కిటికీలకు గోనె సంచులు, దర్వాజలకు సూపర్ బస్తాలు కట్టుకుని సగం పూర్తికాని ఇందిరమ్మ ఇళ్ల బాధితులు మాత్రం ఇంకా గుర్తుకు రాకపోవడం విషాదకరం.

రాష్ట్ర ఆవిష్కరణకు ముందు అనేక వామపక్షాలతో పాటు, మావోయిస్టు పార్టీ కూడా తెలంగాణ కోసం తన మద్దతు తెలియజేసింది. ప్రజా పోరాటం ద్వారానే తెలంగాణ సాధ్యమవుతుందని చెప్పి ఉద్యమానికి ఊతమిచ్చింది. తమ ప్రజా పోరాట బాటలో ఎందరినో పోగొట్టుకున్న పార్టీ వచ్చే తెలంగాణలోనైనా ప్రభుత్వ హత్యలు ఉండకూడదని ఆశించింది. ఎన్‌కౌంటర్ లేని తెలంగాణ కావాలని నినదించింది. సుదీర్ఘ పోరాట ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో నిజంగానే బహుజన, దళిత, ఆదివాసి, పేద ప్రజల ఆక్రందనలను వినే రాజ్యం అవతరిస్తుందను కున్నారు. అనుకున్నదేమైనా ప్రజాస్వామ్యమనే ముసుగు ఒకటి ఉంది గనుక తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ పీఠమెక్కింది. తక్షణమే నక్సలైట్ల ఎజెండాయే మా ఎజెండా అని ప్రకటించుకుంది. మరి నక్సలైట్ల ఎజెండా ఏమిటి? గిరిజన ఆదివాసి పీడిత ప్రజల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం, వారి పట్ల రాజ్య విధ్వంసానికి వ్యతిరేకంగా పోరాడి, ఆ ప్రజల చైతన్యానికి పునరంకితం కావడం నేరమా? విప్లవ భావజాలం కలిగి ఉండడమే నేరమా? నిజానికి ఉద్యమ కాలంలోనే ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న పెద్దలు పై మాటలు చెప్పారు. ప్రజల్లో ఉన్నప్పుడున్న వైఖరి, ప్రభుత్వంలోకి రాగానే మారిందా? తెలంగాణ ప్రభుత్వం వచ్చిన ఈ పదహారు నెలల కాలంలో మూడు ఎన్‌కౌంటర్‌లు జరిగాయి. ఇవేవి నిజానికి ఎదురుకాల్పులు కావు. నిరాయుధులైన వారిని పట్టుకుని, హింసించి, అత్యంత పాశవికంగా చంపి ఎన్‌కౌంటర్ కథలల్లడం గత పాలకుల అడుగుజాడల్లో నడవడమే గాని మరొకటి కాదు. తన అస్తిత్వం కోసం పోరాడి గెలిచిన రాష్ట్రమే తన బిడ్డలను పొట్టనపెట్టుకోవడం ఏ న్యాయం? రాజ్యం తన పోషిత బలగాలచేత ఒకవైపు కూంబింగ్‌ల పేరుతో రక్తపాతం సృష్టిస్తూ, మరొకవైపు జరిగిన సంఘటన దురదృష్టకరం, విచారణ జరిపిస్తామనడం వంటి అమాయకపు మాటలు వల్లెవేస్తూ, ప్రజలను సానుభూతి కోరడం దాని నిస్సిగ్గుతనానికో నిదర్శనం. జరిగిన ఎన్‌కౌంటర్‌లను చూపి, ఇటీవల వాటికి వ్యతిరేకంగా చలో అసెంబ్లీ నిర్వహించిన తన పూర్వ మిత్రుల ప్రజా సంఘాలపై పోలీసుల నిరంకుశ అణచివేతను చూపి రాష్ట్రంలో మా పాలన ఎంత ప్రశాంతమైందో చెప్పుకుని ప్రపంచ బ్యాంకుకు, పారిశ్రామిక వేత్తలకు చూపి మెప్పు పొందాలన్న ప్రయత్నం తప్ప మరొక వైఖరి కాదు. ఈ వైఖరి మారాలి. బతుకుదెరువు లేని బతుకులకు 'బంగారం' ఎవడికి కావాలి?

ప్రజల నడుమ నడచి నిలిచిన నాయకత్వానికి రక్షణ లేదా? గత పాలకుల కంటే ఎక్కువ ప్రమాదంలో ఉన్నారా? పోనీ తెలంగాణలో మావోయిస్టుల, వ్యతిరేక శక్తుల భయం ఉందా? అది లేదని ప్రభుత్వ పెద్దలే చెపుతున్నప్పుడు ప్రజా నాయకులకు కోట్ల రూపాయల రక్షణ కవచాలెందుకు? రక్షక వాహనాల రొద ఎందుకు? పైగా నల్ల రంగులోంచి తెల్ల రంగుకు మారితే రక్షణ దొరుకుతుందా? ఇందుకోసం కోట్ల రూపాయలు ఖర్చుచేసి వాహనాలు కొనుగోలు చేయడం తెలంగాణ సమాజం హర్షిస్తుందా? ఇప్పటికైనా పోలీసు రక్షణలో నాయకులు, పోలీసు నిర్బంధాల్లో ప్రజలు ఉండాలనే ప్రభుత్వ వైఖరిలో మార్పు రావాలి. ప్రజలు స్వేచ్ఛగా తమ నిరసనలు తెలిపేలా, ప్రజా నాయకులు స్వేచ్ఛగా తిరిగే వాతావరణం సృష్టించాలి. ప్రచార ఆర్భాటాలకు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి బస్సులు, రక్షక వలయాలు, రక్షక వాహనాలు, ఆడంబరాలకు, అశాస్త్రీయ విధానాలకు స్వస్తి చెప్పి గతానుగతికమైన పాత విధానాలను పక్కకు పెట్టి, నూతనంగా ఆవిష్కృతమైన రాష్ట్ర పురోభివృద్ధికి, పునరుజ్జీవనానికి, ఆచరణీయ, అనుసరణీయ విధానాలతో ముందుకెళ్లాలి. పార్టీ ఫిరాయింపుల పట్ల, విద్యా, వైద్య రంగం పట్ల, మద్యం, పారిశ్రామిక విధానం పట్ల, ఎన్‌కౌంటర్లు, సెప్టెంబర్ 17, విద్యార్థుల ఆందోళనలు, వ్యవసాయ విధానం, ప్రపంచ బ్యాంకును దేబిరించే అస్పష్ట విధానాల పట్ల నాయకుల నాలుకలు చీలికలు కాకముందే తెలంగాణ సమాజం మేల్కొంచి, పాలకులను మేల్కొల్పాల్సి ఉంది.

(రచయిత డిటిఎఫ్ ఉపాధ్యాయుడు) వీ

గద్వాలలో ఘరానా దోపిడీ

***పత్తి రైతుల సమస్యలు ఏడాదికేడాది పెరుగుతున్నాయనీ, ప్రభుత్వ సహకారం లేకపోవడంతో, దళారీల, వ్యాపారుల మోసాలు పెచ్చరిల్లిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారనీ అంటున్నారు* సాయన్న**

గద్వాల సంస్థానం ఘనఖ్యాతి బయటి సమాజంలో బాగా ప్రచారంలో ఉంది. కాని అక్కడ దోపిడీ కింద నలిగిపోతున్న రైతుల దుస్థితి ఎవరికీ కనిపించదు. వినిపించదు. నేడు సీడ్ పత్తి రైతులు చేస్తున్న ఉద్యమం అక్కడి పోరాట వారసత్వాన్ని ఎత్తిపట్టింది. గద్వాల డివిజన్‌లోని గద్వాల, దరూర్, గట్టు, మల్దకల్, అయిజా మండలాల్లో దాదాపు 20 వేల మంది రైతులు 50 వేల ఎకరాల్లో పత్తి విత్తనాలను పండిస్తున్నారు. వీరికి అంకుర్, కావేరి, నూజివీడు, బయోసీడ్, సత్యసీడ్, నంది విత్తన కంపెనీలు మూల విత్తనాలను పరఫరా చేస్తున్నాయి. కంపెనీలు రైతులతో చేయించే వ్యవసాయం కాంట్రాక్టు వ్యవసాయ చట్టం ప్రకారం జరగాలి. చట్టాలను తప్పించడం కోసం కంపెనీలు ఆర్గనైజర్లు అనే దళారీ వ్యవస్థను సృష్టించాయి. కంపెనీలు విత్తనాలను ఆర్గనైజర్లకు ఇస్తున్నాయి. ఒక్కో ఆర్గనైజరుకు చాలా మంది సబ్ ఆర్గనైజర్లు ఉంటారు. సబ్ ఆర్గనైజర్ల ద్వారా రైతులకు విత్తనాలు అందుతున్నాయి. వీరు కంపెనీల నుండి కమిషన్లు పొందడమే కాకుండా రైతులను అనేక రూపాల్లో దోపిడీ చేస్తున్నారు.

కాంట్రాక్టు ఫార్మింగ్ చట్టం, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ చట్టం, సీడ్ కంట్రోల్స్ ఆర్డర్సు ప్రకారం కంపెనీలు రైతులతో ఒప్పందాలు చేసుకోవాలి. దీనివల్ల రైతుకు వ్యవసాయం గిట్టుబాటు కావడమే కాకుండా భద్రత లభిస్తుంది. కాని కంపెనీలు వ్యవహారమంతా ఆర్గనైజర్లకు అప్పగించాయి. ఇది భారీ పెట్టుబడితో కూడిన పంట. ఎకరాకు రెండు లక్షల రూపాయల పెట్టుబడి అవుతుంది. బ్యాంకులు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రు. 75 వేల రుణం ఇవ్వాలి. కాని 15-20 వేలకు మించి ఇవ్వడం లేదు. దీంతో రైతులు రుణం కోసం ఆర్గనైజర్లపై ఆధారపడు తున్నారు. ఆర్గనైజర్లు మేలో రుణం ఇవ్వడం ప్రారంభిస్తారు.

నవంబర్‌లో రైతులు పత్తిని మార్కెట్ (ఆర్గనైజర్ల)కు ఇస్తారు. కాని రైతులకు జూన్ వరకూ డబ్బులు ఇవ్వరు. అంతేకాదు తమ డబ్బులకు జూన్ వరకు వడ్డీవేసి రైతుకు మిగులు దక్కకుండా చేస్తున్నారు. తిరిగి అప్పులు చూపిస్తున్నారు. అప్పు ఇచ్చే సమయంలో రైతుల నుండి ప్రామిసరి నోట్లు రాయించుకుంటున్నారు. అప్పు చెల్లించకపోతే భూములను స్వాధీనం చేసుకుంటారు. అప్పుతీర్చే వరకు రైతులతో బలవంతంగా సీడ్ పత్తినే వేయిస్తున్నారు.

రైతులు పండించిన విత్తనాలలో 8 శాతం విత్తనాలను తరుగు పేరుతో తీసుకుంటున్నారు. క్వింటాలు విత్తనాలకు కంపెనీలకు రెండు రు. లక్షల పైనే వస్తున్నా రైతుకు లక్ష రూపాయలు ఇవ్వడం లేదు. కేవలం 40 వేలు మాత్రమే ఇస్తున్నారు.

ఈ విధంగా కంపెనీలు చట్ట విరుద్ధంగా ఏటా వెయ్యి కోట్ల వ్యాపారం చేస్తున్నాయి. కాని జిల్లా అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. రైతుకు – కంపెనీకి మధ్య ఒప్పందం జరిగేలా చూడాలి. ఈ ఒప్పందాలను నమోదు చేయాలి. వాటిని అమలు జరిగేలా చూడాలి. కాని ఇక్కడే రాజకీయాలు, అధికార యంత్రాంగం పూర్తిగా ఆర్గనైజర్ల నియంత్రణలో ఉన్నాయి.

ఎప్పటిలాగే రైతులు మేలో పంట వేశారు. పంటకు తెగులు సోకింది. పీకేసి మళ్లీ వేశారు. మళ్లీ తెగులు వస్తూనే ఉంది. మూడు సార్లు వేసినా తెగులు వస్తుంది. దీంతో రైతులు వేసినవి నకిలీ విత్తనాలని నిర్ధారించుకుని కంపెనీలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూన్ చివరిలో తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో రెండు సార్లు ధర్నా ర్యాలీ నిర్వహించారు. రైతుల నుండి ఒత్తిడి పెరగడంతో జెడిఎ హైదరాబాద్‌లోని వ్యవసాయ కమిషనర్‌కు కంపెనీలతో మాట్లాడి నష్టపరిహారం ఇప్పించమని రాసింది. కమిషనర్ కంపెనీల ప్రతినిధులతో రెండుసార్లు సమావేశం నిర్వహించింది. అయినా కంపెనీలు నష్ట పరిహారం చెల్లించడానికి ఒప్పుకోలేదు.

బలమైన ప్రజా ఉద్యమం లేకుండా కంపెనీల మెడలు వంచడం సాధ్యం కాదని తెలంగాణ రైతాంగ సమితి గ్రామ గ్రామాన కమిటీలను ఏర్పరచింది. సెప్టెంబర్ 11న గద్వాలలో జనరల్ బాడి సమావేశం ఏర్పాటు చేసింది. అందులో మండల డివిజన్ కమిటీలను ఎన్నుకుంది.

ఈ సమావేశంలో నాలుగు డిమాండ్లను ఆమోదించింది. అవి 1) కంపెనీలు రైతుకు ఎకరాకు రెండు లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలి. 2) క్వింటాలు విత్తనాలకు లక్ష రూపాయలు ఇవ్వాలి. 3) కంపెనీలు రైతులతో నేరుగా ఒప్పందాలు చేసుకోవాలి. 4) తరుగు పేరుతో 8 శాతం విత్తనాలు తీసుకోవడం నిలిపివేయాలి. ఈ డిమాండ్ల సాధన కోసం 25న గద్వాల పట్టణంలో భారీ దర్నా జరిగింది. దాదాపు 2000 మంది రైతులు హాజరై కంపెనీలపై, ఆర్గనైజర్ల దోపిడీపై తమ ఆక్రోశాన్ని వెల్లగక్కారు.

రైతుల నుండి ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతు సంఘాల ప్రతినిధులతో పాటు కంపెనీల ప్రతినిధులను కూడా చేర్చారు. పంట నష్టాన్ని అంచనా వేయడానికి కంపెనీల ప్రతినిధులు ఎందుకు?

అదే విధంగా రిపోర్టు ఎప్పటిలోగా ఇవ్వాలనే కాలపరిమితి లేదు. కమిటీ ఏర్పడి పది రోజులైనా ఇప్పటికీ సమావేశమే కాలేదు. అంటే

వ్యక్తిని చూసి రాజ్యం స్వరూపాన్ని మర్చిపోదామా?

***ప్రజా ఉద్యమం ద్వారా సాధించుకున్న తెలంగాణ పాలకవర్గాల చేతుల్లోకి వెళ్లడంతో అది కేవలం భౌగోళిక తెలంగాణగానే మిగిలి పోయిందనీ, ప్రజాస్వామిక తెలంగాణ సాధించడానికి ఇంకా పోరాడాల్సిందేననీ అంటున్నారు* సిఎచ్. మధు**

వాస్తవాన్ని వాస్తవంగా మర్చి, సిద్ధాంతాన్ని పక్కన పెట్టి సెంటిమెంట్ ను తలకెత్తుకుని తెలంగాణ విషయంలో ప్రత్యేకంగా ఆలోచిద్దామా? – వ్యక్తిని చూసి రాజ్య స్వరూపాన్ని మర్చిపోదామా? – తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత, ఉద్యమ నాయకుడు తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారని ఎగిరి గంతులేసిన వారు రాజ్యం వాస్తవ స్వరూపాన్ని మర్చిపోయారు. ఆదర్శ తెలంగాణ అవుతుందని, ప్రజాస్వామిక తెలంగాణగా విరాజిల్లుతుందని, సామాజిక తెలంగాణ రూపుదిద్దుకోవాలని ఆశలు అల్లుకున్న వారున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ బంగారు తెలంగాణ అనగానే నమ్మినవారున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా యాబది సంవత్సరాల స్వప్నం సాకారమైన మాట నిజమే. స్వప్నం సాకారం కావడానికి సోనియా ఇచ్చింది, కెసిఆర్ తెచ్చారు అని అందరిలాగా గతితర్కం తెలిసినవారు కూడ నమ్మడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రజా ఉద్యమాల స్వరూప స్వభావాలు తెలిసిన వారు అలా మాట్లాడరు. బియ్యం ఉడకగానే ఇవ్వడం సోనియా ఇవ్వడం కాదు. వండిన అన్నాన్ని వడ్డించడం కెసిఆర్ తేవడం కాదు. ప్రజా పోరాట పరిపక్వత తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావడానికి దోహదం కలిగించింది.

ప్రజలను, ప్రజా ఉద్యమాలను పక్కన పెట్టి, వ్యక్తిగత గ్లామర్ దృష్టితో మాట్లాడే వారితో వచ్చిన చిక్కే ఇది. మానవ పరిణామ క్రమం, మార్క్సిజం, గతితర్కం తెలిసిన వారు కూడ ఇలా మాట్లాడడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎవరు ఇచ్చింది లేదు, ఎవరు తెచ్చింది లేదు. ప్రజలు పోరాడి తెచ్చుకున్నారు. రాజకీయాలలో పెద్ద అనుభవం లేకున్నా – సోనియా గాంధీకి ముందుచూపు ఉంది. తెలంగాణ ఇవ్వకపోతే ప్రజలు తిరగబడతారని, ప్రజలు తిరగబడి తెలంగాణ తెచ్చుకుంటే చంద్రశేఖర రావు నాయకత్వం ఉండేది కాదు. తెలంగాణ ఇలా ఉండేది కాదు.

ఒక పెద్ద రాష్ట్రాన్ని రెండు రాష్ట్రాలు చేసారు అంతే. గీత గీసారు అంతే. తెలంగాణ ఒక రాష్ట్రంగా భారత దేశ పటంలో రూపుదిద్దుకుంది అంతే. దేశంలోని సమస్యలన్నీ కొత్త రాష్ట్రంలో ఉంటాయి. ఏదీ మారదు. దోపిడీ ఉంటుంది. కన్నీళ్లు ఉంటాయి. పోరాటాలు ఉంటాయి. దేశంలోని దుర్వాసలన్నీ తెలంగాణ రాష్ట్రంలో ఉంటాయి. ఈ సత్యం తెలుసు కోకుండా స్వప్నం చెల్లా చెదురయ్యిందంటే ఎలా? ఈ రాజ్యం స్వరూపం తెలిసి కూడ భ్రమలు పటాపంచలయ్యాయంటే ఎలా?

ఒక ఊహాగానంలో, ఒక భ్రమలో మనం బతుకుతున్నాం. ఇతరులను భ్రమలలో ముంచి ముంచి మనం కూడ ఆ భ్రమలకు లోనయ్యాం. మనకు ఈ వ్యవస్థ స్వరూపం తెలుసు. ఈ రాజ్యం గుణం తెలుసు. ఈ దోపిడీ వ్యవస్థ రాజకీయ రంగు – రుచి తెలుసు. తెలిసి తెలిసి భ్రమలకు లోను కావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. భ్రమలకు లోను కావడానికి, స్వప్నాలు కలగడానికి వ్యవస్థ స్వరూపం తెలియక కాదు. తెలుసు. తెలంగాణ రాష్ట్రం కాగానే ఏదో జరిగిపోతుందని, ప్రజలు స్వర్గాన్ని చూస్తారని, రాష్ట్రం పూర్తిగా మారిపోతుందని, ప్రజాస్వామిక తెలంగాణ విరాజిల్లుతుందని, బంగారు తెలంగాణ పూలు పూస్తుందని, అభివృద్ధి నూరు పూలు వేల కాయలు పూస్తుందని ఎలా భావించాం?

మనకు తెలుసు. ఇది పూర్తిగా భౌగోళిక విభజన మాత్రమేనని. తెలంగాణ ఒక రాష్ట్రంగా గిరిగీసుకోవడమని. వేరే మార్పులు ఏమీ జరగవని. తెలిసి ఎందుకు మాట్లాడుతున్నాము? ఎవరో మాట్లాడితే ఇంత రాయాల్సిన అవసరం లేదు. ప్రొఫెసర్ హరగోపాల్ గారన్నారు – స్వప్నం చెల్లాచెదురయిందనీ, వరవరరావు అన్నారు – భ్రమలు పటా పంచలయ్యాయని. ఏ స్వప్నాలు కన్నారు? ఏ భ్రమలు పొందారు? – ఇటువంటి మాటలకు సెంటిమెంట్ మార్క్సిజం కూడ సెంటిమెంట్ కు గురి అవుతున్నాం. ఇది దురదృష్టకరమైన విషయమే. ఎన్ కౌంటర్ లు ఉండకూడదనడం వేరు ఉండవని భావించడం లేరు. ఉండవని ఎలా

ఇది కంపెనీల కనుసన్నలలో కాలయాపన కోసం వేసిన కమిటేనని స్పష్టమవుతుంది. చట్ట విరుద్ధంగా కంపెనీలు వ్యవసాయం చేస్తుంటే చట్టాన్ని అమలు చేయాల్సిన ప్రభుత్వం రైతులతో అగ్రిమెంట్లు చేసుకోవాలని కంపెనీలకు చెప్పలేదు. అదే విధంగా బ్యాంకులు సరిపడా రుణాలు ఇవ్వకపోవడం వల్ల ఆర్గనైజర్లు వడ్డీలతో రైతుల నడ్డి విరుస్తున్నారు. మొదట్లో మార్కెట్లో ప్రభుత్వ పర్యవేక్షణ ఉండేది. వ్యాపారం పెరుగుతున్నా కొద్ది కంపెనీలు ప్రభుత్వాన్ని పక్కకు నెట్టేశాయి. అదే విధంగా ఈ పంటకు రెండు, మూడు సంవత్సరాలకు మించి ఏ నేల సపోర్టు చేయదనే శాస్త్రవేత్తల సూచనలున్నాయి.

కమిటీ ఈ సమస్యలన్నింటిని అధ్యయనం చేయాలని సంఘం భావిస్తోంది. కాని ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోకుండా పంట నష్టం అంచనా వేయడానికే కమిటీని పరిమితం చేసింది. దీని వెనుక ఎంతో కొంత నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకునే ఉద్దేశమే వ్యక్తమవుతోంది. కమిటీ నుండి కంపెనీల ప్రతినిధులను తొలగించాలి. కమిటీకి కాలపరిమితి విధించాలి. ఈ డిమాండ్ల సాధన కోసం రైతాంగం పోరాటాన్ని తీవ్రం చేయాలి. పత్తివిత్తన రైతుల పోరాటానికి అన్ని పంటల రైతులు, రైతు సంఘాలు, ప్రజాస్వామిక వాదులు మద్దతుగా నిలవాలి.

(రచయిత రైతాంగ సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

భావించగలం? రాజ్యం స్వరూపమే ఎన్ కౌంటర్ ల స్వరూపం. రాజ్యం స్వరూపంలోనే ఉంది నిర్బంధం. దోపిడీ రాజ్యం నిలదొక్కుకోవాలంటే నిర్బంధం – ఎన్ కౌంటర్ లు తప్పనిసరి అవుతాయి. ఎందుకూ? – తమ దోపిడీని సురక్షితంగా ఉంచుకోవడానికి.

నాలాంటి వాళ్లం పదే పదే అన్నాం – ఇది భౌగోళిక తెలంగాణ మాత్రమే. మన రాష్ట్రం మనది రాజకీయంగా మన రాష్ట్రాన్ని మనం పరిపాలించటానికి రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తున్నాం – అన్నాం. ఒక వాస్తవం మనకు తెలుసు. అయినా మరిచిపోయాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇతరులు మనను దోచుకోవడం తగ్గుతుంది. మన వాళ్లే మనను దోచుకుంటారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమే తప్ప ప్రత్యేక దేశం కాదు. ప్రత్యేక దేశమైనా ఒరిగేమీ ఉండదు. ప్రపంచీకరణ వలలో అన్నీ రాష్ట్రాలు ఊపిరి పీల్చుకోలేని పరిస్థితులతో ఉన్నాయి. ప్రపంచంలో అన్నీ దేశాలు ప్రపంచీకరణ విషంతో అల్లకల్లోలంగా ఉన్నాయి. తెలంగాణ వచ్చిన తర్వాత కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యారు కానీ గద్దర్ ముఖ్యమంత్రి అయినా పెద్ద మార్పు ఉండదు. ఈ రాజ్యంలోని అన్ని అవలక్షణాలకు ఆర్థిక అంతరాలు – భూమి ఎక్కువ తక్కువలు అగ్రకులాలు అణగారిణ కులాల మధ్య దూరం ఇవి కారణాలు. వీటిని వ్యవస్థ పూర్తిగా మారే వరకు ప్రజా విప్లవం వచ్చి చెత్త అంతా కొట్టుకుపోయే వరకు, కొత్త రాజ్యాంగం ప్రజా రాజ్యాంగం వచ్చేవరకు ఏమి చేయలేం. ఒకటి నిజం, ఈ ప్రపంచాన్ని కార్పొరేట్ సామ్రాజ్యం ఏలుతూ ఉంది. మన దేశం కూడ కార్పొరేట్ సామ్రాజ్య గుప్పిట్లో ఉంది. మన తెలంగాణ రాష్ట్రం అందుకు భిన్నం కాదు. భిన్నంగా ఉండడానికి ఆస్కారం లేదు. హేతుబద్ధంగా ఆలోచించినప్పుడు సిద్ధాంతం అంచనా వేసినప్పుడు కెసిఆర్ పూర్తిగా ధనవంతుల ప్రతినిధి, అగ్రకులాల ప్రతినిధి. కెసిఆర్ ముఖ్యమంత్రి అయితే ఏదో జరుగుతుందని, ఆదర్శం వెల్లివిరుస్తుందని, ప్రజలు శాంతితో విలసిల్లుతారని ఎవరైనా భావిస్తే తప్పు – పైగా ఇప్పుడు తెలంగాణ ప్రజలు రెండు దోపిడీ వర్గాల ఉచ్చులో విలవిలలాడుతున్నారు. ఒకరు, కార్పొరేట్ సామ్రాజ్య దోపిడీ, రెండు, యాబది సంవత్సరాలుగా మనను దోచుకుంటున్న సమైక్యాంధ్ర శక్తుల దోపిడీ (వీరితో కెసిఆర్ ఇంచుమించు రాజీకొచ్చారు. వీరి సాంస్కృతిక సారధి రామోజీరావు ఫిల్మ్ సిటీకెళ్లి కలిసి భోజనం చేసి ఐదు గంటలుండి దోపిడీ లెక్కలను సరి చూసుకున్నారు. ప్రజల వేరు తామంతా ఒకటేననే నిజాన్ని బహిరంగంగా అర్థమయ్యేలా ప్రవర్తించారు). తెలంగాణ వచ్చింది అన్న సంతోషమే కాని ఏమి మిగిలింది? ఇప్పటికీ మీడియా వాళ్ల చేతులలో ఉంది. ఎప్పటికీ ఉంటుంది. సినిమా రంగం, వైద్య రంగం, విద్యారంగం, వ్యాపార రంగం, రియల్ ఎస్టేట్ రంగం అన్నీ వాళ్ల చేతుల్లోనే ఉన్నాయి. ఎప్పుడో చంద్రబాబు వీరితో రాజీపడ్డారు. ఇప్పటికీ రాజ్యంలో సమైక్యాంధ్ర శక్తులదే పెత్తనం. వాళ్ల దోపిడీ మధ్య తెలంగాణ వారికి అవార్డులు, సన్మానాలు, పారితోషికాలు. మనం అల్ప సంతోషులం. వీటితో ఎగిరి గంతులేస్తున్నాం.

ఈ వ్యవస్థ స్వరూపం మనకు తెలుసు. ఇది పూర్తిగా దోపిడీ వ్యవస్థ. ధనవంతుల వ్యవస్థగా మనకు పూర్తిగా తెలుసు. కొందరికి నచ్చకపోవచ్చు కానీ రాజ్యాంగం నీడలోనే ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగాయి. ఈ వ్యవస్థ గుణం తెలిసి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ పట్ల ఆశలు – భ్రమలు ఎలా పెంచుకోగలిగాం? అరువది సంవత్సరాల స్వాతంత్ర్య భారతంలో ఎన్నో పార్టీలను చూశాం. ఎన్నో పరిపాలనలను చూశాం. ఎవరైనా పేదల కొరకు పనిచేశారా? ఏ పార్టీ అయినా ధనికులకు వ్యతిరేకంగా కృషి చేసిందా? ఈ వ్యవస్థను పూర్తిగా మార్చడానికి ఎన్ని పేదల ప్రజాస్వామ్యంగా, శ్రమజీవుల వ్యవస్థగా పోరాటం చేసి మార్చుకునే వరకు ఎవరు ముఖ్యమంత్రి అయినా, ఎవరు ప్రధాని అయినా జరిగే మేలు ఏమీ ఉండదు. ఈ నిజాలన్నీ తెలిసి తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు పట్ల భ్రమలెందుకు పెంచుకున్నాం? పదమూడు సంవత్సరాల ఉద్యమానికి నాయకత్వం వహించాడని, ఉద్యమ నుండి ముఖ్యమంత్రి అయ్యాడని, వివక్షతకు గురి అయిన తెలంగాణను కాదని నాయకుడు కెసిఆర్‌గా భ్రమలు పెంచుకున్నాం. ఇది ఒకరకమైన సెంటిమెంట్. ఇది పోరాటాన్ని, ఉద్యమాలను బలహీనం చేస్తుంది. వ్యక్తిగత సెంటిమెంట్ ప్రజా ఉద్యమాలకు, ప్రజల అభివృద్ధికి అవరోధంగా నిలుస్తుంది. కెసిఆర్ పట్ల వ్యక్తిగత సెంటిమెంట్‌గా భ్రమలు పెంచుకున్నాం. అందుకు కారణాలుండవచ్చు. ఆయన అన్న మాటలు ఆయన పట్ల విశ్వాసం కలిగించవచ్చు. ఒకటి తన పరిపాలనకు మావోయిస్టు ఎజెండాగా పేర్కొనడం, రెండు రైతు అప్పులను మొత్తం మాఫీ చేస్తానని, మూడు బంగారు తెలంగాణ లక్ష్యమని. వీటిని నమ్మాం ఎలా నమ్మగలిగాం? నమ్మటానికి పునాదులున్నాయా?

తెలంగాణ ఉద్యమంలో కూడ కెసిఆర్ పట్ల ప్రజాస్వామ్యవాదులకు వ్యతిరేకత ఉంది. ప్రజాస్వామిక తెలంగాణ రాష్ట్రం కావాలని కొందరన్నారు. ఈ మాటను కెసిఆర్ కాదనలేదు, ఔననలేదు. కెసిఆర్ సారథ్యంలో నడిచిన ఉద్యమం పట్ల ప్రజాస్వామికవాదులకు అప్పుడు సదభిప్రాయం లేదు. ఉద్యమాన్ని వ్యాపారం చేశారని, పొత్తుల ద్వారా దోడిపీ పార్టీలతో చేతులు కలిపారని అప్పుడే మనకు ఒక అంచనా ఉంది. ఇంతా తెలిసి ముఖ్యమంత్రిగా ఆయన మాటలను ఎలా నమ్మగలిగాం. తెలంగాణ రైతుల ఆత్మహత్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం, మావోయిస్టులని ఇద్దరిని పాశవికంగా ఎన్‌కౌంటర్ చేదం, చలో అసెంబ్లీకి అనుమతి ఇవ్వకుండా ఉక్కుపాదం మోపడం, ఆశా వర్కర్ల సమ్మెను సర్కారు బలంతో అణచాలని చూడడంలో కెసిఆర్ అసలు స్వరూపం మనకు పూర్తిగా అర్థమయిపోయింది. కానీ మనం ఆయనను అంచనా వేయడంలో తప్పటడుగు వేశాం. కెసిఆర్ ఈ వ్యవస్థకు ప్రతినిధి, కోటీశ్వరుల పక్షపాతి. కార్పొరేట్ సామ్రాజ్య అనుకూల నాయకుడు. ప్రజాస్వామ్య నినాదాన్ని అధికారం కొరకు వాడుకునే రాజకీయవేత్త. ఆయనపై సెంటిమెంట్ మనకెందుకు?

ప్రజల పక్షాన ఆలోచించే మనం వ్యక్తిగత సెంటిమెంట్‌ను, ఉద్యమ నాయకుడు అనే అభిమానంతో చూడడం, భ్రమలు బద్ధలయ్యాయని భావించడం తప్పు. ఈ దోపిడీ రాజ్యానికి ఆయన ముఖ్యమంత్రి. ఈ దోపిడీ వ్యవస్థలో ఆయన ఒక భాగం. దోపిడీ వ్యవస్థ తనను తాను రక్షించుకోవడానికి ఎన్‌కౌంటర్ చేయగలదు. ఉద్యమాలను, పోరాటాలను ఉక్కుపాదాలతో అణచగలదు. రైతు ఆత్మహత్యల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించి చేతులు దుపులుకోగలదు. ఇది ఈ రాజ్యం స్వభావం.

(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్ట్) వీ

ఆర్టికల్ 371డి ఉల్లంఘనే జి.ఒ. 120

***కోస్తాంధ్ర పాలకుల దోపిడీ స్వభావాన్ని తెలియజేస్తూ, రాయలసీమ ప్రజల, విద్యావంతుల హక్కులను హరించే జి.ఒ. 120 గురించి వివరిస్తున్నారు* మల్లెల భాస్కర్**

'తెలంగాణ ప్రభుత్వం విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తున్నది. చట్టాలన్నా రాజ్యాంగమన్నా తెలంగాణ ప్రభుత్వానికి ఏమాత్రం గౌరవం లేదు. అసలు కోర్టులు చెపుతున్నా వినడం లేదు. ఆంధ్రప్రదేశ్ హక్కులను కాలరాస్తున్నది' అంటూ గత ఒకటిన్నర సంవత్సరంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పనికట్టుకుని దండోరా వేస్తున్నది. దీనికి ఆంధ్ర మీడియా సైతం అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నది. ఈ సంగీతం రాయలసీమలో మరింత శృతిమించి పోయింది. రాయలసీమలో మంత్రులు ప్రతిరోజూ ఏదో ఒక మూలన ఈ విషయాలు మాట్లాడుతూనే ఉంటున్నారు. దొంగా దొంగా అని అరుస్తున్నవాడే అసలు దొంగైనట్లు ఆధారాలతో సహా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్డంగా దొరికి పోయింది. ఆ ఆధారమే జి.ఒ. నెం 120. ఇక సూటిగా అసలు విషయానికొస్తే, ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం మూడు నెలలకే 2014 ఆగస్టు 23నే జి.ఒ. నెం 120ని తెచ్చింది. ఈ జి.ఒ. 2014లో తిరుపతిలో ఏర్పాటైన పద్మావతి మహిళా మెడికల్ కళాశాలలో రాయలసీమ స్థానిక కోటాగా ఉండాల్సిన 85 శాతం సీట్లను నిరాకరించింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ వివక్షత మూలంగా రాయలసీమ ఎంత అన్యాయానికి గురవుతున్నదో కోస్తాంధ్ర ప్రాంతీయ ఆధిపత్యం ఏ స్థాయిలో ఉందో అంచనా వేయడానికి ఇంతకు మించి వేరే ఏ ఆధారం అక్కర్లేదు.

జి.ఒ. నెం. 120 – ఆర్టికల్ 371 (డి)

1969లో వచ్చిన జై తెలంగాణ ఉద్యమం, ఆ తర్వాత వచ్చిన జై ఆంధ్ర ఉద్యమం పర్యవసానంగా ఉమ్మడి ఆంధ్రప్రదేలో ప్రాంతీయ అసమానతలు తగ్గించడానికి, 1973లో 32వ రాజ్యాంగ సవరణ ద్వారా వచ్చినది ఆర్టికల్ 371 (డి). తరువాత దీని ప్రకారమే 1974లో రాష్ట్రపతి ఉత్తర్వులు వెలువడ్డాయి. అట్లా వచ్చినదే జోనల్ వ్యవస్థ. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం స్థానికత, అంటే ఎస్‌వియు పరిధి అయితే ఎస్‌వియు పరిధి జిల్లాలు మాత్రమే స్థానిక ప్రాంతం అవుతాయి. అట్లాగానే ఎయు, ఒయు పరిధిలోని జిల్లాలు మాత్రమే అక్కడ స్థానిక ప్రాంతం అవుతాయి, కాని చాలా విచిత్రంగా తిరుపతి పద్మావతి మహిళా మెడికల్ కళాశాల సీట్ల భర్తీ కోసం తెచ్చిన జి.ఒ. నెం 120లో స్థానికత అంటే పదమూడు జిల్లాల ఆంధ్రప్రదేశ్ అని చెప్పారు. నిజానికి ఈ జి.ఒ. 2014 ఆగస్టు 23నే వచ్చినప్పటికీ ఆ విద్యా సంవత్సరం అమలు చేయడానికి సాహసం చేయలేదు. అందుకు కారణం అప్పుడు జరుగుతున్న రాయలసీమ ఉద్యమం, విభజనానంతరం ఆంధ్రప్రదేశ్ రాజధానిని రాయలసీమలో ఏర్పాటు చేయాలనీ, శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమకు అన్ని రంగాల్లో న్యాయమైన వాటా ఇవ్వాలని ఆందోళన జరుగుతున్న సందర్భమది. ఆ సందర్భంలో ఈ జి.ఒ.ను అమలు చేస్తే ఎక్కడ సీమ ప్రజల నుండి తిరుగుబాటు వచ్చి అసలుకే మోసం వస్తుందోననే భయంతో అమలు చేయకుండా జి.ఒ. నెం 120ని రహస్యంగా దాచి పెట్టారు. ప్రభుత్వ వెబ్‌సైట్లో కూడా పెట్టలేదు. చివరికి రాజధానితో సహా ఏది రాయలసీమలో పెట్టకుండా అమరావతి దాని చుట్టూ పెట్టినా, సీమ ప్రజల్లో పెద్దగా ప్రతిఘటన రాకపోవడంతో చాలా వ్యూహాత్మకంగా ఈ విద్యా సంవత్సరం అమలు చేసి సీమ విద్యార్థులు డాక్టర్లు అయ్యే అవకాశాన్ని అడ్డుకున్నారు. ఆ మెడికల్ కళాశాలలో మొత్తం 150 ఎంబిబిఎస్ సీట్లకు గాను కన్వీనర్ కోటగా ఉండే 127 సీట్లలో స్థానిక కోట 85 శాతం ప్రకారం రాయలసీమ విద్యార్థులకు 108 సీట్లు రావాలి.

దొంగ చాటుగా జి.ఒ. అమలు

తిరుపతి ఎస్.వి యూనివర్సిటీలో ఆగస్టు 5న మెడికల్ ఓపెన్ కేటగిరి సీట్లకు కౌన్సిలింగ్ ప్రారంభమైంది. సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు సాంకేతిక కారణాలు చూపుతూ కౌన్సిలింగ్‌ను ఆపేసిన ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ అధికారులు తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సిలింగ్ ప్రారంభించారు. కౌన్సిలింగ్ ఆగిపోవడానికి ముందు పద్మావతి మహిళా మెడికల్ కాలేజీలో 46 ఓపెన్ కేటగిరి సీట్లు ఉన్నట్లు చూపిన అధికారులు తిరిగి కౌన్సిలింగ్ ప్రారంభమైనాక ఆ సీట్లు భర్తీ అయిపోయాయని చేతులెత్తేశారు. అవి మా రాయలసీమ కోటా సీట్లు కదా మాకు కాకుండా ఎవరికిచ్చారు అని రాయలసీమ విద్యార్థులు, తల్లిదండ్రులు నిలదీసేసరికి రకరకాల సాకులు చెప్పారు. చివరికి అధికారులు భారీగా పోలీసులను మోహరించి జి.ఒ. 120 ని అమలు చేశామని అసలు విషయాన్ని బయట పెట్టారు. స్వయాన రాష్ట్రమంత్రులే రంగంలోకి దిగి ఈ వ్యవహారాన్ని నడిపించారని తెలియడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చేయగా దౌర్జన్యంగా తల్లిదండ్రులను పోలీసుల ద్వారా బెదిరించారు. ఈ విషయాన్ని ఏ ఒక్క పత్రిక కాని, న్యూస్ చానల్ గాని పూర్తి స్థాయిలో బయట పెట్టలేదు. విభజన చట్టాన్ని గాని రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 (డి)ని గాని ఉల్లంగించిందని చెప్పలేదు. రాయలసీమకు జరిగిన ఈ ద్రోహం అందరికి తెలిసే లోపే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కావాలని తిరుపతిలో మునికోటి ఆత్మహత్య అంటూ అదే పెద్ద హాట్ టాపిగ్గా మారింది. రాయలసీమకు ఏ మాత్రం సంబంధం లేని ఈ హోదా విషయాన్ని అన్ని పార్టీలు భుజానికి ఎత్తుకుని ఊరేగాయి తప్ప, ఏ ఒక్క పార్టీ కూడా దీనిపై స్పందించలేదు. జి.ఒ. 120 విషయం తెలిసి కూడా తెలియనట్లు నటించాయి.

ఒక వైపు రాయలసీమలోని మేధావులు, కొన్ని రాయలసీమ సంఘాలు 120కి వ్యతిరేకంగా ఆందోళనలు చేసినా ప్రత్యేక హోదా శబ్ద కాలుష్యంలో ఏటికీ ఎదురీతలా అయింది తప్ప రాయలసీమ ప్రజానికానికి అది తాకలేదు. ఈ జి.ఒ.ను సవాల్ చేస్తూ రాయలసీమ విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించగా, రాజ్యాంగాన్ని, విభజన చట్టాన్ని ఉల్లంగిస్తూ తెచ్చిన 120 జి.ఒ. ఎంతమాత్రం చెల్లదని తిరిగి పద్మావతి మెడికల్ కాలేజీ సీట్లకు రీ కౌన్సిలింగ్ జరపాలని ఆదేశించింది. ఈ తీర్పు ఆగస్టు 19న వచ్చింది. ఈ లోపే అక్కడున్న 108 రాయలసీమ కోటా సీట్లను ఆంధ్రా విద్యార్థులకు కట్టబెట్టిన ప్రభుత్వం ఆగస్టు 31 వరకు రీ కౌన్సిలింగ్ జరపకుండా మౌనంగా ఉండి తరువాత హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఆంధ్ర ప్రాంత పక్షాన సుప్రీం కోర్టుకు వెళ్లింది. చివరికి సుప్రీం కోర్టులో కూడా చాలా తెలివిగా వ్యవహరించి తన పంతాన్ని నెగ్గించుకుంది. సెప్టెంబర్ 7న సుప్రీం కోర్టులో కేసు విచారణకు రాగా ఆరోజు విచారణకు హాజరు కాకుండా సెప్టెంబర్ 21 వరకు సాగ తీసింది. చివరికి విచారణకు వచ్చిన ఆ రోజున సుప్రీం కోర్టులో చాలా తెలివిగా వాదనలు వినిపించింది. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం సెప్టెంబర్ 30 వరకు అడ్మిషన్లు అయిపోవాలని కాబట్టి ఇక 9 రోజులే గడువుంది. రీ కౌన్సిలింగ్ జరపలేమని డ్రామా ఆడింది.

పెద్ద మనిషిలా పంచాయితీ చేసిన సుప్రీంకోర్టు చివరికి కోర్టుకొచ్చిన 8 మంది విద్యార్థులకు మాత్రమే ఎన్ఆర్ఐ కోటాలో సీట్లివ్వాలని రాయలసీమ కోటా సీట్లు పొందిన ఆంధ్రా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తీర్పునిచ్చి వచ్చే విద్యా సంవత్సరం రాయలసీమ కోటాను యథావిదిగా కొనసాగించాలని చెప్పింది. ఇలా హైకోర్టు సుప్రీంకోర్టు రెండు చోట్లా 120 జి.ఒ.ను రద్దు చేస్తూ తీర్పు వచ్చినా రీ కౌన్సిలింగ్ జరగలేదు. రాయలసీమ విద్యార్థులకు సీట్లు రాలేదు. ప్రభుత్వం అడుగడుగునా రాయలసీమకు వ్యతిరేకంగానే ప్రవర్తించింది తప్ప ఎక్కడ కూడా రాయలసీమ హక్కుల పట్ల కనీస మర్యాదగా కూడా వ్యవహరించ లేదు. ఈ జి.ఒ.కు వ్యతిరేకంగా సెప్టెంబర్ మొదటి వారంలో రాయలసీమ లోని ప్రతి పట్టణంలో రాయలసీమ విద్యార్థులు ఆందోళనలు చేశారు.

ఆ సందర్భంలోనే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. ఏ ఒక్క శాసన సభ్యుడు కూడా ఈ జిఒ పై నోరు విప్పలేదు. కనీసం ఒక్క పార్టీ రాష్ట్ర కమిటీ కూడా దీనిపై నోరు విప్పలేదు. కేవలం రాయలసీమ జిల్లాలలో మాత్రమే నామమాత్రంగా స్థానిక లీడర్లతో మాట్లాడించారు. రాయలసీమకు సంబంధంలేని ప్రత్యేక హోదా కోసం రాష్ట్రమంతా పాదయాత్రలు, ఆందోళనలు చేసే పార్టీలు రాయలసీమకు సంబంధించిన విషయంలో మాత్రం కేవలం రాయలసీమలోనే కార్యక్రమాలు చేస్తాయి. అది కూడా చాలా నామమాత్రంగా చిన్న గొంతుతో. ఏ పార్టీ అధికారంలోకి రావాలన్న ఆంధ్రలో ఉండే 123 సీట్లే కీలకం కాబట్టి రాయలసీమలో ఎటు మా గుంపు ఓట్లకు సీట్లకు ఏ ఇబ్బంది ఉండదులే అనే అవకాశవాదంతో, బరోసాతోనే వ్యవహరిస్తు న్నాయి తప్ప ప్రజాస్వామికంగా న్యాయ బద్దంగా వ్యవహరించలేదు. పర్యావసానంగా రాయలసీమ రోజు రోజుకు పీకల్లోతు సంక్షోభంలోకి కూరుకుపోతూ నీళ్లు, నిధులు, విద్యా, ఉద్యోగాల్లో తన న్యాయమైన వాటాను పొందలేక పోతున్నది. జి.ఒ. 120 రాజ్యాంగ వ్యతిరేకమని తెలిసి కూడా ప్రభుత్వం మొండిగా దాన్ని అమలు చేసింది. చివరికి స్లైడింగ్ ద్వారా 18 సీట్లు మిగలగా వాటిని కూడా రాయలసీమ విద్యార్థులకు ఇవ్వడానికి నిరాకరించి, 18లో 10 సీట్లను మాత్రమే రాయలసీమ విద్యార్థులకు ఇచ్చి మిగిలిన 8 సీట్లు ఎన్ఆర్ఐ కోటాలో అమ్ముకుంది. ప్రభుత్వం ఆదాయాన్ని మాత్రమే చూసుకుంది తప్ప రాయలసీమ విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోలేదు. ముఖ్యమంత్రితో సహా అన్ని పార్టీల అగ్ర నాయకులందరూ రాయలసీమ ప్రాంతానికే చెందినా 90 మంది సీమ విద్యార్థులు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా డాక్టర్లు అయ్యే అవకాశాన్ని కోల్పోయారు.

ఇప్పటికే శ్రీశైలం జలాశయంలో కనీస నీటి మట్టం 854 అడుగులు ఉండనక్కరలేదని జి.ఒ. నెం. 69 తెచ్చి రాయలసీమ ప్రజలు పంటలు పండించుడానికి వీల్లేకుండా చేసిన ఆంధ్రా వాళ్లు ఇప్పుడు జి.ఒ. 120తో సీమ విద్యార్థులు వైద్య విద్యనూ చదవకుండా చేతిలోని పుస్తకాలను గుంజుకున్నారు.

తెలంగాణ ప్రభుత్వం విభజన చట్టాన్ని ఉల్లంగిస్తుందని ప్రతి రోజూ ఓవరాక్షన్ చేసే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన రాష్ట్రంలోని రాయలసీమ హక్కులను హరిస్తూ విభజన చట్టాన్నే కాక తను ప్రమాణం చేసిన భారత రాజ్యాంగాన్నే ఉల్లంగిస్తున్నా ఆంధ్రా మీడియా మాత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లాంటి అమాయక ప్రభుత్వం ఈ భూమి మీద మరెక్కడా లేదన్నట్లు ప్రచారం చేస్తున్నది. ఇప్పటికే తరతరాలుగా వారసత్వ అన్యాయానికి, వివక్షకు గురవుతున్న రాయలసీమ ప్రాంతంపై కనీసమైన జాలి చూపకుండా ఉన్న హక్కుల్నీ గుంజుకుంటే కొత్త హక్కుల్ని అడక్కుండా ఉంటారులే అనే వ్యూహంతో వ్యవహరిస్తున్నారు. రాయలసీమకు మెడికల్ సీట్ల విషయంలో జరిగిన ద్రోహానికి కేవలం చంద్రబాబు ప్రభుత్వం ఒక్కటే కారణం అనుకోవడానికి వీల్లేదు. వై.ఎస్. జగన్‌తో సహా అన్ని పార్టీలు, అందరి నాయకుల పాత్ర ఉంది. సిపిఐ సిపిఎం పార్టీలు కుడా ఇందుకు మినహాయింపు కాదు.

ఇక ఇటీవల రాయలసీమ కోసం చిన్న ధర్నాలు చేస్తూ తమ కాషాయ రంగుకు రాయలసీమ రంగు పులుముకోడానికి రాయలసీమపై ప్రేమను ఒలకబోస్తున్న బిజెపి చాలా దుర్మార్గపు పాత్ర పోషిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వంలో బిజెపి భాగస్వామిగా ఉంది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఉండేది బిజెపి నాయకుడే. జిఒ 120 వచ్చింది కూడా ఆ మంత్రిత్వ శాఖ నుండే. అందుకే రాయలసీమలో ఉండే బిజెపి నాయకులూ, వారి అనుబంధ విద్యార్థి విభాగం ఎబివిపి కాని ఎక్కడా జిఒపై స్పందించలేదు.

అంతిమంగా తేలుతున్నదేమిటంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విభజన చట్టాన్ని ఉల్లంగించడం ద్వారా తెలంగాణకు అన్యాయం జరిగితే దాన్ని అడ్డుకోవడానికి అక్కడ ఒక ప్రభుత్వం ఉంది. అట్లాగే తెలంగాణ ఉల్లంగిస్తే ఆంధ్రప్రదేశ్‌కు ఒక ప్రభుత్వం ఉంది. కాబట్టి గత ఒకటిన్నర సంవత్సరంగా రెండు ప్రభుత్వాలు వారి హక్కులను కాపాడుకుంటూ వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్ట ఉల్లంగనకు పాల్పడి రాయలసీమ హక్కులకు భంగం కలిగిస్తే ఎదుర్కోవడానికి కచ్చితంగా రాయలసీమకు ఒక ప్రభుత్వం అవసరం కదా! అంటే ఈ ప్రాంతీయ వివక్షకు, అధిపత్యానికి విరుగుడు ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర సాధనలోనే ఉందని అర్థం అవుతున్నది.

(రచయిత రాయలసీమ విద్యార్థి వేదిక కన్వీనర్,
ఎకనామిక్స్ రీసర్చ్ స్కాలర్, యోగివేమన యూనివర్సిటీ, కడప) వీ

ప్రజా సమస్యలు పట్టని అమరావతి ఆర్భాటం

ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణంలో స్థానిక ప్రజల ప్రయోజనం కన్నా రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాలకే ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని అంటున్నారు **చిమ్మె జాన్ బర్నబాస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దాదాపు 300 కోట్ల రూపాయల ఖర్చుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన రాజధాని అమరావతి నిర్మాణ ప్రారంభోత్సవ సభ (శంకుస్థాపన) కార్యక్రమం నిర్వహించారు. ఇది ఆశ్చర్య చకితులను చేయడమే కాకుండా, అదో సంకల్ప సభగా మాత్రమే కాకుండా దసరా పండుగ రోజున జరపడం ఒక పెద్ద నాటకం లేదా సినిమాను తలపింపజేస్తున్నది. ఒకపక్కనేమో రాష్ట్రం లోటుబడ్జెట్‌లో ఉందనీ, ఖజానా ఖాళీ అయిందనీ, ఖర్చుల కోసం మాత్రం ప్రభుత్వం ఓవర్ డ్రాఫ్ట్ తీసుకున్నది.

ఇప్పటికినీ నూతన రాజధాని ప్రాంతంలో 6 లేదా 7 గ్రామాల ప్రజలు తమ పంట భూములను (3 కార్లు పండేవి) ఇవ్వడానికి ఇష్టపడని పరిస్థితుల్లో, ఈ రాజధాని శంకుస్థాపన సభ ఆర్భాటం చేయడం ద్వారా, మెజారిటీ ప్రజలు తనవైపే ఉన్నారనే సంకేతాన్ని ప్రజలకు, ప్రపంచ దేశాలకూ, మిగతా రాష్ట్రాలకూ ఇవ్వాలని చంద్రబాబు తాపత్రయ పడుతున్నాడు. ఇదంతా ఒక సినిమా నిర్మాణం లాగా ఉంది తప్ప వాస్తవ పరిస్థితులు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయి.

ప్రభుత్వ కార్యక్రమానికి లక్ష నుంచి 2 లక్షల మందిని సమీకరించాలని ముఖ్యమంత్రి భావించడం పెద్ద సమస్యేమీ కాదు. ఎలాగూ పొదుపులక్ష్మి మహిళలూ, తనకు అనుకూలంగా ఉన్న పార్టీ కార్యకర్తలూ, ఎంఎల్‌ఎలు, ఎంపిలు అందరూ వస్తారు కాబట్టి సభ విజయవంతమవ్వొచ్చు. అయితే, దానికిస్తున్న ప్రాధాన్యత, మీడియా ప్రచారం, సినిమా షూటింగ్‌ను తలపించే ఏర్పాట్లు, భారీ ఖర్చుతో కూడిన ప్రచార సామాగ్రి ఇదంతా ప్రజల సొమ్ము నుంచి ఖర్చు చేస్తున్నది తప్ప తెలుగుదేశం పార్టీ స్వంత ఖర్చు కాదు, అది స్వంత కార్యక్రమమూ కాదు.

చంద్రబాబునాయుడుకున్న ఈ మీడియా ప్రచార ఆర్భాటం వల్లనే కదా, గోదావరి పుష్కరాలలో దాదాపు 30 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. పోలీసుల అతి మర్యాద వల్లనే కదా ప్రజలకు అసౌకర్యం కలిగినది. అయినప్పటికినీ ముఖ్యమంత్రికి, అధికారులకు జ్ఞానోదయం కాలేదు.

అంతే కాకుండా చంద్రబాబు నాయుడు అమరావతి ప్రజా రాజధాని అంటూ గొప్పలు చెప్పుకుంటున్నాడు. అంటే ప్రజల భాగస్వామ్యంతో తాను రాజధానిని నిర్మిస్తున్నానని చెప్పుకుంటున్నాడు. ఇదొక డ్రామా. ఆకాశంలో హెలికాప్టర్లు, విమానాలు, పూల వర్షాలు, మొత్తం విజయవాడ నగరంలోని పెద్ద, పెద్ద హోటల్లలో వివిధ దేశాల ప్రతినిధులందరికీ బస ఏర్పాట్లు, రంగురంగుల విద్యుద్దీపాల అలంకరణలు, భారీ కటౌట్‌లు సింగపూర్, జపాన్, మలేషియాలను సంతృప్తి పరచడానికే నన్నది సుస్పష్టం. ముఖ్యంగా, ముఖ్యమంత్రి ప్రైవేట్ కార్పొరేట్ సంస్కృతిని ఆంధ్రప్రదేశ్‌లో విస్తృత పరుస్తున్నాడనే విషయం అర్థమవుతుంది. కార్యక్రమానికి వచ్చే అతిథులకందరికీ ఆతిధ్యం కేటరింగ్‌కు అప్పజెప్పాడంటే, ప్రభుత్వ యంత్రాంగం కన్నా, కార్పొరేట్ వ్యాపార సంస్థల పైననే ముఖ్యమంత్రికి ఎక్కువ నమ్మకమున్నదని తెలుస్తున్నది. పేరుకు ప్రజా రాజధాని నిర్వహణంతా ప్రైవేట్ సంస్థలకు, సినిమా డైరెక్టర్లకు అప్పజెప్పారు. ఇది పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకం. ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఒ) కూడా ఒక ప్రైవేట్ నిర్వహణా సంస్థగా మార్చి వేయబడిందటే, వీరికి ప్రజల పట్ల, పౌర సంస్థల పట్ల ఏమాత్రం విశ్వాసం లేదని అర్థమవుతున్నది. రాజ్యాంగ వ్యవస్థలో నివసిస్తున్న మనం ముఖ్యమంత్రి రాజ్యాంగ వ్యవస్థను అవమానపరుస్తున్నట్లు భావించవలసి వస్తున్నది.

అమరావతి శంకుస్థాపన కార్యక్రమానికి కెసిపి సిమెంట్ వారు లక్ష ఇటుకలను ఉచితంగా (ఉదారంగా) ఇచ్చినట్లు మంత్రులు ప్రకటించారు. అదేదో ఒక పెద్ద ధాతృత్వంగా భావించాలని ప్రభుత్వం భావిస్తున్నది. అంతే కాకుండా, వివిధ మారు మూల గ్రామాల ప్రజలు, వారి వారి ఇళ్ల నుంచి ఇటుకలనూ, వివిధ నదుల నుంచి జలాన్ని కలశాలలో తీసుకుని, వాటికి పూజలు చేసి, ఊరేగింపు నిర్వహించి, ఆయా గ్రామాల పేర్లు వాటిపై రాసి, ఈ కార్యక్రమానికి తీసుకుని రావాలని ముఖ్యమంత్రే స్వయంగా ప్రకటించడం, వివిధ వర్గాల మత విశ్వాసాలను కూడా ముఖ్యమంత్రి అవహేళన చేస్తున్నట్లున్నది. ఎందుకనగా హిందూ మత విశ్వాసాల ప్రకారం కలశాలనూ ఆయా గ్రామాలలో పూజలు నిర్వహించి, తీసుకుని రావాలని అనడం, మిగిలిన మత విశ్వాసాలను బహిరంగంగానే తిరస్కరించినట్లే. భారతదేశ లౌకికవాద విలువలకూ, రాజ్యాంగ ప్రమాణాలకు ఈ ముఖ్యమంత్రి, మంత్రి వర్గ సహచరులు తిలోదకాలు ఇచ్చినట్లవుతున్నది. అన్ని మతాలకు సమానమైన ప్రామాణికతను పాటించాలని భారత రాజ్యాంగం చెపుతుంటే, అందుకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నాడు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని మెప్పించడానికి కాబోలు ఈ తతంగమంతా. అంతేకాకుండా, తానూ హిందూత్వ వాదినని భారతీయ జనతా పార్టీ పెద్దల ఎదుట మెప్పుకోసం కావచ్చు చంద్రబాబు నాయుడు ప్రయత్నమంతా. లేదా, బిజెపి–టిడిపి అలియన్స్ మరింత పటిష్టం చేసుకోవడానికి కావచ్చు. ఏది ఏమైనప్పటికినీ, ఇదంతా ప్రజాస్వామిక – రాజ్యాంగ వ్యతిరేకం.

ఏదో విధంగా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను రాబట్టి, తద్వారా రాజధాని నిర్మాణం చేపట్టి, మిగతా నిర్మాణాలను సింగపూర్, జపాన్ కంపెనీలకు అప్పజెప్పాలని భావిస్తున్నది. ఆచరణలో మాత్రం తెలుగుదేశం పార్టీ అనుకూల కార్పొరేట్ కంపెనీలకు కూడా కొద్దో, గొప్పో భాగస్వామ్యం కల్పించవచ్చు. దీనిని స్విస్ చాలెంజ్ పద్ధతిలో చేపడతారని వారి వర్గీయులే ప్రచారం చేస్తున్నారు.

నేటి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నేపథ్యంలో, ఏ విదేశీ కంపెనీ కూడా తమ స్వలాభాపేక్ష కోసం తప్ప ఇక్కడి ప్రజల అభ్యున్నతి కోసం రాదు. సంవత్సరానికి మూడు కార్లు పండే పంట భూములను భూ సమీకరణ పేరుమీద సేకరించి వారికి లాభాల పంటలు పండించేందుకై ప్రభుత్వం ధారాదత్తం చేస్తున్నది. ఇక్కడ భూమితో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నది. ఇక్కడ భూమి ఇచ్చిన వారికి ఏమాత్రం వాణిజ్య స్థలం ఇస్తారు? లేదా వారి పిల్లలకు ఏమైనా ఉద్యోగాలిస్తారా? అన్నది ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇవ్వవలసి ఉంది. ఒక్కసారి ప్రభుత్వం భూమిని ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పిన తర్వాత, ప్రజల పాత్ర ఏమాత్రం ఉండదు. వారికి ప్రశ్నించే అవకాశమే లేదు. (రాదు).

రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఎ) కే ప్రభుత్వం 40 శాతం వాటా భూమి ప్రభుత్వం పొందడానికి కృషి చేస్తున్నది. (అంటే ఎవరి భూమిలో ఎవరు ఎవరికి వాటాలు ఇవ్వాలి?) భారతదేశంలో (బహుశా ప్రజాస్వామిక దేశంలో ఎక్కడ కూడా) ఈ విధంగా ఎక్కడ కూడా మొత్తం రాష్ట్ర రాజధాని నిర్మాణం ఒక కార్పొరేట్ కంపెనీకి అప్ప జెప్పిన చరిత్ర లేదు. విదేశీ సంస్థలకు అప్పజెప్పిన చరిత్ర అసలే లేదు.

అస్సెండాజ్-సింగ్ బ్రిడ్జ్, సెంబ్ క్రాఫ్ డెవలప్‌మెంట్ అనే సింగపూర్ సంస్థలు రంగంలోకి వచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వారి వెనక ఎవరెవరి ప్రయోజనాలు, ఎలా ఉన్నాయో భవిష్యత్తులో అర్థమవుతుంది. అమరావతి నగర శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేసిన ప్రసంగం ప్రజలకు నిరాశనూ, నిస్పృహలకు గురిచేసింది.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడునూ, తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావులనూ ఒకే వేదికపై కలుసుకోవడం తనకు ఆనందంగా ఉందని తెలియజేయడమే ప్రధానంగా కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు ఉపన్యాసం సాగింది. అదే విషయాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ కూడా తెలియజేశాడు. ప్రధాన మంత్రి చేసిన దాదాపు 20 నిమిషాల ప్రసంగంలో ఎక్కడ కూడా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా గురించి గానీ లేదా ప్రత్యేక ప్యాకేజీ గానీ ప్రకటించలేదు. కనీసం భవిష్యత్తులో ఏమేమి చేస్తారో కూడా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. బాధ్యతగా కూడా భావించలేదు. ప్రజలకిచ్చిన హామీలను (ఎన్నికల సందర్భంగా) కూడా గౌరవించి ప్రస్తావించలేదు. కేవలం గత ప్రభుత్వం (కాంగ్రెస్) ఎపి స్టేట్ రిఆర్గనైజేషన్ యాక్ట్ 2014ను ప్రస్తావిస్తూ, దానిలోని అంశాలన్నీ నెరవేర్చుతామని మాత్రమే మాట్లాడి, అది ఎప్పుడు ప్రారంభిస్తారో, ఎపటిలోగా పూర్తి చేస్తారో కూడా మాట్లాడలేదు. చంద్రబాబు నాయుడు కూడా తెలంగాణకు హైదరాబాద్ ఉంది, కర్ణాటక రాష్ట్రానికి బెంగుళూరు ఉంది, తమిళనాడుకు చెన్నై ఉంది కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అలాంటి ఆదాయ వనరున్న నగరం లేదంటూ, అలాంటి దాన్ని నిర్మిస్తున్నామని, అందుకు మీ అందరి సహకారం కావాలని అడిగాడు తప్ప, మా రాష్ట్రానికి, ఈ సభ సందర్భంగా, ప్రధాన మంత్రి ఒక ప్రకటన చేయాలని కానీ లేదా ఒక హామీ ఇవ్వాలని కానీ గట్టిగా అడగలేదు లేదా కనీసం ఆ ప్రస్తావన చేయలేదు. అమరావతి శంకుస్థాపన కార్యక్రమమే ఈవెంట్ మెనెజ్‌మెంట్‌గా కోనేరు మురళీ కృష్ణ (కెఎంకె) కంపెనీకి అప్పజెప్పిన చంద్రబాబు, దానిని గొప్పగా చేయడానికి దాదాపు రు. 300 కోట్లు ఖర్చు చేశారని వార్తలు వస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగానైనా కనీసం ప్రధానమంత్రి నుంచి రాబట్ట లేకపోయారు. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాలు కలసి పనిచేసుకోవాలన్న నరేంద్రమోడీ, అదే బీహార్ రాష్ట్ర ఎన్నికల ప్రచార సభలో 1 లక్షా 30 వేల కోట్ల ప్యాకేజీని ఆ రాష్ట్రానికి ప్రకటించారు. మరి అదెలా సాధ్యపడిందో బిజెపి, టిడిపి మిత్ర పక్షాలే సమాధానమివ్వాలి.

ఉత్తరాంధ్ర, రాయలసీమ రెండూ కలిసి 7 జిల్లాలు (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు) వెనుకబడి ఉన్నాయనీ, ఇప్పుడిప్పుడే అక్కడి ప్రజలు ఆందోళనలు చేపడుతున్నారనేది వాస్తవం. అది చంద్రబాబు నాయుడుకు తెలియనిది కాదు. వారి పోలీస్-ఇంటలిజెన్స్ వ్యవస్థ అంత బలహీనంగా ఏమీ లేదు. రాయలసీమలోనైతే రోజూ ఏదో ఒక రూపంలో ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. మరి వాటి పట్ల చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా సమాధానం చెప్పాల్సి ఉంది. అది ఈ సభా ముఖంగానైతే మరీ బాగుండేది. కనీసం అలాంటి ప్రయత్నం చేయలేదు. ఇది విచారకరం, బాధకరం. ప్రజల మధ్య ఆందోళన తీవ్రమై భవిష్యత్తులో ప్రభుత్వానికి ఒక సవాలుగా మారవచ్చు. అప్పుడు శాంతి భద్రత'ల సమస్యగా చూసే బదులు ఇప్పుడే దానిని పరిష్కరించే ప్రయత్నం చేస్తే కొంతలో కొంతనైనా మెరుగవ్వచ్చు.

కొత్త రాజధానికి పంట భూములు దానమిచ్చిన రైతులకు పదాభి వందనాలు అంటూ ప్రత్యేకంగా చెపుతున్న ముఖ్యమంత్రి మరి ఆ పంట పొలాలలో పనిచేసి, రోజువారీ పొట్టనింపుకునే కూలీల, వాటిపై ఆధారపడి జీవించే రైతుల పరిస్థితి భవిష్యత్‌లో వారి జీవనానికి భరోసా ఈ ప్రభుత్వం ఏమివ్వలేదు. అంతే కాకుండా, అక్కడ పండించే పంటల నుంచి ఉత్పత్తి అయ్యే ధాన్యం, పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, అంతే మోతాదు మరోచోట ఎక్కడ నుండి ఉత్పత్తి చేస్తారో ఈ ప్రభుత్వం సమాధానమిచ్చి ఉంటే బాగుండేది. ఒకవేల ఆ పంటల ఉత్పత్తి చేపట్టకపోతే (ప్రత్యామ్నాయంగా) అప్పుడు ఈ జనాభాకు తగిన ఆహారం అందక ఆహార సంక్షోభం తలెత్తదా? ఇక్కడ పండే పంట భూములను విడిచిపెట్టి, ఎక్కడి నుండో దిగుమతి చేసుకునే దౌర్భాగ్య స్థితికి, ఈ ప్రభుత్వం ఈ ప్రజలను దిగజార్చింది. ఇది వాస్తవం! కాబట్టి ఏ గ్రామాల ప్రజలైతే భూ దానం చేశారో ఆ పంట పొలాల మీద ఆధారపడి జీవించే కష్ట జీవులకు (ముఖ్యంగా రెక్కల కష్టంతో జీవించే వారికి) ప్రత్యామ్నాయ జీవన మార్గం ఈ ప్రభుత్వం చూపాలి. లేకపోతే ఆ ప్రజలు తీవ్రమైన ఆందోళనా పథంలో పయనించ ప్రయత్నిస్తారు.

ఉమ్మడి రాష్ట్రం విడిపోతున్న ప్రకటన వచ్చిన సమయంలో (బహుశా 2013 చివరలో) 5 లక్షల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేసిన చంద్రబాబు నాయుడు, అందుకు తగ్గట్లుగానైనా ఇప్పుడు అధికార హోదాలోనైనా అడగకపోవడం, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసే పరిస్థితి లేకపోవడం, పైగా కేంద్ర దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి జీవించాలనే వైఖరికి రావడం సమాఖ్య వ్యవస్థకే అగౌరవం. కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై జస్టిస్ ఆర్ఎస్. సర్కారియా కమిషన్ సిఫారసులనైనా ఈ ప్రభుత్వాలు గుర్తించుకోకపోవడం విచారకరం. కేంద్రం-రాష్ట్రం పరస్పరం ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉండాలనీ, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలలో అనవసర జోక్యం చేసుకోరాదనేది సారాంశం. అంతే కాకుండా కేంద్ర జాబితాలోని అంశాలను పూర్తి చేసి, ఆ తర్వాత పన్నుల రూపంలో రాష్ట్రాల నుంచి వసూలు చేసుకోవాలి. (నేషనల్ హైవేస్ అథారిటి ఆఫ్ ఇండియా ఉదాహరణ) ఇవి ముఖ్యమంత్రికి తెలియని విషయాలు కావు.

ప్రధాన మంత్రి భారత పార్లమెంట్ ఆవరణంలోని మట్టినీ, యమునా

రిషితేశ్వరి ఆత్మహత్య - మూలాలు

విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల ఆత్మహత్యలకు కారణం అటు విద్యాలయాల బాధ్యతారాహిత్యం, ఇటు ప్రభుత్వాల పర్యవేక్షణా వైఫల్యం అనీ, మొత్తం మీద సమాజంలో పతనమవుతున్న విలువలనీ అంటున్నారు **షేక్ కరిముల్లా**

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జూలై 14న ఆర్కిటెక్చర్ పిజి ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని రిషితేశ్వరి ఆత్మహత్య చేసుకున్నది. ఈ అమానవీయ సంఘటనపై విచారణకు ప్రభుత్వం నియమించిన బాల సుబ్రహ్మణ్యం కమిటి వెల్లడించిన విషయాలు హాస్టల్లో ర్యాగింగ్ దారుణంగా ఉందని, ర్యాగింగ్ జరుగుతున్న తీరు నరకం చూపిస్తుందని జూనియర్ విద్యార్థులను – సీనియర్ విద్యార్థులు క్యాట్‌వాక్, ర్యాంప్‌వాక్ చేయించి ఫోటోలు, వీడియోలు తీసి వాట్సప్‌లో సీనియర్ మగ విద్యార్థులకు పంపేవారని, అంతే కాకుండా సీనియర్ మగ విద్యార్థులకు జూనియర్ విద్యార్థినులతో ఫోన్లు చేయించి మాట్లాడించేవారని, ఎదురు తిరిగితే వారిని ఒత్తిడికి గురిచేసి వేధించేవారని కమిటి పేర్కొంది. సీనియర్ మగ విద్యార్థులను ప్రేమించమని రిషితేశ్వరిని సీనియర్లు వేధించారని ఈ ప్రేమ వేదింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిందని కమిటీ నిర్ధారించింది. రిషితేశ్వరి ఆత్మహత్యకు ఆర్కిటెక్చర్ కాలేజీ ప్రిన్సిపల్ బాబూరావు కూడా కారణమని ఫ్రెషర్స్‌డే పార్టీలంటూ హాయ్‌లాండ్‌లో విందులు ఏర్పాటు చేసి, ప్రిన్సిపల్ ఒళ్లు మరిచి సభ్యత సంస్కారంను కూడా మరచి డాన్సులు చేయడం బహిరంగంగా వెల్లడైన విషయాలను కమిటీ తెలిపింది. బాబూరావు అండదండలతో విశ్వ విద్యాలయంలో అరాచకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు వెల్లడించింది. ప్రిన్సిపల్ ప్రవర్తన ఏమాత్రం సరిగా లేదని ఆయన చొరవతో కాలేజీలోకి మద్యం బాటిల్స్ సైతం వచ్చేవని వివరించింది.

రిషితేశ్వరి తండ్రి ఎం. మురళీకృష్ణ ర్యాగింగ్‌పై కళాశాల యాజమన్యానికి ఫిర్యాదు చేసినా స్పందించలేదని కమిటీ స్పష్టం చేసింది. ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికిచ్చిన నివేదికలో కమిటీ పేర్కొన్నప్పటికీ అతనిని అరెస్ట్ చేయనందుకు గుంటూరులో స్వాతంత్ర్యం వచ్చి 69 ఏళ్లు అవుతున్నా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ఈ ఘటనపై ప్రభుత్వ ఉదాసీన వైఖరిని నిరశిస్తూ విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవం రోజున నల్ల బ్యాడ్జీలు, రిబ్బన్లు నోటికి కట్టుకుని నిరసన తెలిపారు. 'ఆడపిల్లలకు రక్షణ కల్పించలేని స్వాతంత్ర్యం మాకొద్దు' అని నినదించారు. తాజాగా స్వాతంత్ర్య దినోత్సవం రోజు రిషితేశ్వరికి న్యాయం జరగడం లేదని రిషితేశ్వరి కుటుంబానికి ఎక్స్ గ్రేషియా ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని, విద్యార్థులలో విష సంస్కృతిని ప్రోత్సహించిన ప్రిన్సిపల్‌ను వదిలిపెట్టడం ఏమిటని? ప్రభుత్వం, పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ న్యాయం జరగకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు.

ఈ తాజా పరిణామాలపై అసలు విశ్వ విద్యాలయంలో ఏమి జరుగుతున్నది. విద్యాలయాలు ఎలా ఉండాలి? దేశానికి దిశ, దశ నిర్దేశించే విశ్వ విద్యాలయాలు ఇంత ఘోరంగా కునారిల్లుతున్నాయా? పరిశోధనలు ఏవి? గొప్ప సాంఘిక విప్లవాలు, ఉద్యమాలు వెల్లివిరిసి నాయకత్వం వహించిన మన విశ్వ విద్యాలయాల ఘన చరిత్ర ఏమైపోయింది? ఇంత దుర్భర పరిస్థితులు విశ్వ విద్యాలయాలలో ఉండడం ఆ జాతికి, దేశానికి ఏమాత్రం మంచిది కాదు. ఇది ఆ వ్యవస్థ పతనానికి సంకేతం కాదా? దీనికి మూలాలు ఎక్కడ ఉన్నాయి. ఈ విష బీజాలను, వృక్షాలను పెకలించలేమా? అనే ప్రశ్నలు ఈ సమాజం నేడు మన ముందుంచినది.

ఒకనాడు నేను నాగార్జున విశ్వ విద్యాలయంలో (1993–95 బ్యాచ్ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్) చదువుకుంటున్న రోజులు. ఆ రోజుల్లో ర్యాగింగ్ సంస్కృతి లేదు. విశ్వవిద్యాలయం పచ్చని చెట్లతో, కాలుష్య రహితంగా నిండు కుండలా ఉండేది. ఆచార్యులు, విద్యార్థులకు మధ్య

నది నీరు తీసుకొని రావడం గొప్పగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రచారం చేయడం చాలా విడ్డూరంగా ఉంది. మహాకవి శ్రీశ్రీ రాసిన నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను కవితకు సారూప్యంగా నేను సైతం ప్రజా రాజధానికి పుట్టమన్ను తెచ్చాను అని ప్రధానమంత్రి చెప్పడం చాలా విడ్డూరం. మొత్తం మీద సభలో ప్రధానమంత్రి తానొక ప్రధానమంత్రిగా ప్రవర్తించలేదు. కేవలం ఆంధ్రప్రదేశ్–తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య సయోధ్య కుదుర్చడానికి వచ్చినట్లు, వారిరువురినీ చూసి, ఈయన చాలా సంతోషిస్తున్నట్లు ప్రకటించడం చాలా హాస్యాస్పదం. విభజన చట్టంలో లేకుండా కేవలం పార్లమెంట్‌లో నాడు హామీ పొందిన ప్రత్యేక హోదా ఎలా అమలు చేస్తారో వివరించ లేదు. నాడు రాజ్య సభలో వెంకయ్య నాయుడు, అరుణ్ జైట్లీ మాట్లాడిన విషయాలు మాట మాత్రంగానైనా ప్రధాన మంత్రి నోటి నుంచి గానీ లేదా వెంకయ్యనాయుడు నోటి నుంచి కానీ రాకపోవడం విడ్డూరం, విచారకరం.

ఆంధ్రప్రదేశ్ పట్ల ప్రధాన మంత్రి చూపించిన వివక్షత పట్ల ప్రజలు తీవ్రమైన ఆందోళన, నిరాశ, నిస్పృహలకు గురయ్యారు. ముఖ్యంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజలు త్వరలోనే దాని పట్ల నిరసన'లు వ్యక్తం చేసే పరిస్థితి ఉన్నది. 1953 నుంచి 1956 వరకూ కర్నూలు రాజధానిగా ఉండగా దానిని నేడు అమరావతి'లో ఏర్పాటు చేయడం ప్రజలు ఒకవైపు నిరసనలూ, వ్యతిరేకత ప్రదర్శిస్తున్నారు. దీనినైనా పట్టించుకొని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం వద్ద ఒత్తిడి తీసుకుని రావలసిన అవసరమున్నది. లేకపోతే ఉత్తరాంధ్రలోనూ, రాయలసీమలోనూ త్వరలోనే ప్రత్యేక రాష్ట్ర నినాదం ఊపందుకున్నా ఆశ్చర్యపోనక్కర లేదు.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి) వీ

ఈ దేశం గురించి, దేశ భవిష్యత్తు గురించి చర్చలు జరిగేవి. పరిశోధనలు జరిగేవి. 1994 డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ కాన్ఫరెన్స్‌ను మూడు రోజులపాటు ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ నిర్వహించింది. ఈ కాన్ఫరెన్స్‌కు డి. నరసింహారెడ్డి లాంటి ఉద్దండ ప్రొఫెసర్లు, పలు ప్రాంతాల నుంచి ఆర్థికవేత్తలు హాజరైనారు. అప్పుడే 1991 నుంచి దేశం అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల మీద వాడివేడి చర్చలు జరిగినాయి. ఎక్కువ మంది ప్రపంచీకరణను వ్యతిరేకించారు. అప్పుడే ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ నేను సమర్పించిన పత్రంను వేదికపై చదివి వివరిస్తే నరసింహారెడ్డి గారితో పాటు పలువురు నన్ను అభినందించారు. 'నా దగ్గర పిఎచ్‌డి చేయి' అని నన్ను ప్రోత్సహించిన ఆయన మాటలు, ఆ సదస్సులో ఆయన మాట్లాడిన విషయ పరిజ్ఞానం, ఆ జ్ఞాన సంపద అప్పటి విద్యార్థి లోకాన్ని ఎంతో ఉత్తేజపరిచాయి. ఇంకనూ మిగతా డిపార్ట్‌మెంట్లలో కూడా ఇదే వాతావరణం ఉండేది.

ఈ గత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటూ అసలు ఇప్పుడు నాగార్జున విశ్వ విద్యాలయం ఎలా ఉంది? ఇటువంటి చెడు సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయి? స్వయంగా చూసి విద్యార్థులతో మాట్లాడి అచటి అనుభవాలతో ఏదైనా రాయాలి అనే కుతూహలంతో విశ్వ విద్యాలయంలోకి అడుగు పెట్టాను. విశ్వ విద్యాలయంలో చాలా భౌతిక మార్పులు గోచరించాయి. దూర విద్య కోసం నిర్మించిన భవనం రాజ దర్బారును మరిపించింది. అటుగా లైబ్రరీవైపు నడుస్తూ విద్యార్థులను పలకరిస్తూ విషయ సేకరణ చేసుకుంటూ నడిచాను. నేను చదువు కుంటున్న రోజుల్లో లైబ్రరీ ముందున్న దిమ్మెల మీద అక్కడి పచ్చటి గడ్డి మీద మేము కూర్చొని జ్ఞాన సంబంధమైన, తత్వ చింతనతో కూడిన చర్చలు చేసుకునే వాళ్లం. అదే స్థలంలో ఇప్పుడు చదువుకుంటున్న విద్యార్థుల గుంపు ఒకటి నాకంట పడింది. వారి సమీపంలో కాసేపు కూర్చున్నాను. ప్రతి ఒక్కరి చేతిలో పెద్ద స్క్రీన్ గల ఆండ్రాయిడ్ ఫోన్స్ ఉన్నాయి. కొద్దిమంది ఈ ప్రపంచంతో సంబంధం లేనంతగా నెట్‌లో ఫేస్‌బుక్, చాటింగ్, వాట్సప్, ట్విట్టర్‌లను వాచ్ చేస్తూ కనిపించారు. కొద్దిమంది 'బాహుబలి', 'శ్రీమంతుడు' లాంటి ఇటీవల కొత్తగా రిలీజ్ అయిన సినిమాల గురించి చర్చించుకుంటున్నారు. దాదాపు అర్ధగంట గడిచినా ఇదే సీన్. ఔరా! ప్రపంచీకరణ ఈ 25 ఏళ్లలో మన జాతిని, మన సంస్కృతిని, మనదేశ భవిష్యత్తును ఎంత నిర్వీర్యం చేసింది? రిషితేశ్వరి ఆత్మహత్యకు గల సామాజిక మూలం నాకు దొరికింది అనుకుంటూ నిట్టూర్పుతో భారంగా అక్కడి నుంచి కదిలాను.

నేటి యువతపై ఈనాటి సినిమాల ప్రభావం ఎంత ఉందో పై సంఘటనను బట్టి అర్థం చేసుకోవచ్చు. నేటి సనిమాలు హీరో ప్రేమ పేరుతో అమ్మాయిల వెంటపడి వేధిస్తూ లొంగతీసుకోవడాన్నే ప్రేమగా చూపిస్తూ నేటి యువత ఆలోచనను కలుషితం చేస్తున్నాయి. రిషితేశ్వరి లాంటి మరెందరో అమ్మాయిలను బలితీసుకుంటున్నాయి. స్త్రీకి వ్యక్తిత్వం లేకుండా మార్కెట్ సరుకుగా, అమ్మకపు వస్తువుగా సెక్స్ సింబల్‌గా చూపిస్తున్నారు. నైతిక విలువలను నశింపచేసే అశ్లీల సినిమాలకు సెన్సార్ బోర్డు అడ్డుకట్ట వేయాలి. ఇంటర్‌నెట్, సినిమా, టివీలలో మహిళలను అశ్లీలంగా చూపించే విధానాన్ని ప్రభుత్వాలు పూర్తిగా నిషేధించాలి. క్లబ్, పబ్, మద్యం అమ్మకాలకు పర్మిషన్లు ఇస్తూ ఇలాంటి విష సంస్కృతిని పెంచి పోషిస్తున్న ప్రభుత్వ చర్యలను ప్రజలు, పౌర సమాజం నిలువరించాలి. ప్రభుత్వాలు చట్టాలు చేసి చేతులు దులుపుకుంటే సమస్యలు పరిష్కారం కావని చరిత్ర నిరూపించింది. ఉదాహరణకు నిర్భయ చట్టం, జ్యోతిసింగ్ కోసం చట్టం తెచ్చారు. కాని స్త్రీల మీద అత్యాచారాలు ఆగాయా? నేటికి బాధితులకు న్యాయం జరిగిందా? ఆచరణ ఏది? అశ్లీలత ద్వారా యువతను పెడదారి పట్టించే విష సంస్కృతిని పారదోలాలి. ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా ఏమీ చేయవని తేలిపోయింది. కాబట్టి మేధావులు, మొత్తం పౌర సమాజం మౌనం వీడి ఒక నైతిక బాధ్యతగా ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి. రిషితేశ్వరి లాంటి అమ్మాయిలు ఇంకను ఎవ్వరు బలి కాకుండా మహిళలు స్వేచ్ఛగా బతికే ఉత్తమ సమాజ నిర్మాణం జరగాలి. అందుకు పునాదిగా ఉత్తమ విద్యా వ్యవస్థ నిర్మాణం జరగాలి. అసలు విశ్వ విద్యాలయాలు ఎలా ఉండాలి? విద్యకు ఉన్న సామాజిక పాత్ర ఏమిటి? అనేది ఇప్పుడు చర్చిద్దాం.

విద్య అనేది ఆ సమాజం తాలుకు లక్ష్యాలను సాదించుకోవడానికి ఒక చైతన్యవంతమైన సాంఘిక చర్య. విద్య సామాజిక పరివర్తనకు ఒక సాధనం. విద్య మానవ జీవితాన్ని పరిపూర్ణం చేసే ఒక సామాజిక ప్రక్రియ. శాస్త్రీయ దృక్పథంతో సత్యశోధన ద్వారా సామాజిక విలువలను రూపొందించుకుని సాధించుకోవడం విద్య ప్రధాన లక్ష్యం. జ్ఞానం మానవ జాతిని శక్తివంతుల్ని చేస్తుంది. అది సమాజంలోని పరిణామాలు, వైరుధ్యాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. భారత రాజ్యాంగంలో దేశంలో సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయాన్ని సాధించడం లక్ష్యంగా రాసుకున్నాము. దీనికి విద్యను సాధనంగా చేసి ప్రాధాన్యతను ఇచ్చినప్పటికీ పాలకులు స్వార్థంతో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వారి పాలనకు అనుగుణమైన గుమస్తాలను, అధికారులను (ఐఎఎస్, ఐపిఎస్) తయారు చేసే ఆనాటి మెకాలే విద్యా విధానమే నేటికీ కొనసాగడంలో ఆంతర్యం ఏమిటి? మనదేశ చరిత్ర, సంస్కృతి, జీవన విధానం, వాతావరణం, భౌగోళిక అంశాలు, భాషలు మొదలగు వాటి ఆధారంగా నేటికీ మన విద్యా వ్యవస్థ రూపుదిద్దుకోకపోవడానికి కారణం ఏమిటి? ఇంగ్లిష్ మోజులో ఆ చదువులతో ధన దాహంతో కన్న తల్లి లాంటి భరత మాతకు ద్రోహం చేసి విదేశాలకు ఊడిగం చేయడానికా? (బానిసలుగా) ఈ దాహం సుసంపన్నమైన మన భాషల్ని, సంస్కృతిని మొత్తం జాతిని నిర్వీర్యం చేసే ప్రమాదకర స్థాయికి నేడు చేరుకుంది. కాబట్టే రిషితేశ్వరి, నిర్భయ లాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

ముఖ్యంగా మూడు దశాబ్దాలుగా ప్రపంచీకరణ అవసరాలకు అనుగుణంగా మనదేశ విద్యను సరుకుగా మార్చే ప్రక్రియ వేగంగా జరుగుతున్నది. విద్య సరుకుగా మారిపోయింది. మన దేశీయ విశ్వ విద్యాలయాలు కనీస సౌకర్యాలు కూడా లేక కునారిల్లుతుంటే, మరోవైపు ప్రైవేట్ విశ్వ విద్యాలయాలు, విదేశీ విశ్వ విద్యాలయాలు పుట్టుకు వచ్చి బడుగు బలహీనులకు, సామాన్యులకు విశ్వ విద్యాలయాల చదువులు దూరం చేశాయి. ఏదేశం అయినా తన ప్రజలకు నాణ్యమైన విద్యను అందించకుంటే ఆ దేశ పురోగమనం ఊహించలేం. వీటన్నింటి మూలంగా తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లు నేడు పాశ్చాత్య పోకడల విష సంస్కృతి పెచ్చరిల్లుతున్నది. గమ్యం లేని, అర్థం లేని చదువులు విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నాయి. ఎన్నో ఆశలతో, ఆశయాలతో విశ్వ విద్యాలయాలలోకి అడుగుపెడుతున్న రిషితేశ్వరి లాంటి అమాయక విద్యార్థులను బలితీసుకుంటున్నాయి. ఇప్పటికైనా కళ్లు తెరిచి విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి మన దేశీయ అవసరాలు తీర్చగలిగే, స్త్రీలను గౌరవించే ప్రజాతంత్ర విద్యా విధానం ఏర్పరచడమే రిషితేశ్వరికి మనమిచ్చే నివాళి.

(రచయిత ఉపాధ్యాయులు)

వీ

విద్యను దూరం చేసే డిటెన్షన్ విధానం

పోటీ పరీక్షల పేరుతో విద్యార్థులను యంత్రాలుగా మారుస్తున్న వ్యవస్థను, విద్యను వ్యాపార మయం చేసి మార్కులే కొలమానంగా చేస్తున్న విధానాన్ని ఎండగడుతున్నారు రుద్రవేణి

ఓ తరగతి గదిలో కొంతమంది విద్యార్థులకు పరీక్ష జరుగుతూ ఉంటుంది. ఆ పరీక్షలో పాస్ అయితే మంచి ఉద్యోగం వస్తుంది. అంత కీలకం ఆ పరీక్ష. ఫెయిల్ అయితే ఆ ఉద్యోగం దక్కదు. దీంతో విద్యార్థులందరూ ఎంతో శ్రద్ధగా పరీక్ష రాస్తున్నారు.

ఆ సమయంలో ఓ రైతు కాపాడండంటూ అక్కడకు పరుగెట్టుకుని వస్తాడు. అక్కడ ఉన్న వారందరిని చూసి 'నన్ను కాపాడండి, నా పంటను పురుగులు నాశనం చేయబోతున్నాయి. ఇంకో రెండు రోజుల్లో పంట చేతికి వస్తుంది. నా కష్టాలు తీరుతాయి కాపాడండి' అని అడుగుతాడు. దీంతో అక్కడున్న వారంతా ఆశ్చర్యపోతూ 'మేము ఏం చేయగలం' అని అడుగుతారు.

'ఇక్కడ చాలా మంది ఉన్నారు. మీరు తలచుకుంటే ఆ పురుగులను తరిమి కొట్టగలరు. ఆ పురుగులు గుంపుగా వచ్చి నా పంటపై వాలి తినేస్తున్నాయి. ఈ లోపు ఏదైనా పెద్ద శబ్దం చేస్తే అవి వెళ్లిపోతాయి. మీరంతా కలిసి పెద్దగా అరిచినా, శబ్దం చేసినా నా పంట కాపాడినవారు అవుతారు' అని వారితో రైతు అంటాడు.

కాని ఇక్కడ పరీక్ష జరుగుతుంది. మేము రాలేం అని అక్కడ ఉన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు అంటారు.

ఈ మాటలకు రైతు చాలా కంగారు పడుతూ 'ఆ పురుగుల గుంపు వచ్చేస్తుంది. నాకు సహాయం చేయండని' అన్ని తరగతులకు తిరుగుతూ వేడుకుంటాడు. దీంతో అక్కడ విద్యార్థులు పరీక్ష రాయాలా? రైతు సమస్యను తీర్చాలో అర్థం కాక సందిగ్ధంలో పడతారు. అక్కడున్న ఉపాధ్యాయులు కూడా ఏమి చెప్పలేరు.

రైతుకు ఏమి తోచక అక్కడే కుప్పకూలిపోతాడు. ఆ రైతు పిరిస్థితిని చూసిన కొంతమంది విద్యార్థులు పరీక్ష పోతేపోయిందని అతనికి సహాయం చేయడానికి వెళ్తారు. వెళ్లిన అందరూ పెద్ద శబ్దం చేసి పురుగులను తరిమి కొడతారు. దీంతో రైతు ఆనందపడతాడు. వాళ్లందరికి కృతజ్ఞతలు చెప్పుకుంటాడు. కానీ వెళ్లిన ఆ విద్యార్థులు పరీక్ష పోయిందని దిగులుపడతారు. మరికొంత మంది విద్యార్థులు పరీక్ష బాగా రాసి బయటకు వెళ్లడానికి సిద్దంగా ఉంటారు.

అప్పుడు ప్రధానోపాధ్యాయులు అక్కడకు వచ్చి పరీక్ష పూర్తి అయిందని ప్రకటిస్తారు. బయట ఉన్నవాళ్లందరికీ ఉద్యోగాలు వచ్చాయని, పరీక్ష రాసిన వాళ్లకీ ఉద్యోగాలు రాలేదని చెపుతాడు. దీంతో అక్కడున్న విద్యార్థులందరూ ఆశ్చర్యంగా ఒకరినొకరు చూసుకుంటారు. అక్కడేం జరుగుతుందో ఎవరికీ అర్థం కాదు.

అక్కడున్న వారి ఆలోచనలను అర్థం చేసుకున్న ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఓ సమస్య మీ ముందుకు వస్తే దానికి మీరు ఎలా స్పందిస్తారో, ఎలా పరిష్కరిస్తారో, మీరు ఏం చేస్తారో మేం తెలుసుకున్నామని అదే మీకు పెట్టిన పరీక్ష అని చెపుతారు. ఓ మనిషికి విషయ పరిజ్ఞానం అవసరమేనని, మానవత్వం ఇంకా అవసరమని వాళ్లకు చెపుతారు. ఆ మానవత్వం, ఆ మానసిక పరిపక్వత అవసరమని, అవి ఉన్నప్పుడు ఏ ఉద్యోగమైనా చేయగలమని చెపుతారు. దాని కోసం పరీక్ష పెట్టామని అందులో కొంత మంది విద్యార్థులు పాస్ అయ్యారని చెపుతారు. ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ విషయాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఇంకా మీ అధ్యయనాన్ని కొనసాగించాలని సూచిస్తారు. అసలు విషయాన్ని గ్రహించిన అక్కడ విద్యార్థులందరూ పరీక్షా ఫలితాన్ని ఎంతో సానుకూలంగా ఆహ్వానిస్తారు.

చైనాలో విప్లవం విజయవంతం అయిన తర్వాత విద్యా వ్యవస్థలో ప్రవేశపెట్టిన ఈ ఆరోగ్యకరమైన పరీక్షలు, డిటెన్షన్ విధానంపై విస్తృత చర్చ జరుగుతున్న ఈ తరుణంలో ఈ కథ అవసరం చాలా ఉంది.

ప్రాథమిక పాఠశాలల్లో నాన్-డిటెన్షన్ విధానాన్ని రద్దు చేసి డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే కేంద్రం ఆలోచనకు చాలా మద్దతు దొరుకుతుంది. పిల్లల సామర్థ్యాన్ని గుర్తించడానికి, పెంచడానికి పరీక్షలే మేలు అనే ఆలోచనలోనే మేధావులు, సామాన్యులు కూడా ఉన్నారు. ప్రభుత్వం తనకు అనుకూలమైన అభిప్రాయాలను కూడగట్టుకోవడానికి సకల ప్రయత్నాలు చేస్తుంది. విద్యను ప్రైవేటీకరించాలనే యోచనలో ఉన్న ప్రభుత్వ వ్యూహంలో పెద్దలు చిక్కుకుపోకుండా కొంచెం ఆగి ఆలోచించాల్సిన అవసరం ఉంది.

డిటెన్షన్ విధానమంటే అన్ని తరగతుల పిల్లలకు పరీక్షలు నిర్వహించి అందులో పాస్ మార్కులు వస్తేనే పై తరగతులకు ప్రమోట్ చేస్తారు. ఇప్పటి వరకూ నాన్-డిటెన్షన్ విధానం అమల్లో ఉంది. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో రతగతి వరకూ గల పిల్లలకు పరీక్షల్లో పాస్, ఫెయిల్‌తో సంబంధం లేకుండా పై తరగతులకు ప్రమోట్ చేస్తున్నారు. అయితే ఈ విధానం వల్ల పిల్లలు చదవడం లేదని, నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఇప్పటి ప్రభుత్వం వాదన.

అయితే ఇటీవల ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లల సామర్థ్యం తెలుకునేందుకు గత ఏడాది ఏప్రిల్ 22, 23న రాష్ట్ర స్థాయిలో మూడు, ఐదు, ఎనిమిది తరగతుల పిల్లలకు తెలుగు, ఇంగ్లిష్, గణితం పాఠ్యాంశాలపై పరీక్షలు నిర్వహించారు. బిఇడి, డిఇడి విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి వారే స్వయంగా పరీక్షలు నిర్వహించారు. జిల్లాల వారీగా పరీక్షలు నిర్వహించి విద్యా శాఖ ఆయా ఫలితాలను వెల్లడించింది.

దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. మేజార్టీ జిల్లాల్లో ఏ గ్రేడ్ సాధించగా, మిగతా జిల్లాల్లో బి ప్లస్ గ్రేడ్‌లను సాధించారు. అలాగే మూడు, ఐదు తరగతుల్లో మేజార్టీ బి ప్లస్, కొన్ని జిల్లాలో ఏ గ్రేడ్‌ను సాధించారు. ప్రభుత్వమే స్వయంగా పరీక్షలు నిర్వహించి, వెల్లడించిన ఫలితాలివి.

అయినా విద్యా ప్రమాణాలు తగ్గిపోవడానికి కేవలం పిల్లలనే బాధ్యులను చేస్తున్న ప్రభుత్వం, విద్యను ప్రోత్సహించడానికి ఇప్పటి వరకూ ఏం చేసిందో తెలియంది కాదు. జిల్లాలో ఎక్కడ చూసినా శిథిలావస్థలో ఉన్న పాఠశాలల భవనాలే దర్శనమిస్తున్నాయి. వసతి, తాగునీటి, మరుగుదొడ్లు లేని పాఠశాలలు ఎన్నో ఉన్నాయి. పాఠశాలల్లో సదుపాయాలు, ఉపాధ్యాయుల కొరత, ఆసక్తి కలిగించని బోధన, అధికారులు ఎన్ని సార్లు మొరపెట్టుకున్న మారని స్థితి. ఏది ఏమైనా సామాన్యులకు చదువును దూరం చేసే విధానాలనే ప్రభుత్వం అవలంభిస్తుందనేది వాస్తవం. వాటి గురించి కాస్త విపులంగా పరిశీలిస్తే.

మౌలిక వసతుల కొరత

గ్రామాలల్లో ఉండే చాలా పాఠశాలల్లో మౌలిక వసతులే లేవు. తాగడానికి నీరు లేదు. ఉండడానికి గదులు లేవు. మరుగుదొడ్లు లేవు. ఆటలకు తావే లేదు. శిథిల భవనాల్లో, వరండాల్లో, చెట్ల కింద బోధన జరుగుతుంది. ఉపాధ్యాయుల కొరత ఉండనే ఉంది. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ఫలితం మాత్రం ఉండడం లేదని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణం. అక్కడ పిల్లలు పాఠశాలలకు వెళ్లినా అవి మూసే ఉంటాయి. ఉన్న ఒక ఉపాధ్యాయుడు విధులకు సరిగా హాజరుకారు. పర్యవేక్షణ లోపం, దూరం పిల్లల పాలిట శాపంగా మారింది. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో చదువు తర్వాత పిల్లల ప్రాణాలకే గ్యారంటీ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పాఠశాలలకు వెళ్లాలనే ఆసక్తి పిల్లల్లో ఉంటుందా?

పాఠశాలల విలీనం

ప్రభుత్వం గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలను కుదించే చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే నెపంతో ప్రతి మండలంలో కనీసం ఐదు పాఠశాలల వరకు విలీనం చేసేశారు. ఎక్కడో దూరంగా ఉండే వేరే పాఠశాలల్లో విలీనం చేయడంతో ఆ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అంతంత దూరాలకు పంపించడం మా తరం కాదంటూ తల్లిదండ్రులు చేతులెత్తేస్తున్నారు. ఆ పాఠశాలల కుదింపును కొన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం తను అనుకున్నది చేసుకుపోతుంది.

విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడానికి గల కారణాలు తెలిసి కూడా పెంచడానికి ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదు. ఒకటి రెండు కార్యక్రమాలు పెట్టినా అవి మొక్కుబడిగా సాగుతున్నాయి. దీంతో ప్రైవేట్ విద్యకు పట్టం కట్టడానికే ప్రభుత్వ కృషి చేస్తుందనే విషయం స్పష్టమవుతుంది.

వాస్తవ విరుద్ధమైౖ పాఠాలు

మన పాఠ్య పుస్తకాల్లో వాస్తవ జీవితంతో పొంతనలేని అంశాలు ఉన్నాయి. ఇప్పటికీ సూర్యుడు సైన్సో? దేవుడో? అనే సందిగ్ధంలోనే మన పాఠాలు మనల్ని ఉంచుతున్నాయి. పిల్లల్లో ఉండే జిజ్ఞాసను, సృజనాత్మకతను చంపేసే ఆ పాఠాలు పిల్లలను ఎటువైపు నడిపిస్తున్నాయి. రోజువారి జీవితంలో తారసపడే విషయాలు మన పుస్తకాల్లో ఉండవు. రాత్రి ఎందుకవుతుంది? పగలు ఎందుకవుతుంది? వర్షం ఎలా కురుస్తుంది? ఎండ ఎలా కాస్తుంది? ఇవే పిల్లలకుండే సందేహాలు. ఈ సందేహాలను తీర్చే పాఠాలు కావాలి. కంటికి కనబడని పుస్తకాల్లో పాఠం అయినప్పుడు ఏ విద్యార్థికి విషయంపై ఆసక్తి ఉండదు. మంచి విషయాలు కొన్ని ఉన్నా వాటిని తెలియజేయాలనే తపన తాపత్రయం మన బోధనలో కనపడదు. ఏదో మొక్కుబడిగా, యాంత్రికంగా సాగే ఒక ప్రక్రియగా మన విద్యా విధానం సాగుతుంది.

పరీక్షా విధానం

పరీక్షలే ప్రామాణికంగా తీసుకున్నా, మన పరీక్షా విధానంలో అంత పస ఉందా? ఎడో తరగతిలోనూ, పదో తరగతి నుంచి మిగతా అన్నింటికి డిటెన్షన్ విధానమేగా అమలవుతుంది. మరి ఈ పరీక్షలతో సాధిస్తున్నదేమిటి? కాపీ కొట్టి కొంత మంది, గండం గడిస్తే చాలన్నట్లు కొంతమంది పరీక్షలు రాస్తున్నారు. కేవలం పాస్ అవడం కోసమే చదువుతున్నారు. తర్వాత ఆ చదివినది వదిలివేయడం మనందరికీ తెలియని విషయమేమి కాదు. ఈ కారణం వల్లే డిగ్రీలు, పోస్ట్ గ్రాడ్యుయేషన్లు పూర్తి చేసిన అనేక మంది చదువుకున్న నిరక్షరాస్యులుగా మిగులుతున్నారు. ఇలాంటి పరీక్షలే కదా ఒకటో తరగతి నుంచి పెడదాం అంటున్నారు. దీని వల్ల ఏం ప్రయోజనం ఉంటుంది. అయినా పరీక్షల బూచిని చూపించి బెదరగొట్టి చదివించాలనుకుంటే వాళ్లల్లో ఉండే సృజనాత్మకతను దెబ్బతీయడమే అవుతుంది. ఉన్నత భవిష్యత్‌ను చూపించి అటువైపుగా నడిపించాల్సిన మనం భయపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాం.

ఇలాంటి పరిస్థితుల్లో డిటెన్షన్ విధానాన్ని అవలంబిస్తే బలహీన వర్గాల పిల్లలు చదువుకు పూర్తిగా దూరమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పుడిప్పుడే విద్యవైపు బుడిబుడి అడుగులు వేస్తున్న బాలికలు, ఎస్‌సి, ఎస్‌టి బాలలు పాఠశాలలకు ఆమడ దూరంలోనే నిలిచిపోతారు. ఆ బాలలకు చదువు అందని ద్రాక్షగా మారుతుంది. బహుశా ప్రభుత్వ ధ్యేయం కూడా ఇదే కావచ్చు.

కలహం జరగకుండా న్యాయం పుట్టదన్నట్లు.. చర్చ ఎలాగూ మొదలైంది. ఈ చర్చను మరింత విస్తృతం చేయాలి. మన పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం నిర్వర్తించాల్సిన బాధ్యతను గుర్తింపచేయాలి, డిమాండ్ చేయాలి. ఇప్పుడున్న విధానాన్ని ఇలానే అవలంబిస్తూ పిల్లలు ఎటువంటి పరీక్షలనైనా ఎదుర్కొనేలా మన విద్యను మరింత పదునెక్కించాలి. అంటే మన ఆలోచన పరిధి 'డిటెన్షన్–నాన్ డిటెన్షన్' అనే దగ్గర మాత్రమే ఆగకుండా ఇంకొంచెం ముందుకు వెళ్లాలి. మనకున్న పరిధి, పరిస్థితుల మధ్యనే విద్యా ప్రమాణాలను పెంచడానికి మరింత అన్వేషణ జరగాలి. శ్రమ విలువను, సమిష్టి తత్వాన్ని, సామాజిక బాధ్యతను గుర్తింప చేసే విలువైన విద్యను అందరికీ అందచేయాలి. అటువంటి విద్య కోసం ప్రయత్నించాలి. ప్రభుత్వ లోపాలను ప్రశ్నించాలి. వీ

(రచయిత విలేఖరి)

అర్హతలు లేని వైద్యుల శిక్షణ

వైద్య విద్య ఖరీదైనది కావడంతో అర్హులైన వైద్యుల సంఖ్య తగ్గిపోతోందనీ, గ్రామీణ స్థాయి నుండి వైద్య శిక్షణను అందుబాటులోకి తెస్తే ఉపయోగకరమనీ అంటున్నారు **డా. రాపోలు సత్యనారాయణ**

యూరోపియన్‌లతో పరిచయమైన అల్లోపతి వైద్యం నేడు దేశంలో ప్రజల ప్రధాన స్రవంతి వైద్యంగా ఆదరణ పొందుతున్నది. దేశ జనాభాకు తగిన సంఖ్యలో అర్హులైన అల్లోపతి మెడికల్ ప్రాక్టీషనర్స్ లేని కారణంగా అర్హతలు లేని వైద్యుల సేవలు అనివార్యం అయిన స్థితి ఏర్పడింది. అందుకే అర్హతలు లేని మెడికల్ ప్రాక్టీషనర్ల నిషేధం కోసం, అదే విధంగా గుర్తింపు కోసం దేశవ్యాప్త అందోళనలు జరుగుతున్నాయి.

వైద్య వృత్తి - నియంత్రణ: తొలుత బ్రిటిష్ చట్టాలే వర్తించేవి. 1916లో ఇండియన్ మెడికల్ డిగ్రీస్ యాక్ట్ వచ్చింది. 1933లో ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్ ద్వారా అల్లోపతి వృత్తి ఏకీకృత నియంత్రణ దేశీయంగ అమలులోనికి వచ్చింది. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టం 1956 సవరణ ద్వార అప్పటి దాక అమలులో ఉన్న అన్ని అల్లోపతి డిప్లొమా, లైసెన్షియేట్ కోర్సులు రద్దయినయి. రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ అవ్వడానికి ఎం.బి.,బి.ఎస్. మాత్రమే కనీస అర్హతగా మిగిలింది. మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ పొందిన రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (ఆర్ఎంపి) మాత్రమే అల్లోపతి వైద్యం చేయడానికి చట్టరీత్య అర్హులు. ఆర్ఎంపిలు కాని వారు ఆర్ఎంపి అని చెప్పుకొన్నా, వైద్యం చేసినా చట్ట రీత్య శిక్షార్హం. అల్లోపతియేతర వైద్య విధానాలకు దేశంలో చట్టబద్ధత కల్పించిన తరువాత 1976 వరకు అనుభవం ప్రాతిపదికన ఆయా విధానాల వైద్యులకు రిజిస్ట్రేషన్ లభించింది. ఆ లగాయతు, ఏ విధానమైనా విద్యార్హతలున్న వారికే చట్ట ప్రకారం ప్రాక్టీస్ చేసే అధికారం లభిస్తున్నది. జనాభాకు తగిన నిష్పత్తిలో అర్హతలు కల వైద్యులు లేనందున, వారితో సమాంతరంగ అర్హతలు లేని వైద్యులు తమ సేవలు అందిస్తున్నారు. ఎన్ని విధానాలున్నా, అల్లోపతియే నిత్యావసర వైద్య విధానంగా ప్రజల విశ్వాసం చూరగొన్నది. కనుక అల్లోపతిలోనే అర్హతలేని వైద్యుల సంఖ్య ఎక్కువ.

ఆర్ఎంపి, పిఎంపి, యుఎంపి వివరణ: మెడికల్ కౌన్సిల్లో రిజిస్ట్రేషన్ పొందినవారు మాత్రమే రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ అని ఇంతకు ముందే చెప్పుకొన్నం. అయితే, విద్యార్హత ఉన్నవారు తమ అర్హతలను ప్రదర్శించుకోవడానికి ఇష్టపడినందున, అనుభవం ప్రాతిపదికన రిజిస్ట్రేషన్ పొందినవారు మాత్రమే ఆర్ఎంపిలుగ చెప్పుకోవలసి వచ్చేది. దానితో విద్యార్హతలు లేనివారిని మాత్రమే ఆర్ఎంపి అంటారనే తప్పుడు అభిప్రాయం ప్రజలలో పాతుకొని పోయింది. కొందరు 'రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్' అనే ఫుల్ ఫాం చెప్పుకొంటున్నారు. కాని, ఆర్ఎంపికి ఏ ఇతర ఫుల్ ఫాం ఇచ్చినా చట్టం దృష్ట్యా నేరం. ప్రస్తుత చట్టాల ప్రకారం, ఎం.బి.,బి.ఎస్. విద్యార్హత ఉన్న వారే ఆర్ఎంపిలు! ఇంక, పిఎంపి విషయానికి వస్తే, ప్రభుత్వ ఉద్యోగంలో లేనివారు ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (పిఎంపి) అని భావం. ప్రభుత్వ గుర్తింపు లేని వైద్యులను నకిలీ వైద్యులు లేదా క్వాక్స్ అని అధికారిక పత్రాలలో వ్యవహరిస్తున్నారు. అది అవమానకరంగా ఉన్నందున, తమను 'అనుభవ వైద్యులు'గా పేర్కొనాలని అర్హతలులేని వైద్యుల వాదన. వీరిని నకిలీ వైద్యులు అనకూడదు, అన్-క్వాలిఫైడ్ లేదా అన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (యుఎంపి) అనాలని మద్రాస్ హైకోర్ట్ 1998లో ఆదేశాలు జారీ చేసింది. కాని, నిత్య వ్యవహారంలో అన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (యుఎంపి) నే ఆర్ఎంపి, పిఎంపిలని సంబోధిస్తున్నారు. ఇది చట్ట విరుద్ధం.

యుఎంపిల గుర్తింపు - తెలంగాణ: ఇంక, భారత దేశంలో తెలంగాణది ప్రత్యేక పరిస్థితి. నాటి నిజాం పాలనలో యునాని రాజ వైద్యం. ప్రజలు ఆధార పడింది ఆయుర్వేదం పైన. అల్లోపతి వైద్యం బ్రిటిష్ కంటోన్మెంట్ వరకే పరిమితం. రెసిడెంట్ ఫ్రేసర్ చొరవతో అది హైదరాబాద్ నగర ప్రజలకు పరిచయమైంది. నైజాం రాజ్య విలీనం అనంతరం, అల్లోపతి క్రమంగ మహానగరం నుంచి ఈనాడు మారుమూల లకు విస్తరించింది. నేడు, హైదరాబాద్ అధునాతన అల్లోపతి వైద్య సేవల కూడలి. జిల్లా కేంద్రాలు, పట్టణాలలో కూడ నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారు. కాని, పట్టణ పేదలు, గ్రామీణులకు అర్హతలు లేని అల్లోపతి వైద్యులే ప్రాణప్రదాతలు. వైద్య విద్యార్హతలు లేనంత మాత్రాన వారేమీ నిరక్షరాస్యులుకారు. సెకండరీ పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్యావంతులు ఉన్నారు. అర్హతగల వైద్యుల వద్ద అనుభవం గడించి ఆదర్శ వైద్యులుగా రాణిస్తున్నారు. ప్రజాదరణతో రాజకీయ పదవులు చేపట్టిన వారు కూడ ఉన్నారు. చట్టపరమైన గుర్తింపు కోసం యుఎంపిలు ప్రభుత్వంతో నిరంతర పోరాటం చేస్తనే ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆల్ ఇండియా మెడికోస్ ఫెడరేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వంటి సంఘాలు యుఎంపిలపై అసూయతో పోలిస్ దాడులు చేయించి, కోర్ట్ కేస్లు పెట్టించినయి. నక్సల్ ఉద్యమం ఉధృతంగ ఉన్నప్పుడు పోలీస్ మొదట టార్గెట్ చేసింది ఈ గ్రామీణ వైద్యులనే. పోలీస్ వేధింపులు, కోర్ట్ కేసులతో పాటు, సంఘ విద్రోహకుల ఆగడాలు కూడ మితిమీరుతున్న నేపథ్యంలో అర్హతలు లేని గ్రామీణ వైద్యులు తమ అస్థిత్వం పట్ల తీవ్ర సంఘర్షణకు లోనయ్యిండ్రు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం యుఎంపిల వ్యథను, ప్రజలకు వారి అవసరాన్ని గుర్తించింది. దానితో, ఆనాటి కాంగ్రెస్ - తెరాస సంకీర్ణ ప్రభుత్వం యుఎంపిల శిక్షణకు హామీ ఇచ్చింది. పర్యవసానంగ 2009లో కమ్యూనిటీ పారామెడిక్ పేరిట ఏడాది శిక్షణ ప్రారంభమైంది. కాని, ముఖ్యమంత్రులు మారినప్పుడు ప్రాధాన్యతలు మారినయి. శిక్షణ

ఆదివాసి ప్రాంతాలకు ప్రత్యేక జిల్లాలు

తెలంగాణలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆదివాసి ప్రాంతాలు విస్తారంగా ఉన్నాయనీ, వాటిని ప్రత్యేక జిల్లాలుగా ప్రకటించి, వాటికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందనీ అంటున్నారు **మైపతి అరుణ్‌కుమార్**

విభజించబడిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఒకవైపు అభివృద్ధి వైపు ప్రపంచంలో నలుమూలలా అభివృద్ధి నమూనాలను సింగపూర్, జపాన్ లాంటి దేశాల నుండి తెచ్చుకుంటున్న తరుణంలో, ఇరు రాష్ట్రాలలోని ప్రభుత్వాలు, గడిచిన ఏడాదిలో మూలవాసులైన ఆదివాసి అభివృద్ధి చట్టాలు, హక్కులు, ఆదివాసి స్వయంపాలన, 'జల్ జంగల్ జమీన్' పై హక్కు కోసం ఏమైన చర్యలు తీసుకుందా అంటే అసలు లేదు. ఆదివాసీలు ఇంకా బతికి ఉన్నారనే కోణంలో ఉన్నారు. ఇరు రాష్ట్రాల ప్రభుత్వాల తీరు దీనిని పక్కకు పెట్టి భారత రాజ్యాంగ నియమం ప్రకారం 5వ షెడ్యూల్డ్ ఆదివాసి ప్రాంతంలోని అభివృద్ధి నమూనా, జీవన విధాన స్థితిగతులపై ప్రతి యేడాది రాష్ట్ర గవర్నర్ భారత రాష్ట్రపతికి నివేదిక పంపాలి. కాని అసలు రాజ్యాంగంలో నాపై ఈ బాధ్యత నియమం ఉందా ? అని తెలిసో తెలియదో అనే పరిస్థితులలో ఉంది మన రాష్ట్ర గవర్నర్ తీరు. ఇటువంటి తరుణంలో విభజించబడిన ఆదివాసీల స్థితిగతుల వైపు తొంగి చూస్తే ఇంకా 50 సంవత్సరాలు ఐతే ఆదివాసిలను మ్యూజియంలో పెట్టి చూడాలేమో అనే పరిస్థితులకి అనివార్యంగా నెట్టబడుతాం.

ఆంధ్రప్రదేశ్‌లో జనాభా 13,982 కి.మీ. షెడ్యూల్డ్ ఏరియా విస్తీర్ణంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 18 రకాల ఆదిమ తెగలు నివాసముంటున్నవి. తెలంగాణలో ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో 17,352.78 చ.మీ. విస్తీర్ణంలో 1200 షెడ్యూల్ గ్రామాలు 500పైబడి, నాన్ షెడ్యూల్డ్ గ్రామాలుగా 12 రకాల ఆదిమ తెగలు నివసిస్తున్నవి. ఏడున్నర లక్షల జనాభా ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలను కలుపుకుని నల్లమల కేంద్రంగా 30,000 జనాభా గల చెంచులు ఉన్నారు. వీరి గురించి ప్రభుత్వాలు ఆలోచించడం కన్నా అభివృద్ధి ముసుగులో విధ్వంసకర చర్యలకి పాల్పడుతున్నారు.

తెలంగాణలో చూస్తే సింగపూర్‌ను చూసొచ్చిన తెలంగాణ ప్రభుత్వం నేడు ఆ తరహాలో అభివృద్ధి చేస్తామని ప్రకటించింది. తెలంగాణ సింగపూర్ కావాలంటే అది ఎవరి సమాధులపై నిర్మాణం అవ్వాలి? ఉంటే మళ్లీ బలిపశువులు ఆదివాసిలే అనేది స్పష్టం. అమెరికా ఒకప్పుడు రెడ్ ఇండియన్‌లు అనే ఆదిమ జాతి తెగ నిర్మాణం చేసుకున్న దేశం. కాని నేడు అమెరికాలోకి వచ్చిన వలసవాదులు రెడ్ ఇండియన్‌లను అంతమొందించి అక్కడి ఆదివాసి సమాదులపైన సామ్రాజ్యవాద నిర్మాణం చేసి అదే వారసత్వంతో, అదే నమూనాను భారతదేశంపై ప్రవేశ పెట్టడంలో భాగంగా దానికి వ్యతిరేకంగా దండకారణ్యం లాంటి ప్రాంతాల్లో ఆదివాసిలు చేసే అస్థిత్వ పోరాటాలను మనం చూడవచ్చు. నేడు తెలంగాణ ఆదివాసిపై కూడ సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనా

పూర్తిచేసిన వారికి పరీక్షలు నిర్వహించలేదు. శిక్షణా కార్యక్రమం అర్థంతరంగా అటక ఎక్కింది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యుఎంపిల శిక్షణకు నడుం బిగించింది. శిక్షణ కోసం ప్రత్యేక జిఒ (జిఒ ఆర్‌టి సంఖ్య 428, 29 జూన్ 2015), రూ.46,01,840 నిధులు మంజూరు చేసి చిత్తశుద్ధిని చాటుకొన్నది. ఒక్క సారి అవకాశంగ (వన్ టయిమ్ సెటిల్మెంట్) యుఎంపిలు అందరికి శిక్షణ పూర్తి చేయించాలని భావిస్తున్నది. శిక్షణ ఫలితంగా తెలంగాణలో వైద్య సేవల శాస్త్రీయత, నాణ్యత మెరుగు పడుతది.

సరియైన పరిభాష - సిఎంపి: ఉద్దేశం ఎంత మంచిదైనా, రంధ్రాన్వేషణ చేసే వర్గం కూడ ఉంటది. పరిభాష కూడ అందుకు ఒక పరికరం కావచ్చు. పరిభాష పరమైన లొసుగులు మెడికల్ కౌన్సిల్ అభ్యంతరాలకు, న్యాయ పరమైన వివాదాలకు తావు కల్పించవచ్చు. ఈ యుఎంపిల శిక్షణ పూర్తి అయినా మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ ఈయదు. మెడికల్ కౌన్సిల్లో రిజిస్ట్రేషన్ పొందిన వారు తప్ప ఇతరులు ఆర్‌ఎంపి అని చెప్పుకోవడం చట్ట రీత్య తప్పు. కనుక ఆర్‌ఎంపి అనలేం. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వానికి మెడికల్ కౌన్సిల్ ఈ విషయమై అభ్యంతరం తెలిపింది కూడా. ఏ కోశాన శిక్షణ ప్రారంభించాలన్నది ప్రభుత్వ సంకల్పం. కనుక, కమ్యూనిటీ పారామెడిక్ ట్రయినింగ్ పేర, బాధ్యతను పారామెడికల్ బోర్డ్ మీద పెట్టింది ఆనాటి ప్రభుత్వం. కొన్ని పరిమితులు విధించి, ఆ పరిధిలో ప్రాక్టీసుకు అనుమతించాలనేది ఈ శిక్షణ ఉద్దేశం. ఈ ప్రాక్టీషనర్లను కమ్యూనిటీ పారామెడిక్ లేదా సిపి అనాలని నిర్దేశం. కాని, ఒక సొంత సోలో మెడికల్ ప్రాక్టీషనర్ను పారామెడిక్ అనడం సరికాదు. వీరికి ట్రయినింగ్ సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు. కాబట్టి సర్టిఫైడ్ మెడికల్ ప్రాక్టీషనర్ (సిఎంపి) అంటె బాగుంటది. అలవాటు పడిన ఆర్‌ఎంపి ఉచ్చారణకు దగ్గరగా ఉంటది. మెడికల్ కౌన్సిల్ అభ్యంతరం చెప్పే ఆస్కారం లేదు. కనుక, ఏ కోణంలో చూసినా వీరిని సర్టిఫైడ్ మెడికల్ ప్రాక్టీషనర్ (సిఎంపి) అనడం అన్ని విధాల సమంజసం.

ఆరోగ్య తెలంగాణ సాధనకు సిఎంపిల సేవలు తప్పక తోడ్పడతాయి. దేశ అవసరాల రీత్య భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్, డిప్లొమా లను పునరుద్ధరించిన యెడల ఈ నమూనా ఒక మార్గదర్శకంగా ఉంటది.

(రచయిత ప్రజారోగ్య నిపుణుడు, వైద్య విద్యావేత్త) వీ

అమలు చేయటానికి ప్రభుత్వం పావులు కదుపుతుంది. దానిలో భాగంగా వచ్చినవే ఇచ్చంపల్లి, మణుగురు, థర్మల్ పవర్ ప్రాజెక్ట్, బయ్యారం ఉక్కు హరిత హారం లాంటివి, నూతనంగా ఏర్పడబోయే ఓపెన్ కాస్టులు. అసలెందుకు ఆదివాసిలే అభివృద్ధి ముసుగులో విధ్వంసం అవ్వాలి? రాష్ట్ర అభివృద్ధిని ఆదివాసిలెన్నడు వ్యతిరేకించరు. కాని అస్థిత్వానికి పెను ముప్పు వాటిల్లే విధ్వంసకర అభివృద్ధిని ఎలా సమర్థిస్తారు? బయ్యారం ప్రాంతం మొత్తంగా 5వ షెడ్యూల్డ్‌లోని ఆదివాసి ప్రాంతం. దానిని బయ్యారం ఉక్కు, ఆదివాసి హక్కు అని అభివృద్ధిలో ఆదివాసిలను భాగస్వామి చేయకుండా, బయ్యారం ఉక్కు, తెలంగాణ హక్కు అని అక్కడున్న ఇనుమునంతా తవ్వి స్థానిక ఆదివాసిలను, సాంస్కృతిక జీవన విధాన వ్యవస్థలను ధ్వంసం చేస్తాననటం ఏ రాజ్యాంగ విలువలకు నిదర్శనం. విఫలమైన దేవాదుల కోసం 190 మీటర్ల కంతనపల్లి కట్టిద్దామనటం దుర్మార్గం కాదా? ఇటీవల కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వం కంతనపల్లి రద్దు చేస్తున్నామని ప్రకటిస్తే ప్రతిపక్షాలేమో కట్టాలని విచిత్రంగా గోల చేస్తున్నవి.

నల్లమల చెంచులది అయితే దుర్భర పరిస్థితి. అసలు అక్కడ మానవతా విలువలు మంట కలిసాయి అనే పరిస్థితుల్లో బిక్కుబిక్కు మంటున్నారు. చెంచులను, పులుల రక్షణ పేరుతో చెంచుల వలన పులులు చనిపోతున్నాయని, చెంచుల పెంటలన్నింటిని ఖాళీ చేయించారు. ఆదివాసి విద్యార్థి బృందం చేసిన సర్వేలో 230 చెంచుల పెంటలు ఏమైపోయినవో కూడా తెలియని దారుణ పరిస్థితి. కొత్త వ్యక్తులు ఎవరైన చెంచు పెంటలకు వెళ్లాంటే చెంచుల పెంట ముందు ఒక చెక్‌పోస్టు దగ్గర రిజిస్టర్‌లో సంతకం పెట్టి వెళ్లాలి. లేదంటే కేసు పెడతారు. ఇదే సందుగా ఇంటికి 10 లక్షలు ఇస్తాం అని చెంచులను అడవి నుండి ఉన్న గూడెలను కూడ గెంటివేస్తున్నారు. నేటికి వారి పెంటలకు రోడ్లు, కరెంట్, పాఠశాలలు అంటే కూడా తెలియని అస్థిత్వ వేదనలో మగ్గుతున్నారు. ఇటీవల కాలంలో టైగర్ ఫోర్స్ పేరిట శిక్షణ పొందిన వారిని తుపాకులిచ్చి నల్లమలకు పంపింది తెలంగాణ ప్రభుత్వం.

ఆదిలాబాద్‌లో కూడా కవ్వాల్ టైగర్ జోన్ పేరిట ఇటువంటి విధానమే అమలులోకి తెచ్చి ప్రక్రియలు మొదలుపెడుతుంది. హరిత హారం పేరున అయితే ఆదివాసులకు తీరని బాధలు మొదలు అయినవి. పోడు వ్యవసాయంపై ఆధారపడిన తెగలు దీనికి భూమిలో మొక్కలు పెడుతుంటే బిత్తరపోయి చూస్తున్నవి. ఆదివాసిలకు 2005 డిసెంబర్ 13న పార్లమెంట్ ద్వారా అమలులోకి వచ్చిన చట్టం సైతం హరిత హారాంలో కొట్టుకుపోతుంది. హక్కుల పత్రాలున్న వాటిని పక్కకు పెట్టి మరి మొక్కలు పెడుతుంది. అటవీ హక్కుల చట్టం కేంద్రానికి, పార్లమెంట్‌కు సంబందించింది. హరిత హారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించింది. పార్లమెంటరీ విధానంతో వచ్చి కేంద్ర చట్టాలన్ని ఉల్లంఘించే రాష్ట్ర ప్రభుత్వంపై ఏమి చర్య తీసుకోవాలి?

నిజంగా నేటికి అడవులు, కాసింత బతికున్నాయంటే ఆదివాసిలె కారణం. అంత నిజాయితీ ఉంటే మైదాన ప్రాంతంలోని భూముల్లో చెట్లు నాటొచ్చు కదా. ఆదివాసిలు అమాయకులు. బయట ప్రాంతం వారు తిరగబడుతారని చూస్తున్నట్లుంది ప్రభుత్వం. చివరకు గోండు వీరుడు కొమురం భీం సమరం మొగించిన జోడెన్ ఘాట్‌ను కూడా వదలట్లేదు. టూరిజం పేరిట అక్కడ గొండుల పవిత్రమైన సంస్కృతి సాంప్రదాయాలను విచ్చినం జోడెన్ ఘాట్, గుట్టల్లో ఉన్న 87 హెక్టార్ల బొగ్గును తవ్వాలని చూస్తుంది.

నేడు జియాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకారం 7501 మిలియన్ టన్ను బొగ్గు నిల్వలు 700 చదరపు కిలోమీటర్ల గోదావరి పరివాహక ప్రాంతంలో నిక్షిప్తమై ఉన్నవి. ఇవన్ని కూడా సరిగా 70 శాతం ఆదివాసి గూడెం కిందనే ఉన్నందున ఓపెన్ కాస్టులో విధ్వంసం మనముందున్నది. రంగరాయ చెరువు, ఊరట్టం, లక్నవరం రిజర్వాయర్ వలన కోయ గూడెలకు ముంపు పొంచి ఉన్నది. ఒక పక్క భారత ద్వీపంలోకి ఆర్యన్ వలస లాగా లంబాడీలు లక్షలాదిగా తెలంగాణలోకి వలసలు వచ్చి ఎస్‌టి రిజర్వేషన్‌ను 90శాతం దోచుకుంటే వలసలను వ్యతిరేకించి స్వరాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ నేడు అవే లంబాడీ వలసలను ఓటు బ్యాంకు మత్తులో నెత్తికెక్కించుకుంటుంది. రు. 20 పెట్టి మహారాష్ట్ర బల్లార్షలో బిసిలుగా పరిగణించే లంబాడీలు ట్రెయిన్ ఎక్కి సిర్పూర్ కాగజ్‌నగర్ తెలంగాణలో దిగితే ఎస్.టిలు అయిపోతున్నారు. అలా వలస వచ్చిన లంబాడ జనాభా నేడు తెలంగాణలో 50 లక్షలు.

ఇకపోతే ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆదివాసిలది దుర్భర జీవనమే. పోలవరం పేరిట తెలంగాణ రాష్ట్రం ముంపు మండలాలను ఆంధ్రాకు బలిస్తే బలి తీసుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి 43 మండలాతో అల్లూరి సీతారామరాజు పేరిట గిరిజన జిల్లా చేయాని ప్రయత్నించింది కాని ఈ ప్రాంతం గిరిజన జిల్లా అయితే ప్రమాదమని 40 మండలాలు పూర్తిగా గిరిజను లున్నిరని 3 మండలా గిరిజనేతయి కుట్ర పన్ని 1/70 చట్టం లాంటి మనకు ఇబ్బంది వుందిలో లొల్లి పెట్టడంలో చివరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలొంచిన పరిస్థితును నేడు గమనించాల్సి వుంది. నేషనల్ పార్క్ పేరిట పాపికొండల్లోని కొండ రెడ్లకు కష్టాలు అనివార్యం అయినవి. బాక్సైట్ త్రవ్వకాల పేరిట విశాఖ మాన్యంలో 272 గుడిసాల నాశనం కానున్నవి. తూర్పు కనుమలో 3000 మిలియన్ టన్నుల లాటరైట్ ఇప్పటికే లీజుదారుల చెరల్లోకి వెళ్లింది. కన్నేదార గ్రానైట్ పేరిట సవర జాతపు బతుకుల్లో కల్లోలం రేగుతుంది. నేటికి కూడా ఆంధ్రా ప్రాంతంలో సుమారు 1000 గ్రామాలపై చిలుకు కరెంట్, విద్య, వైద్యం, మౌళిక సదుపాయల కల్పన రోడ్డు సౌకర్యం, రహదారి సౌకర్యం దిశ దారిద్ర్యంలో మగ్గుతున్నవి. ఒక విశాఖ ఏజెన్సీలోని నేటికి 567 గూడెలకు ఎటువంటి ప్రభుత్వ సౌకర్యాలు లేవు. ఆదివాసి మహిళపై జరిగే అత్యాచారాలకు అసలు పకడ్బంది చర్యలే లేవు. 700పై నాన్ షెడ్యూల్డ్ గ్రామాలు షెడ్యూల్డ్ హక్కులు లేక విద్య ఉద్యోగ, రాజకీయ, ఉపాధి హక్కులకు దూరమవు తున్నవి. పోవరం ప్రాజెక్ట్ విధ్వంసం అందరికి తెలిసిన విషయమే.

బాక్సైట్ ఉద్యమకారులను మావోయిస్టు పేరిట ముద్రించి గూడేకు, గూడేను నిర్భంధంలోకి నెడుతుంది ప్రభుత్వం. ఆదివాసి రక్షణ కొరకు చేసిన 1/70 పిసా చట్టం ఎస్.సి./ఎస్.టి అట్రాసిటి లాంటి నేడు ప్రభుత్వాలు అమలు చేసే పరిస్థితి లేదు, అభివృద్ధి పేరిట విధ్వంసం జరిగి ఆదివాసి మనుగడ ప్రశ్నార్థకంగా మారే తరుణంలో నేడు యావత్ ఆదివాసి సమాజం సమ్మక్క సారమ్మ, కొమురం భీం, గంటంమ్మ దొర, తమన్న దొర, రాజీ గొండు కలుకని పోరాటం చేసి రక్తం చిందించిన న్యాయమైన డిమాండ్ ఆదివాసి స్వయం పరిపాన 'జిల్ జంగిల్ జమిన్' కోసం ఉద్యమించాల్సి ఉన్నది. దీనిలో భాగంగా 1996లో కేంద్ర ప్రభుత్వం నియమించిన దిలిప్ సింగ్ భూరియ కమీషన్ పంచాయితి రాజ్ చట్టం 4 (ఓ) క్లాజులో ఆదివాసిలు అభివృద్ధి చెందాలంటే 6వ షెడ్యూల్డ్ నమూనాలను అనుసరించి ఐటిడిఏను ఆదివాసి అటనామస్

రాయలసీమపై శీతకన్ను

రాయలసీమ ప్రాంతానికి దక్కాల్సిన నీళ్లు, నిధుల కెటాయింపులో దగాచేస్తూ ఏకంగా నిరుద్యోగులకు దక్కాల్సిన ఉపాధి అవకాశాలను 120 జి.ఒ. ద్వారా దక్కకుండా చేస్తున్న ప్రభుత్వ తీరును వివరిస్తున్నారు ఎం. కె. కుమార్

రాష్ట్ర విభజన జరుగుతున్న సమయంలో రాయలసీమ ప్రజలు తమకు రావలసిన నిధులు, నీళ్లు, ఉద్యోగాలు, హక్కుల గురించి గొంతెత్తకుండా ఉండడంతో మరోమారు సీమ దగాకు గురైంది. దీన్ని అదునుగా చేసుకుని అధికారవర్గం సీమలోని విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లే విధానాలను అవలంబిస్తోంది. దొడ్డిదారిన జిఒ 120ని ప్రవేశపెట్టింది. విద్యార్థులకు తీవ్ర నష్టం చేకూర్చే జిఒ 120ని రద్దు చేయాలని రాయలసీమలో విద్యార్థుల ఆందోళనలు మిన్నంటుతున్నాయి. హైకోర్టు జిఒను రద్దు చేయాలని సూచించినప్పటికీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో పాలకులకు సీమ ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమౌతోంది. సీమ ప్రాంత మెడిసిన్ విద్యార్థులకు ఎస్‌వి యూనివర్శిటీ పరిధిలోని 150 సీట్లలో 107 సీట్లు రావలసి ఉన్నప్పటికీ, జిఒ 120 వల్ల కేవలం 12 సీట్లు మాత్రమే వచ్చాయి. సీమపై కోస్తా పాలకుల ఆధిపత్యం ఇంకా కొనసాగుతుందనేదానికి జిఒ 120 ప్రత్యక్ష ఉదాహరణ. సీమకు చెందిన వ్యక్తే ముఖ్యమంత్రి అయినప్పటికీ సీమ మెడిసన్ విద్యార్థులకు అన్యాయం జరిపే విధంగా జిఒను తీసుకొనిరావడం వెనుక ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టాలనే వ్యూహం వున్నట్లు అర్థమౌతోంది. రాయలసీమ సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎన్నికల్లో వాగ్దానం చేసి, అధికారాన్ని కైవసం చేసుకున్నాక విస్మరించడం అతనికే తగింది. మరోవైపు ప్రైవేట్ యూనివర్సిటీలను రాష్ట్రంలో అనుమతిస్తూ, పేద విద్యార్థులను, కింది కులాల విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్ర జరుపుతున్నారు.

సీమకు రావలసిన స్థానిక కోటా సీట్లనే ముఖ్యమంత్రి ఇవ్వకుండా దొడ్డిదారిన జిఒ 120ని తీసుకొచ్చాడు. ఈ నేపథ్యంలో ఉద్యోగాలు ఎలా ఇస్తాడోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో 1.38 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం లెక్కించింది. వీటిలో జిల్లాస్థాయి 1.15 లక్షలు, జోనల్ స్థాయిలో 22 వేలు, మల్టీ జోనల్ స్థాయిలో 1100 ఖాళీలున్నాయి. వీటిలో సీమ నిరుద్యోగ యువతకు దక్కాల్సిన వాటాను ఇవ్వకుండా చంద్రబాబు ఏం మాయ చేస్తాడో తెలీని పరిస్థితి నెలకొంది. సీమలోని ఉద్యోగాలు స్థానికత ఆధారంగా సీమ ప్రజలకే ఇవ్వాలని విద్యార్థులు ఇప్పటికే ఆందోళన చేస్తున్నారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య 15 లక్షల వరకు ఉందని ప్రభుత్వం చెప్తోంది. కేంద్ర కార్మికశాఖ గణాంకాల ప్రకారమే రాష్ట్రంలో ఉన్నత విద్య చదువుకున్న వారిలో నిరుద్యోగులు 18 శాతం ఉన్నట్లు తేలింది.

అంతర్జాతీయ విమానాశ్రయాలు, స్మార్ట్ సిటీలు సీమ కిస్తామని నమ్మబలికిన ప్రభుత్వం వాటి ఊసెత్తడం లేదు. అయినా వాటి వల్ల సీమ ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం కలగదు. వర్షాలు లేని కారణంగా సీమలో 50 శాతం భూములు కరువుతో ఎండిపోయాయి. సాగునీరులేక రైతులు ఆత్మహత్యల వైపు నెట్టబడుతున్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని 2,336 గ్రామాలకు తాగునీరు సైతం అందడం లేదు. ఈ గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటినందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో విఫలమైంది. మరోవైపు సీమ ప్రాజెక్టుపై శీతకన్నేశారు. హంద్రీనివాకు 2,900 కోట్లు, గాలేరు-నగరికి 6,000 కోట్లు అవసరమౌతాయని ప్రభుత్వం చెప్పి, ఇప్పటివరకు ఈ రెండు ప్రాజెక్టులకు కలిపి 350 కోట్లు మాత్రమే కేటాయించారు. తాగు, సాగునీరు లేక సీమ ప్రాంతం ఎండిపోతుంటే గోదావరి పుష్కరాలకు 1600 కోట్లు, పట్టిసీమకు 1800 కోట్లు కేటాయించి చంద్రబాబు తన నైజాన్ని చాటుకున్నారు. కరువుతో అల్లాడుతున్న జనం పొట్టకూటి కోసం సీమనొదలి ఇతర రాష్ట్రాలకు వలసెల్లిపోతున్నారు, వీరి సంఖ్య 20 లక్షలకు పైగా ఉంది. చిత్తూరు జిల్లాకు తాగునీరు అందించే విషయంపై కండలేరు ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పిన ప్రభుత్వం, ప్రస్తుతం దాని ఊసే ఎత్తడం లేదు.

సీమ అవసరాలకు 400 టిఎంసిలు కావలసి వస్తుందని దశాబ్దాలుగా ప్రజలు ఘోషిస్తున్నారు. దానికి కావలసిన విధి, విధానాలను ఇంతవరకు

జిల్లాలుగా చేయాలని సూచించింది. దీనిని గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టించుకోలేదు. అందుకే నేడు ఆదిలాబాద్, కరీంనగర్‌లోని గోండు, ఉప తెగలను కలుపుకొని ఊట్నూరు ఐటిడిఎలను కొమురం భీం జిల్లాలుగా, కరీంనగర్, వరంగల్, ఖమ్మం అయా ప్రాంతం, ఉప తెగలను కలుపుకొని సమ్మక్క సారమ్మ జిల్లాగా, (ఏటూర్‌నాగారం) ఐటిడిఎను చేయాలి. పశ్చిమ, తూర్పు గోదావరిని కోయ కొండరెడ్ల కేంద్రంగా, రంపచోడవరం ఐటిడిఎలను కొరుకొండ సుబ్బారెడ్డి జిల్లాలుగా, విశాఖపట్టణం పాడేరు ఐటిడిఎలను (కోందు, బగత కోసం) తమ్మన్న దొర జిల్లాగా. శ్రీకాకుళం, విజయనగరంలోని సవర జాతపులను కలిపి, పార్వతిపురం ఐటిడిఎలను గిడుగు రామ్మూర్తి జిల్లాగా చెయాల్సి ఉంది. ఈ విధంగా ఆదివాసి జిల్లాలు ఏర్పాటు జరిగిన రోజు ఆదివాసి సమూహాన్ని సంస్కృతి సాంప్రదాయ జీవన విధానం, అచార వ్యవహారాలు కాపాడబడి స్వయం ప్రతిపత్తి అధికారంతో పరాయి పాలన అభివృద్ధి విధ్వంసాన్ని ఎదిరించవచ్చు. దీని కోసం నేడు ప్రజా సంఘాలు, మేధావులు, నేడు ఆదివాసి పోరాటం, ఏకమైన రోజు ఆదివాసి స్వయం పరిపాలన డిమాండ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఒక రాజకీయ డిమాండ్‌గా రూపు దిద్దుకుంటుంది.

(ఆదివాసి విద్యార్థి సంఘం, ఉభయ రాష్ట్రాల అధ్యక్షులు) వీ

ఏ పాలకులూ రూపొందించలేదు. కేవలం 120 టిఎంసిలు మాత్రమే సీమకిచ్చి, సీమకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారు. అనాది నుండి అన్యాయానికి గురౌతూ ఇబ్బందులు పడ్తున్న సీమ ప్రజలు, తమ ప్రాంతానికి లక్షల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలని శ్రీకృష్ణ కమిటీకి నివేదించారు. అయినా పాలకులు ఈ విషయాన్ని పెడచెవిన పెట్టారు. రాజధానికి లక్షా యాభై వేల కోట్లు కావాలని కేంద్రాన్ని అడుగుతున్న ముఖ్యమంత్రి సీమకు కనీసం రూపాయి కావాలని కూడా అడగడం లేదు. నీళ్లులేక గొంతెండిపోతున్న సీమ ప్రజలకు నీళ్లు ఇవ్వకుండా, విమానాశ్రయాలకు, సెజ్‌లకు, స్మార్ట్‌సిటీలకు భూములు కావాలని వాటిని నోటిపై చేయాలని నాలుగు జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి ఆదేశాలిచ్చాడు. ఒక్క చిత్తూరు జిల్లాలోనే 2 లక్షల 40 వేల ఎకరాలను సేకరించాలని హుకుం జారీచేయడం వల్ల రైతులు భయభ్రాంతులకు గురౌతున్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సీమ ప్రాజెక్టులను పూర్తిచేయకుండా, పట్టిసీమ ప్రాజెక్టు పూర్తిగాకుండానే జాతికి అంకితమివ్వడం మరీ విడ్డూరంగా ఉంది.

సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందించకుండా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం వినతి పత్రాలను అందించిన వారి సంఖ్య 1 లక్షా 20 వేలు. ఇప్పటి వరకు వీరందరూ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్నట్టు తేటతెల్లమౌతోంది. అభివృద్ధి వికేంద్రీకరణ వల్లే ప్రాంతీయ అభివృద్ధి జరుగుతుందని, లేని పక్షంలో కొన్ని పట్టణాలలోనే అభివృద్ధి కేంద్రీకృతమై మిగిలిన ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురౌతాయనే అంశాన్ని పాలకులు కావాలనే విస్మరిస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం సీమ ప్రజలు నినదిస్తున్నా, పట్టించుకోకుండా వారికివ్వాల్సిన నిధులు, నీళ్లు, హక్కులను ఇవ్వకుండా వారిని అనాదిగా పాలకులు మోసం చేస్తున్నారు.

రాయలసీమలోని ప్రభుత్వ ఆసుపత్రులన్నిటిని ప్రైవేట్ పరం చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. చిత్తూరులోని జిల్లా ఆసుపత్రిని అపోలో యాజమాన్యానికి 3 ఏళ్లపాటు ప్రభుత్వం లీజుకిచ్చింది. ఇవి భవిష్యత్తులో మెడికల్ కాలేజీలుగా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోనే రూపుదిద్దుకుంటాయి. దీనివల్ల భవన నిర్మాణాలు, స్థలాలు ఉచితంగా ప్రవేట్ రంగానికి ఇవ్వబడతాయి. ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఎన్ని ఉన్నప్పటికీ అక్కడ సరైన సదుపాయాలు, డాక్టర్లు లేకపోవడంతో ప్రజలు వసతులు లేకపోయినా ప్రభుత్వ ఆసుపత్రులకే వస్తున్నారు. ఇప్పటికే డయాలసిస్, రేడియాలజీ, ల్యాబ్ సేవలను ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేసేసింది. ఇదేవిధంగా ప్రొద్దుటూరు, హిందూపురంలోని ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేట్‌పరం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 1986లో ఏర్పాటైన వైద్య విధానపరిషత్ వ్యవస్థలోని 9 ఆస్పత్రులను ప్రవైటుపరం చేయడంతో ప్రభుత్వం వైద్యరంగాన్నుండి పూర్తిగా తప్పుకున్నట్లైంది.

1300 కోట్లతో చేపట్టిన పట్టిసీమ ప్రాజెక్టు 3 సంవత్సరాల కాలపరిధిలో పూర్తిచేయగలమని ప్రభుత్వం చేపట్టింది. దీనితో రాయలసీమకు 50 టిఎంసిలకు పైగా నీళ్లు వస్తాయని నమ్మబలుకుతోంది. గోదావరి నీటిని తాడిపూడి ప్రాజెక్టు దగ్గర ఎత్తిపోతల పథకం ద్వారా తోడి పోలవరం కుడి కాలువ ద్వారా బుడమేరులోకి పంపించి, కాలువ ద్వారా కృష్ణా బ్యారేజ్‌లో కలపాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పట్టిసీమను చేపట్టింది. దీన్ని నదుల అనుసంధానంగా పేర్కొంటూ గప్పాలు పోతోంది. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ నుండి గోదావరి జిల్లాకు, కుడి కాలువ ద్వారా కృష్ణా డెల్టా ప్రాంతాలకు నీరందించాలని పోలవరాన్ని చేపట్టారు. గోదావరి నీటిని, కృష్ణానదిలోకి మళ్లించి అక్కడ్నించి ఆ నీటిని రాయలసీమకు మళ్లిస్తామని పాలకవర్గాలు ప్రకటించాయి. ఇది ఎక్కువ డబ్బుతో కూడుకున్న పని. మరోవైపు అనుకున్నవిధంగా నిధులు కేటాయించబడి పనులు పూర్తయితే దశాబ్దకాలం పడుతుంది. పోలవరం నిర్మాణం పూర్తవడానికి 35 వేల కోట్లు ఖర్చు అవుతుందని చెప్తున్నారు. ఇందులో 30శాతం ఖర్చుపెడితే సీమ ప్రాజెక్టును పూర్తి చెయ్యొచ్చు. సీమ ప్రాజెక్టుకు నీరందాలంటే పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచాలి. దీనివల్ల తెలంగాణ నీటి వాటా నష్టపోయేది ఉండదు. ఎందుకంటే శ్రీశైలం వరదనీటితో నిండిన తర్వాతే పోతిరెడ్డిపాడు రెగ్యులేటరుకు నీళ్లందుతాయి. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. తెలంగాణ అభివృద్ధికి నిజాం ఎక్కువగా కష్టపడ్డాడని కెసిఆర్ పదేపదే అంటూ ఉంటాడు. 1800 కాలంలో రాయలసీమను నిజాం నవాబు ఈస్ట్ ఇండియా కంపెనీకి ఇవ్వకుండానే తన అధీనంలోనే ఉంచుకుంటే సీమలో ఎక్కువ అభివృద్ధి జరిగివుండేదని సీమ మేధావులు భావిస్తున్నారు. 45 దేశాలకన్నా విస్తీర్ణంలో పెద్దదైన రాయలసీమ ఈ రోజు కరువు కోరల్లో చిక్కుకుంది. వనరులు ఉండి తెలంగాణ నష్టపోయినట్టే, వనరుల దోపిడీకి గురౌతూ సీమ ప్రజలు దారిద్ర్యంలో మగ్గుతున్నారు. 1890లో నిర్మించబడ్డ కెసికెనాల్ (కడప–కర్నూలు కాలువ) తప్పితే సీమలో మరో ప్రాజెక్టు నిర్మాణం పూర్తవలేదు. దీనితో సాగుయోగ్యమైన భూమిలో 3 శాతానికి మాత్రమే నీరందుతోంది. రాయలసీమకు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికను రూపొందించాల్సిన అవసరముంది. సీమలోని 15 వేలకు పైగా చెరువుల పూడికను తీయించి భూగర్భజలాల తగ్గుదలను నివారించాలి.

రాయలసీమలో సామాజిక సంబంధాల మధ్య సంక్లిష్టతను ఆసరగా చేసుకుని, సామాజిక అభివృద్ధి నమూనాను రూపొందించవలసి ఉంది. ఆర్థికపరమైన పురోగతిని ఇక్కడి సమాజం సాధించడానికి పెట్టుబడిదారీ శక్తులు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. వ్యవస్థీకరించబడిన ఫ్యాక్షన్ తరహా భూస్వామ్య వర్గం ఈ పురోగతిని అడ్డుకుంటోంది. అనాదికాలంగా ఒక సామాజిక వర్గమే ఇక్కడి ప్రజలపై రాజకీయ, ఆర్థిక పెత్తనం చెలాయిస్తోంది. దీన్ని అధిగమించడానికి కావలసిన సామాజిక బలాన్ని అభ్యుదయకర శక్తులు పొందలేక పోతున్నాయి. ఆధిపత్యం చెలాయిస్తున్న సామాజికవర్గమే ఇక్కడ అభ్యుదయకర శక్తిగా చెలామణీ అవుతోంది. గ్రామీణ ఫ్యాక్షన్ తరహా సినిమాలు వెనుకబడిన ప్రాంతమైన సీమ జిల్లాల్లోనే ఎక్కువ ఆడుతాయి. ఎందుకంటే ఫ్యాక్షన్‌ను రుచి చూసిన పాత తరం బతుకుండడం, కొత్త తరానికి అదే ప్రత్యామ్నాయంగా కనబడడం జరుగుతోంది.

రాజకీయాల్లోకి ఫ్యూడల్ శక్తులు ప్రవేశించి అభివృద్ధికి నిరోధకంగా మారుతున్నాయి. సీమ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించాలని కోరుకునే అభ్యుదయకర శక్తులు అప్పనంగా రాజకీయాధిపత్యాన్ని ఫ్యూడల్ శక్తులకు ఇవ్వాల్సివస్తుందనే భయం కూడా వెంటాడుతోంది. ఫ్యూడల్ శక్తుల చేతుల్లోనే ప్రత్యేక రాయలసీమ ఉద్యమం నడుస్తోంది. సోకాల్డ్ అభ్యుదయకర శక్తులు రాజీపడి వారి పంచనే తమ నినాదాలకు పదును పెడుతున్నారు. ఈ నేపథ్యంలో రాయలసీమకు లక్ష కోట్ల ప్యాకేజీ కావాలనే నినాదం లేదా రెండో రాజధానిని సీమలో ఏర్పాటు చేయాలనే ప్రచారమే జరుగుతోంది కాని ప్రత్యేక రాయలసీమ కావాలనే స్పష్టమైన వైఖరిని ప్రకటించడంలో కొంత గందరగోళం నెలకొనివుంది. సీమలోని రాజకీయ వైరుధ్యాలను ఆసరగా చేసుకుని పాలకవర్గం సీమపై శీతకన్ను వేసింది.

(రచయిత పౌరహక్కుల సంఘం కార్యకర్త) వీ

ఆలస్యంగానైనా అర్థవంతమైన అడుగు

సామ్రాజ్యవాద, అభివృద్ధి చెందిన దేశాలు మూడో ప్రపంచ దేశాలను తమ వ్యర్థాలకు డంపింగ్ యార్డులుగా మారుస్తున్నాయనీ, ఇప్పటికైనా ఆ దిగుమతులను భారత దేశం అరికట్టే చర్యలు చేపట్టడం మంచి పరిణామమేననీ అంటున్నారు ఆర్. లక్ష్మి

ఇటీవలే భారత ప్రభుత్వం వ్యర్థాల దిగుమతులపై నిషేధం విధించే దిశగా చర్యలు చేపట్టింది. మన దేశంలో 7500 పైగా రిసైక్లింగ్ యూనిట్లు ఉన్నాయి. ఈ యూనిట్లలో రిసైక్లింగ్ చేయబడే వ్యర్థాలలో 75 శాతం దిగుమతులే. ఆ కారణంగా దేశీ వ్యర్థాలు రీసైక్లింగ్‌కు నోచుకోక గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం ఎటువంటి దేశీ వ్యర్థాలనైనా వినియోగించుకునే స్వేచ్ఛను సంబంధిత పరిశ్రమలకు ఇస్తుంది. ప్రస్తుతం దిగుమతి అవుతున్న వ్యర్థాలను దేశీయ వ్యర్థాల నుండి వెలికి తీయగల సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్లకు అందిస్తారు.

రసాయనాలు, సమ్మేళనాలు, మండే పదార్థాలతో నడిచే పరిశ్రమలకు సైతం ఖచ్చితమై మార్గ దరశకాలను ఆదేశించనున్నారు. సుమారుగా 175 రకాల రసాయనాలు, సమ్మేళనాలు వంటివి ఈ కోవలోనికి వస్తాయి. అలాగే ఇటువంటి పరిశ్రమలు ఇక మీదట ప్రత్యేక భీమా పాలసీని తీసుకోవాలసి ఉంటుంది. అనుకోని ప్రమాదాలు సంభవించినపుడు సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఈ చర్య ఉపకరిస్తుంది. పిఎల్ఐ చట్టాన్ని అనుసరించి ఏడాదికి సరిపడా ప్రీమియానికి సమాన మొత్తాన్ని ఇఆర్ఐగా జమచేయాలి. ఈ నిబంధనలలో వేటిని ఉల్లంఘించినా పర్మిషన్లు రద్దు చేయబడతాయి.

ఈ చర్యలన్నీ ఖచ్చితమైన విధి విధానాలతో వెంటనే అమలులోనికి రావాలి. అప్పుడే సరైన నిర్ణయాలకు సరైన ఫలితాలు లభిస్తాయి. పారిశ్రామిక దేశాల విషయానికి వస్తే మితి మీరిన పారిశ్రామికీకరణ తాలూకు ఫలితాలను ఆయా దేశాలు అంతో ఇంతో అప్పటికీ అనుభవిస్తూనే ఉన్నాయి. మన దేశంలో ఆ స్థాయిలో పారిశ్రామికీకరణ విస్తరించనూ లేదు. వికటించనూ లేదు. ఆ ప్రమాదానికి వెంట్రుకవాసి దూరంలో ఉన్న భారత్ వంటి దేశాలు బాధ్యతాయుతంగా ఆలోచించి పురోగామి చర్యలలో భాగంగా సాంప్రదాయక విధానాలను, సహజ వనరులను ఆశ్రయించడం ద్వారా వ్యర్థాల ఉత్పత్తిని నియంత్రించు కోవాలి. వ్యర్థాల దిగుమతుల బెడద నుండి విముక్తి దిశగా ఆలోచించడం తక్షణావసరమే.

గత శతాబ్ది ఆకరు దశకంలోనే విషపూరిత వ్యర్థాల ఎగుమతులపై నిషేధం విధించాలని అమెరికన్ కాంగ్రెస్ నిర్ణయించింది. సమస్య ఎంత తీవ్రమైనదో దానిని బట్టే అర్థం అవుతుంది. ఫ్రాన్స్, దక్షిణ కొరియా, అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు ఆసియా దేశాలను పారిశ్రామిక వ్యర్థాల చెత్తకుండీలలా వాడుకున్నాయి. ఆయా దేశాలలో రీసైక్లింగ్ యూనిట్లు అనేకం ఉన్నాయి. అయినప్పటికీ ప్రజల అవగాహన, పర్యావరణం పట్ల, ప్రచారోగ్యం పట్ల గల చైతన్యం కారణంగా ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ పనులనైనా కొనసాగించడం ఆ దేశాలకు అంత సులభం కాదు. ఆ కారణంగా వ్యర్థాలను వర్ధమాన దేశాలకు ఎంతో కొంతకు అమ్మి సొమ్ము చేసుకోవడం, అది సాధ్యపడని సందర్భాలలో ఉపకారం ముసుగులో ఉదారంగా ఆ దేశాలలో కుమ్మరించడం పారిశ్రామిక దేశాలు ఎంచుకున్న అతి సులువైన మార్గం.

ఆర్థిక పరిపుష్టితో అవగాహన లేమి కారణంగా ఊరికే వస్తున్నట్లు సంబరపడిపోయి వ్యర్థాలను దేశంలోకి అనుమతించడం జరుగుతూ వస్తోంది. అయితే తగిన సాంకేతిక నైపుణ్యానికీ మళ్లీ ఆ దేశాలపైననే ఆధారపడవలసి వస్తోంది. ఈ మొత్తం తతంగం పూర్తి అయ్యే సరికి రీసైక్లింగ్ సైతం వ్యయ ప్రయాసలతో కూడుకున్నది అవడమే కాక, ఆరోగ్య, పర్యావరణ సమస్యలకూ కారణమవుతోంది.

బాసెల్ అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం విష వ్యర్థాల ఎగుమతులు నిషిద్ధం. ఈ ఒప్పందం 1998 నుండీ అమలులోకి వచ్చింది. ఒఇసికి ఆర్గనైజేషన్ ఆఫ్‌ది ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవలలాప్‌మెంట్ నిబంధనల ప్రకారం సభ్యత్వం లేని దేశాలకు ఎగుమతులు చట్ట విరుద్ధం. మనదేశం 1995 లోనే ఒప్పందాన్ని ఆమోదించిన కారణంగా వ్యర్థాలను దిగుమతి చేసుకోవడం చట్ట విరుద్ధం.

'పర్యావరణ పరిరక్షణ', 'బ్యాక్ టు నేచర్' వంటి లక్ష్యాలను ఆదర్శ ప్రాయంగా అనుసరించి అమలులో పెడుతున్న నెదర్లాండ్స్ వంటి దేశం కూడా తన వద్దనున్న విష వ్యర్థాలను ఇతర దేశాలలో పారబోసి చేతులు దులుపుకుంటున్నదంటే ఏ దేశానికైనా స్వప్రయోజనాలే మిన్న అన్న సరమ సత్యం భారత దేశానికి ఇన్నాళ్లు అర్థం కాలేదు అనుకోవడానికి వీలులేదు. ప్రజా ప్రయోజనాల కంటే ఇక్కడ రాజకీయ ప్రయోజనాలకు, వ్యాపార ప్రయోజనాలకు పెద్దపీట అన్నది బహిరంగ సత్యం. కారణం–1996 జూలై 12న ఢిల్లీ హైకోర్టు విష వ్యర్థాల దిగుమతులను నలిపి వేయవలసిందిగా ఆదేశాలు జారీ చేసింది. 1996 ఏప్రిల్ 16 నుండీ దిగుమతులను నిలిపివేశామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. రెండు దశాబ్దాల అనంతరం ఈనాటికీ భారతదేశానికి ఏటా వచ్చి చేరుతున్న వివిధ రకాల వ్యర్థాలు దాదాపు 50 లక్షల టన్నులు. రీసైక్లింగ్ నిమిత్తం వచ్చే వర్థాలు పర్యావరణానికి, సంబంధిత యూనిట్లలో పనిచేసే పనివారి ఆరోగ్యానికి తీవ్రమైన హానిని కలిగిస్తున్నాయి. రీసైక్లింగ్‌కు అయ్యే ఖర్చు, దాని వలన కలిగే దుష్ట పరిణామాలను లెక్కవేసుకుంటే రీసైక్లింగ్ తలకు మించిన భారమే అవుతోంది.

గుజరాత్‌లోని 'అలంగే' షిప్‌బ్రేకింగ్ యూనిట్స్‌లో పనిచేసే కార్మికులు అనేక రోగాల బారిన పడుతున్నా పట్టించుకునే నాదుడే లేడు. మొరాదాబాద్ ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్, డిస్‌మెంటలింగ్ ప్రక్రియల్లో పనిచేసే కార్మికుల పరిస్థితీ అంతే. సాధారణంగా ఈ వ్యర్థాలను విడగొట్టడం వంటి ప్రక్రియలు ఇళ్లల్లో జరుగుతాయి. ఈ విడగొట్టడంలో వెలువడే హానికారక వాయులు కార్మికుల శ్వాసకోశాల పనితీరును దెబ్బతీస్తున్నాయి. అక్కడ ఆరోగ్య సమస్యలలో 80 శాతం ఊపిరితిత్తుల

అభివద్ధి పేరుతో విధ్వంసం

అభివృద్ధి పేరుతో బాక్సైట్ తవ్వకాలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు, విదేశీ బహుళజాతి కంపెనీల ప్రయోజనాలను నెరవేరుస్తూ, స్థానిక ఆదివాసి ప్రజల జీవితాలను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని అంటున్నారు మర్రి కామయ్య

విశాఖ జిల్లా మన్యం ఏజెన్సీలో చింతపల్లి, గూడెం కొత్తవీధి, అరకు మండలాల పరిధిలోని అటవీ ప్రాంతంలో 3,516 హెక్టార్లలో, తూర్పుగోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే ఏజెన్సీ అటవీ ప్రాంతంలో 1,239 హెక్టార్లలో 565 మిలియన్ టన్నుల బాక్సైట్ ఖనిజం విస్తరించి ఉన్నది. ఈ ప్రాంతం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం. ఇక్కడ 1/70 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల గుర్తింపు చట్టాలు అమలులో ఉన్నాయి. ఈ ప్రాంతాలు 5వ షెడ్యూల్ కిందికి వస్తాయి. ఈ ప్రాంత భూములకు, ప్రజల రక్షణ కోసం ఈ చట్టాలు ఒక మేరకు (నామ మాత్రంగానైనా) ఉపయోగపడుతున్నాయి. ఈ చట్టాల ప్రకారం ఆదివాసి ప్రజల గ్రామ సభల ఆమోదం తెలపకుండా ప్రభుత్వం గాని, ప్రైవేట్ వ్యక్తులు గాని, సంస్థలు గాని, ఖనిజ తవ్వకాలపై అవ్వరూ ఎటువంటి నిర్ణయాలు, కేటాయింపులు చేయడానికి వీలు లేదు. అయినప్పటికీ భారత రాజ్యాంగాన్ని, ఆదివాసి చట్టాలను ఉల్లంఘించి, అన్యాయంగా దొడ్డి దారిలో బాక్సైట్ ఖనిజాన్ని తీయడానికి ప్రభుత్వం కుటిల ప్రయత్నం చేస్తుంది.

ప్రభుత్వం కూడా తను ఇష్టం వచ్చినట్లు బాక్సైట్ ఖనిజాన్ని తీయడానికి వీలు లేదని, సమత, వేదాంత తీర్పుల్లో ప్రభుత్వాన్ని కూడా గిరిజనేతరులుగానే చూపిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం, వివిధ పార్టీలు చెప్పుకుంటున్నట్లు బాక్సైట్ ఖనిజం వెలికి తీయడం వలన, అల్యూమినియం ఫ్యాక్టరీ కట్టడం ద్వారా స్థానిక ఆదివాసులకు ఉద్యోగాలు వస్తాయని, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పార్టీలు ప్రజలకు భ్రమలు కల్పిస్తున్నాయి. ఇది పచ్చి అబద్ధం. ఆదివాసులను, ఆదివాసేతర పేద ప్రజలను మభ్యపెట్టడమే అవుతుంది. ఆదివాసుల అభిమతానికి అనుగుణంగానే బాక్సైట్ ఖనిజ తవ్వకాలు జరుగుతాయంటూ, దీనికోసం దొడ్డి దారిన దారి సుగుమం చేసుకునేలా ఏజెన్సీలోని అన్ని మండలాల్లో పీసా కమిటీల నిర్మాణాన్ని చేపట్టారు.

ఒకవైపు ప్రజలంతా బాక్సైట్ ఖనిజ తవ్వకాలను ముక్తకంఠంతో నిరసిస్తుండగా, బూర్జువా పార్టీలు సైతం (అనివార్య స్థితిలో) మేము కూడా వ్యతిరేకమేనని ప్రకటిస్తూ, ఇంకోవైపు పీసా కమిటీల్లో భాగస్వాములు కావడానికి పోటీ పడుతున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు ఒకలాగా, ప్రతిపక్షంగా మారాక మరోలాగా మాట్లాడుతున్న పాలక వర్గాల ద్వంద్వనీతి ఇప్పటికే ప్రజల అనుభవంలో ఉన్న విషయమే. ధనిక వర్గాలకు ప్రాతినిధ్యం వహించే ఈ పార్టీలన్నీ పేరుకు ప్రజా ఉద్యమాలు చేపట్టినా, అవి ప్రభుత్వ వ్యతిరేక మిలిటెంటు పోరాటంగా మారకుండా, ప్రజల ఆగ్రహాన్ని, వ్యతిరేకతను నీరుగార్చి ఓట్ల రూపంలో తమ పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తున్నవి.

గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు, పార్టీలు కూడా మోసపూరితమైన వాగ్దానాలతో ఆదివాసులకు ఉద్యోగాలు వస్తాయని, అభివృద్ధి చెందుతారని, మాయమాటలు చెప్పి, సీలేరు, మాచ్‌ఖండ్,

వ్యాధులకు సంబంధించినవే. కానీ గణాంకాలతో వీటిని రుజువు చేయడానికి వీలుపడడం లేదు. కారణం ఇటువంటి పనుల్లో ఉన్న కార్మికులు పేదరికం కారణంగా ఒకపాటి ఆనారోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు, చికిత్స వరకు పోరు. మొరాదాబాకు రోజుకు 9 టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వచ్చి పడుతుంటాయని ఆ జిల్లా మెజిస్ట్రేట్ దీపక్ అగ్రవాల్ వాపోవడం జరిగింది. విదేశీ వ్యాపారం, నిర్వహణలకు సంబంధించి అధ్యయనం చేసే సంస్థ (మొరాదాబాద్) వెలువరించిన నివేదికల ప్రకారం–హానికారక రసాయనాలు, బూడిద, పొగ, విషవాయువులు వంటి వన్నీ వ్యర్థాలను విడగొడుతున్నప్పుడు వెలువడుతాయి. ఇవన్నీ వాతావరణాన్ని పాడుచేయడమే కాక, నేల, నీరులను కూడా కలుషితం చేస్తాయి. కొన్ని వాయువులు క్యాన్సర్ కారకాలుగా ప్రజారోగ్యానికే ప్రమాదకరమవుతున్నాయి. పాదరసం, ఆర్సెనిక్ వంటివి అక్వా ఉత్పత్తులలో చేరి తద్వారా మానవ శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. ఇవి అత్యంత ప్రమాదకరమైన న్యూరో టాక్సిన్లు. ఇక జింక్, నికెల్ వంటివి నిదానంగా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి తప్ప వెనువెంటనే పరీక్షలలో బయటపడవు.

ఇక భారీ లోహాల కారణంగా ఏర్పడగల కాలుష్యాన్ని ఖచ్చితంగా లెక్కించగల ప్రమాణాలు మన దగ్గర లేవు. ఆ కారణంగా యునైటెడ్ స్టేట్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ప్రమాణాలు, కెనడియన్ ప్రమాణాలను అనుసరించి జరుపబడిన అధ్యయనాల ప్రకారం మొరాదాబాద్ – పరివాహక ప్రాంతంలో రామ్ గంగానది ఒడ్డున కిలోమీటర్ పొడవునా మట్టిని పరీక్షించగా కాడ్మియం 1.3 రెట్లు, క్రోమియం రెండు రెట్లు, రాగి ఐదు రెట్లు, జింక్ 15 రెట్లు సురక్షిత ప్రమాణాలకు మించి ఉన్నట్లు తేలింది. ఈ అధ్యయనాలను చేపట్టిన సిన్ఇ సంస్థ రామ్‌గంగా నది ఒడ్డున ఎలక్ట్రానిక్ వ్యర్థాలను మండించడాన్నీ నిషేధించాలని కోరుతోంది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల పరిశ్రమల యజమాను లను పరిశ్రమల నిర్వహణలో, తయారీలో, వ్యర్థాల నిర్వహణలో చట్టబద్ధంగా బాధ్యులను చేయాలనీ అప్పుడు యజమాన్యాల నిర్లక్ష్య ధోరణికి అడ్డుకట్ట పడుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే వ్యర్థాల నిర్వహణ చట్టబద్ధమైన విధానాలతో తద్వారా సురక్షితమైన పద్ధతుల్లో జరుగుతుంది. ప్రజారోగ్యానికీ, పర్యావరణానికీ భరోసా లభిస్తుంది. వీ

(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

బలిమెల, డొంకరాయి వంటి జల విద్యుత్ కేంద్రాలు పెట్టడం జరిగింది. ఈ విద్యుత్ కేంద్రాలలో ఆదివాసులకు ఏ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. భూములు కోల్పోయిన వారికి నామ మాత్రంగా నష్ట పరిహారం చెల్లించి చేతులు దులుపుకున్నారు. మన్యంలోనే నాలుగు జల విద్యుత్ కేంద్రాలు ఉన్నప్పటికి చాలా గ్రామాలకు కరెంట్ సౌకర్యం లేదు.

మరొకసారి బాక్సైట్ గనుల పేరుతో అభివృద్ధి ముసుగులో విధ్వంసం సృష్టించడానికి మన ముందుకు వస్తున్నారు. బాక్సైట్ ఖనిజం కొండలలో విస్తరించి, ఈ గుట్టల చుట్టూ 247 గ్రామాలు, 50 వేల మంది జనాభాకు పైనే ఉన్నారు. ఇక్కడ ప్రధానంగా పోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడి కొండల నుంచి బాక్సైట్ ఖనిజాన్ని బయటకు తీయాలంటే పెద్ద పెద్ద బుల్డోజర్లు, ప్రొక్లెన్స్ యంత్రాల ద్వారానే తీస్తారు. పోడు వ్యవసాయం భూముల్లో మట్టిని గుట్టలు, గుట్టలుగా పోసి చుట్టూ ఉన్న గ్రామాలను ఖాళీ చేయిస్తారు. ఈ గుట్టల చుట్టూ 25 కిలోమీటర్ల పరిధిలో వ్యవసాయ భూములకు దుమ్ము, దూళి సోకి పంట భూములు బీడు భూములుగా మారుతాయి. లక్షన్నర ఎకరాల్లో విస్తరించిన కాఫీ, టేకు, 65 రకాల కలపేతర అటవీ ఉత్పత్తులు, ఔషధ గుణాలున్న పిప్పళ్లమోడి, కరక్కాయ, పసుపు, అపరాల పంటలు అదృశ్యం కానున్నాయి. ప్రపంచంలో అరుదుగా కనిపించే బ్లెవిట్ గుడ్లగూబలకు అరకు ప్రాంతం నిలయం. బాక్సైట్ ఖనిజం వెలికితీయడం వలన ఈ జాతి పక్షుల ఉనికి ప్రశ్నార్థకమవుతుంది.

ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు గాలి కలుషితమై, అనేక రోగాల పాలై అనారోగ్యాలతో బాధపడతారు. ఇంకా అనేక సమస్యలు ఉత్పన్నమై అనేక ఇబ్బందులు పడతారు. ఈ విధంగా ఈ ప్రాంతం వదిలి వేరే ప్రాంతాలకు వలసపోయే పరిస్థితి వస్తుంది. ఒకపక్క ఉద్యోగాలు లేక ఉన్న భూములు కోల్పోయి, ఆదివాసి సంస్కృతి చిన్నా భిన్నమై, కూలీలుగా మారి అతి పేదరికంగా, దుర్భర జీవితం గడపవలసి వస్తుంది. అందుకే బాక్సైట్ ఖనిజాన్ని వెలికితీసే ప్రయత్నాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు.

అనాది కాలం నుంచి అడవిని నమ్ముకుని జీవిస్తున్న అడవి బిడ్డలు తమ హక్కులకై గొంతెత్తి నినదించిన ప్రభుత్వాలు, పాలక వర్గాలు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం కూడా భూస్వామ్య పెట్టుబడుదారులంతా సామ్రాజ్యవాద ఏజెంట్లుగా పనిచేస్తూ, వారి ఎజెండాను అమలు పరుస్తున్నారు. అడవిలో జీవిస్తున్న ఆదివాసులను అడవి నుండి దూరం చేస్తూ, అడవి నుంచి తరిమివేయాలి అని పాలక వర్గాలు కుట్రలు పన్నుతూ ఆదివాసుల బతుకులను సామ్రాజ్యవాదుల చేతుల్లో పెడుతున్నాయి. అందులో భాగంగా బాక్సైట్ ఖనిజ నిల్వలున్న చింతపల్లి, గూడెం, అరకు మండలాల నుంచి ఆదివాసి కుటుంబాలను తరలించేందుకు రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు. చింతపల్లి, గూడెం, మండలాల పరిధిలోని జెర్రెల గ్రూప్‌లో అత్యధికంగా 1200 ఆదివాసి కుటుంబాలు ఉన్నాయి. అరకు మండలంలోని రక్తకండిలో 1000 కుటుంబాలు, గాలికొండలో 500 కుటుంబాలు, చిట్టెంగొందిలో 50 కుటుంబాలు ఉన్నాయి. ఇవి కాకుండా తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీలో మరో 300 కుటుంబాలు ఉన్నాయి. మొత్తం 4,500 ఆదివాసి కుటుంబాలను తరలించడానికి ప్రయత్నిస్తున్నది.

ఆదివాసులను తరలించే క్రమంలో ఉత్పన్నమయ్యే పరిణామాలను ఎదుర్కోవడానికి 100 బిఎస్ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్) అవుట్ పోస్టు (పోలీస్ క్యాంపు) ల ఏర్పాటుకు పూనుకుంటున్నది. అందుకోసం పోలీసు విభాగానికి అవసరమైన సాధన సంపత్తిని, మౌలిక వసతులను కల్పించనుంది. అంతే కాకుండా మొబైల్ నెట్‌వర్క్ లేని ప్రాంతం లేకుండేలా ఏజెన్సీని మార్చుతున్నారు. ఈ మేరకు ఇప్పటికే విశాఖ జిల్లా పోలీసు యంత్రాంగంతో, ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి వర్గాలు సంప్రదింపులు జరుపుతున్నాయి. కేంద్రం నుండి తుది ఆమోదం రాగానే కార్యాచరణ చేపడతామని, జిల్లా ఉన్నతాధికార్లు మాట్లాడుతున్నారు. పైన పేర్కొన్న పరిణామాలను బట్టి చూస్తే, ఆదివాసి ప్రాంత హక్కులను, చట్టాలను తుంగలో తొక్కి, సాయుధ బలగాల బల ప్రయోగం ద్వారా ఖనిజ వనరులను కొల్లగొట్టి, అభివృద్ధి పేరుతో ఆదివాసి జీవన విధ్వంసం చంద్రబాబు ప్రభుత్వం చేయబోతుంది. దేశంలో ఆదివాసులు పోరాటం చేయడమే గాని, రాజకీయాలు చేయడం తెలియనందున ఆదివాసుల సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలు ఆదివాసుల మనుగడ దిన దినానికి ప్రశ్నార్థకంగా మారుతున్నది.

ప్రకృతిని మనం రక్షించుకుంటే ప్రకృతి మనల్ని రక్షిస్తుంది. ప్రకృతి సిద్ధమైన వాతావరణం కోసం అడవులు, చెరువులు, నదులను రక్షించుకోవాలి. వన్య ప్రాణుల వైవిధ్యాన్ని కాపాడుకోవాలి. కానీ పర్యావరణానికి విఘాతం కలిగించే విధంగా బాక్సైట్ ఖనిజం వెలికితీత ప్రయత్నం సాగుతుందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తూనే ఉన్నారు. 'అభివృద్ధి అంటే ప్రకృతి వనరులు, వృక్ష సంపద, జంతు సంపదను నాశనం చేయడం కాదు' అని అలాగే ఒక ప్రాంతంలోని ఒక వర్గ ప్రజల ప్రయోజనాల కోసం ఇతర ప్రాంత ప్రజలను బలిపెట్టడం తగదని అంతర్జాతీయ ప్రాజెక్టుల కమిషన్ కూడా తేల్చి చెప్పింది. అయినప్పటికీ మోడీ సర్కారు ఏకపక్షంగా గిరిజన, అటవీ, పర్యావరణ అనుమతులను సింగిల్ స్ట్రోక్‌లో మంజూరు చేసింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (5) ప్రకారం గిరిజన ఆస్తి ప్రయోజనాల రక్షణ ప్రభుత్వ విధి. ఎపి పంచాయతీరాజ్ సవరణ చట్టం 7/98 242 సి (1) ప్రకారం ప్రజల ఆచార, సంప్రదాయాలకు రక్షణకు ప్రభుత్వం పాటు పడాలి. కానీ గనుల అభివృద్ధి పేరుతో ఆదివాసులను బలి పశువులను చేయడం, ప్రభుత్వ పాలకులకు సరైనదేనా అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అధికారంలోకి రాకముందు భారత రాజ్యాంగాన్నీ, ఆదివాసి చట్టాలనూ పరిరక్షిస్తామని, మేనిఫెస్టోలో పెట్టుకుని గద్దెనెక్కినాక ఆ మాటలు నీటి మూటలవుతున్నాయి. దేశంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు జరిగినా, ఆ అభివృద్ధి ముసుగులో ఆదివాసుల సంపద, సంస్కృతి, జనాభా విధ్వంసానికి గురికావాల్సి వస్తున్నది. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మించుకోవడమంటే ఆదివాసులకు బతుకుదెరువు లేకుండా చేయడమా? లేక ఆదివాసులను గనుల్లో సమాధి చేయడమేనా? దీని కోసం ఆదివాసులు కొండలు దిగి రావడమా? ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివాసి ప్రజలకు సమాధానం చెప్పాలని నినదిస్తున్నారు.

'పొట్టకిచ్చిన, బట్టకిచ్చిన అడవే' అని బతుకుతున్న లక్షలాది మంది ఆదివాసులు బాక్సైట్ వెలికితీత మూలంగా, తాము సర్వస్వం కోల్పోతామని, కనుక తమ ప్రాణాలొడ్డయినా బాక్సైట్ తవ్వకాలను అడ్డుకుంటామని ఉద్యమిస్తున్నారు. ఈ ప్రాంతంలో నివసించే ఆదివాసులందరూ కలిసి బాక్సైట్ మైనింగ్ వ్యతిరేక పోరాట కమిటీని ఏర్పాటు చేసుకుని, అందరూ ఏకతాటిపైకి వచ్చారు. వారందరూ గత ఆరేడు మాసాలుగా తమ సమస్యలపై మిలిటెంట్ పోరాటం చేస్తున్నారు. 'ప్రాణాలొదిలైనా మా అడవిని, భూమిని రక్షించుకుంటాం కానీ ఇక్కడ

నుంచి వెళ్లేది లేదు' అని కరాఖండిగా చెప్పడం జరుగుతున్నది. ప్రజల సాయుధ ప్రతిఘటనను సహించలేని క్రూరమైన ఈ రాజ్యం ఆదివాసులపై విరుచుకుపడుతున్నది.

గత ఆగస్టు (2014) నెలలో గూడెం మండలం జెర్రెల పంచాయితీరాజ్ కేంద్రంలో బాక్సైట్ వెలికితీతకు వ్యతిరేకంగా, బాక్సైట్ వ్యతిరేక జెఎసి నాయకత్వంలో జరుగుతున్న బహిరంగ సభపై ఎపి గ్రేహౌండ్స్ పోలీసులు దాడి చేశారు. అయితే సభకు హాజరైన ప్రజలు తిరగబడడంతో కాలికి బుద్ధి చెప్పారు. ఆ తర్వాత సభకు మావోయిస్టులు వచ్చారనే ముందస్తు సమాచారంతో దాడి చేశామే తప్ప! ఉద్దేశపూర్వకంగా మాత్రం దాడి చేయలేదని అసత్యాలు, కట్టు కథలు చెప్పి నమ్మింపచేశారు. ప్రభుత్వం, గనుల కంపెనీల అధికారులు కుమ్మక్కై ఆదివాసులను అడవి నుండి ఖాళీ చేయించాలనే కుట్రలో భాగంగా, చేయని నేరాలను వారిపై మోపి నేరస్తులుగా చిత్రీకరించే కుట్ర చేస్తున్నారు. అందులో భాగంగా ఈ బాక్సైట్ గనులకు వ్యతిరేకంగా ప్రభుత్వ దమన నీతిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఆదివాసులలో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ ఆదివాసులను సంఘటిత పరుస్తున్నందుకు ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్. జె. అప్పారావును అక్రమంగా అరెస్ట్ చేసి, తప్పుడు కేసులు మోపి జైల్లో నిర్బంధించారు. అక్రమ అరెస్టును నిరసిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధన, బోధనేతర సిబ్బంది, మహిళలు రోడ్లపైకి రావడం జరిగింది. అన్ని వర్గాల వారు అక్రమ అరెస్టును ఖండించారు. ఇది మచ్చుకు మాత్రమే. ఇలాంటి ఘటనలు, సంఘటనలు విశాఖ ఏజెన్సీలో కోకొల్లలు. ఇది ముమ్మాటికి బాక్సైట్ వ్యతిరేక పోరాటాన్ని నీరుగార్చడానికే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని ఆదివాసులు ముక్తకంఠంతో నినదించారు. ఆదివాసులు ఇప్పుడు సామ్రాజ్యవాద విదేశీ, స్వదేశీ కబంధ హస్తాల్లో ఉన్నారు. గ్రీన్‌హంట్ పేరిట ఆదివాసులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధర్మ యుద్ధానికి దిగుతున్నాయి.

గ్రామాలపై మూకుమ్మడి దాడులు చేయడం, ప్రజల ఆస్తులను ధ్వంసం చేయడం, అక్రమ అరెస్టులకు పాల్పడడం, తప్పుడు కేసులు మోపి జైళ్లలో నిర్బంధించడం, మావోయిస్టుల ముద్ర వేసి లొంగుబాట్లకు గురిచేయడం సర్వసాధారణమై పోయింది. నిత్యం ఇనుప బూట్ల చప్పుళ్లతో మన్యం మారుమోగిపోతుంది. గతంలో వివిధ కాలాలలో అడవిలో స్వేచ్ఛగా తిరిగేవారు. కానీ నేడు అలా తిరగలేని పరిస్థితి నెలకొని ఉంది. వారి కదలికలను (అప్రకటిత) నిషేధించారు. దీంతో అడవి లేకుండా ఎట్లా బతకాలో అర్థం కావడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఈ ప్రాంతాలలో నిర్విరామంగా జరిగే (పోలిసింగ్) నిఘాలతో, కనిపించిన వారిని అనువణువున చెకింగ్‌లు చేయడం, అనుమానం వస్తే అరెస్టులు చేయడం ఇంటరాగేషన్ పేరుతో థర్డ్ డిగ్రీ పద్ధతులను అనుసరించి, తీవ్ర చిత్రహింసలకు గురి చేయడం పరిపాటయింది. హక్కులు పొందాల్సిన ఆదివాసి ప్రాంతంలో మానవ హక్కులు మృగ్యమవు తున్నాయి. అంతేకాదు ఇక్కడి ఆదివాసులకు శాంతియుతంగా ధర్నా నిర్వహించుకునే స్వేచ్ఛ కూడా లేదు. 'భావ ప్రకటనా చుట్టూ ఎన్నో ఇనుప కంచెలు, ఎంతో పోలీసు పహారా' అయినా అవన్ని భరిస్తూనే, నిర్బంధ శిబిరంలోనే పోరాటం కొనసాగిస్తున్నారు. గద్దల్లా మారిన పోలీసు మూకల చేత చిక్కిన ప్రజలను సాధారణంగా ప్రభుత్వం తల్లి కోడిలా మారి ఆదుకోవాలి. కానీ దుష్పరిపాలన, అవినీతి, నేర ముఠాలకు, గనుల మాఫియాకు నారు నీరు పోసి పెంచడం వంటి చర్యల ద్వారా చంద్రబాబు ప్రభుత్వం ఓ ఆకలిగొన్న గద్దలానే వ్యవహరిస్తోంది. ఈ పాలక వర్గాలు అభివృద్ధి ముసుగులో ఆదివాసులను అంతం చేసే దిశగా కుట్రలు పన్నుతున్నారనేది పచ్చి నిజం.

బాక్సైట్ ఖనిజం వెలికి తీయడం వలన సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థలు, దేశీయ బడా కంపెనీలు, కోస్తాంధ్ర వలస పాలకులు లబ్ధిపొందుతారని, ఆదివాసులు గనుల్లో సమాధి కావడమేనని, అత్యధిక సమాజం గొగ్గోలు పెడుతున్నది. కాని మన్యం బాక్సైట్ గనుల ప్రాజెక్టు వలన ఆదివాసులు విస్థాపితులవుతున్నా రావాల్సిన నిరసన రాకపోవడం చాలా బాధకరం. ఆదివాసులంటే ఎవరికి చెందినవారని అడవిలో నివసించే ఆదిమజాతియని సమాజం ఏమి అభిప్రాయపడిందో గాని, నాగరిక సమాజానికి పెను ప్రమాదకరం. ఆదివాసుల ఓట్ల ద్వారా లబ్ధి పొందిన రాజకీయ నాయకులు, పాలకవర్గ ప్రతినిధులు ఈ సమస్యలన్నింటిని పరిష్కరించే బాధ్యతను తీసుకున్నారు. కానీ వారు ఆయా పార్టీల నాయకుల చేతుల్లో ముఖ్యంగా అగ్రకుల కనుసన్నల్లో మెలుగుతున్నారు. దీనికి మన ఎన్నికల విధానం ఒక కారణం కావచ్చు. ఆదివాసుల కోసమే పనిచేస్తే, ఆదివాసేతరుల నుండి ఓట్లు రాలవేమోనని, అసలు సీట్లు ఇస్తారో లేదోనని వారి మనసుల్లో భయం నిండి ఉంటోంది. దీంతో వారు మరింత అవకాశవాదం వైపు వెళ్తూ, ఆదివాసుల ప్రయోజనాలను మంటగలుపుతున్నారు.

ఆదివాసులు చరిత్రలో వలసవాదులకు వ్యతిరేకంగా పోరాడుతూనే, స్థానిక పెత్తందార్ల, ముఠాదార్లకు, మొఖాసీదార్లకు, భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా పోరాడి, ప్రజాతంత్ర దృక్పథాన్ని కలిగిన సమాజాన్ని నిర్మించడానికి పూనుకున్నారు. అట్లాంటి ప్రగతిశీల సమాజాలలోని వందలాది గ్రామాలు విధ్వంసానికి గురి అవుతున్నా, వేలాది మంది ఆదివాసులు నిర్వాసితులవుతున్నా, తోటి ఆదివాసులుగా సహోదరుల పట్ల ఏమాత్రం బాధ్యతగా స్పందించకపోవడం, ఉద్యోగులు, రాజకీయ నాయకులు, విద్యార్థి యువజనుల వైఖరి ఆందోళనకరంగా ఉంది. ఇటువంటి వారిని ఉద్దేశించి డా.బి.ఆర్. అంబేద్కర్ అన్న మాటలను గుర్తు చేసుకోవడం సముచితంగా ఉంటుంది. 'ఎవరైనా మిమ్మల్ని తమ రాజభవనంలోకి ఆహ్వానిస్తే వెళ్లండి. కానీ మీ గుడిసెలను తగలబెట్టుకుని మాత్రం వెళ్లకండి. కొన్ని రోజుల తర్వాత ఆ రాజు మిమ్మల్ని కోటలోంచి గెంటేస్తే ఎక్కడికి వెళతారు? మీరు అమ్ముడు పోవాలంటే అమ్ముడు పోండి, కానీ మీ సంస్థలను, పునాదులను నాశనం చేసి మాత్రం కాదు. బయటవారి నుంచి నాకే ప్రమాదం లేదు. ప్రమాదమంతా సొంతవారి నుంచే' అన్న ఆయన మాటలు కటువుగా అనిపించినా అందులోని నిజాన్ని విస్మరించలేం. ప్రపంచీకరణ నేపథ్యంలో సమిష్టి జీవన విధానం విచ్చిన్నమయి-విధ్వంసం అవుతున్న మానవత్వంగా పరిగణించాల్సిన పరిస్థితి నెలకొన్నది.

విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ ఖనిజ తవ్వకాలతో ఆదివాసుల సామాజిక, సాంస్కృతిక జీవనాన్ని పెద్ద ఎత్తున విధ్వంసం సృష్టించే ఈ బాక్సైట్ ఖనిజాన్ని వెలికి తీయడం అవసరమా? పాలకవర్గ రాజకీయాలు, ఆ రాజకీయాల ప్రయోజనాల ఆధారంగా చేపట్టే బాక్సైట్ ఖనిజాల వెలికితీత, ఆదివాసుల అస్తిత్వాన్ని ప్రమాదంగా మార్చేస్తున్నాయి. అమానవీయమైన చంద్రబాబు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తమ అస్తిత్వ, ఆత్మ గౌరవ పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తూ జల్, జంగల్, జమీన్ కోసం స్వయం పాలనాధికారాల కోసం ఆదివాసులు సమైక్యంగా, సంఘటితంగా పోరాడాలి.

(రచయిత రాజనీతి శాస్త్ర విద్యార్థి) వీ

'ద్వేష'భక్తి !

దేశ భక్తి పేరుతో దేశంలోని మైనారిటీల పట్ల ద్వేషాన్ని ప్రదర్శిస్తూ, ప్రజాస్వామిక వాదులను హత్యలు చేస్తున్న మతోన్మాదుల చర్యలను అడ్డుకోకపోతే పెను ప్రమాదమే జరుగనుందని హెచ్చరిస్తున్నారు** **గుండెబోయిన శ్రీనివాస్

దేశముదుర్లు పెరిగిపోతున్న దేశం మనది! 'ద్వేష'భక్తుల పెంచి పోషించే సహనమూ మనది! దేశానికి హద్దులుంటే ఉండొచ్చు కానీ ద్వేషానికి హద్దులను ఇంతవరకు ఎవరూ నిర్ణయించలేదు. గురజాడ లాంటి మహానుభావులెందరో దేశమునే ప్రేమించమని చెప్పారు! ద్వేషాన్ని ప్రేమించమని చెప్పడానికి ఎవరికైనా ఎంత ధైర్యం కావాలి! చాప కింద నీరులాగా అట్లాంటి ధైర్యవంతుల సంఖ్య దేశవ్యాప్తంగా రోజురోజుకీ పెరిగిపోతున్నది. దేశాల మధ్య పెరిగే ద్వేషాలను ప్రాంతాల మధ్యకు పట్టుకురావడం – ప్రాంతాల ప్రజల మధ్య నలిగే సమస్యలను సరిహద్దుల వరకూ సాగతీయడం ఒక విధానంగా బలపడుతున్న కాలమిది. అందుకే అడ్డూఅదుపూ లేని ద్వేషానికి దేశంలో ఇప్పుడు పొద్దు పొడిచింది.

ద్వేషం రంగు, రుచి, వాసనలను తెలుసుకోవడానికి దేశదేశాలూ తిరగవలసిన అవసరం లేదు. అందుకు భారతదేశాన్ని మించిన భాగ్యవంతమైన దేశం మరొకటి లోకంలో ఎక్కడా కనిపించదు. ఇక్కడ ఎందరో స్వాములున్నారు. మహామహా సాధ్వీమణులున్నారు. వారిని తీర్చిదిద్దుతున్న సంస్థలున్నాయి. వారు మనకు అందిస్తున్న సందేశాలున్నాయి. ఈ దేశం కోసం వారు తీసుకుంటున్న శ్రద్ధ – ఈ దేశం మీద వారు వేస్తున్న ముద్ర కూడా మన ముందే ఉంది. ఈ దేశ ప్రజలుగా ఎవరు ఏ పని చేయవచ్చునో, ఎవరు ఏఏ పనులు చేయకూడదో చెప్పే కనిపించని కంచె ఒకటి జనాల మధ్యన నాటబడుతున్న విషయం కూడా చూపరులకు స్పష్టంగా కనిపిస్తూనేవుంది. ప్రేమికుల(పై) వేటను ప్రారంభించి ఎలా పేట్రేగిపోవాలో! డ్రెస్‌కోడ్‌లను రూపొందించి మహిళలకు కొత్త 'కట్టు'బాటలు వేయవలసిన అవసరం ఇప్పుడే ఎందుకు వచ్చి పడిందో, ఉచిత నిర్బంధ బోధనలలోని ఉటంకనలు చెబుతూనే ఉన్నాయి. ఎవరు ఎప్పుడు ఏ ఆహారాన్ని తీసుకోవాలో – దానిని అప్పుడే ఎందుకు తీసుకోవాలో – ఎవరెవరు ఎందరు పిల్లలను కనాలో, వారిని ఏఏ రంగాలకు అప్పగించాలో – ఎవరెవరు ఎందుకు పిల్లలను కనకూడదో, దాని వెనుక ఉన్న తాత్విక భూమిక ఏమిటో ఫర్మానాలు జారీచేసి మరీ చెప్పిన ప్రవక్తలు ఇప్పటి వరకూ ఎవరైనా ఉన్నారా చెప్పండి? శాతాలుగా తమ జనాభా పెరగడం కూడా కొన్ని వర్గాలకు శాపంగా పరిణమిస్తున్న కాలమిది.

ప్రజల తరఫున ఎన్నికైన వాళ్లకు కూడా పైనుండి ఏవో ఆదేశాలు అందుతుంటాయి. కేంద్రస్థాయి మంత్రులయినా వాళ్లు ఇంకొక అధికార కేంద్రం చుట్టూ తిరిగి వస్తూ ఉంటారు. అక్కడ వాళ్లిచ్చిన 'ఆదేశిక' సూత్రాలే ఆ తరువాత ప్రభుత్వ ఉత్తర్వులుగా బయటికి వస్తుంటాయి. ఈ సందర్భంగా దూషణ భూషణలతో నాయకులు ఒకరిపైనొకరు దుమ్మెత్తి పోసుకుంటుంటారు. గతాన్ని బయటికి తవ్వితీసి వర్తమానాన్ని గందరగోళం చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. అది కాంగ్రెస్ కావచ్చు, బిజెపి కావచ్చు, పార్టీలు ఏవైనా కానివ్వండి ఈ దేశంలో 'పైకమాండులు' లేని హైకమాండులు ఒక్కటీ లేవు. రాతలేని శాసనాలను రూపొందించి వాటిని 'అలిఖిత రాజ్యాంగం' ద్వారా అమలు చేయించ చూడడమే ఇక్కడ అసలు సిసలు రాజనీతి! అందుకు కావలసిన వ్యూహ రచనలు జరుగుతున్నాయి. ప్రత్యేక ప్రణాళికలూ సిద్ధమవుతున్నాయి. అవి పాఠ్య ప్రణాళికలలోనికి దర్జాగా ప్రవేశించి రాబోయే రోజుల్లో పాఠాలుగా మన ముందుకు రాబోతున్నాయి. చరిత్రను తిరగేసి రాయడం కూడా చారిత్రక కర్తవ్య నిర్వహణ కిందికే వస్తుందని మనం మరచిపోకూడదు! అందుకే చరిత్రకు రేపటి నుండి కొత్త చి(ప)గుళ్లు మొలవనున్నాయి.

మదర్ థెరిస్సా చేసిన సేవల వెనుక మత ప్రచార ధృక్కోణం ఉందని కనిపెట్టిన మహానుభావుని పేరు శాంతి బహుమతి కోసం ఇంకా నోబెల్ కమిటీకి పంపకపోవడం ఎందుకో వెలితిగా అనిపిస్తున్నది. దేశాన్ని అనునిత్యం కనిపెట్టుకొని (కాపలా) ఉండే వ్యక్తులకన్నా ద్వేషాన్ని ద్విగుణీకృతం చేసేవారే నిజమైన దేశ(ద్వేష)భక్తులని ఎలాంటి విచారణలు జరపకుండానే నిర్ధారణ చేసుకునే స్థాయికి భారత సమాజం ఎదిగినందుకు గర్వంగా అనిపిస్తోంది.

కులం, మతం, భాష – ప్రాంతం, దేశం! బహుళ జాతులు – బహుళ సంస్కృతులు! వీటి మధ్య సాంస్కృతిక వారధుల నిర్మాణం సవ్యంగా జరిగినట్లు కనిపించడం లేదు కదూ? లేకుంటే నీతికి నిలువ నీడ దొరకక అది నిప్పుల పంచన ఎందుకు బతుకుతుంది? ధర్మం తన దారి కోసం ఒంటికాలుపై ఎందుకు తపస్సు చేస్తుంది? కూల్చివేతలు, కాల్చివేతలు, సం'కుల' సమరాలు ఇస్తున్న సందేశం సరిగ్గా అందుతున్నట్టే కదా! ఒక వృద్ధ సాహితీకారుడి హత్య వెనుక ఉన్న ఉగ్రరూపం దర్శనమిస్తున్నది కదూ! విలువల్ని విప్లవీకరించడం కాదు, విధ్వంసంలో విప్లవాల సృష్టికి భూమిపూజ జరుగుతున్నట్టు అనిపించడం లేదూ? లేకుంటే నిలబెట్టాల్సిన వాటిని పడగొట్టడం – పడగొట్టి తీరాల్సిన వాటిని బలవంతంగా నిలబెట్టడానికి ముమ్మర ప్రయత్నాలు ఎందుచేత జరుగుతున్నట్లు? భారతదేశానికి బహుశా వాస్తుదోషం ఏమైనా ఉందేమోనని అనుమానంగా ఉంది కదూ! పరమత సహనాన్ని ఉగ్గుపాలలో రంగరించుకొని తాగేసిన వారికి విద్వేషపు విషం కక్కడం ఏఏ దినుసుల వాడకం వల్ల అలవాటుగా మారుతున్నదో ఇప్పుడు కనిపెట్టి తీరాల్సిన అవసరం ఉన్నది.

సహనాన్ని సహించలేని లక్షణమొకటి సహజంగానే అజెండా మీదికి వచ్చి చేరాక ఉన్మత్త విత్తనాల పంపిణీ ఊరూరుకీ నిశ్శబ్దంగా జరిగిపోతున్నది. ఇక వాటి మొలకలు మొగ్గలై, మానులై, ఊడలుదిగే పాడు కాలమొకటి మనకు దగ్గర్లోనే ఉందనిపిస్తోంది. ద్వేషానికి పురుడుపోసి దేశం మీదికి వదిలిపెట్టాక శాంతికి వాంతి కాకుండా ఆగుతుందా? అహింస అంపశయ్యను పలవరించకుండా ఆపడం ఎవరికైనా సాధ్యపడుతుందా? చూడబోతే ఆధునిక అశ్వమేధయాగానికి ఇక అంతా సిద్ధమవుతున్నట్టే కనిపిస్తున్నది!

(రచయిత ఉపాధ్యాయులు) వీ

బ్రిటిష్ - మోడీ పాలనలకు మధ్య తేడా ఉందా?

బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలనకూ, మోడీ కాషాయీకరణ పాలనకూ మధ్య పెద్ద తేడా ఏమీ లేదనీ, పాలకవర్గాలు ఎప్పుడూ ప్రజలను అణచి దోచుకోవడానికే విధానాలు రూపొందిస్తాయనీ అంటున్నారు **వి. హనుమంతరావు**

బ్రిటిష్ పాలనకు, మోడీ పాలనకు తేడా ఏమిటని ఒక మిత్రుడు నన్ను ప్రశ్నిస్తే, నీ ప్రశ్నే దారుణంగా ఉంది. అపుడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పాలిస్తే ఇపుడు మనది సతంత్ర దేశం, మనల్ని మనమే పరిపాలించుకుంటునాం. ఇది భూమి, ఆకాశానికి మధ్య ఉన్నంత తేడా అని పరుషంగా జవాబిచ్చా. మా ఇద్దరి మధ్య వాగ్యుద్ధం ప్రారంభమైంది. ఈ ప్రశ్నను నువ్వే వేశావు కాబట్టి ముందు నీవే నీ వాదనలను వినిపించు అన్నాను.

1) బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ప్రత్యక్ష పాలనను విరమించుకుని వెళ్లిపోయారు కాని ఇపుడు ఆ స్థానాన్ని మోడీ ఆహ్వానించగా, అమెరికన్ సామ్రాజ్యవాదులు పరోక్ష పరిపాలన చేపట్టారు.

2) బ్రిటిష్ పాలనలో బెంగాల్‌లో కరువు వచ్చి లక్షల మందిని ఆకలితో చంపేశారు. ఇప్పుడు మోడీ పాలన పుణ్యమా అంటూ రుణ భారంతో వేల మంది ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి.

3) తెల్లవాడి పాలనలో బ్రిటిష్ సైనికులు భారతీయ స్త్రీలపై యథేచ్ఛగా మానభంగాలకు పాల్పడేవారు. ఇపుడు మోడీ పాలనలో మానభంగాలు యథేచ్ఛగా జరిగిపోతున్నాయి. మోడీ అధికార పీఠం ఢిల్లీలోనే ఇలాంటి వార్తలు పత్రికల్లో చూస్తున్నాం.

4) అప్పుడు చదువు సంధ్యలు చాలా చాలా తక్కువైనా, ఉన్నంత మటుకు క్రమ శిక్షణ పాటించేవారు. తెలుగు బోధనా భాషగా ఉండేది. ఇప్పుడు పాఠశాలలు ఎలా ఎంత అధ్వానంగా పనిచేస్తున్నాయో అందరికీ తెలిసిన విషయమే. ఐదో తరగతి విద్యార్థికి రెండో తరగతి పుస్తకం చదవడం రాదు. పిల్లలే కాదు ఉపాధ్యాయులే డుమ్మా కొట్టేస్తున్నారు. ఈ మధ్య మోడీ అమెరికా వెళ్లగా టెక్నాలజీ విషయంలో భారతీయులే అగ్రస్థానాల్లో ఉన్నారు. వాళ్లు తమ దేశాన్ని వదిలి అమెరికా ఎందుకు వెళ్లిపోయారో, అపుడు కాంగ్రెస్ ఇపుడు మోడీ ఆలోచించాల్సిన పనిలేదు. ఎందుకంటే ఇక్కడి ప్రజలకు విద్య అబ్బితే వాళ్లు ఆలోచించడం ప్రారంభిస్తారు. పాలకుల పీఠాలు కదిలిపోతాయి. అంతే కాదు, విద్య అబ్బితే ఉద్యోగాలు కావాలంటారు.

5) బ్రిటిష్ పాలకులు తాము భారతీయులను సివిలైజ్ చేస్తున్నామనే వారు. మోడీ వచ్చి కాషాయీకరణ చేస్తున్నానంటున్నారు.

6) అప్పుడు తెల్లతొక్కవారినే ఉన్నతాధికారులుగా నియమిస్తూ, వారి పరిపాలనా పద్ధతులను దిగుమతి చేశారు. స్వతంత్రం వచ్చిన తర్వాత వారిని వెళ్లగొడితే, అంత అనుభవం లేని భారతీయాధికారులు పాలించడం ప్రారంభిస్తే పరిపాలన అస్తవ్యస్థం అవుతుందని, బ్రిటిష్ పరిపాలనా పద్ధతులనే, బ్రిటిష్ పాలనలో ఉన్న భారతీయులనే కొనసాగించారు. బ్రిటిష్ పాలనా పద్ధతులంటే తిండికి గతిలేకుండా చేయడం. గ్రామీణ ప్రాంతాలను నిర్లక్ష్యం చేయడం, అభివృద్ధి కార్యక్రమాలను పక్కన పెట్టడం, ఆ పద్ధతులే కాంగ్రెస్ పాలనలో, నేడు మోడీ పాలనలో కొనసాగు తున్నాయి. అపుడు బ్రిటిష్ పాలకులు తెల్లతొక్కవాళ్లను అధికార పీఠాలపై కుర్చొబెడితే, ఇపుడు కాషాయ కషాయం పుచ్చుకున్న వారిని అధికార పీఠాల మీద కూర్చోబెడుతున్నారు మోడీ. గుజరాత్‌లో తనకు జోహుకుం చేసిన వారిని ఢిల్లీకి తీసుకుని వచ్చారు. 2014లో ఓడిపోయిన వ్యక్తిని తన ఆర్థికమంత్రిగా నియమించు కున్నారు. ప్రభుత్వ నియమ నింబంధన లకు వ్యతిరేకంగా ఒక అధికారిని తన ప్రిన్సిపల్ కార్యదర్శిగా ఏర్పాటు చేసుకున్నారు. బ్రిటిష్ పాలకులకు, మోడీకి తేడా ఏమిటి?

7) భారత ప్రజలను హిందువులు, ముస్లింలుగా విడగొట్టి బ్రిటిష్ పాలకులు పాకిస్థాన్‌ను ఏర్పాటు చేశారు. ఈ గొడవల్లో వేల మంది చనిపోయారు. ఇపుడు దేశంలోనే మాది హిందూ దేశమనే పేరుతో, ముస్లింల మీద కాషాయ మూకలు దాడులు చేస్తున్నారు. కొన్ని గ్రామాల నుంచి ముస్లింలను తరిమేస్తున్నారు. కొంత మంది ముస్లింలను చంపేస్తున్నారు. ఇదేనా హిందువుల సంస్కృతి?

8) వాగ్దానాలనే నల్లమందిచ్చి, పాలకులు ప్రజలను జోకొట్టుతూ కాంగ్రెస్ పాలిస్తే, మోడీ బృందం ఆ నల్ల మందుకు కాషాయమనే విషాన్ని పూసి ఇది నల్లమందు మాత్రమేనంటూ మోడీ అనుయాయులు ప్రభావ లాలసలో పడేస్తున్నారు. ఇలా ప్రజలను మోసం చేయాలని ఏ పురాణాల్లో ఉంది?

9) హేతువాదులు కాషాయవాదుల తుపాకి గుండ్లకు బలైపోతున్నారు. మేధావులు తమకిచ్చిన ప్రశంశా పత్రాలను తిరిగి ఇచ్చేస్తున్నారు. బ్రిటిష్ పాలనలో ఇలాంటి ధోరణులు వినరాలేదు.

10) శాస్త్ర పరిశోధనలను స్థాపించి ప్రధాన పరిశోధకులను నియమించి బ్రిటిష్ పాలకులు వాటిలో జోక్యం చేసుకోలేదు. కాని మోడీ పలు సంస్థల్లో జోక్యం చేసుకుని వాటి అధికారులను తొలగించి కాషాయులను నియమించారు.

11) అపుడు ఆయా రాష్ట్రాల భాషల్లో ప్రాథమిక స్థాయి పుస్తకాలను రచించే పని ఆయా భాషల్లో నిశ్నాతులను నియమించారు. ఇపుడు కాషాయ భాషల్లోకి మార్చేపని ప్రారంభించింది మోడీ ప్రభుత్వం.

12) అపుడు దేవాలయాలను, మసీదులను కూల్చివేయలేదు. ఇపుడు మోడీ అనుయాయులు ఆ పనికి పునాదులు వేస్తున్నారు.

13) అపుడు పాలకులు బ్రిటిష్ పాలకుల విగ్రహాలు అనేక రాష్ట్రాల్లో నిర్మించారు. నగరాల్లో వాళ్లకు పూర్వం పాలించిన ముస్లిం ప్రముఖుల పేర్లు పెట్టారు. ఇపుడు మోడీ శిష్యులు ఆ పేర్లమీద దాడి చేస్తున్నారు.

14) బ్రిటిష్ పాలకులు గాంధీజీని జైలులో నిర్బంధించారు. ఆయన

వ్యవసాయ సంక్షోభం - పరిష్కారాలు

పాలకులు వ్యవసాయానికి అనుబంధ పరిశ్రమలు నెలకొల్పకపోవడంతో అది సంక్షోభంలోకి నెట్టబడి దళారీలకు, పెట్టుబడిదారులకు లాబసాటిగా మారిందనీ, భూమిని సమాజ పరంచేసే మౌలిక మార్పులే సంక్షోభాలకు పరిష్కారాలనీ అంటున్నారు **కె. సురేష్**

మానవులు వేట, సేకరణ మీద ఆధారపడి ఉన్నంత కాలం అందరూ అదే పనిలో ఉండాల్సిన స్థితి ఉండేది. వ్యవసాయం మొదలైన తరువాతనే ఆహార ఉత్పత్తి నుంచి కొందరు విముక్తం కావటానికి అవకాశం కలిగి, క్రమేపీ ఇతర వృత్తులపై ఆధారపడే సమూహాలు ఏర్పడటానికి వీలయ్యింది. వ్యక్తిగత ఆస్తికీ, శ్రమ దోపిడీకీ (పరిమితులకు లోబడి ప్రకృతి దోపిడీకి కూడా) వ్యవసాయమే దారి తీసింది. వేటాడే స్థితి నుండి వ్యవసాయానికి రావడానికి చాలా కాలం పట్టింది.

కాలక్రమంలో పల్లెలు, చిన్న పట్టణాలు ఏర్పడ్డాయి. వస్తు మార్పిడితో మొదలయ్యి క్రమేపీ వాణిజ్యం వృద్ధి చెందింది. ఆయా ప్రాంతాల భౌగోళిక, వాతావరణ పరిస్థితులు, సహజవనరులపై ఆధారపడి వ్యవసాయమూ, ఇతర వృత్తులూ, వాణిజ్యం వృద్ధి అయ్యాయి. శిలాజ ఇంధనాలైన బొగ్గును, ఆ తరువాత చమురును కనుగొనటంతో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వేగవంతం అయ్యాయి; వాణిజ్య పరిమాణం, విస్తృతి పెరిగాయి.

పరిశ్రమలకు అవసరమైన శ్రామికుల కోసం ఇంగ్లాండు దేశంలో పల్లెల్లో ఇళ్లను తగలబెట్టి పట్టణాలకు తరిమివేశారు. మొదట్లో పట్టణాలలో కార్మికుల పని పరిస్థితి, నివాస పరిసరాలు దారుణంగా ఉండేవి. అయితే ఆ దేశానికి వలస పాలన ద్వారా ఇటు ముడిసరుకులకు, అటు పారిశ్రామిక ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లు అందుబాటులోకి రావటంతో పారిశ్రామిక అభివృద్ధితోపాటు అక్కడి పని పరిస్థితులు, కార్మికుల పరిస్థితులు మెరుగుపడుతూ వచ్చాయి.

పెట్టుబడిదారీ వర్గం బలోపేతం కావటానికే రకరకాల ప్రభుత్వ పథకాలు

వ్యవసాయ యాంత్రీకరణ వల్ల పాశ్చాత్య దేశాలలో పెద్ద, పెద్ద కమతాలు ఏర్పడ్డాయి. అయితే అక్కడ కూడా 'కుటుంబ' ఆధారిత వ్యవసాయం తగ్గుతూ కార్పొరేటీకరణ జరుగుతోంది. ప్రస్తుతం పాశ్చాత్య, పారిశ్రామిక దేశాలలో 3 శాతం ప్రజలు మాత్రమే వ్యవసాయంలో ఉన్నారు. అభివృద్ధి అంటే ఇదేనన్న భావజాలం వ్యాప్తిలో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయ పరిశ్రమ చాలా కొద్ది కార్పొరేట్ సంస్థల చేతుల్లో ఉంది. బ్రిటిష్ వాళ్లనుండి అధికార మార్పిడి నాటికి మన దేశం వ్యవసాయ ప్రధాన దేశంగా ఉంది. పారిశ్రామిక పంథాని ఎంచుకున్న పాలక వర్గాలు మొదటి పంచవర్ష ప్రణాళికలో తప్పించి ఆ తరువాత ఎన్నడూ వ్యవసాయానికి ఇవ్వాల్సినంత ప్రాధాన్యత ఇవ్వలేదు.

ఇతర అంశాలతోపాటు పరిశ్రమలకు తక్కువ వేతనాలకు పనిచేసే శ్రామిక వర్గం కావాలి. పల్లెల నుంచి పట్టణాలకు ప్రజలు తరలివెళ్లటాన్ని ప్రభుత్వం ప్రోత్సహించింది. అంతేకాకుండా వీరికోసం పౌర సరఫరా

ప్రారంభించిన ఉద్యమాల మీద లాఠీ ఛార్జీలు, కాల్పులు జరిపారు. అదే సమయంలో గాంధీజీ ప్రారంభించిన స్వాతంత్రోద్యమం గురించి అనేకసార్లు చర్చించారు. లండన్‌లో కూడా ఆయనతో సమావేశ మయ్యారు. కాని మోడీ భాగస్థుడైన ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు సావర్కర్‌ను కుట్రదారునిగా 1961 సెప్టెంబర్ 30న జీవన్‌లాల్ కమిషన్ నివేదిక నిచ్చింది. అలాంటి సావర్కర్‌కు మోడీ అధికార పీఠం నదిష్టించిన మూడవ రోజునే నివాళులర్పించారు.

15) బ్రిటిష్ పాలనలో ఆ దేశ రాణి ప్రతినిధిగా మన దేశాన్ని వైస్‌రాయ్, ఆయన కింద గవర్నర్-జనరల్, రాష్ట్రాల్లో గవర్నర్లు పరిపాలనా విధులు నిర్వహించేవారు. మనదేశ సహజ వనరులను వారి దేశానికి తరలించుకుపోవడమే వారి ప్రధాన లక్ష్యం. దేశ పరిపాలన అంతా కేంద్రం చేతుల్లో ఉండేది. తెల్లదొరలు పోయి, నల్లదొరలు వచ్చి ఆ దోపిడీ కార్యక్రమాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. తమ పార్టీ నాయకులను గవర్నర్లుగా, ముఖ్యమంత్రులుగా నియమించుకున్నారు. రాష్ట్రాల సహజ సంపదపై అధికారాన్ని దాఖలు పరుచుకున్నారు. రాజ్యాంగం ప్రకారం కొన్ని అధికారాలను కేంద్రం చేతుల్లో, కొన్ని అధికారాలను రాష్ట్రాలకు ఇచ్చి, మరికొన్ని అధికారాలను కేంద్ర, రాష్ట్ర జాయింటు పరిధిలో ఉంచారు. కాని ఆచరణలో కొన్ని అధికారాలు చట్టరీత్యా రాష్ట్రాల పరిధిలో ఉన్నా, ఆచరణలో కేంద్రమే పెత్తనం కొనసాగిస్తోంది. ఉదాహరణకు వ్యవసాయ రంగాన్ని తీసుకుంటే ధాన్యం ఎంత పండించాలి, ఎరువులను ఎంతెంత రాష్ట్రాలకు పంచాలి, ధాన్యం పంట తరుగు రాష్ట్రాలకు ఏ రాష్ట్రం ఎంత ఎగుమతి చేయాలి అనే విషయాన్ని కేంద్రమే నిర్ణయిస్తుంది. పరిశ్రమల్లో ఉత్పత్తి ధరలను ఆయా పరిశ్రమాధిపతులే నిర్ణయించుకుంటారు. కాని వ్యవసాయోత్పత్తుల ధరలను కేంద్రమే నిర్ణయిస్తుంది. ఇది రైతుల హక్కును కేంద్రం దఖలు పరుచుకుంటుంది. కేంద్ర పార్లమెంట్‌లో సుమారుగా పూర్తి అధికారాన్ని దఖలుపరుచుకున్న మోడీ ప్రభుత్వం రైతులపై చిన్న చూపు చూస్తుంది. నూటికి 70 మంది వ్యవసాయంపై ప్రత్యంక్షంగా, పరోక్షంగా ఆధారపడుతున్న రైతాంగం, ఇతరులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే, గుడ్లప్పగించి చూస్తున్న మోడీ అపుడు బ్రిటిష్ పాలకులకు, తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వాలకు, మోడీ ప్రభుత్వానికి తేడా ఏమిటి?

నా మిత్రుడు వేసిన ఈ ప్రశ్నలకు మీకు మీరు జవాబు చెప్పుకోండి. ఇంతకన్నా పెద్ద ప్రశ్న కేంద్ర, రాష్ట్ర సంబంధాలు ఎలా దిగజారి, అధికారాలు కేంద్రం చేతుల్లో, అంటే మోడీ చేతుల్లో అంటే ఆర్‌ఎస్‌ఎస్ చేతుల్లోకి కేంద్రీకృతమవుతుందో వచ్చే 'వీక్షణం' సంచికలో చూడండి.

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

వ్యవస్థ ద్వారా చౌక ధరలకు ఆహార ధాన్యాల సరఫరాను చేపట్టింది. చౌక ధరల దుకాణాల ద్వారా ప్రధానంగా లాభపడింది పట్టణ కార్మిక, మధ్య తరగతి వర్గాలే.

చౌక ధరల దుకాణాలలో అమ్మే ఆహార ధాన్యాల కోసం ప్రభుత్వం ఎంచుకున్న విధానాన్నే మనం హరిత విప్లవంగా పేర్కొంటున్నాం. వనరులు, అంటే సారవంతమైన నేలలు, నీరు పుష్కలంగా ఉండే ప్రాంతాలను ప్రభుత్వం ముందుగా ఎంచుకుంది. ఆనకట్టలు, కాలువల నిర్మాణం ద్వారా సాగునీటి వ్యవసాయ విస్తృతిని పెంచింది. ప్రభుత్వ, సహకార రంగాలలో ఎరువుల కర్మాగారాలను స్థాపించింది. మనుగడ వ్యవసాయం నుంచి మార్కెట్‌కోసం అదనపు ధాన్యపు ఉత్పత్తిని సాధించడానికి ప్రభుత్వం చెయ్యవలసినవన్నీ చేసింది-రసాయనిక, పారిశ్రామిక ఉత్పాదకాలపై సబ్సిడీలు, యాంత్రీకరణ, వ్యవసాయ విస్తరణ, కనీస మద్దతు ధర, ధాన్యం కొనుగోలు వ్యవస్థ, వగైరా.

ఈ విధానాల వల్ల పరిశ్రమలు, పెద్ద రైతులు లాభపడ్డారు. ఈ విధానాలను సమర్థించేవాళ్లు దీని వల్ల భారతదేశం ఆహారంలో స్వయం సమృద్ధి సాధించిందని అంటారు. విమర్శించే వాళ్లు ధనిక-పేద రైతుల మధ్య అంతరం పెరిగిందని, పర్యావరణం కాలుష్యానికి లోనయ్యిందని, అన్నిటికిమించి రైతు పరాధీనుడై మార్కెట్ మీద ఆధారపడే పరిస్థితి ఎదురయ్యిందని అంటారు.

వ్యవసాయ రంగంలో క్రమేపీ ప్రభుత్వ పెట్టుబడులు, ఖర్చు తగ్గిపోతూ వస్తున్నాయి. వ్యవసాయంలోని మిగులు సంపదను పెద్ద రైతులు తిరిగి వ్యవసాయంలో కాక ఇతర రంగాలలో పెట్టుబడిగా ఉపయోగించసాగారు. వ్యవసాయ సంక్షోభానికి ఇది మొదటి కారణం.

వ్యవసాయంలో ఎంత మంది ఉండాలి?

స్థూల జాతియోత్పత్తిలో వ్యవసాయ వాటా గణనీయంగా పడిపోయినా, వ్యవసాయంపై ఆధారపడిన జనాభా ఆ దామాషాలో పడిపోవటంలేదు. అంటే వ్యవసాయం లాభసాటిగా లేదనీ, పారిశ్రామిక దేశాలను ఆదర్శంగా తీసుకుని పల్లెల్లో 40 శాతం కంటే ఎక్కువ జనాభా ఉండకూడదంటూ ఏవో లక్ష్యాలను పెట్టుకుని ఆ దిశగా పాలక వర్గాలు కృషి చేస్తున్నాయి. పరస్పరం విరోధించుకునేవిగా అనిపించినా అన్ని రాజకీయ పార్లమెంటరీ పార్టీలు అవలంబించే విధానాలలో మౌలికంగా తేడా లేదు. పెట్టుబడిదారీ వర్గాలకు లాభం చేకూర్చటానికి అవసరమైనప్పుడు అనేక ప్రజా సంక్షేమ ముసుగులు తొడుక్కుని, అవసరంలేనప్పుడు ముసుగులు లేకుండా బహిరంగంగా కృషిచెయ్యటానికి అన్ని పార్టీలు సిద్ధంగా ఉన్నాయి. ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణకు అనుగుణంగా పెట్టుబడులను ఆకర్షించటానికి, పరిశ్రమలను ప్రోత్సహించటానికి ఇవి కంకణం కట్టుకున్నాయి. అన్ని రకాల క్రమ, అక్రమ మార్గాల ద్వారా పెట్టుబడిదారీ వర్గాలు బలపడటానికి ఇవి సహకరిస్తున్నాయి.

'అభివృద్ధి' దశలో మనం ఎక్కడున్నాం?

అయితే, ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులలో మన దేశం నిజమైన పారిశ్రామిక దేశంగా ఎదిగే అవకాశాలు లేవు. ప్రాథమిక, కనీస ద్వితీయ పారిశ్రామిక ఉత్పత్తులపై కాకుండా మనం ప్రధానంగా సేవారంగం మీద ఆధారపడి ఉన్నాం. సేవా రంగంలో ఉపాధి అవకాశాలు ప్రస్తుతానికి గణనీయంగానే ఉన్నాయి. మన దేశ మధ్య తరగతి ప్రజలు ఊహించని 'వస్తు సంపద', 'వినియోగదారీ సంస్కృతి' కి ఇది దారి తీసింది. 'అభివృద్ధి' అంటే ఇదే అన్న భావజాలం బలంగా పాతుకుపోయింది. అయితే పల్లె పట్టుల నుంచి వస్తున్న ప్రజలందరికి ఇది పూర్తి ఉపాధిని కానీ, మెరుగైన జీవన ప్రమాణాలను కానీ అందించలేదు.

మూలధనం పోగుబడడం (కాపిటల్ అక్యుములేషన్)లో అదనపు విలువ రూపంలో శ్రమ దోపిడీ ఎంత కీలకమో, దోపిడీ (ప్లండర్), మోసం, అవినీతి, ప్రభుత్వ విధానాల మానిప్యులేషన్ కూడా అంతే కీలకం. పెట్టుబడిదారీ విధానం వృద్ధి చెందుతున్న కొద్దీ దోపిడీ, మోసాలు (కనీసం 'తమ' ప్రాంతాల, 'తమ' ప్రజలపై) తగ్గుముఖం పడుతూ ఉంటాయి. కానీ, ప్రస్తుతం మనం ఉన్న ఆర్థిక దశలో ఈ దోపిడీ, మోసాలే ఇంకా సంపద సమకూర్చుకోటానికి ప్రధాన మార్గాలుగా ఉన్నాయి. పెద్ద ఎత్తున నకిలీ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు చలామణి కావటానికి ఇది కూడా ఒక కారణం. ధనిక రైతులు, చిన్న వ్యాపారస్తులు, పాలక వర్గాల ఆశ్రితులు ఇటువంటి మోసాలకు పాల్పడుతున్నారు. డబ్బు అవసరం ఉన్న వాళ్లకి అధిక వడ్డీలకు అప్పులు ఇవ్వటం, అధిక వడ్డీల ఆశ చూపి మోసం చెయ్యడమూ సంపదకు మార్గాలుగా ఉన్నాయి. ఇక మార్కెట్ మోసాలు చెప్పనవసరం లేదు. ధర, తూకం దగ్గర నుంచి అసలు డబ్బు చెల్లించకుండా బోర్డు తిప్పేసే, పారిపోయే వ్యాపారులు నిత్యమూ ఉంటూనే ఉన్నారు. వ్యవసాయ రంగంలో సంక్షోభానికి ఇది మరొక కారణం.

మధ్యలో ఆగిపోయిన సామాజిక మార్పు ప్రక్రియలు, తగ్గిపోతున్న ప్రభుత్వ పాత్ర

అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలకు మన దేశ పాలకవర్గాలు తల ఒగ్గటం వల్ల, ఇతర కారణాల వల్ల వ్యవసాయ ఉత్పాదకాలపై, డీజిలుపై ఇచ్చే సబ్సిడీలను ప్రభుత్వాలు తగ్గించుకుంటూ వస్తున్నాయి. ఇంకొకవైపు పౌర సరఫరా విధానంలో మార్పుల వల్ల మద్దతు ధర, ప్రభుత్వ కొనుగోళ్లలో కూడా మార్పులు వస్తున్నాయి. హరిత విప్లవం వంటి ప్రభుత్వ విధానాలతో వ్యవసాయం ద్వారా లాభపడిన శూద్ర పైకులాల వాళ్లు దాని నుంచి ప్రత్యక్షంగా తప్పుకున్న తరువాత శూద్ర కింది కులాలు వ్యవసాయంలోకి వస్తున్న తరుణంలో ఈ మార్పులు వాళ్లను సంక్షోభంలోకి నెడుతున్నాయి.

బ్రిటిష్ పాలనలో జమిందారు వ్యతిరేక ఉద్యమం వల్ల, ఇతర విధానాల వల్ల సాగుచెయ్యని వర్గాల నుంచి సాగుచేసే శూద్ర పైకులాల చేతుల్లోకి చాలావరకు భూమి వచ్చింది. ప్రభుత్వ రంగంలోని విద్య, వైద్య సదుపాయాలను ఈ సామాజిక వర్గాలు అందిపుచ్చుకున్నాయి. అప్పటి ప్రభుత్వ వ్యవసాయ విధానాలు, ప్రభుత్వ ఉద్యోగాల వల్ల ఈ వర్గాలు బాగా లాభపడ్డాయి. ఈ సామాజిక వర్గాలు ఇప్పుడు ఆధిపత్య వర్గాలుగా బలపడ్డాయి. ఏరు దాటిన తరువాత తెప్ప తగలబెట్టినట్టు ఇప్పుడు ప్రభుత్వం విద్య, వైద్య, సంక్షేమ రంగాల నుంచి తప్పుకోవాలని కేవలం సుపరిపాలనపై దృష్టి పెట్టాలని ఈ వర్గాలు కోరుతున్నాయి.

భూసంబంధాలలో మార్పులు తీసుకురావటానికి చేపట్టిన భూసంస్కరణలు, భూపరిమితి చట్టాలు ఒకటి, రెండు రాష్ట్రాలలో మినహాయించి సక్రమంగా జరగలేదు. మొదట్లో చేపట్టిన ఉమ్మడి వ్యవసాయ విధానానికి ప్రభుత్వం వెంటనే తిలోదకాలు ఇచ్చింది. సహకార వ్యవస్థ రైతుల మధ్య సహకారానికి కాక రాజకీయ సోపానంలో మొదటి మెట్టుగా మారిపోయింది.

ఒకప్పుడు 'దున్నేవానికి భూమి' అన్న నినాదంతో లబ్ధి పొందిన వర్గాలు ఇప్పుడు వ్యవసాయంతో ప్రత్యక్ష సంబంధంలేని

భూయజమానులుగా ఉన్నారని అనుకున్నాం. ఇప్పుడున్న రాజకీయ, ఆర్థిక నేపథ్యంలో భూసంబంధాలు ఇంకొక మెట్టు కింద ఉన్న సామాజిక వర్గాలకు అనుకూలంగా కాకుండా పారిశ్రామిక, కార్పొరేట్ రంగాలకు అనుకూలంగా మారే సూచనలే కనపడుతున్నాయి. భూసేకరణ, భూపరిమితి చట్టాలను సవరించటం, లేదా సవరించటానికి పూనుకోవటం; ప్రత్యేక ఆర్థిక మండళ్లు మాదిరిగా ప్రత్యేక వ్యవసాయ మండళ్లను ప్రతిపాదించటం దీనిని సూచిస్తుంది.

ఒప్పంద సేద్యం, ఇజ్రాయల్ తరహా సేద్యం వంటి వాటికి చేసిన, చేస్తున్న ప్రయత్నాలు కార్పొరేటీకరణకు సహకరించేవే. వరి కోత వంటివి ప్రస్తుతం కూలీలు లేదా వరికోత యంత్రాలతో గుత్తకి చేపడుతున్నారు. వరికోతలే కాకుండా, నాట్లు/ విత్తటం, పురుగుల నియంత్రణ వంటి 'సేవలు' విస్తృత ప్రాంతంలో కార్పొరేట్ రంగం ద్వారా చేపట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కోళ్ల పెంపకం, ఎగుమతికి ఉద్దేశించిన కూరగాయలు, పూల వంటి వాటిల్లో కాంట్రాక్టు పద్ధతుల్లో విత్తనం, ఉత్పాదకాలు, సాంకేతిక సలహా, కొనుగోలు వంటివన్నీ కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి మారి రైతు నిమిత్తమాత్రుడౌతున్నాడు.

పుష్, పుల్ కారకాలు

పెట్టుబడిదారీ విధానం అసమానతలకు కారణమే కాకుండా వాటిని పెంచుతుందికూడా. ఓడలు బళ్లు, బళ్లు ఓడలు అయ్యే నిరంతర ప్రక్రియలో ధనికులు పేదల మధ్య అంతరాలు నిరంతరం పెరుగుతూ ఉంటాయి. కొందరు ధనికులు పేదలుగా, కొందరు పేదలు ధనికులుగా మారే ప్రక్రియలో ఆధిపత్య భావజాలం పైకి ఎదిగిన వాళ్లను ఆదర్శంగా చూపుతుంది. అనివార్యంగా ఈ పరుగులో అందరూ పాల్గొనాల్సిందే. అందులో పాల్గొననివాళ్లని ఈ సమాజం వదిలిపెట్టదు, ఓడిపోయిన వాళ్లని పట్టించుకోదు. కింద పడిన వాళ్లది దురదృష్టం, కాలం కలిసి రాలేదు, అసమర్థత, అత్యాశ, వగైరా, వగైరా.

ప్రస్తుత పెట్టుబడిదారీ ఆర్థిక విధానమే వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెడుతోంది. ముసుగులతోనూ, వీలైతే ముసుగులు లేకుండానూ ఇది వ్యవసాయ వ్యతిరేక విధానాలను చేపడుతోంది. అయితే ఒకప్పటి ఇంగ్లాండ్‌లో లాగా పల్లెల్లోని ఇళ్లను ఈనాడు తగలబెట్టలేరు కదా! అందుకే పొమ్మనకుండా పొగబెడుతున్నారు, వ్యవసాయాన్ని గిట్టుబాటు కాకుండా చేస్తున్నారు. దీనినే 'పుష్ ఫాక్టర్' అంటారు. ఆకర్షించే పట్టణాలనుంచి 'పుల్ ఫాక్టర్' ఇంకోవైపున ఎలాగూ ఉంది.

పెట్టుబడిదారీ, మార్కెట్ విధానంలో పరిష్కారం లేదు

ఈ ఆర్థిక విధానం నుంచి, పాలకవర్గాల నుంచి, పార్లమెంటరీ పార్టీలనుంచి వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారాలు ఆశించటం అడియాసే అవుతుంది. ఇవి ఏ చర్యలు చేపట్టినా కంటి తుడుపు చర్యలే అవుతాయి. ఇవి కొంతమందికి ఉపయోగపడతాయి కానీ, సంక్షోభానికి పరిష్కారాలు మాత్రం కాదు. ఈ పేరుతో పారిశ్రామిక, పెట్టుబడిదారీ, వ్యాపార, దళారీ వర్గాలే లాభపడతాయి. బ్యాంకు రుణాలు, రుణ మాఫీలు, బీమా పథకాలు, రాయితీలు, కనీస మద్దతు ద్వారా ప్రస్తుత వ్యవసాయ సంక్షోభాన్ని ఆపలేవు.

ప్రజల సామర్థ్యాలను మార్కెట్ శక్తులు పెంచుతాయని, వనరుల సమర్ధ వినియోగానికి దోహదం చేస్తాయని, వాటికి స్వేచ్ఛ ఇస్తే అవి అందరికీ మేలు చేస్తాయన్న భావాలు చాలా బలంగా వ్యాప్తిలో ఉన్నాయి. మార్కెట్‌కి తగినట్టుగా ఉత్పత్తి చేస్తే రైతులకు లాభసాటిగా ఉంటుందనే అభిప్రాయమూ ఉంది. మార్కెట్ వల్ల కొంత మంది రైతులు, కొంతకాలం పాటు లాభపడవచ్చు, కానీ వీళ్లకంటే ఎక్కువగా వ్యాపారవర్గాలు, దళారులు లాభపడుతుంటారు. వ్యవసాయ ఖర్చులు పెరగటానికీ, వాతావరణం అనుకూలించనప్పుడు, మార్కెట్ ధర పడిపోయినప్పుడు చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలు చేసుకోటానికీ ఈ విధానాలే కారణం.

పరిష్కార మార్గాలు ఏమిటి?

వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించడంలో దగ్గర దారులు లేవు. సామాజిక-ఆర్థిక వ్యవస్థలోనూ, విధానాలలోనూ మౌలిక మార్పులు జరగాలి. భూమి వ్యక్తిగత ఆస్తిగా కాకుండా సమాజ యాజమాన్యంలో ఉండాలి. వాస్తవంగా సాగు చేస్తున్న వాళ్లకి, ఒప్పందం మీద భూమిని ఇవ్వాలి. వ్యవసాయ లక్ష్యం ప్రజల ఆహార అవసరాలను తీర్చేదిగా ఉండాలి. స్థల, కాల పరిస్థితులకు అనుగుణంగా ఆహారం ఉండాలి. ఒక పరిధిని దాటి ఆహారం రవాణా కాకూడదన్న నియమం ఉండాలి. జైవ, భౌగోళిక ప్రాంత స్థాయిలో (బయో జియొలాజికల్ రీజన్స్) ఆహార స్వయం సమృద్ధిని సాధించాలి.

భూసారాన్ని కాపాడుతూ, వీలైతే భూసారాన్ని పెంచుతూ వ్యవసాయం సుస్థిర పద్ధతులలో కొనసాగాలి. రసాయనిక ఎరువులు, పురుగు మందులకు బదులుగా వ్యవసాయం జైవ, పునరుద్ధరింపబడే ఉత్పాదకాల వినియోగంలోకి మారాలి. సమానత, సుస్థిరత అన్నవి వ్యవసాయంలోనే కాకుండే ఉత్పత్తి సంబంధాలు అన్నింటికి మార్గదర్శకంగా ఉండాలి.

అన్ని వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు తప్పనిసరిగా పల్లెల్లో, లేదా వాటికి దగ్గరగా ఉండాలి. గ్రామీణ ప్రాంతాలలో పనులు లేని రోజులలో పని కల్పించే విధంగా పరిశ్రమలను అక్కడ నెలకొల్పాలి. వ్యవసాయ పనులు ఎక్కువగా ఉండే (విత్తటం/ నాట్లు, కోతలు వంటివి) రోజుల్లో పట్టణ ప్రజలు అందులో పాల్గొనాలి/ సహకరించాలి.

పై మార్పులు ఇప్పట్లో జరిగేవి కావు

పునాదిలో మార్పులు ముందా, ఉపరితలంలో మార్పులు ముందా అన్న చర్చ గుడ్డు ముందా పిల్ల ముందా లాంటిది. పునాదిలో మార్పులు లేకుండా ఉపరితలంలో మౌలిక మార్పులు రావు. అయితే పునాదిలో మార్పులు వచ్చినంత మాత్రాన ఉపరితలంలో మార్పులు వెనువెంటనే, వాటంతట అవి రావు. హరిత విప్లవం, అధిక దిగుబడులు వంటి ఆధిపత్య భావజాలం కొనసాగే అవకాశం ఉంది. వీటిని ఇప్పటినుండే ఉపరితలంలో ఎదుర్కోవాలి. అంతరించిపోతున్న వందల, వేల సంవత్సరాల అనుభవపూర్వక సుస్థిర వ్యవసాయ పద్ధతలను నమోదు చేసి భద్రపరుచుకోవాలి. వ్యవసాయం స్థానిక, జైవ ఉత్పాదకాలపై వాటిని కొనసాగించే విధంగా ప్రయోగాలు జరగాలి. పంటల వైవిధ్యతను, విత్తన సంపదను కాపాడుకోవాలి. ఉత్పత్తిదారుల మధ్యే కాకుండా ఉత్పత్తిదారులు, వినియోగదారుల మధ్య కూడా సహకార విధానాలను రూపొందించుకోవాలి. సాధ్యమైన అన్ని ప్రాంతాలలో ఆహార ఉత్పత్తిని చేపట్టాలి.

ప్రభుత్వం ముందు ఉంచే డిమాండ్లు ప్రజల పోరాటాలను బలోపేతం చేస్తూ సమూల మార్పు దిశగా పయనించటానికి దోహదపడేలా ఉండాలి. పాలకపక్షాలకు లాభపడేలా కాకుండా ప్రజల పోరాటాలకు అనుకూలించే వ్యూహాలు, కార్యక్రమాలు చేపట్టాలి. పోరాడే ప్రజల మధ్య సహకారమూ, సంఘీభావమూ పెరిగేలా కార్యాచరణ ఉండాలి.

(రచయిత వ్యవసాయ శాస్త్రవేత్త) వీ

వేగుచుక్కల ఉసురు తీస్తున్న మతోన్మాదం

సమాజాన్ని మూఢవిశ్వాసాల నుండి శాస్త్రీయత వైపుకు తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తున్న ఆలోచనాపరులపై దాడులకు పాల్పడుతున్న మతోన్మాదుల నుండి దేశ ప్రజలను కాపాడవలసిన అవసరాన్ని తెలియజెపుతున్నారు **వై.ఎచ్.కె. మోహన్‌రావు**

భావ ప్రకటన స్వేచ్ఛ లేనివారు మృతజీవులతో సమానం. అదే విధంగా అభిప్రాయాలను అణచివేసే పాలన ఏదైనా అది నియంతృత్వం గానే పరిగణించబడుతుంది. మతాతీత రాజ్యాంగం కలిగిన ప్రజాస్వామ్య భారతదేశంలో ఇటీవల చోటుచేసుకున్న మేధో హత్యలు నాగరిక ప్రపంచానికి సవాలుగా పరిణమించాయి. స్వేచ్ఛాయుత ఆలోచనలకు సంకెళ్లు పడుతున్నాయి. సామాజిక మార్గదర్శులు, మేధావులు, సాహితీ వేత్తలు, జాతీయ కవులు ప్రాణహానితో ఆందోళన చెందుతున్నారు. హిందుత్వ తీవ్రవాద హత్యాకాండలతో సాహితీలోకం కలవర పడుతుందని మీడియాలో వస్తున్న వార్తలు ధ్రువపరుస్తున్నాయి. ఇప్పటికే సాహితీవేత్తలు, హేతువాదులైన మహారాష్ట్ర పూణెకు చెందిన నరేంద్ర దభోల్కర్‌ను, అదే రాష్ట్రానికి చెందిన కొల్హాపూర్‌లో గోవింద పన్సారేని, కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎం.ఎం కల్బుర్గీలను హిందూ తాలిబన్స్ పొట్టన పెట్టుకున్నారు. వీరి హత్యలపై దేశ వ్యాప్తంగా మేధో వర్గాలలో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మేనకోడలు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నయనతార సెహగల్ ఈ హత్యలను ఖండిస్తూ ప్రధాని నోరు విప్పకపోవడానికి నిరసనగా అవార్డును అకాడమీకి తిరిగి ఇచ్చేశారు. మూఢ నమ్మకాలను ప్రశ్నిస్తున్న రచయితలను, హేతువాదులనూ హతమార్చడం దారుణమని ఆమె ఆగ్రహం వెలిబుచ్చారు. ఆహారపు అలవాట్లు, జీవన విధానాలకు లక్ష్మణ రేఖలు గీస్తూ మనుషులను విభజిస్తూ దూరం పెంచుతున్నారని ఆమె విమర్శించారు. ఆమె కోవలోనే ప్రముఖ రచయిత్రి, అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యురాలు శశిదేశ్ పాండే నిరసన గళమెత్తుతూ తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రముఖ మలయాళ రచయిత్రి సారాజోసెఫ్ తనకు లభించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డునూ, మహారాష్ట్ర ఉర్దూ రచయిత రెహ్మాన్ అబ్బాస్ ఉర్దూ సాహిత్య అకాడమీ పురస్కారాన్ని కేంద్రానికి తిప్పి పంపుతామని ప్రకటించారు. మలయాళ కవి కె. సచ్చిదానందన్ సాహిత్య అకాడమీ కమిటీల్లోని తన అన్ని పదవులకూ స్వస్తి చెప్పి వ్యతిరేక గళాన్ని వినిపించారు. రచయితల భావ ప్రకటన స్వేచ్ఛకు అండగా ఉండడంలో కేంద్ర సాహిత్య అకాడమీ విఫలమైందనే తాను అకాడమీ జనరల్ కౌన్సిల్, ఎగ్జిక్యూటివ్ బోర్డు, ఫైనాన్సియల్ కమిటీల్లోని పదవులకు రాజీనామా చేసినట్లు కె. సచ్చిదానందన్ ప్రకటించారు. మలయాళ కథా రచయిత పి.కె. పరక్కడవు అకాడమీ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని ప్రకటించారు.

ఇతర రాష్ట్రాలలో ప్రారంభమై సాహితీ అవార్డులు తిరిగి ఇచ్చే నిరసన జ్వాల తెలుగు రాష్ట్రాలలో ఒకటైన తెలంగాణాకు అంటుకుంది. భూపాల్‌రెడ్డి, కాత్యాయనీ విద్మహే అవార్డులను తిరిగి ఇచ్చేశారు. భూపాల్ అయితే ఇటీవల తెలంగాణలో జరిగిన శృతి, సాగర్‌ల ఎన్‌కౌంటర్‌లను కూడా జోడించి రాష్ట్ర అవార్డును కూడ వెనక్కి ఇచ్చారు. సాహిత్య అవార్డుతో పాటు 2004లో తానందుకున్న పద్మశ్రీ పురస్కారాన్ని కూడా ప్రఖ్యాత పంజాబీ రచయిత్రి దాలిప్ కీర్ తివానా వదులుకుంటున్నట్లు ప్రకటించారు. ముస్లీంలపై జరుగుతున్న దాడులకు నిరసనగానే తానీ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు.

తెలుగు రాష్ట్రాలలో కె. శివారెడ్డి, రాచపాళెం తదితర కేంద్ర సాహిత్య అవార్డీలు 11 మంది ఆ దారుణ హత్యాకాండపై పెద్ద ఎత్తున నిరసన ప్రకటించి తీవ్రంగా ఖండించారు. మరో కోణంలో తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్ తన రచనా వ్యాసంగం మానుతానని నిర్ణయం తీసుకునే వరకు అక్కడి మత శక్తుల దాడులు గావించి తీవ్ర ఒత్తిడికి గురి చేశాయి. మరో రచయిత కె.ఎస్. భగవాన్ తనకు మత శక్తుల నుండి ప్రాణహాని ఉందని భయపడుతున్నారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని దాద్రీలో గోవు మాంసం తిన్నాడనే ఒక అసత్య ప్రచారంతో ఇఖ్లాక్ అనే ముస్లిం వ్యక్తి గృహంపై హిందూ వాదుల గుంపు దాడి చేసి, ఆయనను హత్య చేసి, కుమారుడిని స్పృహతప్పే వరకూ హింసించిన సంఘటనానంతరం దేశంలోని ఉర్దూ రచయితలంతా ఆందోళన చెందుతున్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామిక రచయిత తస్లీమా నస్రీన్‌పై అక్కడి మత సంస్థలు చంపుతామని ఫత్వా జారీ చేసిన పూర్వ రంగంలో ఆమెకు మనదేశం చాలా కాలం పాటు ఆశయం కల్పించి, ప్రాణ రక్షణ చర్యలు చేపట్టింది. అదే విధంగా చైనా నుండి రక్షణ కోరిన దలైలామా జీవితం మొత్తం భారత్‌లోనే తలదాచుకుంటున్నాడు. అయితే ఇప్పుడు భారత్‌లో జరుగుతున్నదేమిటి? వినీల సమాజంలో వేగుచుక్కలైన ఉద్దండ మేధావులను హత్య గావిస్తున్నారు. ముగ్గురి వరుస హత్యలపై కేంద్ర సాహిత్య అకాడమీ గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ పెదవి విప్పక పోవడం తీవ్ర అభిశంసనీయం. ముఖ్యంగా ప్రధాని మోడీ స్పందించక పోవడం అత్యంత విషాదకరమైన అంశం.

2014 సాధారణ ఎన్నికల అనంతరం సంపూర్ణ ఆధిక్యతతో కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టిన నాటి నుండి దేశంలో హిందూ శక్తులు పెచ్చరిల్లుతున్నాయి. సాక్షాత్ ఆ పార్టీ మంత్రులు, ఎంపిలే విచక్షణా రహితంగా పేలిపోతున్నారు. దేశ ప్రజలంతా ఎట్లా ఆలోచించాలో, ఏమి భుజించాలో, ఏవిధమైన వస్త్రాలను ధరించాలో, ఎట్లా జీవించాలో అన్న విషయాలపై విచ్చల విడిగా పెట్రేగిపోతున్నారు. వీరి వికృత పోకడలపై ప్రధాని మోడీ కంటితుడుపుగా ఒకటో, అరో మాట్లాడడం మినహా, కచ్చితమైన నష్ట నివారణ చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించవు. మోడీ ప్రవర్తనను లోతుగా గమనిస్తే వీరి ప్రేలాపనలకూ, ప్రవర్తనకూ ఆయన మద్దతుగా ఉన్నట్లు భావిస్తాము. ఢిల్లీలో క్రిస్టియన్

పాఠశాలపై మత దుండగులు దాడిచేసి నన్ను మానభంగం చేసిన దుస్సంఘటన నుండి మొదలైన ఈ మతశక్తుల ఆగడాలు అనేక మలుపులు తిరుగుతూ ఇప్పటికి మేధావులు, రచయితల హత్యల వైపు మళ్లాయి.

కల్బుర్గి విగ్రహారాధనకు వ్యతిరేకం. ఆ విషయాన్నే తన సిద్ధాంతంగా ప్రచారం గావించాడు. వేద కాలంలో విగ్రహారాధన లేదు. బౌద్ధ మతంలో విగ్రహారాధన నిషిద్ధం. ఇస్లాం విగ్రహారాధనను అంగీకరించదు. భారతదేశంలోనే మరెన్నో మతాలు విగ్రహారాధనకు దూరం. వైదిక ఆచారాలనూ, కర్మకాండలనూ, విగ్రహారాధనను వ్యతిరేకించిన బుద్ధునిపై హిందూ వైదిక ముష్కరులు మూడు పర్యాయాలు హత్యా యత్నం చేశారు. విగ్రహారాధనను నిరసించిన వృద్ధ మేధావి కల్బుర్గిని ఏకంగా హత్యే గావించారు. బుద్ధుని సంఘటనలు క్రీస్తు పూర్వం రాచరిక సమాజంలోనైతే, కల్బుర్గి హత్య 21వ శతాబ్దిలోని నాగరిక ప్రజాస్వామ్య పాలనలో ననేది విస్మరించలేని నిజం. అయితే ఈ దేశంలో విగ్రహారాధన పాటించని వారినందరినీ ఈ మత మూఢులు ఏమిచేయనున్నారన్నదే ఇప్పటి పెద్ద సంశయం. విజ్ఞానాభివృద్ధిలో ఇప్పటికే ప్రపంచంలో మన స్థానం కుంభాకార కటకాలతో వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో ఆలోచనలకే సంకెళ్లు వేసే దుష్ట సంప్రదాయాలు ప్రవేశిస్తే మనదేశ అభివృద్ధి తిరోగమనంలో ప్రయాణించడం ఖాయం.

ముగ్గురు రచయితలు, మేధావుల హత్యకు సంబంధించిన నిందితులను పసిగట్టడంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. బహుశా అటువంటి ప్రయత్నానికే పూనుకున్నట్లు కనిపించదు. హత్యల విషయంలో కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాల్లో చైతన్యం కొరవడినప్పుడు ముల్ల కర్రతో అదిలించాల్సిన కేంద్రం ఆదిశగా అడుగులు వేస్తున్న దాఖలాలు లేవు. ఆయా హత్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు పట్టీ పట్టనట్లు వ్యవహరించే విధంగా కేంద్రమే సంజ్ఞలు ఇస్తున్నట్లు మీడియా ద్వారా తెలుస్తుంది. రాష్ట్రాల వల్ల కానప్పుడు కేంద్రమే రంగంలోకి దిగి సిబిఐ, రా వంటి పరిశోధనా సంస్థలచే లోతైన విచారణ జరిపించి నిందితులను కనిపెట్టవలసి ఉండగా, కంటితుడుపు అడుగులు వేస్తుంది. సూర్యుడు భూమి చుట్టూ పరిభ్రమిస్తున్నాడని నమ్ముతున్న కాలంలో, భూమే సూర్యుని చుట్టూ తిరుగుతుందని కోపర్నికస్ కనుగొన్న నూతన ఖగోళ సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన బ్రూనోను నాటి రాచరిక వ్యవస్థలోని రాజు శిక్షించినట్లుగా నేడు ప్రజాస్వామ్య పాలనని గొప్పగా చెప్పుకుంటున్న ఈ వ్యవస్థలో ముగ్గురు మేధావుల హత్యాకాండ దేశ పురోభివృద్ధికే గొడ్డలి పెట్టు వంటిది. పురోగమన ఆలోచనలు కలిగిన వ్యక్తుల విషాదాంత మరణాలు దేశ ప్రగతికి ఎంత మాత్రం శ్రేయస్కరం కాకపోగా తీవ్ర నష్టాన్నే కలిగిస్తాయనేది భవిష్యత్ తెలిపే సత్యం.

రచయితలు, విజ్ఞాన వేత్తలు, మేధావులు, శాస్త్రవేత్తలు, విశ్లేషకులు, ఆలోచనాపరులు మానవ సమాజ మనుగడను అభ్యుదయం వైపు నడిపే దార్శనికులు. ఇలాంటి వారి హననం ప్రపంచ భావి మనుగడకు పెద్ద ముప్పుగా పరిగణించాలి. ఎవరి అభిప్రాయాలు వారివి. ఎవరి విశ్వాసాలు వారివి. ఇతరుల విశ్వాసాలు నచ్చకపోతే భౌతికంగా నిర్మూలిస్తామనడం మానవీయతకు మాయని మచ్చ. ఒకనాడు చార్వాకులనూ, హేతువాది అయిన సత్యకామ జాబాలిని ఈ మత దురహంకారులే మట్టుబెట్టినట్లు మనం చదువుకున్నాం. రచయిత సమాజానికి చూపుడువేలు వంటివాడు. అందరికంటే ఒకడుగు ముందుండేవాడు. కాలానికి కాస్త ముందు ఉండే వాణ్ని కవి అంటారనే నానుడి వాస్తవం. కవి సమాజిక బాధ్యతతో వ్యవహరించే సునిశిత ఆలోచనా పరుడు. అటువంటి సున్నితమైన మనస్కులను, లోక కళ్యాణాన్ని కాంక్షించే వారిని హతమార్చడం మానవ లోకానికి ద్రోహం చేయడమే అవుతుంది. మన శిరస్సును మనమే ఛేదనం చేసుకున్నట్లుగా ఉంటుంది. మనిషి ఆలోచించకపోతే, మార్పు చెందకపోతే, చర్చించకపోతే రాతి యుగంలోనే ఉండేవాడు. ఆధునిక యుగానికి చేరువాడు కాదు. వాస్తవానికి రాతి యుగానికి చేరడం కూడా మానవ అభివృద్ధి పథంలో ఒక అడుగేనని చెప్పాలి. ప్రతి మార్పు ఒక అభివృద్ధికి ఆయువుపట్టు. ఆ మార్పును ఆమోదించినప్పుడే నూతన ఆలోచనలపై, ప్రతిపాదనలపై చర్చ జరిగినప్పుడే మానవ సమాజం పురోగమన దిశలో పరుగులు పెడుతుంది. ఉన్నతమైన జీవన ప్రమాణాలకు ఏది అవసరమో, ఏది కూడదో అనే నిశ్చలత్వానికి మార్గం సుగమమవుతుంది.

ఈ వ్యాసం పూర్తి చేసే సమయానికి హత్యలకు నిరసన ధ్వనుల పరంపర కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం, సాహిత్య అకాడమీ కళ్లు తెరిచే వరకూ రాజీనామాల పర్వం నిలిచేటట్లు లేదు. వ్యాస రచన ముగిసిన రోజున మరికొందరు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డీలు తమ అవార్డులను అకాడమీకి తిప్పి పంపుతామని మీడియాకు తెలిపారు. అట్లాగే అకాడమీ పదవుల రాజీనామాలు కూడా సాగుతూనే ఉన్నాయి. పంజాబీ రచయితలు గురుబిబన్ భుల్లార్, అజ్మీర్ సింగ్ ఔలఖ్, అతంజిత్ సింగ్, అమన్‌సేథ్, గుజరాతీ రచయిత గణేష్‌దేవి, హిందీ రచయిత ఉదయ ప్రకాశ్, కవి అశోక్ వాజ్‌పేయి మరో విడతలో అవార్డులను వాపసు చేశారు. కర్ణాటక సాహిత్య అకాడమీ పరిధిలో అవార్డీలు చంద్రశేఖర్ పాటిల్, చిదానందసాలి, సంగమేశ మెణసినకాయ, హనుమంత హోలిగెరె, సతీశ్ జవరేగౌడ, శ్రీదేవి ఆలూరి, వీరణ్ణ మడివాళ అవార్డులను తిరుగుటపా కడుతున్నారు. ఈ నిరసన ఉద్యమంలో భాగంగా సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్‌లో ప్రతినిధులుగా, సభ్యులుగా ఉన్న 20 మందికి పైగా వివిధ యూనివర్సిటీల నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నవారు తమ పదవులకు రాజీనామాలు సమర్పించారు. కన్నడ సాహితీవేత్త డాక్టర్ అరవింద్ మలాగట్టి నూతనంగా రాజీనామా సమర్పించిన వారిలో ఉన్నారు. ఇంత దుమారం మూటగట్టుకున్న అనంతరం కేంద్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్ విశ్వనాథ్ ప్రసాద్‌తివారీ పెదవి కదిలించి మొక్కుబడి పలుకులు పలుకుతూ అకాడమీ, రచయితల, కవుల సంక్షేమానికి, స్వేచ్ఛకూ కట్టుబడి ఉందని ఉటంకించారు. రచయితలపై దాడులను అకాడమీ ఖండిస్తుందనీ, లౌకిక విలువలకు కట్టుబడి ఉంటుందని చిలక పలుకులు పలికారు మినహా, అందుకై పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను మాత్రం ఆయన అక్షరం వెల్లడించకపోవడం విచారకరమే!

అవార్డులు తిరిగి ఇస్తున్న వారిలో అధిక సంఖ్యాకులు హిందువులే. అయితే ఆర్ఎస్ఎస్ పత్రిక పాంచజన్య ఈ నిరసనలపై వ్యాఖ్యానిస్తూ వీరందరూ సెక్యులర్ వ్యాధిగ్రస్తులని అవహేళన చేసింది. ఈ వ్యాధిగ్రస్తులు కొందరు హిందుత్వాన్ని నాశనం చేయడానికి కంకణం కట్టుకున్నారని విమర్శించింది. వీరి నేపథ్యాన్ని గుర్తించాలని, ఆంతర్యాలను అర్థం చేసుకోవాలని వక్ర భాష్యాలు, తప్పుడు సంకేతాలను పంపాలని హిందూ వాదులు, ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రతినిధులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. నిజంగా భారత్‌కు కావాల్సిన లౌకిక తత్వాన్ని కూడా

వారు అపహాస్యం చేస్తున్నారు. ఈ మతాతీత సమాజాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని నిలుపుతున్నదీ లౌకిక తత్వమనేది వీరు విస్మరిస్తున్నారు. స్పష్టమైన ఆధిక్యతతో బిజెపి ప్రభుత్వాలు అధికారంలోకి వస్తే ఏమి జరుగుతుందో వారు ఆచరణలో దర్శించమంటున్నారు.

మొత్తంగా అరవు మంది రచయితలు, కవులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు తిరిగి ఇవ్వగా, ఐదుగురు సాహిత్య అకాడమీ పదవులను విసిరేశారు. వీరిలో ఐదుగురి పూర్వ రంగాలను తప్పుపడుతూ హిందూ వాదులు బురదజల్లే ప్రయత్నం చేశారు. వీరు బిజెపి సిద్ధాంతాలకూ, హిందుత్వానికీ వ్యతిరేకులని జాతిని నమ్మించే వక్ర భాష్యాలు చేశారు. నయనతార సెహగల్ నెహ్రూ–గాంధీ కుటుంబాలకు చెందినదని, రెహమాన్ అబ్బాస్ నిషేధిత భావజాలాన్ని ప్రచారం చేస్తారని, ఉదయ ప్రకాశ్ కమ్యూనిస్టు అని, అశోక్ వాజ్‌పాయ్ కాంగ్రెస్ పాలనలో అనేక కీలక పదవులు అనుభవించాడని, సారాజోసెఫ్ ఆమ్ ఆద్మీ పార్టీ తరపున సాధారణ ఎన్నికలలో పార్లమెంట్‌కు పోటీ చేశారని అందువలన వీరంతా బిజెపి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి పూనుకున్నారని మకిలి అంటించేందుకు ప్రయత్నించి విఫలమే అయ్యారు. ఐదుగురి పూర్వ రంగాలను గురించి వక్రీకరించే కృషిచేసిన వారు మిగిలిన అరవై మంది నిరసనకారుల గురించి చెప్పడంలో వైఫల్యం చెంది కావాలని చేసిన ఆరోపణలుగా, విమర్శలుగా తేల్చారు.

అకాడమీ అవార్డులు తిరిగి ఇచ్చేస్తూ, అకాడమీ పదవులకు స్వస్తి పలుకుతూ తెలుపుతున్న నిరసనను విష ప్రచారం చేయడం ద్వారా తిప్పికొట్టాలని చేసిన యత్నాలు ఫలప్రదం కాకపోగా ప్రపంచ ప్రఖ్యాత రచయిత సాల్మన్ రష్దీ, మరో 150 మంది వివిధ దేశాల ఖ్యాతి వహించిన రచయితల నిరసనలు కూడా హిందూ మౌఢ్యులను చుట్టు ముట్టాయి.

జరుగుతున్న పరిణామాలను అవగతం చేసుకుంటూ మోడీ రానున్న మూడున్నరేళ్ల పాలనా కాలంలో దేశంలో మత ఘర్షణలకు దారితీయవచ్చని బుద్ధిజీవులు ఆందోళన చెందుతున్నారు. నిన్న మొన్నటి వరకూ విద్వేష వ్యాఖ్యలను కొనసాగించే హిందూ మూకలు దాడులకు పాల్పడుతున్న వైనం పైన పేర్కొన్న ఆందోళనకు ఊతమిస్తుంది. అవార్డుల తిరస్కరణకు విపరీత అర్థాలు చెపుతూ, నరేంద్ర దభోల్కర్, గొవింద పన్సారే, ఎంఎం. కల్బుర్గీ, ఇఖ్లాక్ హత్యా నేరాలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల శాంతి భద్రతలకు సంబంధించిన అంశాలని, కేంద్ర ప్రభుత్వం బాధ్యతల నుండి ప్రజలను పక్కదోవ పట్టించాలనుకునే వారు ఇప్పుడేమంటారు? ఇప్పుడని ఎందుకంటున్నానంటే పశు మాంస విందు విషయంపై జమ్మూ కశ్మీర్ అసెంబ్లీలో స్వతంత్ర ఎంఎల్ఎ రషీద్‌పై బిజెపి శాసనసభ్యుల దాడి పర్యావసనాన్ని అనుభవించిన పూర్వ రంగంలో ఢిల్లీలో ఒక మీడియా సమావేశం సందర్భంలో హిందూ అతివాదులు ఆయన శిరస్సుపైనా, ముఖం పైనా సిరా, నల్లరంగు, ఇంజనాయిల్ పులిమారు. రషీద్‌ను కాపాడబోయిన కొందరు జర్నలిస్టులు, పోలీసుల ముఖాలపైనా సిరా, ఆయిల్ చిందాయి. అదనపు బలగాలు వచ్చే వరకూ రషీద్ ప్రాణాలు అరచేతిలో ఉంచుకుని ప్రెస్‌క్లబ్‌లోనే కాలం గడిపారు.

ఢిల్లీ మహానగరం శాంతి భద్రతలు కేంద్రం చేతిలోనే నడుస్తున్నాయి కదా! అయితే ఇక్కడెందుకు జరిగిందీ దౌర్జన్యకాండ? బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా మత విషయాలపై, పశు మాంస వినియోగంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమ పార్టీ హర్యానా సిఎం మనోహర్‌లాల్ ఖట్టర్, కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి సంజీవ్ బల్యాన్, ఎంపి సాక్షి మహరాజ్, ఉత్తరప్రదేశ్ శాసన సభ్యులు సంగీత్ సోమ్‌లకు హెచ్చరికలు చేసి, నోటీసులు జారీ చేస్తున్నా హిందూ మూకలు ఇట్లా ఎందుకు రెచ్చిపోతున్నాయి. 'నేను చెపుతూనే ఉంటాను. నీవు చేసేది నువ్వు చేయి' అనే నానుడిని అనుసరిస్తున్న అమిత్‌షా బెదిరింపులు, ప్రధాని నరేంద్ర మోడీ పొడిపొడి అసంతృప్తులే హిందూ తీవ్రవాదుల దూకుడు మరింత పెరగడానికి బలం చేకూరుస్తున్నాయి. ఒకవైపు అమిత్‌షా స్వరం ఝుళిపించిననాడే ఆర్ఎస్ఎస్ పత్రిక పాంచజన్యలో గో హంతకుల్ని చంపివేయాలని కవర్ పేజీ వ్యాసం వచ్చింది. ఈ విధంగా వేదాలు చెపుతున్నాయని వ్యాసానికి ముక్తాయింపునిచ్చారు. నిజంగా వేదాల ఆధారంగానే మన జీవన విధానం సాగుతుందా? వేదాలలో విగ్రహారాధన ఉందా? ఇప్పుడే మత దాడులు, ఆహార అలవాట్లపై నిషేధాల వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.

గత 10 సంవత్సరాల యుపిఎ ప్రభుత్వ పాలనలోనూ, అంతకు క్రితం ఏడేండ్ల వాజ్‌పేయి పాలనలోనూ ఎందుకు జరుగలేదు? విశ్లేషించు కుంటే ఈ దుష్పరిణామాలు, మతవాద దాడులకు కేంద్రం, నరేంద్రమోడీ, బిజెపి పాలనా మద్దతుగా ఉన్నాయని స్పష్టంగా బోధపడుతుంది. ఇటు వంటి మత విద్వేషాలను ప్రధాని మోడీ అభిలషిస్తున్నా రేమోననే నమ్మకం బలపడుతుంది. ఆయన ప్రధానిగా పాలన చేపట్టిన తరువాత మీడియాలో వస్తున్న కథనాలు ముఖ్యమంత్రిగా గుజరాత్‌లో మతపరమైన భావోద్వేగాల తోనే అధికారాన్ని తిరిగి నిలబెట్టుకున్నాడని తెలియ జేస్తున్నాయి. అదే ఫార్ములాని దేశ వ్యాప్తంగా అమలు పరచాలనేది మోడీ ప్రణాళిక కావచ్చు. యుపిఎ, వాజ్‌పేయి, కాంగ్రెస్ పాలనలో ఈ మతమూఢ మూకలు కలుగుల్లో దాక్కోవడానికి ఆయా ప్రభుత్వ అదుపు ఆజ్ఞలే కారణాలుగా చెప్పుకోవచ్చు. నిజంగా ఇలాంటి సంఘటనలను అణచి వేయాలంటే హెచ్చరికలు, మెత్త మెత్త నిరసనలు దాటి అమిత్‌షా, నరేంద్రమోడీ క్రమశిక్షణా చర్యల దిశగా అడుగులు వేయాల్సి ఉంది. ఒకనాటి అతివాది అద్వానీ సైతం ఈ విపరీత సంఘటనలను తీవ్రంగా ఖండించినా మోడీ మాత్రం కనీసం తన మంత్రి మండలి సభ్యులను, తమ పార్టీ ముఖ్యమంత్రులను, పార్లమెంట్ సభ్యులను, శాసన సభ్యులను కూడా అదుపు చేయకపోవడం వెనుక ఆంతర్యం అర్థం చేసుకోవలసి ఉంటుంది.

తమిళనాడులో ఇటీవల జరిగిన్న రెండు సంఘటనలు దేశంలో మతఘర్షణలు జరుగనున్నాయనే భయానికి ప్రబల నిదర్శనంగా ఉన్నాయి. కొయంబత్తూరులో ఇందుమక్కల్ కట్చి–తమిళగమ్ (ఐఎంకెటి) ఇస్లామిక్ స్టేట్ వ్యతిరేక భారత్ మకుటంతో వెబ్‌సైట్ ప్రారంభించిన కార్యక్రమంలో రాజకీయ పార్టీలు, సంస్థలు గో మాంసంతో ఏర్పాటు చేసే విందులను నిరసిస్తూ వాటికి ప్రతిగా నిరసనకారులకు పంది మాంసాన్ని పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అర్జున్ సంపత్ గో మాంసం భుజించేవారిని భారత్ విడిచి వెళ్లిపోవాలని సలహా ఇచ్చారు. ఇందుకు పూర్తి భిన్నంగా అదే రాష్ట్రంలో గో మాంస భక్షకుల సంక్షేమ సంఘం అక్కడ రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తున్న ప్రభుత్వ 'అమ్మ' క్యాంటిన్‌లలో రాయితీ ధరలకు గో మాంస బిర్యానీని అందించాలని ప్రభుత్వానికి విన్నవించింది. గో మాంసం ఎంతో ఆరోగ్యకరమని దాన్ని తినడంపై రాజకీయాలు చేస్తున్నారని సంఘం అధ్యక్షుడు ఎ. మునుస్వామి పేర్కొన్నారు. ఈ చర్య, ప్రతి చర్యల వాతావరణాన్ని అంచనా గట్టుకుంటే సమీప భవిష్యత్‌లో భారత్ మత, ఆహార వివాదాలతో అగ్ని గుండంగా మారే ప్రమాదం ఉన్నట్లు స్పష్టంగా అనిపిస్తుంది.

(రచయిత పల్నాడు రచయితల సంఘం అధ్యక్షులు) వీ

ఆధార్ - అంతా అయోమయం

***ఆధార్ కార్డుల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తూ, దేశ ప్రజల భద్రతను ప్రపంచ మార్కెట్లో ఉంచిన ప్రభుత్వాల తీరును, మౌనాంగీకారాన్ని వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు తీరును వివరిస్తున్నారు* ఎస్. కిశోర్‌కుమార్**

వాణిజ్య వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తులను అమ్ముకునే క్రమంలో వినియోగదారులను ఆకట్టుకునేటందుకు ఆయా ఉత్పత్తుల పేర్ల ప్రక్కన ఒక ట్యాగ్‌లైన్‌ను కూడా చేరుస్తూ వస్తున్నాయి. ఇది 21వ శతాబ్దం పూర్వం నుంచే ఉన్న సంప్రదాయం. ఉదాహరణకు ఒనిడా టెలివిజన్‌కు 'ఓనర్స్ ప్రైడ్ - నెయిబర్స్ ఎన్వీ' అనే ట్యాగ్‌లైన్ ఉండేది. ఇక, 21వ శతాబ్దంలోకి ప్రవేశిస్తున్న సమయంలో ఈ సంప్రదాయం దేశంలోని సినిమా టైటిళ్లకూ గట్టిగా పట్టుకుంది. ప్రేక్షకులను ఆకట్టుకునేటందుకు సినిమా వాళ్లకు ఈ ట్యాగ్‌లైన్ సంప్రదాయం బాగానే పనికొచ్చింది. ట్యాగ్‌లైన్ లేకుండా సినిమా టైటిల్‌ను ఊహించే పరిస్థితి లేదిప్పుడు. సినిమా టైటిల్‌కు తోడుగా ఉండే ఈ ట్యాగ్‌లైన్‌ను ప్రేక్షక లోకంలో ముద్దుగా 'తోక' అని పిలుచుకునే వరకు వచ్చింది. ఇక, తమ పౌరులను ఆకట్టుకునేటందుకు తాజాగా మన ప్రభుత్వాలకు కూడా ఈ 'తోక'లపై మోజు ఏర్పడింది. ఉన్నత ఆదాయ వర్గాలు ప్రభుత్వం నుంచి పొందే గ్యాస్ సబ్సిడీని స్వచ్ఛందంగా వదులుకోడానికి ఇటీవల 'గివ్ ఇట్ అప్' అనే నినాదంతో ముందుకొచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం ఆ నినాదానికి 'ఫీల్ ది జాయ్ ఆఫ్ గివింగ్' అంటూ బండరాయి లాంటి గుండెలు సైతం కరిగిపోయేటంతటి ఆకర్షణీయమైన తోక (ట్యాగ్‌లైన్)ను తగిలించింది. అంతకన్నాముందు, యుపిఎ-1 ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన 'ఆధార్' పథకానికి కూడా ఆనాటి ప్రభుత్వం కళ్లు మిరుమిట్లు గొలిపే విధంగా ఓ తోకను తగిలించింది. ఆ తోకపేరు 'ఆమ్ ఆద్మీకా అధికార్'. కలిపి చూస్తే 'ఆధార్ - ఆమ్ ఆద్మీకా అధికార్' అన్నమాట.

1907-08 సంవత్సరంలో బ్రిటిష్ వలసపాలనలో ఉన్న దక్షిణాఫ్రికా దేశంలో బ్రిటిష్ ప్రభుత్వ అధికారి జనరల్ జాన్ క్రిస్టియన్ స్మట్స్ ఓ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఆ చట్టం పేరు 'ఏషియాటిక్ రిజిస్ట్రేషన్ యాక్ట్'. ఈ చట్టం ప్రకారం దక్షిణాఫ్రికాలో నివసిస్తున్న చైనీయులు, భారతీయులు విధిగా తమ చేతివేళ్ల ముద్రలను అక్కడి ప్రభుత్వానికి సమర్పించాలి లేదా నమోదు చేసుకోవాలి. వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించే ఇలాంటి మరికొన్ని నియమాలతో రూపొందించిన ఈ చట్టాన్ని ఓ 'నల్లచట్టం'గా పరిగణిస్తూ ఆనాడు అక్కడ నివసిస్తున్న భారతీయులందరూ తీవ్రంగా వ్యతిరేకించారు. వేలిముద్రలను ప్రభుత్వానికి ఇవ్వడానికి వారు ససేమిరా అన్నారు. అంతేకాదు, ఆనాడు బ్రిటిష్ వలసపాలనలోనే మగ్గుతున్న భారతదేశంలో సైతం కేవలం నేరస్థుల వేలి ముద్రలను మాత్రమే తీసుకుంటారని వారు వాదించారు.

సరిగ్గా వంద సంవత్సరాల తరువాత 2009 సంవత్సరంలో దేశంలో యుపిఎ-1 ప్రభుత్వం 'ఆధార్ కార్డు పథకం' పేరుతో స్వంత దేశంలోని పౌరుల వ్యక్తిగత వివరాలతోపాటు చేతివేళ్ల ముద్రలను, కనుపాపల (ఐరిస్) గుర్తులను తీసేసుకునే చర్యకు ఒడిగట్టింది. ప్రత్యక్ష బలవంతం కాకపోయినా... ప్రతినిత్యం ప్రభుత్వంపైన ఆధారపడే పౌరులకు అవసర రీత్యా తప్పనిసరి పరిస్థితిని కల్పిస్తూ పరోక్షంగా బలవంతపు చర్యకు పాల్పడింది. తదనంతర ప్రభుత్వాలు సదరు చర్యను కొనసాగిస్తున్నాయి. ఈ పరిస్థితిని చూస్తే స్వపరిపాలన కన్నా వలసపాలన కాస్త నయమేమోనని పించకమానదు. పరిశీలించి పోల్చి చూస్తే ఆనాడు దక్షిణాఫ్రికాలో బ్రిటిష్ వలసపాలకులు వ్యవస్థలో, వ్యవస్థ పట్ల, కాస్తంత పద్ధతిగా, గౌరవప్రదంగా వ్యవహరించినట్లుగా నేడు మనం భావించాలేమో! ఎందుకంటే, ఒక నిర్దిష్టమైన చట్టాన్ని రూపొందించి, ఆ చట్టం ద్వారా ఆనాడు అక్కడ నివసించే భారతీయుల చేతి వేళ్ల ముద్రలను తీసుకునే ప్రయత్నం చేశారు అక్కడి బ్రిటిష్ వలసపాలకులు. కానీ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారతదేశంలో నేటి పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఓ చట్టం లేదు, ఓ పద్ధతి లేదు, కనీసం పథకానికి ప్రభుత్వం తరపున నిర్దిష్టమైన నిర్వచనం, గోప్యతలేని స్థిరమైన ఉద్దేశ్యం కూడా లేవు... కేవలం 'ఆమ్ ఆద్మీ కా అధికార్' అనే ఒకేఒక్క ఆకర్షణీయమైన మాయమాటతో ప్రభుత్వం స్వంత దేశంలోని పౌరులను తికమకకు గురిచేస్తూ... కేవలం నేరస్థుల కోసం చట్టాలు నిర్దేశించి నటువంటి నియమాలను సాధారణ పౌరులపై రుద్దుతూ, వారి చేతివేళ్ల ముద్రలు, కనుపాపల గుర్తులు (ఐరిస్) తదితర బయోమెట్రిక్ వివరాలను తీసేసుకుంటుంది. ప్రపంచ వేదికపైన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని అపహాస్యం పాల్జేసే ఒక అస్పష్టమైన, సంపూర్ణ గజిబిజి చర్య ఇది.

ఏ దేశంలోనైనా అక్కడ నివసించే సాధారణ పౌరుడికి రక్షణ కల్పించేవి, తన మనుగడకు విశ్వాసం పెంపొందించేవి అత్యున్నత స్థాయిలో ఆ దేశ ప్రభుత్వం, అక్కడి సర్వోన్నత న్యాయస్థానం. ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం కూడా ఇందుకు ఏమాత్రం మినహాయింపు కాకూడదు. అయితే, గత ఏడు సంవత్సరాలుగా 'ఆధార్' పథకం విషయం లో దేశంలోని సాధారణ పౌరుడు ఇటు కేంద్ర ప్రభుత్వం, అటు సుప్రీం కోర్టు నడుమ నలిగి మానసిక వేదనకు గురవుతూ దయనీయమైన పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఆధార్ నమోదు ప్రక్రియ ప్రారంభించిన 2009 జనవరి నుండి నేటివరకూ ఆధార్ పథకం విషయంలో దేశంలోని అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టుకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్యన అనేకమార్లు వాదోపవాదాలు జరిగాయి. సుమారు ఏడు సంవత్సరాలు గడిచిపోయాయి. ఇప్పటివరకూ ఆధార్ పథకం చెల్లుబాటుపై సుప్రీంకోర్టు సంపూర్ణ లేదా తుది తీర్పు ఇవ్వనేలేదు.

గతంలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ కె. ఎస్. పుట్టస్వామి 2012 నవంబర్ 30న, ఎన్‌జిఒ సొసైటీ ఫర్ సివిల్

రైట్స్ అనే స్వచ్ఛంద సంస్థ తదితరులు ఆధార్ నమోదు ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధమంటూ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలు నేటికీ సుప్రీంకోర్టు వద్ద విచారణలో ఉన్నాయి. ఈ వ్యాజ్యాలపై స్పందిస్తూ... సంక్షేమ పథకాలను పొందేందుకు ఆధార్ కార్డులను తప్పనిసరి చేయవద్దని సుప్రీంకోర్టు 2013 సెప్టెంబర్ 23 న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పౌరులు ఆధార్ కార్డులు తీసుకోవడం ఐచ్ఛికం మాత్రమేనని తప్పనిసరేమీ కాదని కూడా తేల్చి చెప్పింది. అప్పటికే ఆధార్ నమోదు ప్రక్రియలో భాగంగా దేశంలో 53 కోట్ల మంది ప్రజలు తమ బయోమెట్రిక్ వివరాలను అందించారు. ఆధార్ కార్డు తప్పనిసరి కాదంటూ 24 మార్చి 2014న సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఆధార్ కార్డును తప్పనిసరి చేస్తూ ప్రభుత్వాలు ఏవైనా ప్రకటనలను జారీ చేసినట్లయితే వాటిని తక్షణం ఉపసంహరించుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటికి ఆధార్ పథకంలో తమ వివరాలను నమోదు చేసుకున్న దేశ ప్రజల సంఖ్య 60 కోట్లు దాటింది. ఇదిలా ఉండగా, ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలంటూ కొత్తగా వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. జూన్ 2015 నాటికి దేశంలో ఆధార్ నమోదు ప్రక్రియ పూర్తి కావాలంటూ సెప్టెంబర్ 2014లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ సంబంధిత సంస్థకు ఆదేశంతో కూడిన ఓ గడువు విధించి, ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతానికి మరింత దోహదం చేశారు. ఆధార్ విషయంలో గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ దేశంలోని ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయంటూ 2015 జూలై 21న ముగ్గురు సభ్యులతో కూడిన ధర్మాసనం విచారం వ్యక్తం చేసింది. సాంఘిక సంక్షేమ పథకాలు పొందే లబ్దిదారుల నుంచి ఆధార్ కార్డు కోసం ఒత్తిడి తెస్తున్నట్లు పత్రికల్లో అచ్చుయిన అనేక సంఘటనలను ఈ సందర్భంగా ఉదాహరణలుగా చూపించింది.

అధార్ కేసులో సుప్రీంకోర్టు విధించిన నిబంధనలను సడలించాలంటూ కేంద్రప్రభుత్వం కూడా ఆది నుంచీ పదేపదే సుప్రీంకోర్టుకు అభ్యర్థనలు చేస్తూ వస్తుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి కాస్తంత వెసులుబాటు కల్పిస్తూ... 11 ఆగస్టు 2015న సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వంటగ్యాస్, ప్రజా పంపిణీ వ్యవస్థ పథకాలకు మినహా దేనికీ ఆధార్‌ను వర్తింపజేయరాదంటూ సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే, ఆధార్ కార్డు లేదనే కారణంతో అర్హత కలిగిన ఏ ఒక్క పౌరుడిని కూడా ప్రభుత్వ పథకాలకు దూరం చేయకూడదని కూడా సుప్రీంకోర్టు తెలిపింది. అంతేకాకుండా, ఆధార్ కార్డు కేవలం ఐచ్ఛికం మాత్రమేనని, తప్పనిసరి కాదని కూడా తేల్చి చెప్పింది. ఇదే విషయాన్ని టివి చానళ్ళు, పత్రికలు, రేడియో ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసేనాటికి దేశంలో 89 కోట్ల ప్రజలు ఆధార్ కార్డు పథకంలో భాగంగా భయానికో, అవసరానికో లేక ప్రభుత్వం విస్తృతంగా చేసిన ప్రచార ఆర్భాట ప్రభావానికి గురయ్యో తమ వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ ఉత్తర్వులకు పూర్వం ఆధార్ కార్డ్ 'పిచ్చోడి చేతిలో రాయి - కోతి చేతిలో కొబ్బరి చిప్ప' మాదిరిగా ఉండేది. దేశంలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు వివిధ సేవలు, ఇతరత్రా అవసరాల నిమిత్తం ప్రజల నుంచి గుర్తింపు ధృవీకరణ వివరాలను కోరే క్రమంలో ఆధార్ కార్డును కొన్ని చోట్ల ప్రధాన ఐచ్ఛికంగా, మరికొన్నిచోట్ల తప్పనిసరిగా చేర్చాయి. ఇక, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆధార్ కార్డు ఓ వరమైంది. ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలలో లబ్దిదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించేటందుకు ఈ ఆధార్ కార్డును ప్రధాన ఆయుధంగా చేసుకున్నాయి. సుప్రీంకోర్టు జారీచేసిన ఈ ఉత్తర్వుల తరువాత కూడా ప్రభుత్వాలలో చెప్పుకోతగ్గ మార్పు లేదు. ప్రజలు ఆధార్ కార్డును పొందడం తప్పనిసరి కాదని విస్తృతంగా ప్రచారం చేయాలంటూ సుప్రీంకోర్టు చేసిన ఆదేశాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం మొక్కుబడిగా పాటిస్తుంది. వాస్తవానికి సుప్రీంకోర్టు ఆదేశంలో ఉన్న తీవ్రతను పరిశీలించి చూస్తే ఈ విషయానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా విస్తృత ప్రచారం కల్పించాలి. అలాకాకుండా ఆధార్ నమోదు కార్యక్రమానికి సంబంధించిన ప్రచార ప్రకటనలోనే ఆధార్ తప్పనిసరికాదు అంటూ ఓ చిన్నవ్యాక్యాన్ని చేర్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. సిగరెట్ పెట్టెలపై చట్టబద్ధ హెచ్చరికను చిన్న చిన్న అక్షరాలలో రాసినట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తుంది. దొంగచేతిలో తాళంచెవి పెట్టినట్లు... ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతంపై అత్యుత్సాహం చూపే ప్రభుత్వాలు ఆధార్ విరుద్ధ ప్రచార బాధ్యత పట్ల ఏమాత్రం చిత్తశుద్ధిని పాటిస్తాయనేది సామాన్యుడికి సైతం కలిగే స్పష్టమైన అనుమానం.

వంటగ్యాస్, ప్రజాపంపిణీ పథకాలకు ఆధార్ కార్డుల స్వచ్ఛంద వినియోగానికి అనుమతి పొందిన కేంద్రప్రభుత్వం మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం అందించే అన్ని పథకాలకు ఆధార్ కార్డుల స్వచ్ఛంద వినియోగానికి అనుమతివ్వాలంటూ అభ్యర్థించింది. సుప్రీంకోర్టు అందుకు నిరాకరిస్తూ... కేవలం ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల్లో మాత్రమే ఆధార్ కార్డుల స్వచ్ఛంద వినియోగానికి అనుమతినిస్తూ 2015 అక్టోబర్ 15న తాత్కాలిక ఉత్తర్వులను జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ఆధారంగా ఉపాధి హామీ పథకం, అన్ని పెన్షన్ పథకాలు, ఉద్యోగుల భవిష్యనిధి, ప్రధానమంత్రి జనధన్ యోజనలాంటి పథకాల్లో ఆధార్ కార్డుల స్వచ్ఛంద వినియోగానికి అవకాశం లభించింది. ఈ ఉత్తర్వులు వచ్చే నాటికి ఆధార్ కార్డు పథకంలో 92.5 కోట్ల దేశ ప్రజలు భాగస్వాములయ్యారు. ఆధార్ కార్డుల స్వచ్ఛంద వినియోగానికి అనుమతివ్వాలంటూ ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు వద్ద క్యూ కట్టాయి. రోజు రోజుకూ సుప్రీంకోర్టు ఆదేశాలు మొక్కుబడిగా అమలవుతున్నాయి, ఆధార్ కార్డు విచ్చలవిడి వినియోగానికి దేశంలోని ప్రభుత్వాలు పౌరులపై చేసే ఒత్తిడి పెరుగుతూనే ఉంది. ఆధార్ కేసులో సుప్రీంకోర్టు తుది తీర్పు ఇంకా వెలువడాల్సి ఉంది.

ఆధార్ నమోదు ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధమంటూ జస్టిస్ కె. ఎస్. పుట్టస్వామి తదితరులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలు ప్రధానంగా పౌరుల బయోమెట్రిక్ వివరాలను సేకరించడం పట్ల తప్పుపట్టాయి. పౌరుల చేతి వేళ్ల ముద్రలు, కనుపాపల గుర్తులు (ఐరిస్) తదితర బయోమెట్రిక్ వివరాలను సేకరించడం పౌరుల వ్యక్తిగత గోప్యత హక్కును అతిక్రమించడమే అవుతుందని గత మూడు సంవత్సరాలుగా తీవ్రంగా వాదిస్తున్నాయి. పైగా ఈ వివరాలను ప్రైవేట్ వ్యక్తులు సేకరిస్తున్నారని, వాటి భద్రత పట్ల సహేతుకమైన అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నాయి. అయితే వ్యక్తిగత గోప్యత హక్కు ప్రాథమిక హక్కు అవుతుందా? లేదా? అనే అంశంపై నిర్ణయించడానికి విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటయింది. ఆ నిర్ణయం ఎప్పుడొస్తుందో వేచి చూడాలి. ఇవన్నీ ఇలా ఉంటే 2010 సంవత్సరంలో ఆనాటి యుపిఏ-2 ప్రభుత్వం

మరణశిక్షను ఎందుకు వ్యతిరేకించాలి?

***దేశంలో అమలవుతున్న మరణశిక్షలు న్యాయాన్యాయాల పాత్ర కంటే మతం, వర్గం ప్రాతిపదికన అమలువుతున్నాయనీ, నాగరిక సమాజంలో ఉరిశిక్షలు వేయడం ఎంతవరకు సమంజసమనీ అంటున్నారు* మాదిరాజు రాంబాబు**

'కంటికి కన్ను' 'రక్తానికి రక్తం' (జస్ టాలియనిస్) అనే దుర్మార్గమైన శిక్షా పద్ధతిని అనుసరించడం నాగరికమా? అన్న చర్చ ఇవాళ్టిది కాదు. ఇందులో భాగంగా మరణశిక్ష అనాగరికమని, దాన్ని పూర్తిగా రద్దు చేయాలన్న డిమాండ్ చేస్తూ అంతర్జాతీయంగా ఒక హక్కుల ఉద్యమాలు నడుస్తున్నాయి. ఉరిశిక్షను అత్యంత అరుదైన నేరాల విషయంలో అమలు చేస్తున్న మన దేశంలో కూడా గత కొన్ని దశాబ్దాలుగా కొన్ని ప్రజాస్వామిక సంస్థలు, హక్కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. మన శిక్షాస్మృతి ప్రకారం నర హత్యలు సహా సాధారణ నేరాలతో కలిపి 34 రకాల నేరాలకు చట్టబద్ధంగా వివిధ సెక్షన్ల పరిధిలో మరణశిక్ష విధించవచ్చు. మరణశిక్షను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలు 1956లోనే తమ సమ్మతిని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశాయి. అయితే ఇప్పటికీ 'మరణశిక్ష రద్దు చట్టం' పార్లమెంట్‌లో అమోదం పొందలేదు. దానికితోడు అత్యంత అరుదైన నేరాలుగా పరిగణిస్తూ ప్రత్యేక ట్రయల్ కోర్టులు గత 15 ఏళ్లలో 1,790 కేసుల్లో మరణ శిక్షలు విధిస్తే, వాటిలో 95.7 శాతం తీర్పులు తప్పుడువని సుప్రీకోర్టు గుర్తించింది.

ఈ మరణ శిక్షలపై జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ వేదికల ద్వారా నిరసనలు వ్యక్తమైనాయి. హత్యా నేరాలకు సహకరించిన వారికి ప్రాసంగిత సాక్ష్యాధారాల ఆధారంగా మరణశిక్ష విధించకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ పార్లమెంట్ దాడి కేసులో 'జాతి మనస్సాక్షిని సంతృప్తిపరచా'లన్న ప్రాతిపదికపై అఫ్జల్‌గురుకు, ప్రాసంగిక సాక్ష్యాధారాలపై ముంబాయి పేలుళ్ల కేసులో మెమన్‌కు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శిక్షలు విధించింది. అఫ్జల్‌గురు, మెమన్ మరణ శిక్షల సందర్భంగా భారత అత్యున్నత న్యాయస్థానం, రాజ్యం వ్యవహరించిన తీరుపై దేశంలోని ప్రజాస్వామికవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మత సంబంధిత ఉగ్రవాదం, దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం ఏర్పడే ఉగ్రవా, తీవ్రవాద నేరాల విషయంలో తప్ప మిగిలిన ఏ నేరాల విషయంలోనూ మరణశిక్ష విధించరాదని భారత 20వ లా కమిషన తాజా నివేదిక సిఫారసు చేసింది.

1993 మార్చి 12 నాటి ముంబై వరుస పేలుళ్లలో సుమారు 257 మంది మరణానికి, 1400 మంది తీవ్ర క్షతగాత్రులవడానికి, అంతకంటే ఎక్కువగా దేశ వ్యాప్తంగా ఉగ్రవాద భయోత్పాతాన్ని సృష్టించడానికి సహకరించాడనే కారణంపై యాకూబ్ మెమన్‌ను రాజ్యం ఉరితీసింది. న్యాయస్థానాల ద్వారా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దగ్గర ఉన్న అన్ని చట్టబద్ధ అవకాశాలను మెమన్‌కు మరణశిక్ష తప్పలేదు. మెమన్ ఉరిశిక్ష ద్వారా ముంబయి పేలుళ్ల బాధితులకు న్యాయం చేయాలన్న ప్రచారం మీడియాలో బలంగా జరిగింది. వందల మందిని చంపిన దోషులలో ఎవరో ఒకరికి తీవ్రమైన శిక్ష విధిస్తే ఏదో ఒక మేరకు న్యాయం జరుగుతుందన్న భావం బాధితుల్లోనూ, ప్రజల్లోనూ కొనసాగుతుండడం సహజమే.

మెమన్ ఉరి సందర్భంగా దేశంలో రాజ్య స్వభావంపై చర్చ మరోసారి ముందుకు వచ్చింది. గత పదకొండేళ్లలో ముంబయి పేలుళ్ల కేసులో నిందితుడు యాకూబ్ మెమన్ ఉరి నాల్గవది. దేశ వ్యాప్తంగా సంచలనం

ఆధార్ కార్డ్ పథకానికి చట్టపరమైన హోదా కల్పించే ఉద్దేశంతో రూపొందించి, పార్లమెంటులో ప్రవేశపెట్టిన 'భారత జాతీయ గుర్తింపు ప్రాధికార సంస్థ బిల్లు' నేటికీ పార్లమెంటు ఆమోదం పొందలేదు. ఓ వైపు ఆధార్ కార్డు పథకానికి చట్టబద్ధత లభించలేదు, మరోవైపు వ్యక్తిగత గోప్యత హక్కు ప్రాథమిక హక్కు అవుతుందా? లేదా? అనే విషయాన్ని త్రిసభ్య ధర్మాసనం తేల్చలేకపోయింది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే, వ్యక్తిగత గోప్యత హక్కుకు సంబంధించిన ఈ అంశం గత మూడు సంవత్సరాలుగా నిరాకరణకు గురికాకుండా ఒక ప్రాధాన్యత కలిగిన అంశంగా సుప్రీంకోర్టు పరిశీలనలో సజీవంగా ఉంది. ఇలాంటి సందిగ్ధ పరిస్థితిలో తుది తీర్పు వెలువడేంతవరకు ఆధార్ నమోదు ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసేందుకు తగిన ఉత్తర్వులను జారీ చేయడం ఇంతకాలంగా సుప్రీంకోర్టు పాటించాల్సిన కనీస సహజ ధర్మం. కానీ అదీ జరగలేదు. సుప్రీంకోర్టు తుది తీర్పులో జాప్యం జరిగినా కొద్దీ, ఆధార్ నమోదు ప్రక్రియలో వేగం పెరుగుతూ పోతూనే ఉంది. ఈ రకంగా ఆధార్ నమోదు కార్యక్రమం వేగంగా, నిరాటంకంగా సాగడానికి పరోక్షంగా సుప్రీంకోర్టు యింతకాలం మేలు చేసినట్లయింది. ఇప్పటికే దేశ జనాభాలో అత్యధిక శాతం ప్రజలు తమ బయోమెట్రిక్ వివరాలను ఆధార్ కార్డు పథకంలో సమర్పించుకున్నారు. ఒకవేళ ఆధార్ నమోదు ప్రక్రియను తప్పుపడుతూ రేపటిరోజున విస్తృత రాజ్యాంగ ధర్మాసనం తన నిర్ణయాన్ని ప్రకటిస్తే... ఇంతకాలం దేశంలోని ప్రభుత్వాలు దేశ పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించినట్లే కదా! ఇంతకాలం ప్రైవేటు వ్యక్తులు సేకరించిన పౌరుల బయోమెట్రిక్ వివరాల భద్రతకు హామీ ఎవరిస్తారు? ఇది కేవలం వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశం మాత్రమే కాకుండా కొన్ని వేలకోట్ల రూపాయల ప్రజాధనానికి సంబంధించిన అంశం కూడా. ఏదైతేనేమీ... ఇటు ప్రభుత్వాలను, అటు న్యాయస్థానాలను నమ్ముకుని బతుకుతున్న సాధారణ పౌరుడికి అయోమయం, అనుమానంతో పాటు విస్మయం కలిగించే పరిణామమిది.

(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్టు) వీ

రేపిన పార్లమెంట్ దాడి కేసులో అఫ్జల్‌గురుపై యుపిఎ ప్రభుత్వం ఎన్నికల ముందు హడా ఉడిగా ఉరిశిక్ష అమలు చేసింది. ఆ కేసులో అఫ్జల్‌గురు పాత్రకు సంబంధించిన సాక్ష్యాధారాలపై వెలువడిన సందేహాలు ఎన్ని ఉన్నప్పటికీ 'సమాజం ఉమ్మడి మనస్సాక్షి'ని సంతృప్తి పరిచేందుకు మరణ శిక్ష వేస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది. ఉరితో సహా మరణ శిక్షలేవైనా నిందితుల పాత్రను అన్ని కోణాల నుంచి ప్రత్యర్థుల వాద ప్రతివాదనల ఆధారంగా, న్యాయ సూత్రాల అనుసారం అత్యంత అనువైన నేరాలు చేసినవారికి న్యాయస్థానాలు మరణ శిక్షలు విధించాలి. దీనికితోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, రాజ్యాంగాధినేతల విచక్షణాధికారాలు నేపథ్యంలో వచ్చిన నిర్ణయాల మేరకు మరణ శిక్షలు అమలవుతాయి. ముంబయి బాంబు పేలుళ్ల అనంతరం 1993 మార్చ్‌లో ముస్లింలపై ఊచకోత సాగింది. న్యాయస్థానాలు, మీడియా, మెజారిటీ ప్రజలు ముంబయి పేలుళ్ల గురించి పట్టించుకున్నంతగా ఆ పేలుళ్ల అనంతరం ముస్లిం వ్యతిరేక హింస గురించి ఎవరూ పట్టికోకపోవడంలో ఆంతర్యమేమిటి?

మనదేశంలో చట్టబద్ధ మరణ శిక్షలు చాలా తక్కువే. అయితే అందుకు భిన్నంగా ఈ శతాబ్దపు తొలి శతాబ్దిలో 14,231 మంది జుడిషియల్/ పోలీసు కస్టడీల్లో మరణించారు. ఈ కస్టడీ మరణాలన్నీ రాజ్యం చేస్తున్న చట్ట విరుద్ధ మరణ శిక్షలుగా పరిగణించాలి. రాజ్యం చేస్తున్న ఈ మరుగునపడ్డ మారణ హోమం, మరణ శిక్షల్లో కొన్ని మాత్రమే అరుదైన సందర్భాల్లో, రాజకీయ వివాదాల కారణంగా వెలుగులోకి వస్తున్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. రాజ్యాల సార్వ భౌమత్వ అసాధారణ అధికారాలలో పౌరులను చంపే అధికారం కూడా ఒకటైనట్టయితే, మనదేశం కూడా అతి పెద్ద హంతకుల్లో ఒకటిగా నిలుస్తుంది. మరణ శిక్షకు గురైన ప్రతి పదిమంది వ్యక్తులలో తొమ్మిది మందికి పైగా వెనుకబడిన కులం లేదా మైనారిటీ లేదా పేదవారేనని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కస్టడీలో జరిగిన హత్యల్ని కూడా కలుపుకుంటే ఈ నిష్పత్తి ఇంకా ఎక్కువ ఉండొచ్చు.

దేశంలోని అత్యంత వెనుకబడిన అస్తిత్వాల్లో రగులుతున్న అలజడులు, అసంతృప్తిని అదుపు చేసేందుకు మరణ శిక్షను అంతిమ ఆయుధంగా రాజ్యం వినియోగిస్తుంది. యాకూబ్ మెమన్ ఉరిశిక్ష సహా రాజ్యం విధించే చట్టబద్ధ, చట్ట విరుద్ధ మరణశిక్షలు కచ్చితంగా వర్గ స్వభావాన్ని వ్యక్తీకరిస్తున్నాయి. స్వాతంత్ర్యం అనంతర కాలంలో వివిధ సామాజిక అస్తిత్వాలు, ఆ అస్తిత్వాల్లోని పేద, వెనుకబడిన వర్గాల వారు చేసిన ప్రతిఘటన 'బీభత్సాన్ని' మాత్రమే రాజ్యం శిక్షించిందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అన్ని అస్తిత్వాల్లోని పేదవారిపైన జరుగుతున్న హింస చాలా సందర్భాల్లో వెలుగులోకి రావడం లేదు. మత హింస లేదా కుల హింస లేదా జండర్ హింసల్లో ఏ రకమైన హింస అయినా సరే ఆ అస్తిత్వాల్లోని బలహీనులపై బలవంతులు చేస్తున్న హింసాత్మక చర్యలకు శిక్షలు పడడం లేదు. హక్కుల సంస్థల కృషి ఫలితంగా గుజరాత్ మారణ హోమంలో రాజ్యహింసకు చెందిన కొన్ని కేసులు న్యాయపరమైన వివాదాలుగా సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నాయి.

ముంబయి వరుస పేలుళ్లలో జరిగిన మారణకాండ ఎవరినైనా కలిచివేస్తుంది. పేలుళ్లకు కారకులైన ఉగ్రవాదులతోను, వారి సమస్యల తోను, లక్ష్యాలతోను ఎలాంటి సంబంధం లేకుండా, వారికి ఎలాంటి హాని తలపెట్టని ప్రజలు చనిపోయిన సందర్భంలో మనందరికీ బాధ కలగడం సహజం. అయితే ఆ మారణ హోమానికి బాధ్యులైన వారికి మరణశిక్షలు వేయడం, ఆ హంతకులకు మరణశిక్షలు వేయడంపై హర్షం వ్యక్తం చేయడమనేది సామాన్య ప్రజల్లో ఒక సహజాతం (మానవ ప్రవృత్తి) గా ఉంటుందని ప్రచారం చేస్తూ ఆ మరణ శిక్షలు సహజ న్యాయసూత్రాల ప్రకారం అమలవుతున్నాయనే ప్రజా సమ్మతిని మీడియా సృష్టిస్తోంది. సమాజంలో ప్రబలంగా, ఆధిపత్యం వహిస్తున్న పాలకవర్గ భావజాలానికి, మానవ సహజాతానికి మధ్య తేడాను మేధావులు గుర్తించడం లేదు. రాజ్యం విధిస్తున్న మరణ శిక్షను ప్రజల ప్రశ్నించకపోవడాన్ని మానవ సహజాతంగా వారు పరిగణించడం దురదృష్టకరం.

పాలితులు, పాలకులుగా విభజితమైన సమాజంలో పాలకుల భావలజాలమే ప్రబల భావజాలంగా ప్రజల మస్తిష్కాలలో రాజ్యమేలు తుంటుందన్న ప్రాథమిక సామాజిక భావనను వారు గుర్తించడం లేదు లేదా కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారు. మెమన్ ఉరిశిక్షకు లభించిన సామాజిక సమ్మతి ప్రజల్లో వ్యవస్థీకృతమై ఉన్న పాలకవర్గ భావజాలమే గాని మరొకటి కాదు. నేరం–శిక్ష, పౌర హక్కులు అనేవి వర్గ సమాజ స్వభావంతో సంబంధం లేకుండా, నాగరికతా వికాస క్రమంలో విడిగా, వాటికవే పరిణామం చెందిన విలువల సంపదగా కనిపిస్తాయో గానీ, సారాంశంలో సర్వసాధారణ రూపంలోని పాలకవర్గ స్వభావాన్ని అవి కలిగి ఉంటాయి. ఏ రాజ్యాంగ వ్యవస్థ అయినా సమకాలీన సామాజిక అస్తిత్వాలన్నింటికీ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పైకి కనిపించినా, వాస్తవంలో ఆధిపత్య అస్తిత్వాల్లోని పాలక వర్గాల ప్రయోజనాలను నెరవేర్చే స్వభావాన్ని అది కలిగి ఉంటుంది.

రాజ్యాంగం, రాజ్యాంగ వ్యవస్థలు, సంస్థలు వగైరా సామాజికాంశాలు నాగరికతాభివృద్ధి క్రమంలో వర్గాలతో సంబంధం లేకుండా వర్గ సంబంధాలకు సమాంతరంగా పరిణామం చెందిన సామాజికాంశాలుగా, స్వతంత్రంగా వర్గాతీత ఉమ్మడి మానవ స్వభావాన్ని సంతరించుకున్నట్లుగా పైకి కనిపిస్తాయి. అవి పైకి అలా స్వతంత్ర వ్యవస్థలుగా కనిపిస్తేనే వర్గ వైషమ్య సమాజాన్ని నడిపించే సాధనాలుగా, యంత్రాంగంగా మనగలుగుతాయి. వాటికున్న పైకి కనిపించే వర్గేతర, మానవత్వ స్వభావం పాలిత వర్గాలకు భావజాల దాస్యంలో ఉంచేందుకు మాత్రమే.

సమకాలీన ప్రజల ఆకాంక్షలను ప్రాతినిధ్యం వహిస్తున్నట్లుగా కనిపిస్తూ, నిర్దిష్ట పాలక వర్గాల ప్రయోజనాల పునాదిపై చరిత్ర గతిలోని అనేక అస్తిత్వ రూపాల్లో సాగిన వర్గ పోరాటాల నుంచి ఉనికిలోకి వచ్చిన విలువల సంశ్లేషిత వ్యవస్థగా రాజ్యాంగం/రాజ్యాంగ వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. మనల్ని తప్పుదారి పట్టించే, మోసం చేసే ఇలాంటి సామాజిక దృగంశాలను అధ్యయనం చేసేటప్పుడు అప్రమత్తంగా లేకపోతే పాలక వర్గ భావజాల మాయలో కొట్టుకుపోతాం. నేరం–శిక్ష అన్న ద్వంద్వం వర్గాతీత అభూత మానవ స్వభావం గల అంశంగా కనిపిస్తుంది.

వర్గాతీత అణచివేత యంత్రాంగంగా రాజ్యాన్ని, నాగరికతాభివృద్ధి క్రమంలో చారిత్రకంగా రూపొందిన వర్గ స్వభావ రహిత మావన ప్రవృత్తి, హక్కులు, ఆదర్శాలు వంటి భావనలు అత్యంత పురోగామి ప్రజాస్వామిక భావాలుగా తెలుగు మేధావుల్లో వర్ధిల్లుతున్నాయి. మార్క్సిస్టు భావజాల సంస్థలు, మేధావులకు సైతం ఈ ఆధునికానంతరవాద తాత్విక తెగులు సోకింది. మెమన్ ఉరి నేపథ్యంలో ఆధునికానంతరవాద వర్గ రహిత దృక్పథంతో మేధావులు మరణ శిక్షను మొత్తంగా వ్యతిరేకిస్తూ ప్రచారం

చేస్తున్నారు. రాజ్యాంగ యంత్రంలోని హక్కులు, శిక్షాస్మృతి సుదీర్ఘ మానవజాతి ప్రజాస్వామిక పోరాట ఫలితంగా ఉనికిలోకి వచ్చాయి. అవి క్రమంగా మరింత పరిపుష్ఠమవుతూ సాగుతున్నాయి.

అయితే ఈ క్రమంలో వాటిలోని అసంపూర్ణ అంశాలను, ఆధునీకీకరణకు గురికాని అంశాలను సంపన్న వర్గాలు తమ స్వార్థానికి ఉపయోగించుకుంటున్నాయి కానీ, వాటికి స్వతహాగా వర్గ స్వభావం లేదనే ఆధునికానంతరవాద భావనను మెజారిటీ మేధావులు మోస్తున్నారు. మత, జాతి, కుల తదితర సాంఘిక వైషమ్యాలను, ఘర్షణలను వర్గ స్వభావంలేని శుద్ధ సామాజికాంశాలుగా చూసే మార్క్స్ పూర్వ చారిత్రక అర్థరాహిత్యాన్ని ఆధునికానంతర వాదమనే అత్యాధునిక భావనలుగా ఈ మేధావులు భ్రమపడుతున్నారు.

నేరస్థుల్ని సంస్కరించడానికి లేదా భయపెట్టి భవిష్యత్‌లో నేరాలు చేయబోయే వారిని నిరోధించడానికి ఉపకరించే సాధనాలుగా నేరస్థులకు వేసే శిక్షల్ని పరిగణించడం పరిపాటి. సాధనాలు, పరికరాలకు వలె వివిధ రకాల శిక్షలకు కూడా రాగద్వేశాలు, వర్గ స్వభావాలు ఉండవు. అయిత వివిధ సందర్భాల్లో, రీతుల్లో వినియోగించే వ్యక్తులకున్న సామాజిక/వ్యక్తిగత స్వభావాలు, సంకల్పాలు, భావజాలులు, లక్ష్యాలను బట్టి వారు వినియోగించే ఆ సాధనాలకు తెలిసో తెలియకో మనం మంచి చెడులను ఆపాదిస్తుంటాం. అంతేగాని వాస్తవంలో ఒక సాధనం మంచిది, ఒకటి చెడ్డది అనేదేమీ ప్రత్యేకించి ఉండదు. అదే విధంగా సామాజిక నేరాల నియంత్రణ కోసం రాజ్యం వినియోగించే శిక్షాస్మృతి – జరిమానా, సాధారణ జైలు శిక్ష నుంచి మరణ శిక్షల వరకు–సమకాలీన రాజ్య స్వభావంపై ఆధారపడి ఉంటుంది. అంతేగాని వివిధ శిక్షలు వాటికవే కొన్ని మంచివి కొన్ని చెడ్డవిగా ఉక్కడా ఉండవు.

సామాజిక వ్యవస్థ స్వభావాన్ని బట్టి అంటే సమాజంలోని ఆధిపత్య, ప్రబల వర్గాలు, వాటి కేంద్రంగా ఉన్న వివిధ అస్తిత్వాల మధ్య గల సమీకరణాలను బట్టి శిక్షల స్వభావం రూపొందుతుంది. మరణ శిక్షల ద్వారా నేరస్థుల్లో పరివర్తన, కొత్తగా అలాంటి నేరాలు జరగకుండా ఇతరులకు హెచ్చరికలుగా నిలిచేందుకు అవకాశముండొచ్చు. మరణ శిక్షల విషయంలో మాత్రం సదరు నేరస్థుల్లో పరివర్తనకు కాక ఇతరులను అలాంటి నేరాలు చేయకుండా భయపెట్టడమొక్కటే అంశంగా మిగిలి ఉంటుంది. ఇతరులను సంస్కరించడం లేదా భయపెట్టడం కోసం నన్ను చంపే హక్కు మీకెక్కడిది? అని మరణశిక్ష పడ్డ నేరస్థులు ప్రశ్నించడంలో తప్పేముంది? యథాస్థితి సజావుగా కొనసాగేందుకు ఉపకరించే అతి కీలకమైన పరిస్థితులు ఏ రూపంలో అదుపు తప్పినప్పటికీ వాటిని ఎదుర్కొనేందుకు ఒక సమాజం తనను తాను పరిరక్షించేందుకు ఉపయోగించే సాధనమే శిక్షాస్మృతి.

అయితే ఒక నాగరిక సమాజం తనను తాను కాపాడుకునేందుకు అంతిమంగా తలారి మీద మాత్రమే ఆధారపడవలసిన దుస్థితికి రావడం ఆ వ్యవస్థ కాలం చెల్లిందిగా తయారయిందనడానికి సంకేతంగా పనిగణించాలి. ప్రతి సామాజిక వ్యవస్థ తనదైన రాజ్యాంగ వ్యవస్థ (రాజకీయ వ్యవస్థ, కార్యనిర్వాహక యంత్రాంగం, న్యాయ, బలప్రయోగ వ్యవస్థ) ను కలిగి ఉంటుంది. వాటి నిర్వాహణ కోసం రాజ్యాంగం, శిక్షాస్మృతిని కలిగి ఉంటుంది. ఆ సమాజంలోని ప్రబల సామాజిక అస్తిత్వాల (వర్గ, కుల, మత, జాతి, వగైరా) లోని ఆధిపత్య వర్గాల ఆధిపత్యాన్ని, ఆధిక్యాన్ని మొత్తంగా ధృవపరుస్తూ పాలక వర్గాల్లోని ఏ ఒక్క విభాగానికి పరిమితం కాకుండా పాలకవర్గ సర్వసాధారణ రూపంలో రాజ్యాంగం పనిచేస్తుంది. సమాజంలోని ఆధిపత్య వర్గ ముఠాలకు, ప్రజలకు అతీతంగా అది సాధారణీకృత నిష్పాక్షిక పాక్షికత్వ రూపంగా అది పరాయీకరణ పొందింది. దాంతో రాజ్యమనేది సమాజంలోని వివిధ అసమాన అస్తిత్వ సంబంధాలు, వాటిల్లోని ఆధిపత్య వర్గాల ప్రయోజనాలకు ప్రాతినిథ్యం వహిస్తుందన్న భావన మరుగునపడింది. దాని స్థానంలో రాజ్యం–పౌర సమాజం అనే ఊహాకల్పిత సామాజిక విభజన అనే భావన మేధావులు, ప్రజల అవగాహనలో భాగమయింది.

ఒక వ్యక్తి లేదా కొందరు వ్యక్తులు కలిసి వ్యక్తిగత లేదా వ్యవస్థీకృత (భావజాల కక్షలు, లక్ష్యాల కోసం) హత్యా నేరాలకు పాల్పడడమనే రూపాల్లో సాధారణంగా హత్యా నేరాలు ఉంటాయి. వ్యక్తి లేక గుపు చేసే ఏ నేరమైనా సమాజంలోని వివిధ అస్తిత్వాలు, వాటిలోని వర్గ స్థానాన్ని బట్టి ఏర్పడిన భావజాలం నేపథ్యంలోనే జరుగుతుంటాయి. మన న్యాయ వ్యవస్థ వక్తిగత లేదా వ్యవస్థీకృత నేరాల్లో 'అత్యంత అరుదైన' కేసులకు మరణశిక్ష విధిస్తుంది. అలాంటిది దేశ సార్వభౌమత్వాన్ని భంగపరిచే ఉగ్రవాదం, తీవ్రవాదం నేరాలకు మరణ శిక్షల్ని పరిమితం చేయాలని 20వ లా కమిషన్ సూచించింది. అయితే మరణ శిక్షలు వేసిన ప్రతిసారీ దేశంలోని ప్రజాస్వామికవాదులు, హక్కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు అన్నీ వ్యక్తిగతమా? వ్యవస్థాగతమా? అనే అంశంతో సంబంధం లేకుండా ఖండిస్తున్నాయి. అదే సమయంలో మరణ శిక్షను రద్దుచేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

వ్యక్తుల నేరాలకు మరణ శిక్షను వేయడాన్ని రద్దుచేసి, కేవలం ఉగ్రవాద, తీవ్రవాద నేరాలకు మాత్రమే మరణ శిక్షల్ని అమలు చేస్తే, ఆయా భావజాల విశ్వాసాలున్న వారు మాత్రమే ప్రధానంగా వాటిని వ్యతిరేకించాల్ని పరిస్థితి ఏర్పడుతుంది. దేశంలోని ప్రజాస్వామిక వాదులంతా ముక్తకంఠంతో ఉగ్రవాద కేసుల్లోని మరణ శిక్షను వ్యతిరేకించ డానికి జంకుతారు. ఉగ్రవాద, తీవ్రవాదం ముద్ర పడితే ప్రభుత్వం నుంచి ఇబ్బందులు తలెత్తే ప్రమాదముందన్న భయంతో ఎన్‌డిఒ సంస్థలు చరవ చేయలేని పరిస్థితి ఏర్పడింది. అదీకాక వ్యక్తిగత నేరాల్ని చేసిన వారికి మరణ శిక్షలు వేయడం వల్ల దేశ సార్వభౌమత్వానికి, పాలకవర్గ ప్రయోజనాలకు కలిగే అదనపు లాభాలేమీ లేకపోగా, అంతర్జాతీయంగా అప్రజాస్వామిక చట్టాన్ని కలిగి ఉన్న దేశంగా అపఖ్యాతి మూటకట్టు కోవాల్సి వస్తుంది.

కార్పొరేట్ నేరాలనేవి ఉగ్రవాద, తీవ్రవాద నేరాలు కావు. అందువల్ల ఎంతటి ప్రాణాంతక ప్రమాదాల్ని కలిగించే పరిశ్రమలననైనా నిర్భయంగా స్థాపించేందుకు బహుళజాతి సంస్థలకు అవకాశం కలుగుతుంది. ప్రబల సామాజిక అస్తిత్వాలు, వాటిలోని ఆధిపత్య వర్గాల ప్రయోజనాలకోసమే చట్టాలు, శిక్షాస్మృతి నిలుస్తుందనడానికి 20 లా కమిషన్ సిఫార్సు ఒక సాక్షీ భూతంగా నిలుస్తుంది. శిక్షాస్మృతిని ఆధునిక, ఆధిపత్య వర్గాల అవసరాలకు అనుగునంగా సరళంగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అంతర్జాతీయ అవసరాలు, భౌగోళిక రాజకీయాల నేపథ్యంలో వ్యవస్థీకృత మరణ శిక్షలను భవిష్యత్‌లో రద్దు చేయవలసి వచ్చినా రాజ్యం వెనుకాడకపోవచ్చు. మరణ శిక్షలులేని అత్యంత ప్రజాస్వామిక రాజ్యాల జాబితాలో మన దేశం చోటు పొందుతుంది.

మన రాజ్యం మరింత మానవత్వ మేకప్‌తో ముస్తాబవుతుంది. అత్యంత అరుదైన నేరాలకు జీవిత ఖైదు రూపంలోని సాంఘిక బహిష్కరణ శిక్షను రాజ్యం అమలు చేసి మేధావులను, హక్కుల సంస్థలను, ప్రజాస్వామిక వాదులను, కార్పొరేట్ శక్తులను ఏకకాలంలో సంతృప్తి పరచనూవచ్చు.

నేరం–శిక్ష అనేది సామాజిక సంబంధాల (వర్గ, కుల, మత, జాతి, ప్రాంతం వంటి అస్తిత్వాలు) తో సంబంధం లేని వ్యవహారం కాదు. నేరాలకు తావిచ్చే సామాజిక సంబంధాలు, సంస్కృతి కొనసాగుతున్నంత కాలం నేరాలు ఉంటూనే ఉంటాయి. వర్గ స్వభావం లేని నేరాన్ని గాని, శిక్షను ఊహించడం అమాయకత్వమే అవుతుంది. ఆధిపత్యాన్ని అస్తిత్వంలోని సంపన్న వర్గాల్లోని ముఠాలకు అతీతంగా సర్వసాధారణ రూపంలోని పాలక వర్గంగా రాజ్యం శిక్షల్ని పాలితులపై ప్రయోగిస్తుందనేది నిరూపిత సత్యం.

మరణ శిక్షలు రద్దు చేసిన సందర్భాలలో రాజ్యం లాకప్‌డెత్‌లు, ఎన్‌కౌంటర్ల రూపంలో అనధికార, చట్టవిరుద్ధ మరణశిక్షల్ని నిరభ్యంతరంగా వినియోగిస్తుండడం చూస్తూనే ఉన్నాం. ప్రజల సమ్మతి లభిస్తుందనుకున్న సందర్భాల్లో న్యాయ ప్రక్రియతో సంబంధం లేకుండా 'తక్షణ న్యాయ' పేరుతో రాజ్యం మరణ శిక్షల్ని అమలు చేస్తున్న సంఘటనలు చాలనే చూస్తున్నాం. ఆయుధాలతో కొట్లాడుతున్న వారిని చంపొచ్చు అనే లౌక్య తర్కం ద్వారా ప్రజల్ని ప్రేక్షకులుగా మారుస్తున్నారు. దానికితోడు చట్టం, న్యాయం, విలువలు అనేవి ప్రజలు సాధించుకున్నారు. వాటిని అమలు చేసేందుకు మాత్రమే మనం రాజ్యాన్ని ఒత్తిడి చేయాలి గాని, మనం కూడా అప్రజాస్వామికంగా మరణ శిక్షల్ని ఎంచుకోవడం పొరపాటని కొంతమంది మేధావుల అభిప్రాయం.

ఆధిపత్యం అస్తిత్వంలోని ఆధిపత్య వర్గ ప్రయోజనాల కోసం రాజ్యం పనిచేస్తున్న విషయాన్ని వాళ్లు గుర్తించారు. ఈ అసమాన సామాజికార్థిక వ్యవస్థ కొనసాగుతున్నంత వరకు చట్టబద్ధ, చట్ట విరుద్ధ మరణ శిక్షల్ని పాలకులు – పాలితులు అనివార్యంగా కొనసాగిస్తున్నారనే వాస్తుగత చారిత్రక అంశాన్ని గుర్తించడంలో వాళ్లు విఫలమయ్యారు. 'చట్టం ముందు అందరూ సమానమన్న' కుహనా సూక్తిని వల్లిస్తూ పీడిత అస్తిత్వ ప్రజలను మాత్రమే శిక్షిస్తున్న రాజ్యం స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. దోపిడీ వర్గాలు దోపిడీకి గురయ్యే వర్గాల మధ్య జరిగే వర్గ పోరాటం, వివిధ అస్తిత్వాల మధ్య పోరాటం రూపంలో భావజాల పరంగా, సాయుధంగా జరగడం ఒక చరిత్ర. చరిత్ర నిష్పాక్షికంగా సాగుతుందనుకోవడం అమాయకత్వం. చరిత్ర గమనం పక్షపాతంగానే సాగుతోంది. ప్రకృతిని, సమాజాన్ని విధ్వంసం చేసే సామ్రాజ్యవాద, బ్యూరాక్రటిక్ పెట్టుబడి దారీ శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరాటం శాంతియుత రూపంలోనే పరిష్కారమవడానికి ఎవరూ వ్యతిరేకం కాదు.

'విమర్శ అనే ఆయుధం, ఆయుధాలతో విమర్శకు ఎన్నటికీ ప్రత్యామ్నాయం కాజాలదు'. ఈ నేపథ్యంలో పాలిత అస్తిత్వాలు అణచివేతకు వ్యతిరేకంగా తిరగబడ్డ చారిత్రక సందర్భాలు కేవలం విమర్శలకు, సామాజిక సంభాషణలకు, ఒప్పించడాలకు మాత్రమే పరిమితం కావు. అవి వాటి భావజాల శాస్త్రీయత పునాదిగా వివిధ హింసాత్మక రూపాల్లోకి పరిణమిస్తాయి.

విచక్షణారహిత పేలుళ్లకు, హత్యాకాండలకు పాల్పడే ఉగ్రావద రూపం గాని, ఆర్థిక, సామాజిక, సాయుధ అణచివేతకు కారకులైన వివిధ స్థాయి వ్యక్తులు, వ్యవస్థలు లక్ష్యంగా బిభత్సకాండను, హింసాకాండను సాగించే పాలితుల హింసాకాండ అనే రెండు రూపాల్లో వ్యవస్థీకృత భావజాల ప్రతిహింస కొనసాగుతుంది. పాలిత ఉద్యమాల్లోని హింస, మరణ శిక్షలు, పాలక వర్గాల తరపున రాజ్యం విధించే మరణ శిక్షలు ఎప్పటికీ ఒకటికావు.

మరణ శిక్షల వర్గ స్వభావాన్ని గుర్తించకుండా మరణశిక్ష రద్దును డిమాండ్ చేస్తున్న మేధావులు అత్యంత ప్రజాస్వామికంగా పైకి కనపడవచ్చు. వాళ్లు అంతిమంగా పాలక వర్గాల భావజాల మాయలో సౌకర్యవంతంగా తాదాత్మ్యతనొందుతారు. వివిధ సామాజిక అస్తిత్వాల్లోని ఆధిపత్య వర్గాల భావజాల ప్రబలత్వాన్ని గుర్తించడం అవసరం. వర్గాతీత రాజ్యాన్ని, రాజ్యాంగ సంస్థల్ని, వ్యవస్థల్ని, పౌర హక్కుల్ని, విలువల్ని ప్రచారం చేస్తూ, అత్యంత ప్రజాస్వాక ముఖంతో కనిపిస్తున్న ఆధునికానంతరవాదం ఒక భావజాల బ్లాక్ హోల్‌గా మేధావుల హేతుబద్ధ వివేచనను, తాత్వికతను కబళిస్తోంది.

సమాజంలోని అస్తిత్వాలన్నింటినీ ఒకదానికొకటి సంబంధంలేని విడివిడి అంశాల సమాహారం (అంటే ఒక మిశ్రమం–కాంగ్లమరేట్ హోల్) గా, ప్రతి అస్తిత్వం తనదైన సొంత పరిష్కారం మాత్రమే కలిగి ఉండే ఎంటిటిగా ఆధునికానంతరవాదం ప్రచారం చేస్తోంది. సమాజం అనేది అనేక అస్తిత్వాల సంశ్లేషణంగా (సజీవ మొత్తం) గుర్తించడాన్ని కాలం చెల్లిన మహాకథనమని తప్పుగా చిత్రీకరిస్తోంది. సామాజిక శకలవాదాన్ని ప్రచారం చేయడం ద్వారా సామాజిక అస్తిత్వాలన్నీ ఏకమై, ఒక ఉమ్మడి ఎజెండాతో అసమాన సామాజికార్థిక వ్యవస్థను నిర్మూలించడాన్ని ఆధునికానంతరవాదం అడ్డుకుంటోంది. ఈ ధోరణి సమాజం మొత్తానికి ఒకే పరిష్కారం ఉండదని, విభిన్న అస్తిత్వాలకు విభిన్న సత్యాలు, విభిన్న పరిష్కారాలుంటాయనే వాదనతో అసమాన సామాజిక యథాస్థితిని నిర్లజ్జగా సమర్థిస్తోంది.

సాధికారిత పేరుతో ప్రతి అస్తిత్వంలో క్రిమీలేయర్ ఏర్పడేందుకు దోహదం చేస్తూ, అంతర్గతంగా వర్గ సంబంధాల ఏర్పాటును సైద్ధాంతికంగా సమర్థిస్తుంది. ఆర్గానిక్ ఇంటలెక్చువల్స్‌ను జీవనశైలి వగైరా అంశాల్లో అహేతుకంగా ప్రోత్సహిస్తూ తమ అస్తిత్వానికి చెందిన సాధారణ, పేద ప్రజానీకం సమస్యల నుంచి వారిని దూరం చేస్తుంది. అస్తిత్వ ఉద్యమాలన్నింటినీ రాజ్యాధికారంతో వాటా పొందాలన్న డిమాండ్ మాటున ఆ అస్తిత్వాల్లోని క్రిమీలేయర్‌ని పాలకవర్గ ముఠాలలో అంతర్భాగమవడానికి ప్రోత్సహిస్తుంది. ఆధునికానంతరవాద ప్లేగు రాష్ట్రంలోని మేధావుల్ని, వివిధ అస్తిత్వవాద, విప్లవ భావజాల సంస్థల్ని పూర్తి స్థాయిలో కలుషితం చేసింది.

మరణశిక్షల రద్దు నుంచి ప్రతి సామాజిక అంశంలోనూ మేధావులు శాస్త్రీయ దృక్పథం నుంచి తప్పుదారి పట్టేందుకు ఈ తాత్విక ధోరణే ప్రధాన కారణం. మరణ శిక్షలు, మత ఘర్షణలు, కులం, జెండర్, ప్రాంతం వగైరాలల్లో సిబిడీకృతమై ఉన్న సామాజిక వర్గ స్వభావాన్ని బాలగోపాల్, ఆయన తాత్విక సాంస్కృతిక వారసులు మరుగునపరుస్తూ రచనలు చేస్తున్నారు. వ్యవస్థ మార్పును అడ్డుకునేందుకు దోహదపడే ఆధునికానంతరవాద దృక్పథాన్ని విడనాడనంత వరకు పీడిత వర్గాల సమస్యకు శాస్త్రీయ మౌలిక పరిష్కారం ఎండమావిగా మారుతుంది.

(రచయిత పాత్రికేయులు) వీ

బీహార్ ఎన్నికల రాజకీయాలు

పార్లమెంటరీ ఎన్నికల రాజకీయాలలో కులం, మతం, ప్రాంతం ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయనీ, ప్రజల మనోభావాలకు, మౌలిక సమస్యలకు ప్రాధాన్యత లేదనీ అంటున్నారు వై. భాస్కర్

బీహార్‌కు 2015 అక్టోబర్ – నవంబర్‌లో జరుగుతున్న ఎన్నికలు దేశానికి ఎంతో ముఖ్యమైనవిగా పరిగణించబడుతున్నాయి. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి నితిష్ కుమార్ నాయకత్వంలోని జెడి(యు), లాలూ ప్రసాద్ నాయకత్వంలోని ఆర్‌జెడి, కాంగ్రెస్ మహాకూటమిగా, మరొకవైపు బిజెపి, రామ్‌విలాస్ పాశ్వాన్ ఎల్‌జెపి, జెడి (యు) నుండి బయటకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జీతన్ రామ్ మాంఝి హిందుస్తాన్ ఆవామి మోర్చా (హెచ్ఎఎం), రాష్ట్రీయ లోక్ సమత పార్టీ ఎన్‌డిఎ కూటమిగా పోటీలో ఉన్నాయి. అలాగే వామపక్ష పార్టీలు కలిసి లెఫ్ట్ ఫ్రంట్ గా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. ఈసారి అసదుద్దీన్ ఓవైసి ఎంఐఎం పార్టీ కూడ తన అభ్యర్థులను నిలబెట్టింది.

లోక్ సభకు జరిగిన ఎన్నికల్లో పెద్ద ఎత్తున మెజారిటీతో గెలిచి ఆ తర్వాత జరిగిన జార్ఖండ్, హర్యానా, కాశ్మీర్ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోడీని అత్యంత ప్రభావం కలిగిన వ్యక్తిగా చూపించారు. ఆ ప్రభావాన్ని చూపించి ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్శించి పెట్టుబడులను రాబట్టుకోవడానికి ప్రయత్నాలు చేశారు. ఆ తర్వాత జరిగిన ఢిల్లీ ఎన్నికల్లో ఓటమితో అయోమయంలో పడ్డారు. దాంతో మోడీ చూపించిన ప్రభావం మీద అందరికి అనుమానాలు ఏర్పడ్డాయి. దాని నుండి బయట పడడానికి బెజెపికి ఈ ఎన్నికలు ఎంతో అవసరం.

బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చి 17 నెలలు కావస్తోంది. మధ్యతరగతికి హామీ ఇచ్చిన మంచి రోజులు లేకపోగా, ఉల్లి, కందిపప్పు ధరలు ఆకాశానికి అంటి పాత రోజులే మంచివని అనుకునేలా చేశారు. విద్యార్థులకు హామీ ఇచ్చిన ఉద్యోగాలు సృష్టించలేకపోయారు. ఇప్పుడు ఏం చేయాలో తోచక మళ్లీ హిందూత్వ అజెండాను ముందుకు తెస్తున్నారు. అవసరమైనప్పుడల్లా ఆర్ఎస్ఎస్ మతవాదులు రంగంలోకి దిగి కావలసినంత అలజడిని ప్రజల్లో సృష్టిస్తున్నారు. జార్ఖండ్ ఎన్నికలకు ముందు ఘర్ వాపసి, కాశ్మీర్ ఎన్నికలకు ముందు ముస్లీం తీవ్రవాదాన్ని, ఈ బీహార్ ఎన్నికల్లకు ముందు గోమాంస నిషేధం, రిజర్వేషన్లు ఎత్తివేయడం గురించి చర్చను లేవనెత్తి హిందూ ఓట్లను సమకూర్చు కోవడం కోసం ప్రయత్నిస్తున్నారు. మరొక వైపు ప్రభుత్వంలోని పెద్దలు, ప్రధానమంత్రి అభివృద్ధి మంత్రం జపిస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులయినా, ప్రజలు అంత పెద్ద మెజారిటీతో గెలిపించినా బిజెపి ఇప్పటి వరకు చేసిందేమీ లేదు. గత కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఈ మంచి రోజులు తెస్తానన్న నరేంద్రమోడీ ప్రభుత్వానికి పెద్ద తేడా ఏమీ లేదని ప్రజలు భావించిన ప్రతిసారీ హిందూత్వ అజెండాను ముందుకు తీసుకు వస్తున్నారు. గత ఢిల్లీ ఎన్నికల్లో మసకబారిన నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని నిలబెట్టడానికి ఆర్ఎస్ఎస్, బిజెపి మతవాదులు అన్ని ప్రయత్నాలు ఈ బీహార్ ఎన్నికల్లో చేస్తున్నారు.

అంతే కాకుండా బీహార్లో ఏర్పడిన ఎన్నికల పొత్తులు కూడా చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. ఒకవైపు మతం వెర్రితలలు వేస్తూ బీఫ్ తిన్నవారిని, హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా రాసిన వారిని చంపేస్తూ, మాట్లాడిన వారి మీద దాడులు చేస్తూ, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లడుతూ ఉంటే వీటన్నిటిలో బలి అవుతున్న దళితుల ప్రతినిధులు రామ్ విలాస్ పాశ్వాన్, జీతన్ రామ్ మాంఝీలు బిజెపి పక్షాన చేరారు. ఇక ముస్లీంల ప్రతినిధిగా చెప్పుకునే ఎంఐఎం, ఎన్ డి ఎకు ఉపయోగపడే విధంగా ఎన్నికల్లో దిగింది. అలాగే అతి వెనుకబడిన కులాల ప్రతినిధిగా ఉపేంద్ర కుశ్వహా (ఆర్ఎల్ఎస్‌పి) కూడ బిజెపితో జతకట్టారు.

హర్యానా ముఖ్యమంత్రి దాద్రి ఘటన గురించి మాట్లాడుతూ, ముస్లింలు ఈ దేశంలో ఉండాలంటే బీఫ్ తినడం మానేయాలి అనడం. హర్యానాలో ఢిల్లీకి కూతవేటు దూరంలో నిద్రపోతున్న దళిత కుటుంబం మీద దాడి చేసి అగ్రకుల రాజపుత్రులు తగులబెడితే ఇద్దరు చిన్న పిల్లలు చనిపోయారు. తల్లిదండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై స్పందిస్తూ కేంద్రమంత్రి, మాజీ జనరల్ వికె సింగ్ – రోడ్డు మీద పోయే కుక్కను ఎవడో కొడితే దానికి ప్రభుత్వం ఏం చేస్తుంది– అనడం. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ రిజర్వేషన్లను ఆపేస్తామని అనడం.

ఇవన్నీ ఒకవైపు జరుగుతూ ఉంటే ఈ దళిత పార్టీలు, నాయకులు బిజెపితో పొత్తు పెట్టుకోవడమే కాకుండా, వీటి మీద ఒక్కమాట కూడ మాట్లాడ్డం లేదు. వికె సింగ్ వ్యాఖ్యల మీద రాజ్‌నాథ్‌సింగ్ లాంటి బిజెపి పెద్దలు విమర్శించిన తర్వాత రామ్ విలాస్ పాశ్వాన్, జీతన్‌రామ్ మాంఝీ ప్రభుత్వం వికె సింగ్ మీద చర్య తీసుకోవాలి అని నోరుతెరిచారు. బిజెపి నాయకత్వంలోని అగ్రకులాలు అధికారంలోకి వస్తే మా పరిస్థితి ఏంటని చాలా సంవత్సరాలుగా బీహార్ మీద ఆధిపత్యం చెలాయిస్తున్న బిసిలు (కుర్మిలు, యాదవులు) నితీష్ కుమార్, లాలుప్రసాద్ యాదవ్ నాయకత్వంలో ఒక్కటయ్యారు. కాంగ్రెస్ వారికి వంతపాడుతోంది. ఇక దళితపార్టీలు బిజెపితో పోవడంతో ముస్లింలకు మహాకూటమే దిక్కయింది.

తన ప్రభావం చూపించడానికి ఇదే సరి అయిన సమయం అని ఎంఐఎం కూడ బరిలోకి దిగింది. బీహార్లో ఎంఐఎం ఒంటరిగా పోటీకి దిగితే ముస్లిం ఓట్లు చీలే అవకాశం ఉంటుంది. ఇది బిజెపికి అనుకూలంగా మారుతుంది. పైగా బిజెపి ఆదేశాల మేరకే ఎంఐఎం పోటీలో దిగింది అని విమర్శలు రావడంతో ఇరుకున పడిపోయింది. ఇది స్థానిక పార్టీ కాకపోవడం, ఎంఐఎం చేసే ముస్లిం ఉన్నత వర్గ రాజకీయాలు బీహార్లో నడిచే పరిస్థితి లేక 20 సీట్లకు పోటీ చేయడం నుండి దిగివచ్చి 6 సీట్లలో పోటీకి పరిమితం అయింది. అసదుద్దీన్ ఓవైసి, అక్బరుద్దీన్ ఓవైసిల మాటలకు రెచ్చిపోయే పరిస్థితి బీహార్ ముస్లింలలో లేదు. ఆర్ఎస్ఎస్ మతవాదులకు, ఎంఐఎంకు పెద్ద తేడా ఏమి లేదని గ్రహించడంతో ముస్లింలు మహాకూటమి వైపు మొగ్గు

కొండను తవ్వి ఎలుకను పట్టని నివేదిక

శ్రీలంక యుద్ధ నేరాలపై వేసిన కమిటీ ఇచ్చిన నివేదికలోని వివరాలను విశ్లేషిస్తూ, యుద్ధంలో జరిగిన బీభత్సం, యుద్ధం తర్వాత జరిగిన మానవ హక్కుల హననం గురించి వివరిస్తున్నారు **బైరెడ్డి సతీష్**

గత సెప్టెంబర్‌లో ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి తీర్మానంతో ఆఫీస్ ఆఫ్ ది హై కమీషనర్ ఫర్ హ్యూమన్ రైట్స్ ఇన్వెస్టిగేషన్ ఆన్ శ్రీలంక (ఒఐఎల్ఎస్), శ్రీలంక యుద్ధనేరాలపై ఒక నివేదికను వెల్లడించింది. ప్రత్యేక తమిళ రాజ్యం కోసం 26 సంవత్సరాల పాటు కొనసాగిన సుదీర్ఘ పోరాటంలో కీలకమైన 2002-2011 కాలంలో జరిగిన తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలను, యుద్ధ నేరాలను ఈ నివేదికలో పొందుపర్చారు. ఈ నివేదిక ఎల్‌టిటిఇ, శ్రీలంక ప్రభుత్వ యంత్రాంగపు విచ్చలవిడి చర్యను సమానంగా చూపించి 'సమదృష్టి' ని ప్రదర్శించే ప్రయత్నం చేసింది. గత కాలపు యుద్ధ నేరస్తులను, వాస్తవ నిర్ధారణకంటే భవిష్యత్ సామరస్యపు అవసరంపైననే ఎక్కువ దృష్టి నిలిపింది. విచ్చలవిడి హత్యలు, పౌర స్వేచ్ఛ ఉల్లంఘనలు, బలవంతంగా మనుషులను అదృశ్యం చేయడం, లైంగింక హింస, కిడ్నాపులు, బలవంతంగా ఉద్యమంలోకి నెట్టడం వంటి అనేక విషయాలతోపాటు యుద్ధం చివరి దశలో అంతర్గతంగా స్థానభ్రంశం చెంది మిలటరీ క్యాంపుల్లో దయనీయమైన బతుకులీడుస్తున్న 2,84,000 తమిళుల స్థితిని ఈ నివేదికలో పొందుపరిచారు.

నిజానికి యుద్ధం తీవ్రమైన దశలో శ్రీలంకలో క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి నిజానిజాలను నిగ్గుతేల్చే పరిస్థితి ఏ మాత్రం లేదు. తనకు లభించిన సమాచారం, తన పరిశోధనపై ఆధారపడడమే కాకుండా శ్రీలంక ప్రభుత్వం చేత ఏర్పరచబడిన (దక్షిణాఫ్రికా నమూనాలో) లెస్సెన్స్ లెర్న్డ్ అండ్ రికన్సిలియేషన్ కమీషన్ (ఎల్ఎల్ఆర్‌సి) అందించిన అనేక అంశాలను ఈ నివేదికలో పొందుపరిచారు. దీని ద్వారా ఇరుపక్షాలు సామరస్యంగా ఉండాలని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకూడదని సుతిమెత్తగా హెచ్చరించింది.

బాధితుల పక్షాన నిలబడకుండా, వారికి న్యాయం అందేలా, సమాన హక్కులు అనుభవించే స్థితిని కల్పించేలా, యుద్ధ నేరస్తులకు శిక్షలు పడేలా, జవాబుదారీతనం పెంచేలా అంతర్జాతీయ ఒత్తిడితో కూడిన కార్యాచరణ నిర్దిష్టంగా ఈ నివేదికలో ఏమీ రూపొందించబడలేదు. ఎల్‌టిటిఇ చర్యల ద్వారా శ్రీలంక ఉత్తర తూర్పు ప్రాంతాల్లో ఉండే ముస్లింలు సింహాళీయుల హింసలను అనుభవించిన మాట వాస్తవమే. వేలాది మంది ఈ ప్రాంతం నుండి ఇతర ప్రాంతాలకు వలసపోవటం జరిగింది. తానే తమిళ జాతికి ఏకైక ప్రతినిధిని అనేలా వ్యవహరిస్తు ప్రజాస్వామికంగా పనిచేస్తున్న సంస్థ, వ్యక్తులను అంతం చేయడం లాంటివి కూడా ఎల్‌టిటిఇ తప్పిదాల్లో కొన్ని ఉన్నాయి. సింహాళ ఆధిపత్యానికి వ్యతిరేకంగా, స్వతంత్ర్య రాజ్య ఏర్పాటుకు ఉధృతమైన సాయుధ పోరాటాన్నే కొనసాగించింది ఆ సంస్థ. ఈ పోరాట క్రమంలో అనేక మంది అమాయకులు బలైనమాట వాస్తవమే. కానీ తమిళ జాతి పోరాటాన్ని శ్రీలంక అన్ని పాలక పార్టీలు పాశవికంగా అణచివేయడానికే, మిలిటరీ పరిష్కారానికే మొగ్గుచూపాయి. కానీ ప్రజాస్వామిక పద్ధతిలో రాజకీయ పరిష్కారం కనుగొని తమిళుల ఆకాంక్షలను నెరవేర్చి ఉంటే ఇంత రక్తపాతం, హింస, బీభత్సం జరిగి ఉండేవి కాదన్న వాస్తవాన్ని నివేదిక విస్మరించింది.

శ్రీలంక రాజ్యం అనుసరించిన విచ్చలవిడి హింసాయుత విధానం 26 సంవత్సరాల పోరాట క్రమంలో లక్షల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయేలా చేసింది. 2009 మేలో సాయుధ పోరాట పరంగా ఎల్‌టిటిఇని తుదముట్టించగలిగాం అని ప్రకటించుకున్న రాజపక్సే ప్రభుత్వ మిలిటరీ చర్యల వల్ల యుద్ధపు చివరి 5 నెలల కాలంలోనే నలభై వేల మంది ప్రజలు ప్రత్యేకించి తమిళులు ప్రాణాలు కోల్పోయారు. లొంగిపోయిన తమిళ సైనికులను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపేశారు. ప్రజావాసాల్లో తలదాచుకున్న తమిళ ఈలం సైనికులను మట్టుబెట్టడానికి

చూపుతారనడంలో అనుమానం లేదు.

అయితే రామ్ విలాస్ పాశ్వాన్, జీతన్‌రామ్ మాంఝీలు బీహార్‌లో బిజెపిని సపోర్ట్ చేయడానికి దారితీసిన పరిస్థితులు విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది. దళితుల మీద అగ్రకుల దాడులు బీహార్‌లో ఎక్కువ భూస్వాముల రణవీర్ సేనలు దళితులను ఊచకోత కోసిన సందర్భాలు అనేకం. లక్ష్మన్‌పూర్ బాతేలో దాదాపు 53 మందిని ఊచకోత కోస్తే బిసి ప్రభుత్వాలు వారిని ఏమి చేయలేకపోయాయి. పైగా 2013 అక్టోబర్‌లో సాక్ష్యాలు లేనందున ఎవరిని శిక్షించలేమని బీహార్ హైకోర్టు తీర్పునిచ్చింది. దాన్ని సవాల్ చేస్తూ ఇదే జీతన్‌రామ్ మాంఝీ ప్రభుత్వం జెడి (యు) సుప్రీంకోర్టుకు వెళ్లింది. అగ్రకులాల వారంతా ఆర్యులని, విదేశీయులని కేవలం దళితులే ఇక్కడ భూమి పుత్రులని చాలాసార్లు వ్యాఖ్యానించిన మాంఝీ బిజెపి పంచన ఎందుకు చేరాడు? ఒకవేళ మాంఝీ స్వార్థ రాజకీయాల్లో ఇది భాగమైతే దళితులు ఆయనను నమ్మే పరిస్థితి ఉండదు. మూడవ దశ పోలింగ్ జరిగే ప్రాంతాలు నక్సలైట్ ప్రభావిత ప్రాంతాలు. జీతన్ రామ్ మాంఝీ పోటీలో ఉన్న రెండు నియోజకవర్గాల్లో ఒకటి ఇక్కడ ఉంది. మరి నక్సలైట్ ప్రభావిత ప్రాంతాలు ఈ పొత్తులకు ఎలా స్పందిస్తాయో చూడాలి.

నాయకత్వం పరంగా చూసుకుంటే అగ్రకులాలు, దళితులు, అతి వెనుకబడిన కులాలు ఒకవైపు, బీహార్ మీద పెత్తనం చేజారకుండా బిసిలు, ముఖ్యంగా కుర్మిలు, యాదవులు ఒకవైపు ఉన్నట్టుగా కనిపిస్తుంది. ఇక ముస్లింలకు బిసి నాయకత్వమే దిక్కయ్యింది. అయితే ఇది కేవలం కులాల మధ్య జరుగుతున్న పోటీగా కనపడినా అంతకు మించి ఇంకేదో జరుగుతుందనేది వాస్తవం.

(రచయిత రిసర్చ్ స్కాలర్, కేంద్రీయ విశ్వవిద్యాలయం) వీ

ఆ ఆవాసాలపైన రాకెట్‌లతో దాడిచేసి వేలాది మంది అమాయకులను చంపేశారు. వృద్ధులు, మహిళలు, పిల్లల సంగతి అయితే వేరే చెప్పనక్కర్లేదు. ఆసుపత్రులు, పాఠశాలలు, అంతర్జాతీయ సంస్థ కార్యాయాలు వేటినీ వదలకుండా అన్నింటిపైన బాంబుల వర్షం కురిపించి హత్యాకాండను కొనసాగించారు. బ్రిటన్‌కు చెందిన ఛానెల్ - 4 నో ఫైర్ జోన్‌ను ఎట్లా హత్యాక్షేత్రాలుగా శ్రీలంక సైనికులు మార్చివేశారో నెత్తుటి దృశ్యాలను ప్రపంచానికి చూపించింది. ప్రభాకరన్ కొడుకును ఎంత కిరాతకంగా మట్టుబెట్టారో కూడా ఈ ఛానెల్ బట్టబయలు చేసింది.

యుద్ధం ముగిసిన తరువాత మూడు లక్షలకు పైగా తమిళులు తమ ఆప్తుల్ని, ఆస్తుల్ని కోల్పోయి మిలిటరీ క్యాంపులో ఎంత దయనీయంగా బతుకుతున్నారో అనేక హక్కుల సంస్థలు ప్రపంచానికి చెప్తూనే ఉన్నాయి. ఎలాంటి హక్కులు లేకుండా బహిరంగ జైలు జీవితం గడుపుతున్నారు తమిళులు. వాళ్ల భూముల్ని, ఆస్తుల్ని మొత్తం కూడా మిలిటరీ స్వాధీనం చేసుకుంది. ఎంత మంది తమిళ సైనికులు సరెండర్ అయింది, జైళ్లల్లో మగ్గిపోతున్న వారెందరు అనే వివరాలను బయటి ప్రపంచానికి చెప్పటంలేదు. అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారం ఒక నిర్దిష్ట కాలానికి మాత్రమే మిలిటరీ క్యాంపులలో ప్రజలను ఉంచడానికి వీలౌతుంది. ఈ సూత్రాలను ఏనాడూ శ్రీలంక ప్రభుత్వం గౌరవించలేదు. పేరుకు ప్రజాస్వామిక ప్రక్రియను వేగంగా చేపడుతున్నాం అని శ్రీలంక ప్రభుత్వం ప్రకటించినప్పటికీ మెజారిటి తమిళ ప్రాంతాలు మిలిటరీ ఆధిపత్యంలోనే కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రమాణాల మేరకైతే యుద్ధ ముగింపు నెలల్లో జరిగిన హత్యాకాండను 'జాతి నిర్మూలన' (జినోసైడ్)గా ప్రకటించాలి.

ఈ నివేదికలో అటువంటి ప్రస్తావన ఏదీలేదు అనే అంశాన్ని గమనించవచ్చు. వ్యవస్థాగతంగా సంస్కరణలు జరగాలని, బాధితులకు న్యాయం జరగాలని, వారి భయాలను తొలగించాలని, రాజకీయ పార్టీలు తమిళ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని, యుద్ధ బాధితుల జీవితాలను పునర్నిర్మించాలనే మాటలను నివేదికలో పొందుపరిచి చేతులు దులుపుకున్నది. యుద్ధ నేరాల విచారణకు శ్రీలంక ఆధీనంలోనే ఉండేలా అంతర్జాతీయ న్యాయమూర్తులతో కూడిన 'హైబ్రీడ్ కోర్టు' ఏర్పాటు చేయాలని ఆ దిశగా శ్రీలంక శాసనపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొనడమే ఆ నివేదిక మొత్తంలో చెప్పుకోదగిన అంశం. సింహళ బుద్ధిస్టు ఆధిపత్య రాజకీయాల గురించి, భాషా సాంస్కృతిక ఆధిపత్యం గురించి ఏమీ ప్రస్తావించలేదు. అయిందేదో అయింది గతం మర్చిపోయి భవిష్యత్తులో బాగుండండి అని చెప్పినట్టుంది.

అంతా అమెరికా కనుసన్నల్లోనే మానవహక్కుల ఉల్లంఘన అనే అంశాన్ని అంతర్జాతీయంగా అమెరికా ఉపయోగించుకున్నంతగా, తన ప్రయోజనాలకు అనుగుణంగా బ్లాక్‌మెయిల్ చేసినంతగా మరే దేశమూ చేయదు. తన దేశంలో నల్లవారి హక్కుల ఉల్లంఘనలు, తన యుద్ధోన్మాదం వల్ల ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మానవహక్కుల ఉల్లంఘనల గురించి ఏమాత్రం పట్టించుకోదు సరికదా అది ఏదో హక్కుల రక్షణకే అన్నట్టు ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తుంది. నిజానికి శ్రీలంక సైన్యం 2009లో యుద్ధం చివరి దశల్లో కానీ అంతకంటే ముందు నుండి కానీ కొనసాగిస్తున్న హత్యాకాండ, విచ్చలవిడి హింసాకాండ, తీవ్రమైన హక్కుల ఉల్లంఘనలు అమెరికాకేమీ తెలియని అంశం కాదు. ఆనాడు అంతా సక్రమంగా జరుగుతున్నట్టుగా వ్యవహరించింది.

యుద్ధం ముగిసిన వెంటనే ఆనాటి శ్రీలంక అధ్యక్షుడు తన విధానాల్లో భాగంగా చైనాకు దగ్గరయ్యాడు. చైనా మిలిటరీ సహాయాన్ని, హార్డ్‌వేర్‌ను అందించడమే కాక మౌలిక సదుపాయాలకు సంబంధించిన అనేక ప్రాజెక్టులలో పెట్టుబడులు పెట్టి శ్రీలంకలో తన ప్రభావాన్ని పెంచుకోవడం, చైనాకు అడ్డుకట్ట వేయాలనుకుంటున్న అమెరికాకు కంటగింపైంది. ఆసియా ఖండంలో 'ఇరుసు'ను రూపొందించుకునే క్రమంలో, రాజకీయ చిత్రపటంలో కీలకమైన, వ్యూహాత్మకమైన ప్రాంతమైన శ్రీలంకను తమ చెప్పుచేతుల్లో ఉంచుకోవాలంటే సులభంగా సాధ్యమయ్యేది కాదు. సరిగ్గా ఇలాంటి దశలో చేతికి అందివచ్చిందే మానవహక్కుల ఉల్లంఘన అంశం.

2014 మార్చిలో ఇదే అంశంపై అమెరికా ప్రేరేపిత తీర్మానం ఐక్యరాజ్య సమితి మానవహక్కుల సమితిలోకి వచ్చింది. అంతకుముందే మయన్మార్‌లో మానవహక్కుల ఉల్లంఘనల బూచితో మయన్మార్ మిలిటరీ జుంటా ప్రభుత్వాన్ని చైనాకు సన్నితం కాకుండా తన సన్నిధిలోకి తెచ్చుకోగలిగింది. 2009లో కళ్లముందు కనబడుతున్న దాష్టీకం గురించి మాట్లాడని అమెరికా అదను కోసం ఎదురు చూసి వేటువేసింది. 2014 నవంబర్‌లో రాజపక్సే ముందస్తు అధ్యక్ష ఎన్నికలకు వెళ్లడాన్ని అదనుగా భావించి ఆయన మంత్రివర్గ సహచరుడైన మైత్రిపాల సిరిసేనను ఆయన ప్రత్యర్థిగా రంగంలోకి దింపడమే కాక 2009 నాటి హత్యాకాండ అణిచివేతకు అన్ని విధాల సహకరించిన జాతిక హే ఉరుమా (జెహెచ్‌యు) పార్టీ, తమిళ ఉద్యమాన్ని రక్తపుటేరుల్లో ఉంచిన యుఎన్‌పి, శ్రీలంక మాజీ అధ్యక్షురాలు చంద్రికా కుమారతుంగ లాంటి వారందరిని ఒక్కటిగా చేసి తనను కాదనుకున్న రాజపక్సేను పీఠం నుంచి పీకి పారేసింది అమెరికా. నిజానికి ఈ నివేదికను 2014 మార్చిలోనే బయటపెట్టాల్సింది. ఆగస్టులో జరిగే పార్లమెంటరీ ఎన్నికల్లో యుద్ధ 'హీరో'గా పేరుపడ్డ రాజపక్సే తనకు అనుకూలంగా ఉపయోగించుకుంటాడనే అనుమానంతో శ్రీలంక విదేశీ వ్యవహారాల మంత్రి సమరవీర అమెరికా విదేశాంగ కార్యదర్శి కెర్రిని, ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి బాన్‌కిమూన్‌ను కలిసి ఆరు నెలలు నివేదికను ఆలస్యం చేయించారు. అప్పటికే శ్రీలంక నూతన అధ్యక్షుడు సిరిసేన చైనాను విడనాడి అమెరికా అనుకూల విదేశాంగ విధానం చేపట్టడంతో అమెరికా సంతోషంగా నివేదికను వాయిదా వేయించి పార్లమెంటరీ ఎన్నికలు కాగానే సెప్టెంబర్‌లో ప్రపంచానికి వెల్లడి చేయించింది.

ఇప్పుడిక నివేదికలో ఏదైన అరకొర శ్రీలంకను ఇబ్బంది పెట్టే అంశాలున్నా వాటిని నీరుగార్చే పనిని అమెరికా ఎలాగూ చేపడుతుంది. ఆగస్టు పార్లమెంటరీ ఎన్నికల్లోనే అమెరికా ప్రభావం ఏంటో ప్రత్యర్థులను సహితం దారికి తెచ్చి జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయించడంలోనే తేలిపోయింది. రాజపక్సే మంత్రివర్గంలో కీలకమైన కాబినెట్ మంత్రిగా పనిచేసిన మైత్రిపాల సిరిసేన ఇప్పుడు దేశాధ్యక్షుడు. తమిళ ఉద్యమాన్ని అణిచివేయడాన్ని ప్రారంభించిన యుఎన్‌పి నాయకుడు రాణిల్ విక్రమ్‌సింఘే ప్రధాని, తమిళుల ఆకాంక్షలను కొంతమేరకైన నెరవేరుస్తుందనుకున్న తమిళ్ నేషనల్ అలియన్స్ ప్రతిపక్షం అయి కూర్చుంది. కులీన వర్గాలతో కూడిన టిఎన్ఎ తమిళ కార్మిక, కర్షకవర్గాల ప్రయోజనాల కోసం కాక తన ఆధిపత్యం నిలబెట్టుకోవడానికే అధికారాల బదలాయింపు కోసం పాకులాడుతున్నది. మొత్తంగా అమెరికా కనుసన్నల్లో అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడుల ఎజెండా అయిన పొదుపు చర్యలు శ్రీలంక సింహళ పేద ప్రజానికపు, ముస్లిం, తమిళ మైనారిటి ప్రజా జీవితాలతో చెలగాటమాడేందుకు అన్నివిధాల రంగం సిద్ధమయిందనే చెప్పాలి.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

రాజ్యాంగబద్ధ లౌకిక రాజ్యంగా నేపాల్

రాచరికం అంతరించి లౌకిక రాజ్యంగా ఏర్పడిన నేపాల్‌లో మైనారిటీలకు రాజ్యాంగంలో సరయిన ప్రాధాన్యత కల్పించలేదని, మెజారిటీ జాతుల ఆధిపత్యమే రాజ్యాంగంలోనూ ప్రతిబింబించిందని అంటున్నారు **ఎ. నరసింహారెడ్డి**

హిమాలయ ప్రాంతంలోని చిన్నచిన్న రాజ్యాలను 1768లో పృథ్వీ నారాయణ్ షా ఒకే చట్రంలోకి తెచ్చి నేపాల్‌లో రాచరిక వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. శతాబ్దాలపాటు కొనసాగిన రాచరిక వ్యవస్థలో ప్రజలు తీవ్ర అణచివేతకు గురయ్యారు. రాచరిక పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోయారు. దీంతో 1996లో నేపాల్‌లో మావోయిస్టులు ప్రచండ ఆధ్వర్యంలో రాచరికపాలనకు వ్యతిరేకంగా ప్రజాపోరాటం చేపట్టారు. అది అంతర్యుద్ధంగా మారింది. ఈ దశలోనే 2001 జూన్ 1న రాజు బీరేంద్ర, రాణి ఐశ్వర్యతోపాటు మరో ఏడుగురు రాజ కుటుంబీకులను యువరాజు దీపేంద్ర హతమార్చాడు. మరో మూడు రోజులకు తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత జ్ఞానేంద్ర అధికారం చేపట్టి మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేసేందుకు విఫలయత్నం చేశాడు. 2005 ఫిబ్రవరి 1న పార్లమెంట్‌ను రద్దుచేసి పూర్తి అధికారాలను తన చేతులో పెట్టుకున్నారు. పత్రికా స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను కాలరాయడం జరిగింది. రాజకీయ పార్టీలను రద్దు చేశారు. నాయకులందర్ని జైళ్లలో పెట్టారు.

ఈ నేపథ్యంలో రాచరిక పాలనకు వ్యతిరేకంగా నేపాల్ ఏడు పార్టీలు, మావోయిస్టులు ఐక్యంగా పోరాటాన్ని నడిపించాయి. నవంబర్‌లో ఏడు పార్టీల కూటమి మావోయిస్టు పార్టీల మధ్య కుదిరిన 8 అంశాల ఒప్పందం ప్రకారం రాజరికం నిర్మూలన, నూతన రాజ్యాంగ నిర్మాణం, ప్రజాతంత్ర హక్కుల పునరుద్ధరణ, ప్రజాస్వామ్యం ముఖ్యమైన అంశాలుగా ఉన్నాయి. ఇలా ఉద్యమం కొనసాగుతున్న క్రమంలోనే రాజు 2006 ఏప్రిల్‌లో పార్లమెంట్‌ను పునరుద్ధరించారు. 2006లో నేపాల్ ప్రభుత్వానికి, మావోయిస్టులకు మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. దీనితో మావోయిస్టులు సాయుధ పోరాటాన్ని విరమించుకున్నారు. 2006లో నేపాల్ రాజకీయ పక్షాలు, మావోయిస్టుల నాయకత్వంలో సాగిన విస్తృతమైన ప్రజా ఉద్యమం అనంతరం రాచరిక పాలన ముగిసి, రాజ్యాంగ సభ ఏర్పాటు చేసుకోవాలన్న నిర్ణయంతో ప్రజాస్వామ్య ప్రక్రియ ఆరంభమైంది. పార్లమెంట్ పునరుద్ధరణ, ప్రభుత్వ ఏర్పాటు అవకాశం ప్రకటనలు వెలువడగానే మావోయిస్టులు ఉద్యమాన్ని విరమించుకోవడం తో నూతన ప్రజాస్వామిక విప్లవానికి పరిమితులు విధించుకున్నట్లైంది.

మావోయిస్టులు ప్రజాయుద్ధాన్ని విరమించుకొని పార్లమెంటరీ పంథాను చేపట్టారు. రాజ్యాంగ సభకు జరిగిన తొలి ఎన్నికల్లో విజయం సాధించారు. దేశాన్ని లౌకిక రాజ్యంగా ప్రకటించడంతోపాటు రాజు అధికారాలను కత్తెర వేస్తూ పార్లమెంటు తీర్మానించింది. 2007 నుంచి మధ్యంతర రాజ్యాంగం అమలులో ఉంది. రాజ్యాంగ సభకు 2008లో జరిగిన ఎన్నికల్లో మావోయిస్టులు 40శాతం సీట్లను గెలుచుకొని ప్రచండ ప్రధాని అయ్యారు. రాజ్యాంగ రచన రెండేళ్లలో పూర్తికావాలన్న లక్ష్యం నెరవేరకపోవడంతో మరో రెండేళ్లు దానిని పొడిగించారు. చివరకు 2012లో ఆ సభ రద్దయింది. ఆపద్ధర్మ ప్రభుత్వం ఏలుబడిలో ఆ మరుసటి ఏడాది రాజ్యాంగ నిర్ణాయక సభకు జరిగిన ఎన్నికల్లో మావోయిస్టులు మూడో స్థానానికి పడిపోయి కాంగ్రెస్‌కు అధిక స్థానాలు దక్కాయి. తీవ్రమైన రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించుకోవడంలో విఫలం కావడంతో రాజ్యాంగ రచన సకాలంలో పూర్తి కాలేదు. దానికి తోడు తెరాయి ప్రాంతవాసులైన మధేశీల సమస్య ముందుకు రావడంతో దాన్ని సవ్యంగా పరిష్కరించుకోలేక నేపాల్ సతమతమైంది. 2008లో మావోయిస్టులు అధికారంలోకి వచ్చినా వివిధ పార్టీల మధ్య విభేదాల కారణంగా రాజ్యాంగాన్ని రూపొందించలేకపోయారు. 2013లో కొత్త రాజ్యాంగ సభ ఏర్పడింది. సంప్రదాయ పార్టీలు తిరిగి అధికారంలోకి వచ్చాయి. రాజ్యాంగ సభే పార్లమెంట్‌గా వ్యవహరించింది.

శతాబ్దాల పాటు ప్రపంచంలో ఏకైక హిందూ రాజ్యంగా కొనసాగిన నేపాల్ గత ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న లౌకికవాదాన్నే అంటిపెట్టుకొని ఉండాలని నేపాల్ రాజ్యాంగ సభ నిర్ణయించింది. నేపాల్‌లో 2011 జన గణన ప్రకారం 81.3 శాతం హిందువులున్నారు. 9 శాతం బౌద్ధులు, 4.4 శాతం ముస్లింలు ఉన్నారు. అంతకు ముందు, 'లౌకికవాదం' అనే పదాన్ని తొలిగించాలని, ప్రాచీన హిందూ గుర్తింపును తిరిగి తెరపైకి తేవాలని జాతీయ ప్రజాతంత్ర పార్టీ రాజ్యాంగ సభలో డిమాండ్ చేసింది. అయితే సభాధ్యక్షుడు సుభాష్‌చంద్ర నేమ్‌బాంగ్ ఈ డిమాండ్‌ను తోసిపుచ్చారు. జాతీయ ప్రజాతంత్ర పార్టీకి చెందిన కమల్ థాపా తన ప్రతిపాదనపై ఓటింగ్ చేపట్టాలని డిమాండ్ చేశారు. కానీ కేవలం 21 మంది సభ్యులే దీనిని బలపర్చారు. 601 మంది సభ్యులున్న రాజ్యాంగ సభలో ఏదైనా ప్రతిపాదనపై ఓటింగ్ చేపట్టాలంటే కనీసం 61 మంది సభ్యుల ఆమోదం తప్పనిసరి. దాంతో 'మళ్లీ హిందూ దేశం' అన్న ప్రతిపాదన వీగిపోయి, నేపాల్ లౌకిక దేశంగా ఖాయమైంది. దీనికి నిరసనగా హిందూ అతివాదులు ప్రదర్శనలు చేస్తున్నా, వారు కాలంచెల్లిన శక్తులకు ప్రాతినిధ్యం వహించే వారేనన్న గ్రహింపు నేపాల్ ప్రజలకుంది.

హిమాలయ పర్వత రాజ్యం నేపాల్ తన గమ్యాన్ని, గమనాన్ని నిర్దేశించే మెరుగైన నూతన రాజ్యాంగ ఏర్పాటుకు ఏడేళ్లకాలం, రెండు రాజ్యాంగ సభలతో తన అన్వేషణ ముగిసింది. 2015 సెప్టెంబర్ 20న రాజ్యాంగ చట్టంపై సంతకం చేస్తూ దేశాధ్యక్షుడు రామ్‌బరణ్ యాదవ్ నేపాల్ బహుళ జాతుల, బహు భాషల, బహు మతాల, బహుళ సంస్కృతుల దేశమన్నారు. అటువంటి దేశం ఇటీవల పూర్తిస్థాయి లౌకిక, ప్రజాస్వామ్య సమాఖ్య గణతంత్ర రాజ్యంగా అవతరించింది. నేపాల్ నూతన రాజ్యాంగం 2015 సెప్టెంబర్ 22 నుండి అమలులోకి వచ్చింది. 2007లో రాచరికానికి ముగింపు పలికి తాత్కాలిక రాజ్యాంగాన్ని అమలోకి తెచ్చిన నాటినుంచీ నేపాల్ ఎన్నో పురుటి నొప్పుల్ని అనుభవించింది. రాజ్యాంగ రచన అన్నది మౌలికంగా ఒక రాజకీయ

ప్రక్రియ గనుక దాన్ని రూపొందించే క్రమంలో ఎన్నో సమస్యలు సహజం. రాచరికాన్ని పునరుద్ధరించాలనే శక్తులు ఒకవైపు... తాత్కాలిక రాజ్యాంగం గుర్తించిన విధంగా ఇది రిపబ్లిక్‌గా కొనసాగాలనే శక్తులు మరోవైపు హోరా హోరీ తలపడ్డాయి. తమ అస్తిత్వం, ఆకాంక్షల మాటేమిటని తారూ, మధేశీ వంటి మైనారిటీ జాతులు నిలదీశాయి. ప్రావిన్సుల ఏర్పాటును జనాభాకు అనుగుణంగా కాక ఆయా ప్రాంతాల్లో జాతుల పొందిక ఆధారంగా నిర్ణయించాలని డిమాండ్ చేశాయి. అయినా మైనారిటీ జాతుల ఆకాంక్షలను రాజ్యాంగ సభ పరిశీలించలేదు.

2015 సెప్టెంబర్ 16న నేపాల్ రాజ్యాంగానికి జరిగిన ఓటింగ్‌లో 507 మంది కొత్త రాజ్యాంగానికి అనుకూలంగా ఓటు వేశారు. 601 మంది సభ్యులున్న రాజ్యాంగ సభలో 85 శాతం నూతన రాజ్యాంగానికి మద్దతు పలకడంతో దేశ చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. మధేశీ ప్రతినిధులు ఓటింగ్‌ను బహిష్కరించారు. నిజానికి ఇది దేశవ్యాప్తంగా సంబరాలు చేసుకోవాల్సిన సమయం. కానీ అవి కొన్ని ప్రాంతాలకే పరిమితమవడం, మరికొన్ని ప్రాంతాలు ఆందోళనలతో అట్టుడికిపోవడం నేపాల్ హితైషులను నిశ్చేష్ట పరుస్తోంది. మూడు ప్రధాన పార్టీలు ఏకాభిప్రాయంతో ముందుకు రావడంతో పాటు, మూడింటి రెండు వంతులకుపైగా మెజారిటీతో రాజ్యాంగాన్ని ఆమోదించినప్పుడు ఇక ఇబ్బంది ఏముందన్న అభిప్రాయం కలగడం సహజం. కానీ అసలు సమస్య అంతా ఇక్కడే ఉంది. అధికార నేపాలీ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యు.ఎం.ఎల్ యూనిఫైడ్ మార్కిస్టు లెనినిస్టు), యునైటెడ్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు) ఒకేమాటపై నిలిచినప్పటికీ, తెరాయ్ ప్రాంతానికి చెందిన మధేశీ పార్టీలు ఏకంగా ఓటింగ్‌ను బహిష్కరించడం దేశ నాయకత్వానికి కచ్చితంగా మింగుడు పడని పరిణామమే.

ఇప్పుడు అమల్లోకి వచ్చిన రాజ్యాంగం ప్రకారం నేపాల్ గణతంత్రంగా, రాష్ట్రాల సమాఖ్యగా ఉంటుంది. లౌకిక వాదానికి ఆ దేశం తన కట్టుబాటును ప్రకటించింది. దేశంలో ఏడు ప్రావిన్సులుంటాయి. పార్లమెంట్‌లోని 275 స్థానాల్లో 165 స్థానాలకు నేరుగా ఎన్నికలు జరుగుతాయి. మరో 110 స్థానాలు ఆయా పార్టీలకు ఉండే దామాషా ఓటు ప్రాతిపదికన కేటాయిస్తారు. 304 అధికరణలున్న రాజ్యాంగం పౌరులకు ప్రాథమిక హక్కులతో పాటు సామాజిక, సాంస్కృతిక హక్కులను ఇచ్చింది. ఆసియా దేశాల్లోనే ప్రప్రథమంగా లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్ జెండర్ల హక్కులను కూడా గుర్తించింది. మహిళలు, మైనారిటీ జాతుల విషయంలో వివక్ష చూపిందన్న ఆరోపణలను అటుంచితే సుదీర్ఘకాలం పాటు ఎన్నో అటుపోట్లను ఎదుర్కొని ఎట్టకేలకు అమలులోకి వచ్చిన నేపాల్ రాజ్యాంగం ఆధునిక కాలపు ఆకాంక్షలకు అనుగుణంగానే ఉన్నది. రాచరికానికి ముగింపు పలికి తాత్కాలిక రాజ్యాంగంతో నెట్టుకొస్తున్న నేపాల్ ఈ ప్రక్రియ కొనసాగిస్తున్నంత కాలం అనేక సమస్యలు ఎదుర్కొంది.

ప్రావిన్సుల ఏర్పాటు ఆయా ప్రాంతాల్లో జాతుల పొందిక ఆధారంగా జరగాలని మైనారిటీ జాతులు డిమాండ్ చేశాయి. ఫెడరల్ వ్యవస్థ జాతుల పొందిక ఆధారంగా జరగాలని మైనారిటీ జాతులు డిమాండ్ చేశాయి. ఫెడరల్ వ్యవస్థ జాతుల ప్రాతిపదికగానే ఉండాలనీ, వారికి స్వయం నిర్ణయాధికారం సహా విడిపోయే హక్కు కూడా ఉండాలని పదేళ్ల సాయుధ పోరాటంలో మావోయిస్టులు కూడా అన్నారు. కానీ, మైనారిటీల ఈ వాదన అంగీకరిస్తే ఇతర జాతుల నుంచి కూడా ఇదే విధమైన డిమాండ్లు వస్తాయన్న కారణం చూపుతూ మూడు ప్రధాన పక్షాలు కలసికట్టుగా ఇప్పుడు ఆ వాదన తిరస్కరించాయి. ఈ ఏడాది జనవరికే పూర్తికావాల్సిన రాజ్యాంగ రచన మరో తొమ్మిది నెలలు సాగి సెప్టెంబర్ 20తో ముగిసింది.

వాస్తవానికి జాతుల ప్రాతిపదికగానే ఫెడరల్ వ్యవస్థ ఉండాలని... జాతులకు విడిపోయే హక్కుతో సహా స్వయం నిర్ణయాధికారం ఉండాలని మావోయిస్టులు పదేళ్ల సాయుధ పోరాట కాలంలో బలంగా వాదించారు. వివిధ జాతులను ఆ ప్రాతిపదికనే కూడగట్టారు. తీరా సమయం వచ్చేసరికి తమ వైఖరిని మార్చుకున్నారు. వాస్తవానికి నేపాల్‌లో ఈ ఏడేళ్ల కాలంలో జరిగిందంతా పాత విలువలకూ, కొత్త ఆకాంక్షలకూ మధ్య జరిగిన హోరా హోరీ పోరాటం. రాజు మహేంద్ర పాలనాకాలంలో అగ్రవర్ణాల సంస్కృతినీ, మతాన్నీ, వారి భాషనూ తమపైన రుద్దారని... దాన్నే నేపాలీ జాతీయతంగా చూపే ప్రయత్నం చేశారని అట్టడుగు జాతులు వాదించాయి. ఈ క్రమంలో తమ అస్తిత్వాన్నీ, ఆకాంక్షలనూ అణగదొక్కారని ఆరోపించాయి. ఈ చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దడానికి జాతుల జనాభా ప్రాతిపదికన ప్రావిన్సులు ఏర్పడడమే పరిష్కారమని పేర్కొన్నాయి. కానీ అది నెరవేరలేదు. ఫలితంగా గత నెలలో రాజ్యాంగం ముసాయిదా వెల్లడైన వెంటనే దేశంలోని 75 జిల్లాల్లో సగానికిపైగా జిల్లాలు అల్లర్లతో అట్టుడికాయి. హింసాకాండ, పోలీసు కాల్పుల్లో 60 మంది మరణించారు.

తెరాయ్ – మధేశీల ఆందోళన...

నేపాల్‌లో మధేశీలతో పాటు, తారు వర్గం వారిని మైనారిటీలుగా పరిగణిస్తారు. మొత్తం 75 జిల్లాలు ఉండగా 20 జిల్లాల్లో వీరు విస్తరించి ఉన్నారు. వీరు దేశ జనాభాలో 40 శాతం. రాజ్యాంగ సభలో ఈ వర్గానికి చెందిన 61 మంది ప్రతినిధులు ఉన్నారు. 2008 నాటి సభలో వీరి సంఖ్య 84 ప్రస్తుత అధ్యక్షుడు రామ్‌బరణ్‌యాదవ్ ఈ ప్రాంతం వారే కావడం విశేషం. 2008 అధ్యక్ష ఎన్నికల్లో యాదవ్‌తో పోటీపడ్డ రామరాజ ప్రసాద్ సింగ్ కూడ ఈ ప్రాంతవాసే. నేపాలీలందరి హక్కులనూ కాపాడవలసిన నూతన రాజ్యాంగం తమ విషయంలో తీవ్ర వివక్ష చూపిందని మైనారిటీ జాతులు విశ్వసించినందున ముసాయిదా విడుదలైన నాటి నుంచి నేటి వరకూ ఆ దేశంలో హింసాత్మక ఉద్యమాలు సాగుతున్నాయి. మధేశీ ప్రతినిధులు సభలో లేకుండా రాజ్యాంగాన్ని ఆమోదించడం సబబు కాదని అధ్యక్షుడు పలుమార్లు మూడు ప్రధాన రాజకీయపక్షాలనూ హెచ్చరించినా ప్రయోజనం లేకపోయింది. ప్రధాన పక్షాల ఒత్తిడిమేరకు ఆయన సంతకం చేయడంతో మైనారిటీ జాతుల ఆమోదం లేకుండానే నూతన రాజ్యాంగం సెప్టెంబర్ 20 నుంచి అమలులోకి వచ్చింది. అందరి ఆమోదం సాధించే పేరిట ఈ ప్రకటన వాయిదా వేయించడానికి భారత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. భారత విదేశాంగ శాఖ కార్యదర్శి నేపాల్ వెళ్లి ఒత్తిడి తెచ్చినా ఉపయోగం లేకపోయింది.

తెరాయ్ ప్రాంతం భారత్‌లోని బీహార్, ఉత్తర్‌ప్రదేశ్‌కు దగ్గరగా ఉంటుంది. మధేశీల మూలాలు భారత్‌లోనే ఉన్నాయి. వీరిలో ఎక్కువ మంది హిందీ మాట్లాడతారు. రాజ్యాంగ రచనా ప్రక్రియలో తమను, తమ ప్రాంతాన్ని ఉద్దేశ పూర్వకంగా నిర్లక్ష్యం చేశారని, ఏ మాత్రం ప్రాధాన్యం లేకుండా చేశారని, తమ హక్కులను పూర్తిగా కాలరాశారని వీరు ఆక్రోశిస్తున్నారు. మహిళలకు, మైనారిటీ జాతులకు రాజ్యాంగబద్ధంగా రక్షణలు, హక్కులు కల్పించలేదని, వాటిని పార్టీల దయాదాక్షిణ్యాలకు వదిలేశారని ఆరోపిస్తూ మైనారిటీ జాతులు

ఉద్యమిస్తున్నాయి. వందకు పైగా భాషా జాతులున్న ప్రజలపై నేపాల్ భాషాధిపత్యం రుద్దుతున్నారని ఆరోపిస్తున్నారు. తమకంటూ ప్రత్యేకంగా ఒకటి, రెండు రాష్ట్రాలు ఏర్పాటు చేయకుండా, చెల్లాచెదురుగా విభజించి అయిదు రాష్ట్రాల్లో కలపడం తమను దెబ్బతీసే చర్యేనని ఆరోపిస్తున్నారు. మధేశీ ప్రాంతాలను వివిధ రాష్ట్రాల్లో కలపడం వల్ల తాము ఏ రాష్ట్రంలోనూ మెజారిటీగా ఉండబోమని, రాజకీయంగా అనామకులైపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలుత తెరాయ్ ప్రాంతాన్ని రెండు రాష్ట్రాలుగా విభజించాలని నిర్ణయించినప్పటికీ, తరవాత ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం మార్చుకుంది.

ప్రస్తుత సమాఖ్య నిర్మాణం తీరు, పౌరసత్వ నిబంధనలనూ మధేశీ, తారు వర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. నేపాలీ మహిళ విదేశీ వ్యక్తిని వివాహమాడితే అతను నేపాలీ పౌరసత్వం తీసుకునే వరకు వారి పిల్లలకు ఆ దేశ పౌరసత్వం లభించదు. అదే నేపాలీ పురుషుడు విదేశీ వనితను వివాహమాడితే ఈ నిబంధన వర్తించదు. దీనిపైనా మధేశీలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. తెరాయ్ ప్రాంతంలోని పలువురికి భారత్‌లోని బీహార్, యుపి వాసులతో బంధుత్వాలు ఉన్నాయి. తాత్కాలిక రాజ్యాంగం ప్రకారం నైష్పత్తిక ప్రాతినిధ్యం పద్ధతిన 58శాతం మంది చట్టసభకు ఎన్నికయ్యే వారు. కొత్త రాజ్యాంగంలో దీన్ని 45 శాతానికి కుదించడంపై మధేశీలు మండిపడుతున్నారు. ఇది ఉద్దేశ పూర్వకంగా తీసుకున్న నిర్ణయమని, కొత్త నిబంధన వల్ల దిగువ కులాల వారు, అణగారిన వర్గాలవారు చట్టసభకు ఎక్కువగా ఎన్నికయ్యే అవకాశాలు తగ్గిపోతాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేపాల్ రాజకీయ వ్యవహారాల్లో మొదటి నుంచీ పర్వత ప్రాంతాల వారిదే పైచేయి. విద్యా, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార రంగాల్లో వారిదే ప్రాబల్యం. పార్టీలు వేరైనప్పటికి ఈ ప్రాంత నాయకులు అధికారం దగ్గరకు వచ్చేటప్పటికి ఐకమత్యంతో వ్యవహరిస్తారని, తమను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తూ, విచక్షణ ప్రదర్శిస్తారన్నది మధేశీయుల ఆరోపణ.

1996-2006 మధ్యకాలంలో మావోయిస్టులు చేపట్టిన ప్రజాయుద్ధంలో గిరిజనులు, దళితులే చోదక శక్తులుగా ఉన్నారు. నేపాల్ ఫ్యూడల్ రాచరిక వ్యవస్థ, హిందూమతం వల్ల దళితుల పట్ల వర్గ వివక్ష వేళ్లూనుకుని ఉంది. గిరిజనులు, దళితులు దశాబ్దాలుగా భూస్వామ్య, ఆధిపత్యశక్తుల వల్ల అనేక బాధలను అనుభవించారు. వీరి ఉద్యమాలు, ఆందోళనలే నేడు నేపాల్ లౌకిక రాజ్యంగా మారడానికి కారణమయ్యాయి. కాని నూతన రాజ్యాంగం మాత్రం వీరి ఆకాంక్షలను ప్రతిబింబించడంలేదు. ఉద్యమంలో దళితులు, గిరిజనులున్నారు. కాని రాజ్యాంగ సభలో వీరికి తగినంత ప్రాతినిధ్యం లేనందువల్లనే, వీరి హక్కులకు హామీ లభించలేదన్నది స్పష్టం.

ఐక్య ప్రజాస్వామ్య మధేశీ కూటమి (యుడిఎంఎఫ్) నాయకుడు లక్ష్మణ్‌లాల్ కర్న ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు సిద్ధమేనని ప్రకటించాడు. ఇందుకోసం నలుగురు సభ్యులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసినట్లు మీడియాకు తెలిపారు. నేపాల్ నూతన ప్రధాని ఖడ్గప్రసాద్ శర్మ ఓలి (నేపాల్ కమ్యూనిస్టు పార్టీ - యుఎంఎల్) ఎన్నిక కావడానికి మధేశీ పార్టీలు సహకరించాయి. నూతన మంత్రివర్గంలో కొద్దివారాలుగా ఆందోళన పథంలో ఉన్న మధేశీల నుండి ఒకరిని, లౌకిక రాజ్యాంగా కాకుండా హిందూ రాజ్యాంగా ఉండాలని ఒత్తిడి తెచ్చిన మరొకరిని ఆయన డిప్యూటీ ప్రధాన మంత్రులుగా నియమించుకున్నారు. ఖడ్గప్రసాద్ శర్మ నేపాల్ కొత్త ప్రధాని కావడానికి ముందు మధేశీ పార్టీలు అనేక హామీలు పొందినట్లు తెలుస్తుంది.

ప్రచండ నాయకత్వంలోని యునైటెడ్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్ట్)తో పాటుగా, మధేశీ జనాధికార్ ఫోరమ్ సహకారం లేనిదే శర్మ అధికారంలోకి రాగలిగేవారు కాదు. ఇతరత్రా చిన్నస్థాయి మధేశీ పార్టీలు కూడా ఆయనకు అండగా నిలబడ్డాయి. మధేశీ జనాధికార్ ఫోరమ్ నాయకుడు విజయ్ గచ్ఛేదార్‌తో ఎనిమిది అంశాలపై కుదిరిన అవగాహన ఆచరణలోకి వస్తేనే మధేశీల డిమాండ్లు అనేకం నెరవేరతాయి. ప్రతి కులానికీ దామాషా ప్రకారం ప్రాతినిధ్యం దక్కడం, ప్రావిన్సుల హద్దులూ సరిహద్దుల వివాదాన్ని తీర్చడం, జనాభాను బట్టి నియోజకవర్గాలు ఏర్పాటు చేయడం, ప్రతి జిల్లాకు కనీసంగా ఒక నియోజకవర్గం ఉండేట్టు చూడటం వంటివి ఈ ఒప్పందంలో ఉన్నట్టు చెబుతున్నారు. వీటితోపాటుగా, ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు పరిహారాలు, వ్యాపారాలకు, ఇళ్లకూ జరిగిన నష్టాన్ని పూడ్చడం వంటి సుహృద్భావ చర్యలూ ఉన్నాయి.


ఏ దేశ రాజ్యాంగమైనా... దాన్ని అమలు చేసే పాలకులపైనే దాని రాణింపు ఉంటుందనేది పచ్చి నిజం. రాజ్యాంగాన్ని కాగితాలకే పరిమితం చేసి తమ ఇష్టానుసారం పాలనచేసే రాజకీయ గణం అధికారం చేపట్టినప్పుడు సహజంగానే అరాచకం, నిరంకుశత్వం రాజ్యమేలుతోంది. కాబట్టి రాజ్యాంగాన్ని కచ్చితంగా అమలుచేసేలా పాలకులపై ఎప్పటికప్పుడు ఒత్తిడి తేవాల్సిన బాధ్యత ప్రజలదే. ప్రజలు అప్రమత్తంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ సక్రమంగా వర్ధిల్లుతుంది. నేపాల్ ప్రజల ముందు ఇప్పుడు ఆ గురుతర కర్తవ్యం ఉంది. ప్రజాస్వామ్యాన్ని, లౌకిక, సమాఖ్య వ్యవస్థను పరిరక్షించుకోవడం నేపాల్ ప్రజల ముందున్న అగ్ని పరీక్షగానే భావించాలి. ప్రజాస్వామ్య రాజ్యాలుగా అవతరించిన సైనిక పాలనలో, నియంతల పాలనలో మగ్గుతున్న అనేక దేశాల చరిత్రను నేపాలీయులు మరచిపోరాదు. అలాగే బూర్జువా సామాజికార్థిక వ్యవస్థలో ప్రజల మౌలిక హక్కులు సాధించుకోవడానికి ప్రజాస్వామిక విప్లవం కొనసాగించక తప్పదు.

నేపాల్ చరిత్రలో 1948 నుంచి ఇంతవరకూ ఆరు రాజ్యాంగాలు అమలయ్యాయి. వాటిలో కొన్ని పెత్తందారీతనంతో, మరికొన్ని ప్రజాస్వామిక మార్గంలో ఉనికిలోకి వచ్చాయి. అయితే పార్టీల్లో, వివిధ సంఘాల్లో, పౌరుల్లో విస్తృతంగా చర్చ జరిగి ఆమోదించిన తొలి రాజ్యాంగం ఇదే. ఇందులోనూ ఎన్నో లోపాలు ఉన్నాయి. వివిధ జాతులు ఆరోపిస్తున్నట్టు వారి ఆకాంక్షలను ఇది సమగ్రంగా ప్రతిబింబించలేదన్నది స్పష్టం. నేపాల్ మావోయిస్టు నేత ప్రచండ సాయుధ పోరాటాన్ని విరమించి బహుళ పార్టీ పార్లమెంటరీ విధానాన్ని అంగీకరించారు. 2007లో నేపాల్‌లో రాచరిక వ్యవస్థ అంతమవ్వడంతో విప్లవ పంథా విడనాడి ఎన్నికల పంథాలోకి మారడం వలన నేపాల్‌లో ఏర్పడింది బూర్జువా ప్రజాస్వామ్యమే కాని ప్రజల స్వామ్యం కాదు. అందువల్లనే నూతన రాజ్యాంగం, జాతుల స్వయం నిర్ణయాధికారాన్ని తృణీకరించింది. చట్టసభల్లో మధేశీలకు దామాషా ప్రాతిపదికన అధికారంలో భాగస్వామ్యం ఇవ్వడానికి అంగీకరించ లేదు. ఇప్పటి వరకు ప్రపంచంలో ఏ దేశ రాజ్యాంగం జాతుల స్వయం నిర్ణయాధికారాన్ని గౌరవించలేదు. 1917 రష్యా, 1949 చైనాలు జాతుల స్వయం నిర్ణయాధికారాన్ని గుర్తించాయి. తర్వాతి కాలంలో ఆ దేశాలు కూడ మైనారిటి జాతులపై ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. నిజమైన సోషలిస్టు వ్యవస్థలో మాత్రమే జాతుల భాష సంస్కృతులకు రక్షణ ఉంటుంది. స్వయం నిర్ణయాధికారం కూడ ఉంటుంది.

(రచయిత ఉపాధ్యాయ నాయకులు, రాజనీతి శాస్త్ర విద్యార్థి) వీ

చిన్న పుస్తకం - పెద్ద సందేశం

జి. కోటయ్య



నేను కమ్యూనిస్టుని – సీకే జీవిత చరిత్ర – హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ – 86 పేజీలు, 1/8 డెమీ, రు.30 ప్రతులకు: హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, ఫ్లాట్ నం. 85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 006; ఫోన్: 23521849
www.hyderabadbooktrust.blogspot.com

ఇటీవల వీక్షణం పత్రికవారు గుంటూరులో నిర్వహించిన రచయితలు, అభిమానుల సమావేశానికి హాజరైనాను. వారు అమ్మకానికి ఉంచిన పుస్తకాల దగ్గరకు వెళ్లాను. ఆ పుస్తకాల్లో నాకు నచ్చిన కొన్ని పుస్తకాలు కొన్నాను. చిరవగా నేను కొంత కాలంగా చదవాలని ఆసక్తితో ఎదురు చూస్తున్న సి.కె. ఆదినారాయణరెడ్డి గారి జీవిత చరిత్రకు సంబంధించిన 'నేను కమ్యూనిస్టుని' అనే పుస్తకాన్ని చూసి సంతోషించాను. ఎందుకంటే ఆయన మరణానంతరం వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలు చదివిన తరువాత ఆయన జీవిత చరిత్ర చదవాలని నిర్ణయించుకున్నాను. ఒక పర్యాయం హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వారికి ఫోను చేసి అడిగాను. త్వరలో వస్తుంది అని సమాధానమిచ్చారు. 'నేను కమ్యూనిస్టుని' తీసుకుని చదివిన తరువాత ఇంత మంచి పుస్తకాన్ని సంతోషించి నావరకు నేను మిన్నకుండుట మంచిది కాదు. ఉన్న మంచిని, మానవత్వాన్ని కొందరికి తెలియపరచవలసిన అవసరం ఉందని భావిస్తున్నాను. 'చీకటిని చూసి తిడుతూ కూర్చుంటే అది ఎప్పటికి పోదు. ఎంత ప్రయత్నమైనా చేసి చిన్న దీపం వెలిగించు' అన్న నా విద్యార్థి దశ నాటి గోడమీద రాసిన వాక్యాలు జ్ఞాప్తికి వచ్చాయి. ఈ మంచి పుస్తకానికి పరిచయం రాయాలని నిర్ణయించుకున్నాను.

'నేను కమ్యూనిస్టుని' అనే 80 పేజీల చిన్న పుస్తకం హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరైన సి.కె. నారాయణరెడ్డి జీవిత చరిత్రకు సంబంధించినది. ఈ వ్యాసంలో సి.కె. ఆదినారాయణరెడ్డి గారిని సికెగా చదువుకోగలరు. ఆయన జీవిత చరిత్రను తన జీవిత కాలంలో తాను రాసుకొనలేదు. ఆయన జీవితంలోని అనుభవంను ఆయన ద్వారా తెలుసుకుని కొంత సమాచారం పోగు చేశారు రచయిత. ఆయన ఉద్యమ సహచరులు, సమకాలికులు, జీవిత భాగస్వామి, ఇతర కుటుంబ సభ్యుల నుండి సేకరించిన సమాచారం ఆధారంగా ఆయన మరణానంతరం ఈ పుస్తకాన్ని ప్రచురించారు. ఈ పుస్తకం చూడడానికి చిన్నదిగా కనిపిస్తుంది. చదివేకొద్దీ గొప్ప సందేశాన్ని అందిస్తుంది.

ఈ పుస్తకం అందరు చదవదగినది. ముఖ్యంగా ఒక సామాజిక ఉద్యమకారుని జీవిత చరిత్ర. ప్రజా ఉద్యమాల్లో ప్రజల మధ్యన నిలిచి, ప్రజల కోసం పనిచేస్తున్న, పనిచేయాలని తలుస్తున్న యువత చదవవలసిన అవసరం ఉంది. జీవితాంతం ప్రజల కోసం, మంచి కోసం, మార్పు కోసం అవిశ్రాంతంగా పోరాడిన ఒక విప్లవ కారుని జీవిత చరిత్ర. ఇటువంటి వారు మనకు అరుదుగా కనిపిస్తారు. అందరిలా పుట్టి, అందరిలా జీవించి, అందరిలా చనిపోకుండా అందరి వారుగా, అందరి కోసం జీవించిన అరుదైన వ్యక్తి సికె. అందుకే ఇటువంటి అరుదైన వ్యక్తుల గురించి చదవ వలసిన, తెలుసుకోవలసిన అవసరం ఉంది. ఈ పని చేయుట వలన నాకేంటి లాభం. నాకు ఎంతపేరు వస్తుంది. ఎంత డబ్బు వస్తుందని కొందరు నాయకులు ఆలోచిస్తున్నారు. ప్రజా సేవకుల్లా ఫోటోల కోసం ఫోజులిస్తూ ఫ్రంట్ పేజీల్లో తాటికాయంత అక్షరాలతో పత్రికా ప్రకటనలు ఇచ్చుకుంటున్నారు. సికె వంటి నిస్వార్థ వ్యక్తులు వారు చేసిన పనులనే వారు పక్కవారికి చెప్పుకొనుటకు ఇష్టపడని వారున్నారు. వారి వ్యక్తిగత ప్రయోజనాలను, కుటుంబ ప్రయోజనాలను పక్కన పెట్టి ప్రజా ప్రయోజనాలను నిరంతరం కాంక్షించు వ్యక్తి సికె. నాకు పరిచయం ఉన్న కొందరు యువత నిరంతరం ప్రజల కోసం పోరాడే నిస్వార్థ నాయకులు ఈ రోజుల్లో ఉన్నారా? అని ప్రశ్నిస్తుంటారు. అందుకు నా సమాధానం ఎప్పుడు ఉంటారని.

ఈ పుస్తకం ఎందుకు చదవాలో, చదువుట వలన ప్రయోజనం ఏమిటో వివరించుటకు ప్రయత్నిస్తాను. ఎందుకంటే వివేకవంతులు ఎప్పుడూ ప్రయోజనం లేని పనులు చేయుటకు వారి సమయాన్ని, డబ్బును వినియోగించరని తెలుసు. కమ్యూనిస్టులందరూ మానవతా వాదులే. కాని మానవతా వాదులంతా కమ్యూనిస్టులు కారు. సికె అందుకు నేను కమ్యూనిస్టుని అని చెప్పుకొని ఉంటాడు. ఆయన జీవిత గమనాన్ని పరిశీలించినప్పుడు ఆయనలో ఒక సంస్కరణ వాదిని చూడవచ్చు. ఒక ప్రచురణ కర్తను చూడవచ్చు. ఒక సామాజిక సేవా కార్యకర్తను చూడవచ్చు. ఇలా అనేక రకాలుగా తనను తాను మార్చుకుంటూ, మలచుకుంటూ సాగిన జీవిత గమనాన్ని చక్కగా ఈ పుస్తకంలో వివరించారు రచయిత. కమ్యూనిస్టులు మాటలు చెప్పి కడుపులు నింపుకోమని చెప్పరు. కార్యాచరణకు పూనుకుంటారు. కరువులో రైతులు, వ్యవసాయ కూలీలు బాధలు పడుతుంటే ముందు వారి ప్రాణాలు నిలపవలసిన బాధ్యత ప్రభుత్వాలదని పోరాడినాడు సికె. అంతటితో తన పని పూర్తయిందని చేతులు ముడుచుకుని కూర్చోక తన వంతుగా చందాలు వసూలు చేసి గంజి కేంద్రాలను నడుపుటకు ప్రయత్నించాడు. ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకోవమే నిజమైన కమ్యూనిస్టు పని అని తన జీవితం ద్వారా నిరూపించాడు సికె. ఈ పుస్తకంలో 1930 నుండి 2000 సంవత్సరం వరకు దేశం, రాష్ట్రంలో జరిగిన కొన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ మార్పుల గురించి తెలియపరుస్తుంది. ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం. అభివృద్ధి, ఆటుపోట్లు, చీలికలు గురించిన సమాచారాన్ని క్లుప్తంగా అందిస్తుంది. ఆ రోజుల్లో కమ్యూనిస్టు ఉద్యమం ఎంతటి త్యాగాలకు పురిగొలిపిందో వివరించాడు. కొంత మంది కార్యకర్తలు అన్నదమ్ములను, ఆస్తులను, బంధు మిత్రులను వదులుకుని ఉద్యమ వ్యాప్తికి ఎలా కృషి చేశారో తెలుపుతుంది. ఈ విధంగా

భవిష్యత్తులో ఉద్యమాల్లో పని చేయుటకు ముందుకు వస్తున్న వారికి కొంత స్ఫూర్తిని, ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని అందించేదిగా ఉంది. త్యాగాల చరిత్రకే త్యాగాలు నేర్పినది కమ్యూనిస్టు ఉద్యమమని ఈ పుస్తకం అందించు సమాచారం ద్వారా తెలుస్తుంది.

సికె తన ఉద్యమ అనుభవం ద్వారా అనేక సత్యాలను తెలుసు కున్నాడు. ఉద్యమాల్లో పని చేస్తున్న కార్యకర్తలందరిలో కొన్ని శక్తులు అంతర్లీనంగా ఉంటాయి. అందువలన అందరు రంగాల్లో కనిపించలేదు. కొందరు ప్రజలను సమీకరించగలరు. కొందరు పాటలు రాయగలరు. కొందరు పాడగలరు. ఇది వారి వారి ఆలోచనలు, ఆసక్తి, అభిరుచిని బట్టి ఉంటుంది.

ఈనాటికి కమ్యూనిస్టు పార్టీల్లో పని చేస్తున్న కార్యకర్తల్లో ఆమోదం, అంగీకారంకాని ఒకఅంశం ఈరచనలో నేను గమనించాను. అదేమిటంటే కొందరు కమ్యూనిస్టు నాయకులు కుల ప్రాంతీయ అభిమానాలు ఉన్నట్లు సికె తన అభిప్రాయం వెలిబుచ్చాడు. ప్రపంచ కార్మికుల్లారా ఏకం కండని నినదించు కమ్యూనిస్టులు కూడా ఇలా కుల, మత, ప్రాంతీయ దృక్పథం ఏర్పరుచుకోవడం ఎంతో బాధకరం. కమ్యూనిస్టులు మనుషులే. మన చుట్టు ఉన్న సమాజంలోని చెడు ప్రభావం వారిపై కొన్నిసార్లు కొంత పనిచేయడానికి అవకాశం ఉంది. అది వారి వ్యక్తిగతం మాత్రమే. మొత్తం పార్టీకి ఆపాదించడం, అంటగట్టడం బాధాకరం.

కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన చీలికల్లో తాను ఆశిస్తున్న సమాజం రావడానికి చారుమజుందార్ మార్గమే సరైనదని గన్ను పట్టుకోవ డానికి నిర్ణయించుకున్నాడు. తన జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలు ఆయన్ని పెన్ను పట్టుకొను వైపు నడింపించినట్లు చెప్పినాడు. చివరకు హైదరాబాద్ బుక్ ట్రస్ట్‌ను ప్రారంబించాడు. ఈ ట్రస్టు ద్వారా మంచి అభ్యుదయ సాహిత్యం, ప్రజల నిత్య జీవితంలో ఉపయోగపడే డాక్టరు లేనిచోట వంటి పుస్తకాలు, అంబేద్కర్, దళిత సాహిత్యం వంటి మంచి రచనలు ప్రచురించినారు. ఈ విధంగా ఆంధ్రప్రదేశ్‌లో అభ్యుదయ సాహిత్యాన్ని ప్రజలకు అందించుటకు మంచి కృషి చేశారు.

కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన చీలికలు ఆయన్ని (సికె)ని ఎంతో బాధించినట్లు పేర్కొన్నాడు. ఇవి పేద ప్రజల ఐక్య ఉద్యమాలకు ఆటంకమని భావించారు సికె. మానవులంతా సమానమని అంగీకరిస్తూ ఆర్థిక, సామాజిక అసమానతలు తొలగాలని కమ్యూనిస్టులు కోరుకుంటారు. దీనిని బట్టి వారు ఎంతో చైతన్య వంతులు. విశాల హృదయులు. సమాజంలోని అసమానతలను తొలగించుటకు అనుసరించు మార్గాల్లో తేడాలుండవచ్చు అంత మాత్రానా ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకోవడం, భౌతిక దాడులకు దిగడం సికెని మరింత బాధించినట్లు ఈ రచనలో పేర్కొన్నాడు. కమ్యూనిస్టు పార్టీ నుండి బయటకు వెళ్లిన వారు దేనికి భయపడరు. కొంత మంది వ్యాపారులు దేవునికి భయపడతారు. కాని కమ్యూనిస్టులు దేనికి భయపడరు. కమ్యూనిస్టు పార్టీ నుండి బయటకు వచ్చిన వారు వ్యాపారాలు ప్రారంభించి, వారి ఉద్యమ అనుభవంతో వ్యాపారాలను వృద్ధి చేసుకున్నారు. వారు మొదట ఏ దోపిడీ సమాజం అంతం కావాలని కోరుకున్నారో ఆ దోపిడీ సమాజంలోనే సుఖాలు అనుభవిస్తున్నారని సికె తన బాధను వ్యక్తపరిచాడు.

కమ్యూనిస్టు పార్టీలు సమాజాన్ని ఆర్థిక కోణం నుండి చూస్తాయని, అందువలనే కులం, అంటరానితనం, అస్పృశ్యత వంటి సామాజిక సమస్యలకు ప్రాధాన్యతనివ్వలేదని సికె అభిప్రాయం. ఆ కారణంగానే అస్తిత్వ ఉద్యమాలు పట్టుకొస్తున్నాయని, ఇవి శ్రామిక వర్గ ఐక్య ఉద్యమాలకు ఆటంకమని అభిప్రాయ పడినాడు. కమ్యూనిస్టు పార్టీలు కులం, అంటరానితనం వంటి అంశాలకు ప్రాధాన్యతనివ్వవలసిన అవసరం ఉందని, అందుకు అనుగుణంగా దళిత ఉద్యమాలు పోరాటాల గురించి అధ్యయనం చేయవలసిన అవసరాన్ని గుర్తించాడు. అంబేద్కర్ రచనలను ప్రచురించుటకు ప్రాధాన్యతనిచ్చాడు.

ఆంధ్రప్రదేశ్‌లో 1940 నుండి కమ్యూనిస్టు పార్టీ నడిపిన ఉద్యమాలు, పోరాటాల చరిత్రను అధ్యయనం చేయదలచిన యువత, పరిశోధకులకు ఈ పుస్తకం చదవడం ద్వారా కొంత సమాచారం లభిస్తుంది. కరువు రోజుల్లో గంజికేంద్రాలు నడుపుట, చదువుకోని పేద విద్యార్థులకు హాస్టలు నడపడం, విద్య సామాజిక మార్పుకు సహకరించు మంచి సాధనమని ఆ రోజుల్లో గుర్తించడం వంటి పనుల ద్వారా సికె ఒక సంస్కర్తగా కనిపిస్తాడు. ఆయన నడిపిన వసతి గృహంలో చదివిన కొందరు ఐఎఎస్, ఐపిఎస్‌లుగా, మంచి ఉద్యోగులుగా మారినారని చెప్పినారు. కాని అలా పైకి వచ్చినవారు తమవంతుగా సామాజిక మార్పుకు ఎంతవరకు సహకరించారు అనేది ఈ పుస్తకంలో సమాచారం లేదు.


ఈ పరిచయం చదివిన తరువాత చదవడానికి ఆసక్తి చూపువారు చూడగానే ఇంత చిన్న పుస్తకం అంత పెద్ద సందేశం అందిస్తుందా? అని సందేహం కలగక మానదు. చదువుకొద్ది ఆసక్తిని కలిగించి ముందుకు నడిపిస్తుంది. చివరిగా ఒక మనిషి తన జీవితం ద్వారా ఎన్ని పుస్తకాలు చదివాడు. ఎంత డబ్బు సంపాదించాడు అన్నది కాదు. తనకోసం తాను ఏమి చేసుకున్నాడు. తన చుట్టు ఉన్న సమాజం కోసం ఏమి చేశాడు అన్నది ముఖ్యం. ప్రతి మనిషిలో ఎన్నో మంచి ఆలోచనలుండవచ్చు. ఆలోచనలు పనులు కావు. వాటిని చిత్త శుద్ధితో అమలు పరుచుటకు ప్రయత్నించినవారే మంచి ఫలితాలను పొందగలరు. అటువంటి ఆచరణాత్మకమైన వక్తి సికె. తాను నమ్మిన దానిని నిరంతరం ఆచరించుటకు ప్రయత్నించిన మానవత్వమున్న మంచి మనిషి సికె. అందుకే చదవమని మరొకసారి సవినయంగా మనవి చేస్తున్నా.

(రచయిత న్యాయవాది)

వీ

రాబోయే సంచికలలో...

- **ప్రపంచీకరణ బోనులో మాధ్యమిక విద్య - తోట రాజేష్**
- **సాంఘిక వెలి - ప్రజారోగ్యం - డా. పట్టా వెంకటేశ్వర్లు**
- **మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతం పై ఒక వివరణ - వై.వి. రమణారావు**
- **ప్రజారోగ్యం ప్రైవేట్ పరం - మండి నాగమణి**


भारत सरकार
Government of India
स्वच्छ भारत
एक कदम स्वच्छता की ओर
రండి, ఈ అక్టోబర్ 2
నుండి స్వచ్ఛతకు
ప్రమాణం చేద్దాం
"స్వచ్ఛత మహాత్మ గాంధీగారికి చాలా ప్రియమైనది. రండి, స్వచ్ఛ భారతానికి మన నిబద్ధతను నిలుపుకుందాం, మన బాపు గారి స్వప్నాలను సాకారం చేద్దాం. స్వచ్ఛ భారత్‌తో మన ప్రగతి, పేదలకు చేయూతలో భాగస్వాములవుదాం!"
– నరేంద్ర మోదీ
మహాత్మ గాంధీ,
లాల్ బహాదుర్ శాస్త్రిల
జయంతి సందర్భంగా
వారికి వందనం
davp 22202/13/0052/1516
Narendra Modi
Prime Minister of India
www.pmindia.gov.in
ప్రధానితో అనుసంధానానికి
/NarendraModi
భావాలు పంచుకోవడానికి
www.mygov.in

దేశవ్యాప్తంగా సాగుతున్న హిందుత్వ దాడులు

ఉత్తరప్రదేశ్‌లోని గౌతమబుద్ధనగర్ జిల్లా దాద్రీ గ్రామానికి చెందిన ఇఖ్లాక్ (52)ను ఆవు మాంసం తిన్నాడనే అనుమానంతో సెప్టెంబర్ 29న గ్రామస్తులు కట్టెలతో కొట్టిచంపారు. అడ్డుకోబోయిన ఆయన కొడుకును తీవ్రంగా గాయపరిచారు. బుందేల్‌ఖండ్ ప్రాంతంలో దళితుడైన ఛిమ్మా అహిర్వార్ (90)ను అగ్రవర్ణాల వారు సజీవ దహనం చేశారు. తన కుటుంబంతో స్వగ్రామమైన దిల్లావ్‌లోని ఆలయానికి నవంబర్ 30న వెళ్లాడు. ఆలయంలోకి వెళ్లకుండా సంజయ్ శర్మ అనే వ్యక్తి అడ్డుకుని, నువ్వు దళితుడివి ఆలయంలోకి ఎలా వెళ్తావని చేతిలో ఉన్న గొడ్డలితో ఛిమ్మాపై దాడిచేశాడు. పక్కనే ఉన్న కుటుంబ సభ్యులు భయంతో పారిపోయారు. ఛిమ్మాను ఈడ్చుకెళ్లి ఛిమ్మాపై అక్కడే ఉన్న కట్టెలను పేర్చి నిప్పంటించాడు.

ముంబై పేలుళ్ల దోషులకు ఉరి శిక్ష

2006 జూలై 11న ముంబైలో లోకల్ రైళ్లలో జరిగిన వరుస బాంబు పేలుళ్ల కేసులో మహారాష్ట్ర వ్యవస్థీకృత నేరాల నియంత్రణ చట్టం (మోకా) ప్రత్యేక న్యాయమూర్తి యతిన్ డి.శిండే సెప్టెంబర్ 1న తీర్పును వెలువరించారు. ఈ పేలుళ్ల ఘటనలో 189 మంది మరణించగా, 829 మంది గాయపడ్డారు. ఈ కేసులో దోషులుగా తేల్చిన కమల్ అహ్మద్ అన్సారీ (37), మహ్మద్ ఫైజల్ షేక్ (36), ఎహ్‌తెషాం సిద్దిఖీ (30), నవీద్ హుస్సేన్ ఖాన్ (30), ఆసిఫ్ ఖాన్ (38)లకు మరణ శిక్ష విధించారు. అలాగే తన్వీర్ అహ్మద్ అన్సారీ (37), మొహమ్మద్ మాజిద్ షఫీ (43), జమీర్ అహ్మద్ షేక్ (36)లకు జీవిత ఖైదు ఖరారు చేశారు. వీరంతా సిమి సంస్థకు చెందినవారుగా వెల్లడించారు. దోషులకు రు. 1.51 కోట్ల భారీ జరిమాన విధించారు.

ఉత్తరప్రదేశ్‌లో టివి జర్నలిస్టు హత్య

ఉత్తరప్రదేశ్‌లో ఓ టివి చానల్‌లో విలేఖరిగా పనిచేస్తున్న దీనా ప్రాంతానికి చెందిన హేమంత్‌యాదవ్ (45)ను అక్టోబర్ 3న ఇద్దరు వ్యక్తులు తుపాకీతో కాల్చి చంపారు. వారిని పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను నియమించినట్లు చందౌలీ జిల్లా ఎస్‌పి అమిత్‌వర్మ తెలిపారు. ఇదే రాష్ట్రంలో గత నాలుగు నెలల్లో ముగ్గురు జర్నలిస్టులు హత్యకు గురయ్యారు. రాజకీయ నాయకులు మాఫియా వ్యవహారాలను బహిర్గతపరిచినందుకే ఈ హత్యలు జరుగుతున్నాయని అంటున్నారు.

బీహార్ ఎన్నికల్లో క్రిమినల్స్

బీహార్ మొదటి విడత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో 130 మందిపై హత్యతో సహా తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఎన్నికల సంఘం అంతర్జాలంలో ఉంచిన అభ్యర్థుల అఫిడవిట్‌ల ఆధారంగా ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం నివేదికను తయారు చేసింది. 37 స్థానాల్లో పోటీ చేస్తున్న 170 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. అందులో 130 మందిపై బెయిల్‌కు వీలులేని తీవ్రమైన నేరాలు ఉన్నట్లు తెలిపింది. 16 మందిపై హత్య కేసులు ఉన్నాయని తెలిపింది. అట్లాగే 146 మంది కోటీశ్వరులైన అభ్యర్థులు పోటీపడుతున్నారు.

ఇఖ్లాక్ హత్య తీవ్రమైన నేరం: ఎన్‌ఎచ్‌ఆర్‌సి

ఉత్తరప్రదేశ్‌లోని దాద్రీ గ్రామానికి చెందిన ఇఖ్లాక్ గోమాంసం తిన్నాడనే అనుమానంతో స్థానికులు కొట్టిచంపడం చాలా తీవ్రమైన అంశమని జాతీయ మానవ హక్కుల సంఘం అభిప్రాయపడింది. ఇది మానవ హక్కులకు తీవ్ర విఘాతం కలిగించేలా ఉందని పేర్కొంది. ఈ అంశం మైనారిటీ కమిషన్ పరిశీలనలో ఉన్నందున దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేమని హక్కుల సంఘం చైర్‌పర్సన్ జస్టిస్ సిరియక్ జోసఫ్ అక్టోబర్ 12న అన్నారు.

'గోవు ఒక జంతువే' - కట్జూ

ఉత్తరప్రదేశ్‌లోని దాద్రీ గ్రామానికి చెందిన ఇఖ్లాక్ ఆవు మాంసం తిన్నాడనే అనుమానంతో కొట్టి చంపిన ఘటనను రిటైర్డ్ న్యాయమూర్తి మార్కండేయ కట్జూ రాజకీయ ప్రేరేపిత ఘటన అని అన్నారు. ఆవు ఎలాంటి ప్రత్యేకత లేని జంతువు మాత్రమేననీ, అది ఎవరికి తల్లి కాదని వ్యాఖ్యానించారు. గోమాంసం తింటే తప్పేమిటని ఆయన విలేఖరులతో వారణాసిలో అక్టోబర్ 3న అన్నారు.

తీస్తా సెతల్వాద్‌కు సుప్రీం నోటీసులు

సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆమె నేతృత్వంలోని స్వచ్ఛంద సంస్థ విదేశీ విరాళాల నియంత్రణ చట్టాన్ని (ఎఫిసిఆర్ఎ) ఉల్లంఘించి ఫోర్డ్ ఫౌండేషన్ నుంచి నిధులను స్వీకరించినట్టు ఆరోపిస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయస్థానం అక్టోబర్ 14న నోటీసులు జారీచేసింది. కేసును డిసెంబర్ 1కి వాయిదా వేస్తూ, నాలుగు వారాల్లో నోటీసుకు సమాధానం ఇవ్వాల్సిందిగా తీస్తాను ఆదేశించింది.

ఎన్‌జెఎసి చట్టం చెల్లదన్న సుప్రీం

జాతీయ న్యాయ నియామక కమిషన్ (ఎన్‌జెఎసి) చట్టం చెల్లదని సుప్రీం కోర్టు అక్టోబర్ 16న తీర్పు వెల్లడించింది. ఆ చట్టానికి రాజ్యాంగ బద్ధత లేదని సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఐదుగురు సభ్యులున్న రాజ్యాంగ ధర్మాసనంలో నలుగురు న్యాయమూర్తులు ఈ చట్టం చెల్లదని స్పష్టం చేశారు. మరో న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ భిన్నాభిప్రాయాన్ని వెల్లడించారు. 99వ రాజ్యాంగ సవరణ చట్టం చెల్లుతుందని చెప్పారు. కోర్టు తీర్పుతో కొలీజియం వ్యవస్థ తిరిగి అమలులోకి వచ్చింది.

సాహిత్యకారులపై కొనసాగుతున్న దాడులు

దేశవ్యాప్తంగా హేతువాదులపై, దళిత, ముస్లీం మైనారిటీ రచయితలపై హిందూ మతోన్మాదులు దేశవ్యాప్తంగా దాడులు చేస్తున్నారు. దాద్రీ దారుణం, హేతువాదుల హత్యలు, సుదీంద్ర కులకర్ణిపై ఇంకుతో దాడి, ఉధంపూర్‌లో ట్రక్కు డ్రైవర్లపై జరిగిన దాడిని ఖండిస్తూ అక్టోబర్ 20న ఢిల్లీలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశంలో మాట్లాడుతుండగా హిందూత్వ వాదులు ఆయన ముఖంపై సిరా పోసి, ఇంజన్ ఆయిల్ పులిమారు. బీఫ్ విందు ఇచ్చాడనే కారణంతో దాడి చేసినట్లుగా చెప్పారు. కర్ణాటకలో హుచంగి ప్రసాద్ (23) రాసిన 'ఒడల కిచ్చు' అనే పుస్తకంలో హిందుమతానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై దాడి చేశారు. ఈ దాడిని ది ఇండియన్ రైటర్స్ ఫోరం తీవ్రంగా ఖండించింది.

సాహిత్య అకాడమీకి చేరిన నిరసన

కన్నడ రచయిత ఎం.ఎం. కల్బుర్గి హత్య దేశవ్యాప్తంగా రచయితల, సాహిత్యకారులపై కొనసాగుతున్న దాడుల పట్ల అకాడమి మౌనం వహించడాన్ని సాహిత్యకారులు తీవ్రంగా ఖండించారు. అకాడమీ వైఖరిని వ్యతిరేకిస్తూ అక్టోబర్ 23న ఢిల్లీలోని సాహిత్య అకాడమీ ముందు పలువురు రచయితలు, వారి మద్దతుదారులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అకాడమీ సారధికి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. దీనికి సాహిత్య అకాడమీ స్పందిస్తూ రచయితల, ఇతరుల హత్యలను తీవ్రంగా ఖండించింది. అకాడమీకి తిరిగి ఇచ్చేసిన పురస్కారాలను కెనక్కి తీసుకోవలసిందిగా సాహిత్యవేత్తలను అకాడమీ అక్టోబర్ 23న నిర్వహించిన అత్యవసర సమావేశం అభ్యర్థించింది. వీ

అఫ్ఘనిస్తాన్‌లో అమెరికా దాడులు

అఫ్ఘనిస్తాన్‌లోని కుందుజ్ నగరంపై సెప్టెంబర్ 30, అక్టోబర్ 3 తేదీల్లో అమెరికా దాడులు చేసింది. క్లియర్ ద సిటీ అనే ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు జరిపిన దాడుల్లో రెండు వందల మంది తాలిబన్ సైనికులు మరణించారు. నవంబర్ 3న కుందుజ్ నగరంలో తాలిబన్‌లను లక్ష్యంగా చేసుకుని ఒక హాస్పిటల్‌పై అమెరికా దాడులు చేసింది. ఈ దాడిలో 9 మంది రోగులు, 12 మంది హాస్పిటల్ సిబ్బంది మరణించారు. ఈ సంఘటనను ఐక్యరాజ్య సమితీ తీవ్రంగా ఖండించింది. ఇది క్షమించరాని నేరంగా ఐక్యరాజ్య సమితీ ప్రధాన కార్యదర్శి బాన్‌కీ మూన్ తెలిపారు. ఈ దాడిపై పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా వైట్‌హౌస్‌లో ప్రకటించారు.

పోర్చుగల్ పార్లమెంట్ ఎన్నికలు

పోర్చుగల్‌లో అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో అధికార సోషల్ డెమొక్రాటిక్ పార్టీ (సిఎస్‌డి), కన్జర్వేటివ్ పాపులర్ పార్టీ (సిడిఎస్–పిపి) తో కూడిన కూటమి విజయం సాధించింది. అయితే పూర్తి మెజారిటీకి కొద్దిగా వెనుకబడి ఉంది. అక్టోబర్ 4న పార్లమెంట్ లోని 230 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అధికార కూటమికి 104 స్థానాలు (38.55 శాతం ఓట్లు) లభించగా, ప్రతిపక్ష సోషలిస్టు పార్టీకి 85 (32.38 శాతం ఓట్లు) లభించాయి. మిగిలిన స్థానాలు పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ, ఇతర వామపక్ష కూటమితోపాటు మరికొన్ని పార్టీలు గెలుచుకున్నాయి. పోర్చుగల్ రాజ్యాంగ నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థాపనకు పార్లమెంట్‌లో అవసరమైన మెజారిటీ 116 స్థానాలు కావాలి.

సిరియాలో ఐఎస్ లక్ష్యంగా దాడులు

సిరియాలో ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) దళాలను లక్ష్యంగా రష్యా, అమెరికా, దాని మిత్ర దేశాలు, ఇరాన్ దాడులు చేస్తున్నాయి. రష్యా వైమానిక, నావికా దళాలతో దాడులు చేస్తోంది. అమెరికా, దాని మిత్ర దేశాలు వైమానిక దాడులు చేస్తున్నాయి. సిరాయా అధ్యక్షుడు బాషర్ అల్ అస్సద్‌కు మద్దతుగా ఇరాన్ తన పదాతిదళాన్ని రంగంలోకి దింపింది. సెప్టెంబర్ ఆఖరులో వైమానిక దాడులు ప్రారంభించిన రష్యా, అక్టోబర్ 7న నావికా దళంతో దాడులు ప్రారంభించింది. 1500 కిలోమీటర్ల దూరంలో సిరియాలో ఉన్న ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదుల స్థావరాలను లక్ష్యంగా చేసుకొని రాకెట్ దాడులు జరిపింది. ఐఎస్ స్థావరాలపై దాడుల కోసం కాస్పియన్ సముద్రంలో నాలుగ యుద్ధనౌకలను మొహరించింది.

నైజీరియాలో ఆత్మాహుతి దాడి

నైజీరియాలోని ఈశాన్య ప్రాంతంలో ఉన్న రెండు రాష్ట్రాల్లో అక్టోబర్ 8న జరిగిన దాడుల్లో నలభై మందికి పైగా మరణించారు. ఆత్మాహుతి దళ సభ్యులు ప్రార్థనా మందిరాలలో తమని తాము పేల్చుకోవడంతో ఈ మృతుల సంఖ్య ఎక్కువగా ఉంది. మరోవైపు యోబె రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఒక సైనిక శిబిరంపై బొకొహరం దళాలు దాడి చేశారు. ఈ దాడిని భద్రతా దళాలు తిప్పికొట్టడంతో వంద మందికి పైగా బొకొహరం మిలిటెంట్లు మరణించారని సైనిక ప్రతినిధి ఒకరు తెలిపారు. అక్టోబర్ 16న జరిగిన మరో దాడిలో ముప్పై మంది పౌరులు మరణించారు. మైదుగురి శివారు ప్రాంతంలోని మసీదులో ప్రార్థన చేస్తున్న వారిపై లోపలా బయట నుంచి ఏకకాలంలో ఆత్మాహుతి దాడులు జరిగాయి.

టర్కీ రాజధానిలో పేలుళ్లు

టర్కీ రాజధాని అంకారాలో అక్టోబర్ 10న వామపక్ష సంఘాలు, కుర్దిష్ అనుకూల విపక్ష పార్టీలు తలపెట్టిన శాంతి ర్యాలీలో పేలుళ్లు సంభవించాయి. ఈ పేలుళ్లలో దాదాపు వంద మంది మరణించారు. రెండు వందల మంది దాకా గాయపడ్డారు. అంకారాలోని రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన ఈ పేలుళ్ల వెనుక అధ్యక్షుడు ఎర్డోగన్ కారణమంటూ ఆ దేశ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అక్టోబర్ 12న జరిగిన నిరసన ర్యాలీలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

నేపాల్ కొత్త ప్రధాని కెపి శర్మ

నేపాల్‌లో కొత్త రాజ్యాంగాన్ని ప్రారంభించే ప్రక్రియలో భాగంగా ప్రధానమంత్రి సుశీల్ కొయిరాలా తన పదవికి రాజీనామా చేశారు. అక్టోబర్ 2న రాష్ట్రపతి రామ్ బరన్ యాదవ్‌ను కలిసి రాజీనామాను అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రధాని పదవికి అక్టోబర్ 11న ఎన్నికలు నిర్వహించగా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (సిపిఎన్ – యుఎంఎల్) అధ్యక్షులు ఖడ్గ ప్రసాద్ శర్మ (కె.పి. శర్మ) ఓలి గెలిచారు. నేపాల్ పార్లమెంట్ భవనంలో జరిగిన ఎన్నికల్లో 598 ఓట్లకు గాను శర్మకు 338 ఓట్లు వచ్చాయి. దీంతో ఆయన నేపాల్ ప్రధానిగా ఎన్నికయ్యారు. అక్టోబర్ 12న ప్రధానిగా కెపి శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. అక్టోబర్ 16న యుసిపిఎన్ – మావోయిస్టు పార్టీ నేత ఒన్సారిఘర్తి మగర్‌ను పార్లమెంట్ హౌస్ స్పీకర్‌గా సభ్యులంతా ఎన్నుకున్నారు. నేపాల్ పార్లమెంట్ చరిత్రలోనే మొదటిసారి ఒక మహిళను స్పీకర్‌గా ఎన్నుకున్నారు.

మాన్ బుకర్ విజేత మార్లన్ జేమ్స్

ఈ ఏడాది ప్రతిష్టాత్మకమైన మాన్‌బుకర్ బహుమతి జమైకా రచయిత మార్లన్ జేమ్స్‌కు లభించింది. ఆయన రాసిన 'ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ సెవెన్ కిల్లింగ్' నవలకి ఈ బహుమతి వచ్చింది. అక్టోబర్ 14న జరిగిన ఒక కార్యక్రమంలో ప్రిన్స్ చార్లెస్ భార్య కెమిల్లా చేతుల మీదుగా మార్లన్ జేమ్స్ ఈ బహుమతిని పొందారు. 1970లో బాబ్‌మార్లేపై జరిగిన హత్యాయత్నం స్ఫూర్తిగా జేమ్స్ ఈ నవల రాశారు.

2015 నోబెల్ విజేతలు

2015 సంవత్సరానికి గాను నోబెల్ బహుమతి విజేతలను ప్రకటించారు. రసాయన శాస్త్ర రంగంలో ముగ్గురు – థామస్ లిండాన్ (స్వీడన్), పాల్ మోడ్రిచ్ (అమెరికా), అజీజ్ సంచార్ (టర్కీ)లకు నోబెల్ బహుమతి లభించింది. మెకానిస్టిక్ స్టడీస్ ఆఫ్ డిఎన్ఎ (డిఎన్ఎ మరమ్మతులు) పేరుతో జరిగిన పరిశోధనలకు గాను ఈ ముగ్గురు ఎన్నికయ్యారు. భౌతిక శాస్త్రంలో న్యూట్రినోలపై పరిశోధనలు జరిపిన ఇద్దరు శాస్త్రవేత్తలు ఆర్థర్ బి. మెక్‌డొనాల్డ్ (కెనడా), టకాకి కజితా (జపాన్) లకు నోబెల్ బహుమతి గెలుచుకున్నారు. సాహిత్య రంగంలో బెలారస్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి 65 ఏళ్ల స్వెట్లానా అలెక్సీవిచ్‌కు నోబెల్ పురస్కారం దక్కింది. చెర్నోబిల్ అణు ప్రమాదంలో మరణించిన వారి బాధల ఆధారంగా రచించినందుకు నోబెల్ బహుమతికి ఎన్నికయింది. ట్యునీషియాలో అంతర్యుద్ధం తలెత్తకుండా కాపాడిన నేషనల్ డైలాగ్ క్వార్టర్ (జాతీయ సంప్రదింపుల బృందం) కు ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి లభించింది. దేశంలో బహుళ ప్రజాస్వామ్య నిర్మాణానికి కృషి చేసిన నాలుగు సంస్థలు ఈ పురస్కారానికి ఎన్నికయ్యాయి. జాస్మిన్ ఉద్యమం నేపథ్యంలో ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించేందుకు కృషి చేసిన జనరల్ లేబర్ యూనియన్, హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండస్ట్రీ, ట్రేడ్ అండ్ హ్యాండ్‌క్రాఫ్ట్స్, హ్యూమన్ రైట్స్ లీగ్, ఆర్డర్ ఆఫ్ లాయర్స్ అనే సంస్థలు కలిసి జాతీయ సంప్రదింపుల బృందంగా ఏర్పడ్డాయి. అర్థశాస్త్రంలో స్కాట్లాండ్‌కు చెందిన ప్రముఖ అర్థశాస్త్రవేత్త ఆంగస్ డేటన్‌కు నోబెల్ లభించింది. సూక్ష్మ అర్థశాస్త్రంలోని వినియోగం, పేదరికం, సంక్షేమాలపై చేసిన విశేష కృషికి గాను ఆయకు ఈ గౌరవం దక్కింది. మెడిసిన్ విభాగంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు లభించింది. మొండి వ్యాధులైన మలేరియా, తామరలను నివారించడానికి విశిష్ట పరిశోధనలు చేసిన విలియం సి. క్యాంప్‌బెల్ (ఐర్లాండ్), సతోషి ఒమురి (జపాన్), యుయు తు (చైనా)లకు నోబెల్ పురస్కారం లభించింది.

అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లో భూకంపం

అక్టోబర్ 26న హిందుకుష్ పర్వతశ్రేణుల్లో సంభవించిన భూకంపం దక్షిణాసియాను వణికించింది. ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.7గా నమోదయింది. దీని ప్రభావం ఎక్కువగా అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లలో కనపడింది. ఈ రెండు దేశాల్లోనే దాదాపు మూడు వందల మందికి పైగా మరణించారు. అఫ్ఘనిస్తాన్‌లోని ఒక పాఠశాలలో భూకంపం భయంతో విద్యార్థులంతా ఒక్కసారిగా బయటికి పరుగులు తీయడంతో తొక్కిసలాట జరిగి పన్నెండు మంది బాలికలు మరణించారు.

పోలండ్ ఎన్నికలు

పోలండ్ పార్లమెంట్‌కు అక్టోబర్ 25న ఎన్నికలు జరిగాయి. మొత్తం 460 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఈసారి ప్రతిపక్ష లా అండ్ జస్టిస్ పార్టీ విజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ సర్వేలు చెబుతున్నాయి. లా అండ్ జస్టిస్ పార్టీకి పేద ప్రజల నుంచి, గ్రామీణ ప్రజల నుంచి మద్దతు లభించిందని పోల్ సర్వేలు తెలిపాయి. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(సెప్టెంబర్ 1 నుండి సెప్టెంబర్ 30, 2015 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (1142), ఆంధ్రప్రదేశ్‌లోని 8 జిల్లాలలో (599) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1741)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	8	-	22	21	4	12	6	4	3	3	4	-	1	29	34	-	-	-	4	-
హైదరాబాద్	-	-	-	11	11	-	1	1	1	3	4	16	-	-	27	12	-	-	-	17	-
కరీంనగర్	-	7	2	7	6	6	12	2	-	1	5	3	3	6	13	12	-	-	-	-	4
ఖమ్మం	-	2	-	5	20	-	8	1	-	3	2	4	-	8	14	26	-	-	-	-	2
మహబూబ్‌నగర్	1	39	-	13	8	1	2	6	-	1	10	11	11	10	55	27	-	-	-	-	3
మెదక్	9	16	2	16	19	8	10	-	9	6	5	6	9	6	39	8	-	-	-	6	4
నల్గొండ	-	11	-	10	15	3	8	-	-	2	-	3	-	8	29	14	-	-	-	-	5
నిజామాబాద్	-	8	-	4	10	-	2	-	-	3	2	-	-	3	19	13	-	-	-	-	-
వరంగల్	-	11	-	10	11	4	7	-	-	1	3	4	1	5	13	12	2	-	-	-	6
రంగారెడ్డి	-	3	11	-	2	4	1	3	-	-	-	3	4	2	16	8	-	-	-	-	3
తెలంగాణ	**11**	**105**	**15**	**98**	**123**	**30**	**63**	**19**	**14**	**23**	**34**	**54**	**28**	**49**	**254**	**166**	**2**	**-**	**-**	**27**	**27**
అనంతపురం	-	12	-	9	17	4	5	2	2	5	3	3	7	8	23	4	-	-	-	-	-
చిత్తూరు	-	-	-	4	3	2	6	-	-	-	4	8	2	-	33	-	-	-	-	-	-
కడప	-	-	-	3	18	2	1	10	2	3	11	-	6	6	-	-	-	-	-	-	5
గుంటూరు		వివరాలు అందలేదు																			
కృష్ణా		వివరాలు అందలేదు																			
కర్నూలు	-	5	-	4	5	4	5	7	6	3	4	5	7	2	18	14	-	-	-	-	2
తూర్పు గోదావరి	-	-	-	-	4	2	9	2	-	-	1	1	-	4	36	25	5	-	-	-	-
ప్రకాశం		వివరాలు అందలేదు																			
శ్రీకాకుళం	-	-	-	2	5	5	9	6	-	2	3	1	5	9	23	12	-	-	-	-	6
పశ్చిమ గోదావరి	-	-	-	1	3	-	3	-	1	-	4	-	-	3	8	7	-	-	-	-	2
నెల్లూరు		వివరాలు అందలేదు																			
విజయనగరం		వివరాలు అందలేదు																			
విశాఖపట్నం	-	-	-	6	4	1	4	1	-	5	-	2	5	6	11	10	-	-	-	11	-
ఆంధ్రప్రదేశ్	**-**	**17**	**-**	**29**	**59**	**20**	**42**	**28**	**11**	**18**	**30**	**20**	**32**	**38**	**152**	**72**	**5**	**-**	**-**	**11**	**15**

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 172 - November 2015 • **ISSN 2231-6892**

• RNI Regn No APTEL/2003/11483 • Published on 27/10/2014 • Postal Regn. No. L II/RNP/HD/1100/2014-16

Date of Posting : 29th, 30th

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao